
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



31-1-51

4 అణాలు

విషయానుక్రమణిక

31 జనవరి 1951

వ్యాసాలు:


సీరియల్:

కథలు:

బొమ్మరిల్లు:

సినిమా:

గేయం:






ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder: K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **20**

వికృతి సంవత్సర పుష్య బహుళ అష్టమి బుధవారము



ఢిల్లీలో రిపబ్లిక్ ఉత్సవం:— భారతదేశచరిత్రలోని ముఖ్యఘట్టాలు ఊరేగింపులో ప్రదర్శింపబడినాయి. అశోకచక్రవర్తి విదేశాలకు మైత్రిరాయబారాలను పంపిస్తున్న దృశ్యం ఇక్కడ చిత్రించ బడింది.

మహాత్మాగాంధి

కాలచక్రం మరొక పరిభ్రమణం చేసింది. ప్రపంచరంగంనుండి గాంధీజీ నిష్క్రమించిన ఆ దుర్దినం తిరిగి వచ్చింది. భయంకరమైన ఒక అఖాతపుటంచున నిలబడి ప్రపంచం ప్రకంపిస్తోంది. గాంధీజీ నిష్క్రమణం, ప్రపంచప్రళయ సూచనలు- ఈ రెండూ ప్రతి హృదయంలోనూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని వున్నాయి.


గాంధీజీహత్యాదృశ్యం కళ్లారా చూసి వికలమనస్కుడైన ఒక భారతీయుడు ప్రపంచానికి ఘోరాపద "ఏదో రాబోతున్నది," అని వెర్రికేక వేశాడు.

నిజంగా అది ఘోరాపదే. మతబోధలను లౌకికం చెయ్యటానికి ప్రయత్నించిన ప్రవక్తల్లో ఆయన అసదృశుడు. దైనందిన జీవిత వ్యవహారాలలోకి ఆధ్యాత్మిక విలువలను ఆచరణ యోగ్యంగా ప్రవేశపెట్టడానికి ఆయన ప్రయత్నించారు. ఆ విలువలు కేవలం భగవద్భక్తులైన ఏ కొద్దిమంది మహానుభావులకో తప్ప ఇతరులకు ఆచరణ సాధ్యంకావని ఇదివరలో సామాన్యంగా అనుకునేవారు. సామాన్య మానవుణ్ణి మహర్షి తుల్యుడుగా చెయ్యటానికి ఎవరూ ప్రయత్నించలేదు.

కాని గాంధీజీమాత్రం కొత్తదారి తొక్కారు. తాను మహర్షిని కానన్నారు. తను చెయ్యగలిగిన పని ఎవరైనా చెయ్యగలరని చెప్పారు. తను స్వయంగా చేసి పరీక్షించనిదాన్ని ఇతరులకు బోధించనన్నారు. పూర్వం బుద్ధుడుకూడా మానవులను కఠిన నియమాలు అనుసరించగలిగే వారుగాను, మిగతా వారిని సామాన్య మానవులుగాను విభజించాడు.

కాని ప్రపంచం త్వరితంగా మారిపోతోంది. మతప్రవక్తకీ మామూలు మనిషికీ మధ్య దూరం పెరుగుతోంది. మతప్రవక్త ప్రభావం సన్నగిలుతోంది. కనుక ఐహికాముష్మిక ప్రవాహాలను ఏకం చెయ్యటమే దీనికి పరిష్కార మార్గం.

ఎడారిగా మారిన యీ ప్రపంచంలో గాంధీజీ ఆధ్యాత్మికజలమును పారించటానికి ప్రయత్నం చేశారు. ఆధ్యాత్మికజీవనం మామూలుమనిషికి అందరానిదని భావించిన పూర్వప్రవక్తలు ఒకవిధమైన రాజీ ధోరణిని అవలంబించారు. సాంఘికసేవనే పరమార్థంగా పెట్టుకున్న క్రైస్తవ మత సంస్థలు, రామకృష్ణమఠాలు ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చును. మత మనగా మానవసేవేనని వారి అర్థం. అయినప్పటికీ మధ్య అఖాతంమాత్రం అలాగే వుండిపోయింది. గురువు, శిష్యుడు, దాత, గృహీత, వైద్యుడు, రోగి ఈ భేదం



అలాగే నిల్చిపోయింది. మామూలుమనిషి పూర్వంలాగే పశుప్రాయుడుగా వుండిపోయాడు. మనిషిలోని లోపాలు, బలహీనత తొలగించరానివని, క్షమార్హములని ఒక భావం అలాగే ఉండిపోయింది.

కనుక గాంధీజీ తొక్కినదారి సరికొత్తదిగా కనిపించింది. “మోక్షసామ్రాజ్యం నీలోనే వుంది,” అనే సూత్రాన్ని ఆచరణలోకి అనువదించటానికాయన కృషి చేశారు. ఉత్తమ ప్రవర్తనను అలవరచుకోవటానికి తనకు తాను ప్రయత్నించటంతో ఆయన ఆగలేదు. దానిని సర్వమానవకోటిలోనూ శాశ్వతంగా నెలకొనేలాగ చేయటానికి యత్నించారు. మతవర్గాలను, మురాలను ఆయనఎప్పుడూఅంగీకరించలేదు.

నూత్నపథాన్వేషణలో ఆయనకు ఉత్సాహాన్ని, దీక్షనూ యిచ్చింది ఆయన స్వమతమైన హిందూమతమే. హిందూమతం, బ్రహ్మపదార్థం అద్వితీయమని, అవిభాజ్యమని, విశ్వవ్యాపమని ఘంటాపథంగా చెబుతున్నది. ప్రత్యేకజీవాత్మల విభజన అసత్యము, అనిత్యము అని చెబుతున్నది.

బహుశా ఆధునిక మానవుడికి యీ సిద్ధాంతప్రభావం మన మన స్తత్వంమీద, మన సమస్యాపరిష్కార విధానాలమీద, మన గమ్యాత్మప్రమాణ పరిజ్ఞానంమీద ఎంత గాఢంగా వున్నదో తెలియకపోవచ్చును అది తెలిస్తేగాని గాంధీజీ కనిపెట్టిన సత్యాగ్రహాయుధ ప్రాముఖ్యము మనకు తెలియదు. మానవునిలో స్వతహాగా వున్న మంచితనంమీద ఆధారపడివున్నదది. ప్రతిమనిషిలోనూ నైసర్గికమైన ఉదాత్తత కొంత ఉందనీ, దానిని ప్రబోధించాలనీ, అదే బ్రహ్మమనీ, మిగతాదంతా నశ్వరమనీ సత్యాగ్రహవిధానం బోధించే సత్యం.

గాంధీజీ రాజకీయ సమస్యలను, మరే సమస్యలను ఎత్తుకున్నా ఈ దృష్టితోనే చూసేవారు. ఆయన మానవునిలోని గూఢంగా వున్న సత్యమునొక్కదానినే నమ్మారు. ఆ సత్యము ఇదమిత్థమని చెప్పలేము. ఎందువల్లనంటే ఆ సత్యమే బ్రహ్మము; బ్రహ్మము అనిర్వచనీయము. అందుచేతనే గాంధీజీకి శాశ్వతపద్ధతులు, పరిష్కారానికి దగ్గరి దోవలు లేవు. అంతరాత్మలో ఉన్న బ్రహ్మమును వ్యక్తీకరించటానికి తాను, ఇతరులు ఉపయోగించే శక్తినిబట్టి గాంధీజీ తన పద్ధతులను నిర్ణయించుకొనేవారు. బ్రహ్మమునే ‘ఆత్మశక్తి’ అనికూడ ఆయన అనేవారు.

తన ప్రయత్నంలో ఓటమి పొందినప్పుడు గాంధీజీ తన్ను తానే నిందించుకొనేవారు. ఆత్మ పారిశుద్ధ్యంకోసము ఎన్నో కఠోరవ్రతాలు అవలంబించేవారు. మంచితనం మంచితనాన్నే ప్రేరేపిస్తుందని ఆయన దృఢవిశ్వాసం. అలా ప్రేరేపించకపోతే ఆ దోషం తనలోనే ఉండివుండాలని కూడా ఆయన నమ్మకం.

చిన్నచిన్న విషయాల్లో ఆయన రాజీపడేవారు. దీనికి కారణం ఆయన రాజకీయంగా ఏ సాంప్రదాయాన్నీ, ఆచారాన్నీ అంగీకరించకపోవటమే. బూజుపట్టిన గంథాల్లోంచి నియమ నిబంధనలను ఆయన ఎప్పుడూ స్వీకరించలేదు. అగాధమైన తన మానవత్వంలోనుంచే సిద్ధాంతాలను తవ్వితెచ్చుకునేవారు. ఆయన సిద్ధాంతాలు మరేవీ కావు - గాఢప్రేమ, సానుభూతి, సహృదయతమాత్రమే. అందుచేతే వివాదాలను, సంఘర్షణలను ఆయన పరిష్కరించబూనుకునే మార్గమే వేరు. చాలమందికా మార్గం వింతగాను, అసందర్భంగానూ కూడా తోచేది. ఉప్పుసత్యాగ్రహం ఇందుకుదాహరణం. అదొక ఇతిహాసంగా తయారైంది. గాంధీజీ ఈ సందర్భంలో ఇలాగన్నారు:

“నా దృష్టిలో జీసస్, మహమ్మద్‌లు ఉత్తమకళాకారులు. వారు సత్యాన్ని దర్శించి, ప్రకటించారు. అరబ్బీసాహిత్యంలో కురాన్‌కంటె పరిపూర్ణమైన గ్రంథం మరొకటి లేదు. వారిద్దరూ సత్యమునే ముందుగా అన్వేషించటంవల్ల అంతి సహజంగా, అందంగా దాన్ని ప్రకటించగలిగారు. అయినా వారిద్దరూ కళమీద రచన చెయ్యనేలేదు.

నేను సత్యమును, సౌందర్యమును అన్వేషిస్తున్నాను; వాటికోసమే జీవిస్తాను; వాటికోసమే మరణిస్తాను.”

ఆ రోజుల్లో ఉప్పుసత్యాగ్రహయాత్ర ఒక ఉత్తమ కళాసృష్టిగా ప్రజలు భావించారు. యావత్ప్రపంచమూ ఆశ్చర్యంతో ఆ కళాసృష్టిని తిలకించింది.

“నేను భగవంతుని సముద్రంవద్దకు పోతున్నాను. నా చేతులతో నేనే ఉప్పు తయారుచేస్తాను. పరాయి ప్రభుత్వం నన్ను బంధిస్తుంది, జైలులో పెడుతుంది. కాని ఇదే నా సత్యం; నేను దానికోసమే మరణిస్తాను,” అన్నారు ఆ రోజుల్లో గాంధీజీ.

గాంధీజీ భారతస్వాతంత్ర్య సమరరంగంలో తన హృదయశోధన, సత్యాన్వేషణ జరిపారు. తాను పొందిన ఆంతరంగికానుభవాన్నే “అంతర్వాణి” అన్నారాయన. దాన్ని తన దేశీయుల కందరికి వినిపించారు. అందరికీ అది ఆంతరంగికానుభవమే అయింది.

మానవుని అంతరంగాన్వేషణ, ఆందోళనలను ఆయన ఇలా వర్ణించారు: “కురుక్షేత్ర మహాయుద్ధం మానవహృదయంలోనే జరుగుతోంది.”

కనుకనే సాధ్యమునుండి సాధనమును వేరు చేయడం కష్టం.

“ధర్మయుద్ధంకూడా ఎందుకు విఫలమౌతుంది?”అని ఒకరడిగిన ప్రశ్నకు, “దౌర్జన్యమార్గం అవలంబిస్తే ఫలితం విషమిస్తుంది” అని ఆయన జవాబిచ్చారు. కర్మ పరిశుద్ధమైనదిగా ఉండాలి. అంటే ఫలితంమీద ఆశలేనిదిగా ఉండాలి. గాంధీజీకి పరిత్యాగమే జీవితసూత్రము. స్వాతంత్ర్యసమరమునాయన నడిపినప్పుడు ఆయన కోరింది స్వాతంత్ర్యము కాదు. దుష్టశక్తుల నిర్మూలనమునే ఆయన కోరారు. స్వాతంత్ర్యసిద్ధితో విడివడగల సృజనశక్తినే ఆయన తన లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈవిధంగా క్రమక్రమేణా తన దేశీయులను ఈ మహాయాత్రలో నడిపించుకుపోవాలెనని ఆయన ఉద్దేశించారు. కొన్ని కొన్ని సమయాల్లో ప్రజలు ఆవేశపూరితులై, సుస్థిరంగా నిలబడ్డా, వారి విశ్వాసం బలహీనమైపోయింది; ముఖ్యంగా అధికారం రావటంతో మరీ సన్నగిలిపోయింది.

“మీకు అధికారంతో ప్రమేయంవద్దు,” అని ఆయన పదే పదే హెచ్చరించారు. స్వాతంత్ర్యమంటే ఆయన అధికారమని ఎప్పుడూ భావించలేదు; దాస్యశృంఖలాలనుండివిముక్తిచెందటమేనని ఆయనఉద్దేశ్యం.

హింసతోనూ, మారణాయుధోత్పత్తి పోటీలతోనూ నిండివున్న నేటి ప్రపంచంలోకి గాంధీజీ తన అహింసను ప్రత్యామ్నాయంగా ప్రవేశపెట్టారు. శాంతి అంటే ఆయన ఉద్దేశ్యం బలహీనుని అడుకువ కాదు.

శాంతి అంటే నిజమైన మానవత్వం; కనుక అది చైతన్యసమన్వితమైనది. హింసాబుద్ధి కంటే, అది నిజమైనది. రాజకీయతంత్రజ్ఞుల జోక్యం లేకుండా వుంటే అసంఖ్యాక సామాన్యజనం శాంతినే వాంఛిస్తారు. హింస అనేది బుద్ధిపూర్వకంగా ఎవరూ చేయరు; యాదృచ్ఛికంగా మాత్రమే అది సంభవిస్తుంది. యుద్ధాలు అంతకంటే భయంకర యుద్ధాలకి దారితీస్తాయని మానవచరిత్ర నేర్పేపాఠం. మానవజాతి గాంధీజీవంటి ఉత్తమ మార్గదర్శకునికోసం ఎదురు చూస్తోంది. ఆయన ‘మానవులు జీవించాలి, సత్యం జయించాలి’ అనే ఆదర్శంకోసం మరణించారు. ఇదే ఆయన చేసిన త్యాగం; మన కిచ్చే సందేశం. ★

(ఎస్. పి ఎస్. ఇండియా)

ఆసియాలో యూరోపియన్ల ప్రాబల్యానికి స్వస్తి

★

ఎండమావులు

బ్రిటన్, కొన్ని రాజ్యాలూ, ఆసియా, అరబ్ దేశాలూ ఏకమై, జనరల్ మెకార్థర్ ఆశల్ని భగ్నపరిచి, చీనా, అమెరికాలమధ్య ప్రత్యక్ష యుద్ధం సంభవించకుండా నివారించగలిగాయి కాని ఆసియాలో శాంతి అనేది ఎండమావులవలె అల్లంత దూరంలో కనిపించినట్లే కనిపించి, అందుకోబోయేసరికి అదృశ్యమవుతూ, ప్రజలతో చెలగాట మాడుతోంది. కారణం శాంతి స్థాపించడానికి కృషిచేస్తున్నట్లు ప్రచారం చేసేవాళ్లు వాస్తవంగా శాంతి స్థాపనకోసం కాక స్వార్థాశయాలకోసం కృషి చెయ్యడం. చారిత్రక దృష్ట్యా చూసినప్పటికీ ఆసియాలో ఇప్పుడే శాంతి ఏర్పడే సూచనలు కనిపించవు

అమెరికా ఆర్థిక వ్యవస్థ

ప్రపంచంలో అన్నిటికన్న అత్యధికంగా ఉత్పత్తిచేసే అమెరికా, కొన్ని ఇతర ముఖ్య విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. అమెరికాలోని యుద్ధ పరిశ్రమలకు అవసరమైన అల్యూమినియం, మాంగనీస్, మైకా, తగరం, రబ్బరు మొదలైన ముఖ్య వస్తువుల్ని తూర్పు ఆసియా దేశాలనుంచి దిగుమతి చేసుకోవాలి అమెరికా తయారు చేసిన వస్తువుల్ని ఆసియా దేశాలలోనూ, యూరప్ లోనూ అమ్ముకోవాలి ఈ పరిశ్రమలు అమెరికన్ ఆర్థికవ్యవస్థకి ప్రాణాధారాలు. కాబట్టి తూర్పు ఆసియా దేశాలతో వ్యాపార మైత్రి నిలుపుకోడం అమెరికన్ ప్రభుత్వానికి ప్రాణావసరం.

1929-30 ప్రాంతాలవరకూ అమెరికన్లకి ఇది ఇంత ప్రాణావసరం కాలేదు. పశ్చిమ యూరప్ కి ఈపద్ధతి ఎప్పుడూ ప్రాణావసరంగానే ఉంది అందువల్లే బ్రిటన్, ఫ్రాన్సులు, మలయా, ఇండో చీనాల్ని నిలుపుకోడానికి పరువునీ, ప్రాణాల్నీ, విత్తాన్నీ ఒడ్డి పోరాడుతున్నాయి. యుద్ధపు ఖర్చుకూడా లెక్కగట్టితే, ఆ వలసదేశాల వల్ల వస్తున్న లబ్ధి లాభదాయకంగా ఉండేవరకూ అలా పోరాడుతూనే ఉంటాయి. యుద్ధపుఖర్చూ, నష్టమూ పెరిగిపోయి వ్యాపారంలో నష్టం వస్తున్న రోజుని, ఇంక లాభం రాగల ఆశ పూర్తిగా అంతరించిన రోజుని, బ్రిటన్, ఫ్రాన్సులు—మలయా, ఇండో చీనాల్ని విడిచి వెళ్లిపోతాయి.

అమెరికా మనదేశాలనుంచి ముడివస్తువుల్ని కొనే వ్యాపారానికీ, వాళ్ల వస్తువుల్ని మనదేశాలలో అమ్మే వ్యాపారానికీ చాలా వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసాన్ని దోపిడి అంటారు కమ్యూనిస్టులు; అన్యాయం అంటారు మరికొందరు; అది నిండీ దేవుడే అలా నిర్ణయించాడంటారు యూరోపియన్ల అసలు వ్యాపార స్వేచ్ఛలో ఉన్న మజా ఇదేనని అమెరికన్లు అంటారు ఏది ఎలావున్నా మెల్లిగా తప్పులు దిద్దుకొంటూ పోదాం, తగువులు పడితే అసలు వ్యాపారమే జరగదని నెహ్రూ ప్రభృతులంటారు. అసలు దోపిడీ కాని, అన్యాయం కాని జరగడమే లేదు; మనకి న్యాయం చెయ్యడమే కాకుండా, మనల్ని అమెరికన్లు ఉద్ధరిస్తున్నారు కూడా నని అంటారు సగోరాం, ఫిలిప్పైన్స్, దక్షిణ అమెరికన్ దేశాల రాజకీయ నాయకులు.

జరిగేది దోపిడీ అనుకున్నా, అన్యాయం అనుకున్నా, అనుభవించక తప్పని కర్మఫల మనుకున్నా, ఏమనుకున్నా అనుకోవచ్చును. కాని ఇంతవరకూ జరుగుతున్నట్లు ఇకమంచి జరగదనీ, జరగకూడదనీ ఆసియా దేశాల రాజకీయ నాయకులు నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా చీనా భారత దేశాలు నిర్ణయించుకున్నాయి.

మూడు ముఖాల శాంతిపురుషుడు

ఆసియాలో శాంతిని స్థాపించడం అంటే కమ్యూనిస్టుల్ని చితకొట్టడం అని అమెరికన్లు, యూరోపియన్లు చెప్పుకునే అర్థం. సామ్రాజ్యవాదుల పీడన తొలగించి, వాళ్లవల్ల చితికిపోయిన ఆసియా ఆర్థికవ్యవస్థని పునర్నిర్మించి, విప్లవాలతోనూ, ధ్వంసకాండతోనూ నిమిత్తం లేకుండా జాతీయవాదుల కృషివల్లనే శాంతిని స్థాపించాలని నెహ్రూ ప్రభృతుల ఆశయం. ఈ కార్యనిర్వహణలో పాశ్చాత్యుల సహాయం పొందాలని వీరి ప్రయత్నం. ఈప్రయత్నం వ్యర్థమనీ, ఆర్థిక, సాంఘిక, రాజకీయరంగాలలో విప్లవం తెస్తేగాని ఆసియాలో శాంతి దక్కదనీ, యూరోపియన్లు, అమెరికన్లు దక్కనివ్వరనీ కమ్యూనిస్టుల వాదం.

ఈప్రకారం ఆసియాలో శాంతిపురుషుడు మూడురూపాలతో లీలగా ప్రజలకు మనోగోచర మౌతున్నాడు. ఈ శాంతి పురుషుని రూపమేదో మనకి స్పష్టంగా తెలియదు. అందువల్ల ఆయన్ని తీసుకొచ్చి ఆసియాలో ప్రతిష్ఠించాలంటే, ఎవరు వెతికినా ఎండమావుల్లాగ అంతకంతకి దూరమౌతున్నాడు.

ఆసియా దేశాల్ని పాశ్చాత్యులు విడిచిపోవాలని నినాదం చేస్తూ జపాన్ యుద్ధానికి దూకి అమెరికా చేతుల్లో పడి భంగపాటు పొందింది. ఇప్పుడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో చీనాదేశం ఇదివరకెన్నడూ ఎరగనంత బలంకూర్చుకొని ఆ నినాదాన్ని ప్రారంభించింది.

కీలకం

ఈ ఉద్యమానికి చీనా చెప్పగలుగుతూ ప్రధాన హేతువేమిటంటే తమపై ఆధారపడిఉన్న దేశాల్ని, యూరోపియన్ల వలసల్నీ కూడగట్టుకుని అమెరికా చీనాదేశంపై దండెత్తడానికి సన్నాహం చేస్తోందని. చీనా, రష్యాలను చుట్టుముట్టడానికి అమెరికా తన నౌకా, విమానిక, సైనిక బలాల్ని ఆయా దేశాలలో నియోగిస్తున్నదని చీనా ఆరోపిస్తోంది. ఈదేశాలు చీనా దురాక్రమణకు గురికాకుండా కాపాడుతున్నట్లు అమెరికా చెప్తోంది

ఉభయదేశాలూ పన్నుతున్న ఈ వ్యూహాలే ఆసియాలో శాంతికి ప్రమాదాన్ని సన్నిహిత పరుస్తున్నాయి.

తెగనిసమస్య

కొరియాసమస్య, ఫార్మోజా సమస్య ఈ వ్యూహాలలోని, రెండువివరాలు మాత్రమే. కొరియాసమస్య ఫార్మోజాసమస్యపైన ఆధారపడి వుందనీ, రెండోది పరిష్కారమైతే కాని మొదటిది పరిష్కారం కాదనీ పెకింగ్ ప్రభుత్వ వాదనలోని సారాంశం. ఫార్మోజాసమస్యని కొరియాసమస్యతో ముడిపెట్టడానికి వీల్లేదని అమెరికా వాదం. రెండుసమస్యల్నీ పరిష్కరించడానికి ఏకకాలంలో రాయబారాలు జరగాలని భారతదేశం సూచిస్తున్నది.

ఫార్మోజా సమస్య పరిష్కారం

రేషనింగ్

★

దేశమంతటా పట్నాల్లోనూ, పెద్ద నగరాల్లోనూ రేషనింగ్ ప్రవేశపెట్టి, రేషన్ ప్రమాణాన్ని పాతికవంతు చొప్పున తగ్గించాలని భారతప్రభుత్వం ఉత్తరువు చేసింది. పల్లె ప్రాంతాలలో రేషనింగ్ ఉంచాలా, తీసివేయాలా అనే విషయాన్ని ఆయా రాష్ట్రాల నిర్ణయానికి విడిచిపెట్టాలని బొంబాయి ఆహారశాఖామంత్రుల సమావేశం తీర్మానించింది. రద్దుచెయ్యని రాష్ట్రాలు, రేషనింగ్ నిర్వహణ బాధ్యతనంతనీ పూర్తిగా వహించవలసిందే. మునిసిపాలిటీలలో రేషనింగ్ కి సంబంధించినంత వరకే భారత ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుంది.

ఈ రెండు నిర్ణయాలవల్లా వెంటనే జరగబోయేది ఏమిటంటే, రేషన్ ప్రమాణం తగ్గడం, కొనుబడిధరలు పెరగడం.

రేషన్ ప్రమాణాన్ని నాలుగోవంతు తగ్గించినందువల్ల మామూలుగా ఖర్చయే ధాన్యంలో 1951 ఏప్రిల్ మాసానికి రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని మిగల్చవచ్చునని కేంద్ర ఆహారశాఖామంత్రి మున్షీగారన్నారు.

ఇంతవరకూ వరిధాన్యం ఒక్కటే నిర్బంధంగా సేకరించబడుతోంది. గోధుమ, జొన్నలు సామాన్య వ్యాపారరీతినే రాష్ట్రప్రభుత్వాలు కొంటున్నాయి.

ఈ సంవత్సరం కొన్నిచోట్ల అనావృష్టివల్ల, కొన్నిచోట్ల అతివృష్టివల్ల, కొన్నిచోట్ల వరదలవల్ల, అస్సాంలో భూకంపంవల్ల చాలా నష్టం కలిగింది. ఇప్పటికే గోధుమనిలవలు చాలా తక్కువగా ఉన్నాయి. విదేశాలనించి దిగుమతి చేసుకోవాలంటే చాలినంత దొరకదనే విషయం రూఢి అయింది. 37 లక్షల టన్నులుమాత్రం కొనడానికి వీలుందని మున్షీగారన్నారు. ఏ యుద్ధమైనా వస్తే ఇదీ రాదు.

కాబట్టి ఇప్పటినించీ ఉన్న ఆహారాన్ని పొదుపుగా వాడుకోవాలని, భారత ప్రభుత్వం ఇటువంటి ఉత్తరువు చేసింది. ఉత్తరువుచేస్తూ అన్నిరాష్ట్రాలవారూ ఆహారంవిషయంలో సమానంగా త్యాగం చెయ్యాలన్నారు. ఈమాట ఎప్పుడూ చెప్తున్నదే. ఈమారు మళ్లీ చెప్పవలసివచ్చింది అంటే, అన్నిరాష్ట్రాలవారూ అలా చెయ్యడం లేదు కాబట్టి అని చెప్పుకోవాలి.

చెన్నరాష్ట్రంలో రేషన్ ప్రమాణం పేరుకి పదిఔన్సులుందికాని, ఇందులో ఆరౌన్సులే బియ్యం. రెండౌన్సులు గోధుమలుంటే ఇస్తారు. లేకపోతే రవ్వ ఇస్తారు. అదీలేకపోతే ఊరుకుంటారు. మిగతా రెండుఔన్సులూ మొక్కజొన్న కాని, జొన్నలు కాని, చోళ్లుకాని, మరొకటికాని ఉన్నప్పుడుఇస్తామన్నారు. అటువంటిది ఇవ్వడం జరగలేదు. ఇవ్వబూనుకున్నా తీసుకున్నవాళ్లు లేరు. కాబట్టి మన రేషన్ ప్రమాణం ఆరౌన్సులనీ, అడపాదడపా ఎనిమిదౌన్సులనీ చెప్పాలి. దీంట్లో నాలుగోవంతు తగ్గించడం రాష్ట్రప్రభుత్వానికి సమ్మతం కాలేదు. మిగతా రాష్ట్రాలలో పాతికవంతు తగ్గించగా, మొత్తం తొమ్మిదౌన్సులకి తగ్గించడమయింది కాబట్టి, ఆ తొమ్మిదౌన్సులకి తగ్గించడానికి సమ్మతించారు. అయితే ఇందులో బియ్యాన్ని ఎనిమిదౌన్సులకి పెంచాలని షరతుపెట్టారు. ఏడౌన్సులకి పెంచవచ్చని భారతప్రభుత్వం అనుమతించింది. మిగతా రెండౌన్సులూ ఏమివ్వాలో ఇంకానిర్ణయం కాలేదు. నిర్ణయమైనా అది నిత్యం ఇవ్వగలరనే నమ్మకం లేదు.

భూకంపాలూ, వరదలూ వచ్చి కొరత తెచ్చిపెడుతున్నందువల్ల భారత ప్రభుత్వం తల్పెట్టుకున్న స్వయంపోషకత్వదీక్షకి ఆట్టే భంగం కలగనవసరం లేకపోవచ్చును. అలాటి అవాంతరాలు రానిపక్షంలోనే విదేశాలనుంచి దిగుమతి మానేస్తారన్నాగా. వచ్చే ఫసలీ పంటలకి కూడా ఏవో అవాంతరాలు రాకపోతాయా అనే ధైర్యం అందరికీ ఉంది. అప్పుడు దీక్షకి భంగం లేకుండా దిగుమతి చేసుకోవచ్చును.

ఈలోగా వీలైనంత వరకు మన వ్యాపారానికి ముఖ్యమైన జనపనార, పొగాకు మరింత విరిగా పండించుకోవచ్చును. ఏతుపాను లొచ్చినా, భూకంపా లొచ్చినా ఈ రెండు పంటలూ మాత్రం తగ్గడంలేదు. వస్తూత్పత్తిని వృద్ధిపరచాలంటూ ప్రారంభించిన ఉద్యమం, ఈరెండింటిలోనూ ఫలిస్తోంది కాని ఆహారం విషయంలో పలకడంలేదు. ఎంత జోరుగా ప్రచారంచేసినా ఆహారధాన్యాల పంట నానాటికీ తగ్గుతోందే కాని పెరుగుదల కనిపించదు.

మనం స్వయంపోషకత్వం సాధించాలనీ, 1951 ఆఖరునుంచి ఒక్క గింజైనా విదేశాల్లో కొనుక్కోకూడదనీ పదేపదే మనపరిపాలకులు అంటున్నందువల్ల, మనకి బియ్యం అమ్ముకుని తమ వ్యాపారం వృద్ధిచేసుకోవాలని ఆశపడే బర్మావంటి దేశాలు, తమ బియ్యం కొనడానికి సిద్ధంగాఉండే వేరే దేశాల్ని వెతుక్కుంటున్నాయి. ఈ ఒక్క సంవత్సరానికే ఇవ్వండి కొంటాం అని చెప్తే, బర్మా మనకి బియ్యాన్ని ఈ ఒక్క సంవత్సరానికైతే ఎందుకులే అని వెనకదీసింది.

ఎంతప్రచారంచేసినా మన పంటలు వృద్ధి కాకపోగా మన ప్రభుత్వానికి మార్గాంతరం ఒక్కటే తోచినట్లుంది. అది బ్రిటన్ అనుసరించిన పద్ధతి. ఇప్పట్నించీ పొదుపుగా వాడుకుని, మన పొగాకు, జనపనార ఎక్కువగా పెంచుకుని డాలర్లు, పౌనులు ఎక్కువగా సంపాదిస్తే ఆ ద్రవ్యంతో ఏ దేశంలోనైనా సరే ధాన్యాలు కొనుక్కోవచ్చు.

[సీతారామ్]

★

కావడం అంటే, చియాంగ్ కి స్వాధీనం చెప్పి తమకి ఒప్పగించాలని చీనా పట్టుదల. ఏం చెయ్యడానికి, ఒప్పుకోడానికి సిద్ధమే కాని, తమని అంటిపెట్టుకున్న చియాంగ్ కి నీళ్లు వొదలడానికి అమెరికా ఒప్పుకోదు. "మా అమెరికా దేశాన్ని రక్షించుకోవాలంటే ఫార్మోజా నికమ్యూనిస్టుల చేతుల్లో పడకుండా కాపాడుకోవాలి" అని అమెరికన్ల వాదన.

కాబట్టి కొరియా, ఫార్మోజాల సమస్య ఏస్థితికి వచ్చిందంటే - రాయబారాలవల్ల పరిష్కారం కావడం అసాధ్యం; యుద్ధం చేసి తేల్చివేద్దామంటే ఆసియా - అరబ్ దేశాలూ, పశ్చిమ యూరప్ దేశాలూ ఒప్పుకోవు.

చివరికి అటో ఇటో తేలే యుద్ధమూ జరగదు; దక్షిణ కొరియానించి అమెరికన్ సేనలు తొలగిపోవు. అమెరికన్ విమానాలు ఉత్తరకొరియామీద బాంబులు వెయ్యడం మానవు. ఇలా ఎంతకాలం జరుగుతుందో తెలియదు. దీనివల్ల అమెరికన్లకి ఒక ప్రయోజనం ఉంటుందిట; ఇండోచీనా, మలయాలలోకి చీనా సేనలు ప్రవేశించకుండా కమ్యూనిస్టుల చేతులు కట్టివేసి నట్లవుతుందిట.

అంటే ఫలితం ఆసియాలో శాంతీ ఉండదు, పెద్దయుద్ధమూ జరగదు.

[సూర్యనారాయణ]

★

3

త్రుళిద్దరూ మద్యం చప్పరిస్తూ కూర్చున్న ప్రదేశంనుంచి కాటలన్స్ నివాసగ్రామం నూరడుగుల దూరం ఉంది.

పూర్వం ఒకప్పుడు స్పెయిన్ నుంచి ఒక గుంపు చిన్నపడవల్లో వచ్చి ఇక్కడ చేరింది. వాళ్ళెలా వచ్చారో ఎవరికీ తెలియదు. వాళ్ళు వాడేది కొత్త భాష. వారిలో స్థానికభాష తెలిసిన ఒకనాయకుడు ఈప్రాంతంలో వలస స్థిరపర్చుకోడానికి అనుమతి కోరుతూ, మార్సెల్స్ కౌన్సిల్‌కు మహజరు పెట్టాడు. మహజరు నమోదైన మూడుమాసాలలో అక్కడొక గ్రామం వెలిసింది. సముద్రాలపై స్వేచ్ఛాసంచారం కాంక్షించే కాటలన్ జాతి గుంపు ఇక్కడ నివాసం స్థిరపర్చుకుంది. వారు నిర్మించుకున్న గ్రామం కొంత స్పానిష్‌రీతినీ, కొంత మూరిష్‌రీతినీ మేళవించి ఒక వింత అందం తెచ్చుకుంది. సముద్రంలోకి చొచ్చుకున్న ఆ నేలని విడిచిపెట్టకుండా ఆగుంపు ఈనాటికీ అక్కడే వుంది. ఈనాటికీ వాళ్లు పూర్వీకుల భాషనే వాడుతున్నారు. తాత ముత్తాతల ఆచార సంప్రదాయాలను, దుస్తులను అనుసరిస్తున్నారు. మూడు నాలుగు శతాబ్దాలైనా వాగు ఇతరులతో కలవరు. వివాహసంబంధాలు పెట్టుకోలేదు. భాష విశిష్టతనూ, జాతి విశిష్టతనూ నిలబెట్టుకున్నారు.

సీతారామ్

ఆ గ్రామానికి ఒకే ఒక వీధి ఉంది. సూర్యాతపానికి ఇళ్ల రంగులు వెలిసిపోయాయి. సున్నపు తెల్లదనం తప్ప, ఎక్కువ అలంకారమేమీ కనపడదు. ఆ వీధిలో ఒకచిన్న ఇంట్లో......

నల్లని శిరోజాలు, తళతళలాడే లేడికళ్లు గల ఒక చక్కని యువతి గడప నానుకుని నిలబడిఉంది. నాజూకైన వేళ్ళతో ఒక పూలగుత్తిని నలుపుతోంది. రేకులు కింద రాలుతున్నాయి. దేవతా ప్రతిమను చూసి చెక్కినట్లున్న పొడుగైన చేతులు కంపిస్తూ, లోని ఆవేగాన్ని ప్రకటిస్తున్నాయి. ఒక పాదంతో మెల్లిగా నేలను తట్టుతోంది. ఆమెకు మూడడుగుల దూరంలో సౌష్టవశరీరుడైన ఒక యువకుడు కుర్చీలో కూర్చుని, ముందుకూ వెనక్కూ ఊగుతున్నాడు. అతని వయస్సు ఇరవై, ఇరవైరెండేళ్లుండవచ్చును. యువతివంక తదేకంగా చూస్తున్న అతని ముఖంలో ఓర్మిలేమి, చికాకు స్పష్టంగా గోచరిస్తున్నాయి.

యువతిముఖంలోని నిశ్చలభావం, యువకుని ముఖంలోని సంశయాందోళనలను ఇనుమడింప చేస్తున్నది.

"ఈస్టర్‌కి ఇంక ఆట్టేరోజులేవు మర్సిదా! వివాహ ముహూర్తాలు సమీపిస్తున్నాయి. నాకు సమాధానం చెప్పవా?" అన్నాడు యువకుడు.

"ఇప్పటికి నూరుసార్లు సమాధానం చెప్పాను ఫెర్నాండో. నన్ను మళ్లీమళ్లీ అడుగుతున్నావంటే నీపైన నీకే విశ్వాసం లేదన్నమాట."

"అదే కావచ్చు! కాని మళ్లీ ఇంకోమారు చెప్పమని బతిమాలుతున్నాను. నే నామాటల్ని నమ్మగలిగేవరకూ చెప్పు. అయ్యో! నీ సాహచర్యంపొంది సుఖించాలని పదేళ్లకాలం కలలుకంటూ గడిపి, చివరికి నాజీవితంలో ఈ ఏకైకలక్ష్యం చేకూరే ఆశ నశించనా?"

"నేను మాత్రం అటువంటి ఆశకు తావివ్వలేదు ఫెర్నాండో. నే నెప్పుడూ నీకు చెప్తూనేవున్నాను—నిన్ను సోదరునిగా భావించి ప్రేమిస్తున్నానని; సోదరప్రేమకంటె అధికంగా ఏదీ నావద్ద కోరవద్దని; నాహృదయం మరొకనికి అర్పితమయిందని. నేను నీకెప్పుడూ చెప్తూ ఉండలేదా ఫెర్నాండో?"


"అవును మర్సిదా! చెప్తున్నావు. నిర్దయతో నిష్కర్షవాక్యాలనే నాకెప్పుడూ ప్రసాదించావు. కాని, కాటలన్స్‌జాతికి చెందినవాళ్లు అన్యజాతీయుల్ని వివాహంచేసుకోరాదనే పవిత్ర నియమాన్ని నువ్వు మరిచిపోతున్నావు."

"అది సరికాదు ఫెర్నాండో. అది నియమ విధి కాదు. అది ఆచారం మాత్రమే. నీ స్వార్థం కోసం ఈ ఆచారంతో నన్ను బంధించడానికి ప్రయత్నించకు. సైన్యంలో చేరాలని నీకు ఆజ్ఞ వచ్చింది. ఏక్షణంలోనైనా నువ్వు వెళ్ళిపోక తప్పదు. నువ్వు సిపాయివైనతరవాత నావల్ల నీకేం ప్రయోజనం ఉంటుంది? నాకే సంపదా లేదు; ఈ ఒక్క పూరిల్లు తప్ప. తల్లిదండ్రులు లేరు. ఏ ఆధారం లేని నావల్ల నీకేం ప్రయోజనం?"

"నువ్వు పేదవే; ఒంటరివే. అయితేమాత్రం? మార్సెల్స్‌లో ఎంతటి భాగ్యవంతుల పుత్రికలైనాసరే వారికంటె నువ్వే నాకు ఎన్న తగినదానవు. ఋజువర్తనలోగాని, సమర్థతలోగాని నీకు చాలిన మరొక యువతిని చూపించు?"

శిరస్సువంచి మర్సిదా అంది:—"కాని ఫెర్నాండో, ప్రేమించినవానిని కాక అన్యుని వివాహమాడే యువతి ఋజువర్తన మారిపోవచ్చు. నామాట విను. నీ పల్లవృత్తిపైనే నీ

(42-వ పేజీ చూడండి)



విపజ్ఞ చిత్రాలు

పుస్తకం మూసీసేను. కొంచం ఆవలించి, టేబిల్ మీద మోచేతులాని కుర్చీలో అలానే కూర్చొని ఆలోచనలో పడ్డా.

బెడ్ లైటు మసక మసకగా వెల్గుతూంది. ఆ చిన్న లైట్ తోనే యీ రెండేళ్లూ గడుపుకు వచ్చేను.

శ్రీమతి 'ఒకకొత్తలాంతరు కొనండీ' అని ప్రతినెలారంభాన జీతంపుచ్చుకున్ననాడు పోరుపెడ్తుంది. అయినా చదువుల గదిలో యీ బెడ్ లైట్, వంటయింటో బుడ్డీ దీపం, భోజనాలదగ్గర పెద్దసీసా బోదురుదీపమే వెలుగుతున్నాయ్.

కొత్తలాంతరు కొన్నే లేదు.

కిటికీలోంచి ఝుంయ్‌మని గాలి కొట్టింది. భగ్‌మని బెడ్ లైట్ మండి ఆరిపోయింది. నేనుమాత్రం కదల్లేదు. అలా కుర్చీలో టేబిల్‌కు చారబడే వున్నాను.

సినీమాప్రేక్షకుల అలికిడి క్రమంగా తగ్గిపోయింది. ఇంటో అంతా సమస్తాన్నీ మరచి పరలోకంలో వున్నట్టు నిద్రిస్తున్నారు. నేనుమాత్రం చీకట్లో వీధిగదిలో వున్నాను.

కిటికీవూచల తాకిడి చప్పుడయింది. వెనక్కి తిరిగేను. కిటికీలోంచిసన్నగా పడిన వెలుతురుకిరణం గోడమేకుకి తగిలించిన నాలాల్చీ లేనట్టు చెప్పింది. గాభరాపడ్డా- గభాల్న బయటకు వచ్చి చూసేను. ఒక వ్యక్తి అప్పుడే పరుగు పుచ్చుకోబోతున్నాడు. నాగుండె దణక్ మంది. ఆ జుబ్బాలో నా రూపాయిన్నర పెన్నుంది. చాకింటిలాల్చీ నిన్ననే చాకలితెస్తే తొడుక్కున్నా. ఆపెన్ను లేకున్నా, ఆ లాల్చీ లేకున్నా కాలక్షేపం జరగదు తెల్లారిన నుంచీ.

పరిగెత్తేను అతని వెనకాలే- పదిగజాల్లో ఎదురుగా ఎవరో వస్తూంటే 'దొంగ దొంగ పట్టుకొండి' అని కేక వేసేను. ఎదురువ్యక్తి పట్టుకున్నట్టు నటించి తనూ మొదటివాణ్నే అనుసరించేడు. అతడూ ఆ జట్టే నేమో!

నా చిన్నకేకల్తోనే అరుగుమీద పడుకున్న మరిద్దరు మగవారు నాకు సాయపడ్డారు. పరుగెత్తేము. ప్రక్కవీధితిరిగి సందులోకి మాయమవుతూ నామీద కటాక్షించేరేమో అన్నట్లు చొక్కా కాలువ ప్రక్కగా పారీసేరు.

అవును-, ఆరూపాయిన్నర పాతపెన్నూ, కొన్న ఆరునెలల్లో యిరవైరేవుల్లో నలిగి జీర్ణమైన ఆచొక్కా వాళ్లకేం వుపయోగిస్తుంది.

నాసహాయకులు లాల్చీ నాకందిస్తూ 'చూడండీ, రాత్రులు కొందరు కుఱ్ఱవాళ్లు కేపు వేయటానికై తిరుగుతూవుంటారు నిరతం- తలుపులు వేసుకొని పడుకోవాలి. చొక్కా లేపి కిటికీలోంచి అందేట్లు వుంచకూడదు' అని మందలించేరు. వీరికంటే ఆ దొంగలే నాకు బుద్ధి చెప్పేరు- బుద్ధి చెప్పడమేకాదు క్రొత్త జ్ఞానోదయం చేసేరు.

నాగదిలోకి వచ్చి కూర్చున్నా. వీళ్ల కక్కుర్తి దొంగత నంగురించి నవ్వు వచ్చింది- యిలా చేస్తూ ఒక్క రోజులో మళ్లా సంపాదనంతా దూబరాగా జల్సాలకి వెచ్చించేస్తారు. యీ సందర్భాల్లో శ్రీకృష్ణజన్మస్థానంలో కూర్చునే అవుసరం, ఎముకలు విరిగినట్లు తన్నులు తినే స్థితి తటస్థిస్తూవుంటుంది.

‘[illegible]’

అన్నీ భరిస్తూ 'పొదుపూ, కుటుంబ పోషణ లేక మళ్ళా యిదే చేస్తారు రోజూ. దరిద్రులు! నీతిలేని దరిద్రులు వీళ్ళు.

ఏరాత్రో వచ్చి మాఆవిడ యింట్లోకి తీసుకుపోయింది; వీధిగది గడియవేసి-

* * *

ఉదయాన్నే కాఫీ తాగుతూ రాత్రి సంఘటన చెప్పేను. తిరిగి రెండు చెప్పు దెబ్బలు తినేటంత పనైంది. 'నే అనుకుంటూనేవున్నా. మీ రిలాగే వీధిగదిలో వున్న రెండుమూడు పనికివచ్చే సామానులూ ఎవళ్లకో అప్పచెప్పిస్తారని. రేపట్నుంచి మీరు వీధిగొట్లో రాత్రి పది తర్వాత ఉంటే వొప్పుకునేదిలేదు. మీరలా కుర్చీమీద కూర్చుంటేగానే మాగన్ను పట్టేసిందంటే మీ ప్రక్కనుంచే యింట్లోకి ఏదొంగవెధవైనా ప్రవేశించి ఒక కంచు గ్లాసుముక్క తీసుకుపోతే చాలదూ? కాఫీ త్రాగడానికి వెలితివస్తుంది' అని హెచ్చరించింది—

ఆరున్నర బూరా 'బంయ్' మని పెద్ద కేక వేయసాగింది. రెండు గుక్కల వేడికాఫీ ఒక్క గుక్కలో గొంతులో వొంపుకొని వీధిగుమ్మం దిగేను.

ఎదురుగా సూర్యభగవానుడు వుదయించినా ఏదో వ్యాధిగ్రస్థునివలె, మనోవికలునివలె నజ్జుగా వున్నాడు. కాంతివిహీనంగా మసాబులో కనుపిస్తూన్నాడు.

ప్రతిఉదయం నేను ఆ దారంట వెళ్తూంటే ఆ ఉదయభానుడు అలా నీరసంగా కనుపిస్తూనేవుంటాడు.

అయితే ఎందుకలా రూపిస్తాడు అన్న దానికి రెండు జవాబులు తట్టాయి నాకు- ఒకటి నన్ను, నా అసంపూర్ణ సుఖానుభవంలో వస్తూన్న ఒడుదుడుకుల్నీ, నిత్యయాతనల్నీ చూచో, లేక తనకళ్లముందు అనంతకోటి జీవరాసుల సుఖదుఃఖాల ముమ్మరంమాట ఆటుంచి తన ఉదయరాగవేళ కనులు విప్పేసరికే జీవనయాతనల్లో మునిగిన దీన పాటక జనాన్ని చూసో—

సూర్యభగవానుడే కాదు. కడలిరాజు కూడా అంతే- ప్రశాంత గభీరమయిన తన హృదయంలోంచి ఆ వేదనాపూరితాలైన దుఃఖతరంగాల్తో చెలియలకట్టను తట్టి భూలోకవాసుల విపజ్జీవితాన్ని చెప్పి రోదిస్తాడు. అవును- ప్రకృతికైనా ప్రకృతిఅధినేతకైనా గుండె కరుగదా! హృదయంలోంచి వేదన పొంగి పొర్లదా?

జాలరిఆడంగులు తెల్లవారకముందే నానబెట్టిన కొబ్బరిడొక్కలను బరువైన కఱ్ఱదుక్కల్తో బాదటం ప్రారంభిస్తారు. పీచు సాఫుదేరేవరకూ మర్దన చేస్తూవుంటారు. వూరవుదయానే తమపనుల్లో చెమట్లు పోసేటంతగా శ్రమిస్తూంటారు. చేతులెత్తి కదలిపోతూ, ఆయాసంతో చేసే ఆపనిలో వారి బక్క పేగులు, వాడిపోయిన ముఖాలు ప్రత్యక్షమవుతూవుంటాయి.

తీరాన కొందరు జాలర్లు వలల్ని సముద్రంలోకి విసిరి చేపలకోసం గాలిస్తారు. ఇంకొందరు శాంతమయిన సముద్రమధ్యంలో పడవలపై ఆహారంకోసం దేవుల్లాడుతారు.

తొందర తొందరగా భుజాలపై వలలు మోసుకుంటూ ముసలిజాలర్లు బాలయువకులజోడీతో నడుస్తూంటారు. ఆడంగులు చేపల బుట్టల్ని బుఱ్ఱమీద పెట్టుకొని పరుగునడకతో వెళ్తూంటారు.

రోడ్డుప్రక్కగా ఒకచోట బక్కచిక్కిన ముసలమ్మ గోనెబరచి సెనక్కాయల పోగులు సర్దుతూంటుంది.

విరిగిపోయిన రాతిగట్టుమీద కూర్చొని పక్షవాతంతాత ఒకడు దారంట పరిచయమున్నదాతల్ని చూసి చెయ్యిచాస్తూంటాడు. ఇంకా అనేకతరగతుల బీదజనం గోచరిస్తారు. ఆ బీచిరోడ్డంటే వెళ్తూ నేను ఎంతో బాధపడ్తాను. రోజూ ఈ వేదనా ఘట్టాల్ని చూస్తాను. రోజూ గుండె గుబులుతో కృంగిపోతూంటాను.

బీచిరోడ్డు వదలి మలుపుతిరిగి నా గమ్యస్థానానికి వెళ్లేను. ఆవీధినిండా ఎన్ని ధనిక కుటుంబాలు! వారి యిండ్లలో ఎందరు నౌకర్లు! ఎందరి శ్రమఫలితాన్ని కాలు కదపక రవంత కష్టంలేక ఆ ధనికులు అనభవిస్తున్నారు. హాయి విసుపు లేక నెలరోజులు ఆ జాలరిపాటకజనం చెమటోడ్చి సంపాదించవలసే భత్యం, రోజుకు రెండణాలవంతున మూడునెలలకుగానీ ముసలమ్మ ఆర్జించలేని ధనం, నేను జీతంకాక రోజువారీ అదనంగా ఆర్జించగల నెలరోజుల సొమ్ము ఒకరోజులో పండ్రెండు గంటల్లో ఒక్క ధనికకుటుంబం ఖర్చు చేయిస్తున్నది. అందులో మూడువంతులు తిండీ తిప్పలకే అవుతుంది. కొంత మాత్రం శ్రామికులకు ప్రతిఫలంగా అందుతుంది.

నా లెక్కల జమాఖర్చులు వ్రాయటం అవగానే యింటిముఖం పట్టేను. స్నేహితుడొకడు కల్సి చేబదులడిగేడు- వూఁవూఁ ఏమట్టే లేదు. రూపాయకు తక్కువైన చిల్లరే వుంది. అందుకొని ఏదోకొంత తృప్తి పడ్డాడా మిత్రుడు.

* * *

వాలుకుర్చీలో కూర్చొని మార్గాయాసం తీర్చుకుంటూంటే యజమానురాలు వచ్చి యివాళకు బియ్యం లేవంది.

పోనీ అన్నాను-

'భోజనం సున్నా'

'అలాగే అవనీ'

'ఆకలివేస్తుంది-మరి పిల్లలో - నేనో?'

'పస్తుండాలి'

'అలా ఎలా అవుతుంది. మేం నిరాహారంగా వుండము'

'అంతకంటే చేయగలిగిందేముంది. లేకుంటే రెండేసి గోధుమరొట్టెలు వెయ్యి, తిందాం—'

'ఆ పిండీ అయిపోయింది'

'మినప్పప్పు నానవేసి అట్లు వెయ్యి'

'అదైనా కొంచెమే వుంది. బంగాళాదుంప ఒక వీసెడు తీసుకురండి'

'డబ్బులున్నాయా?'

'రాత్రి రూపాయి మార్చేరే. అయిపోయిందిటండీ'

'ఊఁ అయిపోయింది-కనుకే లేదు-'

'అదేంటండీ—మీరు మరీన్ను?'

'అవును-దార్లో స్నేహితునికి అవుసరమైందది. నీ పెట్లో ఏమైనా మిగిలివుందేమో వెతుకు—'

'ఇంకేముంది నా తలకాయ'

'నీ తలకాయ వుందిలే—ఆ తలకాయలో ఏ మూలనైనా ఏమాత్రం చిల్లరైనా పెట్లో వున్నట్లు జ్ఞాపకం వుందేమో చూడు'

'మీ రెప్పుడూ యింతే - పైసాకూడా వుంచక వుప్పు కొనుక్కోడానికి కూడా లేకుండా చేస్తారు.'

'అంతా యీ నీ కుటుంబానికే'

'మీ కుటుంబం కాదు కాబోలు'

'ఆఁ—మన కుటుంబానికే- తే- యివాల్టికి రొట్టె బంగాళాదుంప తినివుందాం.'

'ఏం పనుల్లెద్దురూ! యిన్ని ఖర్చు లవుతున్నాయి. యింత ఆర్జిస్తారు. అయినా పస్తులు తప్పకుండా వున్నాయి'

"ఏంటి సుశీ! నువ్వింత తెలివితక్కువగా మాట్లాడుతావు. ఎందరు మనకంటే దుర్దశల్లో కుందిపోతున్నారు. అసలు రెండేసి రోజులు సెరా తిండి లేక కుడుకుంటున్న కుటుంబాలెన్ని వున్నాయి! పిల్లా పాపకలవాళ్లు ఎంతమంది అర్ధాకలితో మల మల మాడిపోతున్నారో వూహించవేం?" అన్నా.

సుశీల మరేం మాట్లాడలేదు. శనివారం శెలవునాడైనా స్థిమితంగా విశ్రాంతి తీసుకోలేకపోతున్నందుకు విచారంతో వీధులోకి నడచేను.

* * *

బజార్లో ఒక బడిపిల్లవాని తండ్రి కలిసేడు. తన పిల్లవానిగురించి ఏవేవో ఏకరువు పెట్టేడు. పుస్తకాలు త్వరలో కొంటానని బ్రతిమలాడేడు—చాలా జాలివేసింది. అలాగే నని బుర్ర వూపేను.

పాపం! నిన్న నోట్సుపుస్తకం తేలేదని ఒకడ్ని, అచ్చుపుస్తకం తేలేదని మరొకడ్ని, పుస్తకాలు ఎందుకు తేలేదని పీడించేను.

'మాస్టారూ! సోమవారం కొంటానన్నారండీ మా నాన్నగారు. ఇవాళ్టికి క్షమించండి — తప్పకుండా తీసుకువస్తా అని' ప్రార్థేయపడ్డాడు.

కానీ యిరవైరోజులైనా యింకా తీసుకురాలేదని క్షమింపరాని నేరంగా బెత్తాన్ని ప్రయోగించేను నిరయగా. ఇది తరగతిక్రమశిక్షణను సంరక్షించే విధానమని, లేకుంటే పిల్లలు దార్లో పడరని పాఠశాలాధికార్ల తలంపు.

వాళ్లను బాధించి ఏడిపిస్తేగాని వీల్లేకపోయింది. నెలకూలో, రోజుకూలో తెచ్చుకొని బొటాబొటీగా సంసారం పోషణ జరుపుకుంటూవుండే ఆ గర్భదరిద్రులైన సామాన్యప్రజలు పిల్లల్ని చదివించుకోలేక ఏనాటికో ఒకరు తమపిల్లల్ని చదువుకి పెడ్తే యీ కష్టనిష్టురాలు వచ్చిపడ్తూంటాయి. అని చింతపడ్డా

దుంపలు తీసుకువెళ్లి యింట్లో పడేసేను. పిల్ల ఏడుస్తూంటే నాచేతి కందించేసి వీధిలోకి వెళ్లిపోయింది మా ఆవిడ పెరుగు పుచ్చుకోటానికి. ఆ పెరుగుమనిషితో పోట్లాడుతూ కొసరు వేయించుకుంటున్నది.

ఆ పెరుగుమనిషి నాల్గు మైళ్ల దూరం నుంచి ప్రతీరోజు వస్తుంది. ఈమే తెల్లవారుజామున నాల్గుగంటలకు లేపి పాలు పోస్తుంది. మళ్లా తొమ్మిదింటికి పెరుగు పోస్తుంది. ఏమి యాతన! ఏం జీవితం! ఏ నిశలోనో యింట్లో బయలుదేరి, కాలినడకతో నాలుగో గంటయేసరికి పాలు తెస్తుంది. బోరున వాన పడినా, చలిగాలి వేసినా వరద వచ్చినా, ఎడతెరిపి లేక ముసురు పెట్టినా ఆ పాలమ్మి రావడం మానదు.

ఎందుకీ అభంగమయిన యీ విక్రయ దీక్ష! తన ఒక్క కడుపుకా? తన తిండి కోసమే అయితే యింత అపేక్ష ఎందుకు? యింకా వున్నా కుటుంబంకోసం, వీలైతే దాచటానికి ఎవరికో, ఎప్పటికో హాయీ విసువూ లేని పాటుపడటం. ఆమె శరీరంలోని మాంసాన్నీ, సుఖాన్నీ కబళించి జీవచ్ఛవాన్ని చేసేయి. ఏళ్లతరబడి ఆమె జీవన సరళి యిలానే వుంది.

ఆ కష్టజీవిదగ్గర కొసరేంటి అని కసిరేను సుశీని - ఈ ఆలోచనల్లో మైమరచిన నాకు తగిన ప్రాయశ్చిత్తం చేసింది ఒళ్లో చంటిది. తన పసుపు కాటికే నాచొక్కాకు పులిమి చాలా వికృతంగా మార్చింది. ఆ జుబ్బా తొడుక్కొని వీధులోకి వెళ్లటానికి పనికిరాకుండా తయారైంది. వుతుక్కున్నా కాటుకమరకలు వదలవు — ఏంటి గతి భగవంతుడా అని విచారపడ్డాను.

ఇప్పుడప్పుడే భోజనం తయారవదు. ఇంట్లో వూసుపోదు. బయటకు వెళ్దామంటే బట్టలు లేవు. వెతుకుతే చింకిచొక్కా ఒకటి బయటపడింది. చాలా చిరిగింది. మరి కొంత తడవాలోచించగా చిరుగు చొక్కాకు జతకలపడానికి అయిదేళ్లక్రితం కుట్టించిన ఒక పాతికోటున్నట్లు జ్ఞాపకం వచ్చింది. పెట్టె కెలకగా అడుగున వుంది. తీసి తొడుక్కున్నాను.

మా ఆవిడ నాఅలంకరణ చూసి 'ఇదేంటి బుడబుడక్కలప్పయ్యాలా తయారయేరు?' అని పరిహాసం చేసింది.

నాకు అరికాల్లోంచి మండుకొచ్చి 'ఫో ఫో! నీకన్నీ అవహేళనలే-చంటిగుంటను నా వొళ్ళో కిచ్చి చక్కా పోయేవ్ - అది నా చొక్కా అంతా ఖరాబు చేసింది మసి, పసుపులతో. యిది గతయింది ఆఖరుకు - అని చరచరా దారి తీస్తుంటే'

'ఉండండీ కాఫీ వెచ్చచేస్తునా త్రాగి వెళ్లిపొండి' అంది. జేబులో దమ్మిడీ లేదు. కాఫీ తాగాలని జ్ఞాపకం వచ్చి నా కోపం మరచి ఆగిపోయేను.

* * *

వెండిగిన్నెఅంచు పెడిమల్ని చురికిస్తూంటే నాల్గు గుక్కలు వేసి రీడింగు రూముకు దౌడుతీసేను.

ఫేనుగాలిలో ఎండధనరు తెలియకుండా చదువు ప్రారంభించేను. అరగంట తరువాత నా కళ్లు ఒకసారి రాహాలంతా కలయచూసేయ్ - పుస్తకం 'వొళ్ళో' పెట్టుకొని చదువుకొనే వైఖరి మార్చేను. అనుకోకుండానే అలా చేసేనామరో అయిదు నిమిషాల్లో ఎవరో దగ్గరకు వచ్చేరు—

'నారాయణం'

ముఖమెత్తి చూసి కొంతసేపు నిశ్చేష్టుడ్నై 'అఁ కూర్చో' అంటూ ప్రక్కనున్న కుర్చీ కొంచం జరిపేను

'కూర్చుంటాగాని - మరిచిపోయి నట్టున్నావు-'

'అబ్బే! లేదు- జ్ఞాపకముంది. ఈమొదటి వారంలో నీకు తప్పక అందించేస్తాను.'

'ఇది మూడోవాయిదా. యీదఫా తప్పిపోతే బాగుండదుసుమా' కచ్చితంగా మందలిస్తూ అన్నమాట లవి.

మౌనంగా అతని మాటల్ని విన్నాను. వెళ్లి పోతూ అత డనిన మాటలు సూదితో పొడిచినట్లు బాధించేయి.

అసలు అప్పిచ్చిన పెద్దమనిషి కనపడగానే ప్రాణాలు నిలువునా ఎగిరిపోయేటంత వ్యధకల్గుతుంది. ఇక నిలబెట్టి 'అప్పుమాట ఏంచేసేవ్' అని అడుగుతే మరి చెప్పేదేంటి?

నిజంగా ఆపెద్దమనిషి సౌమ్యుడే-మరేం గందరగోళం చెయ్యలేదు నలుగురిలో-' రెండునెలలక్రితం అవుసరాని కిచ్చిన బాకీ తీర్చకుంటే ఎలా?

ఏవో నాలుగుపత్రికలు తిరగవేద్దామని వచ్చిన నా చదువుకూ ఆలోచనలకూ అవాంతరం వచ్చింది అసలే స్థిమితం లేకచస్తుంటే యీ ఘాతలు మరీ నన్ను అస్థిమితుని చేస్తున్నాయ్.

నాలాంటివారింకెంతమంది యీహాల్లో వున్నారో! ఎంతమంది కొద్దికాలమైనా యింటి వాతావరణాన్ని మరచి, పత్రికలు చూద్దామని వచ్చారో! అవును- ప్రతినెలా డబ్బు ఖర్చుచేసి యిన్ని పత్రికలు కొన్లేక ఒక్క ముప్పావులాతో ప్రపంచాన్నీ, దేశాన్నీ, పరామర్శిద్దామనే చాలామంది తాపత్రయం.

అంగుళే యిక్కడకు ఎడతెరిపిలేని విద్యావంతుల హడావుడి. పదకుండుదగ్గరవుతూంటే రీడింగురూముమెట్లు దిగేను. నా వాలకంవేపు చాలామంది దృష్టి సారించేరు. కానీ తొణక్కుండా ముందుకు లంకించుకు పోయేను.

* * *

భుక్తాయాసం అట్టే లేదు. కానీ అడ్డమైన రొడ్డా కడుపులో కూరడంవల్ల కొంచం పొట్ట భారమయింది. అలా ప్రక్కచుట్టుకు బారవేసేను శరీరాన్ని. నిద్రపట్టిందేమో

అనుకున్నా. నిద్రఎలా పడ్తుంది యీ చింతా పరునకు- అయినా అలసిన మనశ్శరీరాలు విశ్రాంతితీసుకున్నాయి ఒక అరగంట నసిలి-

నిద్రలో ఎన్నెన్నో విచిత్రమైన కలలు కన్నాను. బకో యీదార్లు, పత్రికా సంపాదకుల నారితో వకాలుగురించి సుఖమయిన కలలు-

మూడు గంటలు దాటిపోతూందని వేగంగా ముఖం కడుక్కొని బట్టలు వేసుకొని, టీచుక్కలు త్రాగి పైర్రివేటుకు బయలుదేరేను.

'బస్తీలేని నాడు పైర్రివేటు కూడా లేకుంటే బాగుండును మాష్టారూ' అంటాడు ఒక కుఱ్ఱవాడు - బాగుండును. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోరు. పిల్లలకి చదువు బాగా రావాలంటారు.

ఒక సిటింగు పూర్తిచేసి రెండోదగ్గరకి వెళ్లేను. అయిదు కొట్టింది వాచీ. కుర్చీమీద కూర్చున్నా - దూరంనుంచి రేడియోబాకా పాడే పాటలు సన్నగా వినిపిస్తున్నాయి. నాచెవులు ఆవేపు మరలుతున్నాయ్. మళ్లా మందలింపబడుతూ అమ్మాయిచదువులోకి ప్రవేశిస్తూంటాయ్ -

పైర్రివేటు సాగుతూనే వుంటుంది. ద్వంద్వావధానం, త్రయావధానం చేస్తూంటా- పాఠంచెప్పటం, చుట్టూన్న ప్రకృతిని అవలోకిస్తూండడం, దూరంనుంచి వినీవినిపించని రేడియోపాటను అంగుకోడానికి ప్రయత్నించడం. కానీ యివన్నీ అసంపూర్ణమైనవే- కోరె తృప్తి నివ్వలేవు-

నాకూ రేడియోపాట వింటూ బీచిలో చల్లగాలి ఆనటించాలనీ, గుమగుమలాడే వాసననూనెలు రాసుకుని యిస్త్రీసుస్తులు రెండురోజుల కొక పర్యాయం మారుస్తూండాలనీ, వారానికి నాలుగు సినీమాలు చూడాలనీ, రోజూ వుదయం, మధ్యాహ్నం హోటల్లో కాఫీ టిఫిన్లు పుచ్చుకోవాలనీ, ఎలక్ట్రిక్ దీపాలు, కొళాయి వున్న మేడయింట్లో కాపురం వెలిగించాలనీ యింకా యింకా నూరు రూపాయల పైచిలుకు అర్జన గలవానికి అందుబడిలో వున్న కోరికలే నాలోనూ ఎల్లప్పుడూ వస్తూంటాయ్.

కానీ జీవనయాత్ర గడువక రాత్రి ఎనిమిదింటివరకు ట్యూషన్లు, ఉదయం లెక్కల చిట్టా వ్రాయటం.

ఇంటద్దెభారంవల్ల చిన్న పదిహేను రూపాయల యిల్లు, అల్ప పదుపాయాలు గల స్థితులలో నే అల్పసంతుష్టున్నయి వుండిపోతూన్నాను-

ఇలాంటి ఆలోచనలతో ఒక్కొక్కనాడు మనఃపూర్వకంగా, ఒక్కొక్కప్పుడు వెట్టిగా ట్యూషన్లు ముగించుకొని యిల్లు చేరుకుంటుంటాను. యీ వాళా అలాగే యింటికి చేరుకున్నా.

మనసంతా విపరీతవ్యధతో వేడెక్కి వుంది. అప్పతెచ్చి చేసిన గోధుమపిండి రొట్టె తిని యింత తరవాణి తాగి 'పిధిగది' లోకి చేరుకున్నా.

మళ్లా రాత్రి వచ్చింది. నిన్నటికన్నా యీరాత్రి మరోలా వుంటుంది. ఇవాళ పొద్దుట్నుంచీ చీకటి ఆవరించివుంది గదంతా. కిరసనాయల్ నిండుకుంది. వంటింటి పనులాతే రావాలా బుడ్డి.

కిటికీ రెక్కలూ తలుపులూ బార్లా తీసేధాగా దగ్గర్లోవున్న ఎలక్ట్రిక్ దీపం రవంత కాంతిని నాగదిలోకి పంపించింది-

కుర్చీలో చతికిలబడగానే మాధవ కవళం అబ్బి కేక వేసేను. లేదు పొమ్మన్నాను. నిజం - ఎక్కడిదీ! పూటగడవని వారు యీదేశంలో ఎందరో వున్నారు. ముష్టివాళ్లు, నిరుద్యోగస్థులు, అంగవిహీనులు, ముసలితొక్కలు, అన్నమో రామచంద్రా అని రోదిస్తున్నారు.

ఆహా! ఏం మాయా! అపరిమితమైన సమస్యలతో బుర్రంతా ఎంత భారంగా వుంది! నిజంగా యీఘోర దరిద్రాల్లో మునిగి తేలే మానవుడు తన అనుభవగాథలు వ్రాస్తే ఎన్ని వుద్గ్రంథాలు తయారవుతాయ్! సుఖదుఃఖాల్లో కన్నీళ్లూ, నవ్వు లొలికించే ఎన్ని ప్రశస్తమయిన విచిత్ర కథానికలు రచించ గలడు! అవును- రచిస్తున్నాడు. ఏవరో ఒక మేధావి. నావంటి ఆగర్భదరిద్రుడు వ్రాయలేడు. ఆగర్భ శ్రీమంతుడు మేడలపై వినోదిస్తూ వెట్టి కలల్నీ, సత్యాల్నీ వూహించి వ్రాస్తున్నాడు. ఒకప్పుడు వినికిడితో వ్రాస్తున్నాడనవచ్చు - కానీ నిజంగా అనుభవించి జరిగింది వ్రాయలేడేమో!

నేను అలా కాదు. నేనూ, నాతోటివారలం కొందరం మాత్రం బాధావహులమయిన మా దీనగాథలు, సమస్యలు వ్రాసుకుంటున్నాం.

కానీ బహుశా రసమయప్రపంచం కోసం వెతుకులాడేవారికి నా కథల్లో ప్రీతి కలక్కపోవచ్చు. అయినా నా జీవిత రచన యింతే. నాసమాజంలో, దేశంలో జాతిలో యించుమించు మూడువంతుల పైచిలుకు ప్రజలంతా యింతే - యింకా నాకన్నా నికృష్టమయిన, అధమాధమమయిన దరిద్ర పరిస్థితుల్లో, దరిలేని కుటుంబభారాల్లో నలిగి నమసిపోతూన్న వారే అంతా - దరిలేని విపజ్జీవనాలలో గొప్ప కంగారుపడి కృంగి కృశిస్తున్నారు.

ఒకప్పుడు నేనూ, టాగూర్ నో, శరత్ నో అయితే వారి పాత్రల్లో ఔన్నత్యం, సుఖమయజీవితం చిత్రిద్దునేమో! వారిది జమీందారీఫాయీ. వారి లోకం వేరు - వారి దృక్పథం వేరు. వారూ దీన చరిత్ర వ్రాసేరు. వ్రాయవచ్చు. కానీ అది వారి దీనచరిత్ర కాదు. వారు కనీ విని రచించిన గాథ అయివుంటుంది. వారు అనుభవించి రాయకపోవచ్చు. అంచేత వారూ నేనూ సమానం కాలేం. వారి రచనల్లోని రసం నేను తీసుకురాలేను. ఎంచేత? వారి పరిస్థితులకు జిగిబిగి అలంకరించి, రమ్యంగా కథనం చేస్తారు. నేను పై మెరుగులు పెట్టకే వాస్తవికాన్ని చిత్రించ పూనుకుంటా.

ఉన్నదున్నట్టు నా రచనలో నా ఆవేదన ప్రతిఫలింప చేస్తాను. నిజంగా నాకళ్లు విప్పినా, మూసినా గుండెల్లోంచి ఆలోచిస్తే వేలకువేల అన్నార్తులూ, గర్భదరిద్రులూ, నిత్యబాధావహులూ మనోనేత్రాలకి కనిపిస్తారు. వారంతా ప్రతిరోజూ, ప్రతిక్షణం నాకంటె వేయిరెట్ల ఆవేదనలతో నిండివున్న వారే అయినా నాలానే వారూ సహనంతో జీవిస్తున్నారు చచ్చిపోడానికి దారిలేక. అంతే. ఇది దీనదేశమయిపోయింది. కోటానుకోట్ల భారతజాతీ దరిద్రంలో మునిగి కృశించిపోతూవుంది - స్వతంత్రం పొందిన యీ దీనజనాళికి తిండీ గుడ్డా యిల్లు మాత్రం లేవు - యింక వున్నవేంటి? నిత్యదరిద్రం, ఆవేదన - గుండె పగిల్చే జీవనభారం! అబ్బా! కోటానుకోట్ల విపజ్జీవితాలు—

★

గతుకుల దారి

టేకుమళ్ల కామేశ్వరరావు

2

ఆ సమయంలో సుందరమ్మ తహసిల్దారు గారింటిలో పనిచేస్తూంది. పాపారావు పార్వతమ్మ ఇంటికి బయలుదేరి వెళ్లాడు. పార్వతమ్మ అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. "ఇంత ధైర్యంచేసి వచ్చేడా! ఇది ఎవరైనా చూస్తే ఎంత ప్రమాదమో!" అనుకొంది. వచ్చిన పెద్దమనిషిని కుర్చీమీద కూర్చోమంది. అతను కూర్చున్నాడు. అతిథుల మొహాన్ని ఇన్ని కాఫీ నీళ్లు కాచి పొయ్యడం ఈ కాలపు ఆచారంకదా అని ఆమె కుంపటిమీద నీళ్లుపెట్టి, విసురుతూంది. పార్వతమ్మ నవమోహనంగా కనపడింది. ఆమె పక్కగా కూర్చుండగా, వీపుమీద తెల్లని పమిటిలోంచి వాలుజడ కనబడుతూ, చీరె నల్లని అంచుతో జడకొస చెలగాట లాడుతూండగా, తేటనీటి కాలువలో ఈదుతూన్న నల్లతాచుపాములాగుందనిఅతను భావించుకొన్నాడు. అతను కళ్ళజోడు తీసి చేతిరుమాలుతో శుభ్రపరిచి మళ్ళీ పెట్టుకొన్నాడు. ఆమె చేస్తున్న ప్రతిపనీ అతనికి ముద్దుగా కనపడగా వింతగా పరిశీలిస్తున్నాడు. అందమైన ఆమె మొహం కళ్లకి మిరిమిట్లుగొల్పుతూంది. సంభాషణ ఎట్లా మొదలుపెట్టడమో అతనికి తోచలేదు. పార్వతమ్మకి సిగ్గనిపించి మోకాలిమీద గడ్డమాన్చి కూర్చుంది. కొంతసేపటివరకు ఏ ఆలోచనా తోచలేదు. చివరికి ఆమె "కులాసాగా ఉంటున్నావోయ్!" అని కుశలప్రశ్న వేసింది. చిరునవ్వు ఆమె పెదిమలని చుట్టివేయగా ఆమె పెదిములు బిగబట్టింది.

"ఎక్కడ ఖులాసా! నీకు తెలియనిదేముంది" అని అతను ఆమె పెదవులవైపు చూశాడు.

"నాకు తెలిసిం దేమిటి?" అని ఆమె ప్రశ్నించింది.

"నా మనస్సుని నీ వెరుగవా?" అంటూ అతను ఆమె చక్కని చెవులవైపు, మెరుస్తూన్న దుద్దులవైపు చిత్రంగా చూశాడు.

"నువ్వు వర్ణించి చెప్పేవా ఎప్పుడైనా" అంది ఆమె.

"నీ మనస్సుని నే నెరిగినట్టే నా మనస్సును నువ్వు ఎరుగవా?" అంటూ అర్ధచంద్రుడిలాంటి నుదుటివైపు కోరికతో చూశాడు.

"ప్రశ్నని మరీ చిక్కపరుస్తున్నావు. నా మనస్సు నాకు తెలుసు గాని నీ కేం తెలుసు? పైగా నీ మనస్సుని నే నే మెరుగుదును?" అంది. ఆమె మాట్లాడుతూండగా ముత్యాల కోవలాంటి పలువరసవైపు అతను ప్రియంగా చూశాడు.

"పార్వతీ! కప్పిపుచ్చకు, దాచకు. మన మనస్సులు ఐక్యమైనట్టే——" అని అంటూండగా ఆమె అడ్డువచ్చి "ఎప్పుడూ అటువంటి వ్యర్థమైన ఆలోచనలకి పోకు! నీకు నీ మనస్సు తెలుసు కాని ఎదుటవాళ్ల మనస్సేమి తెలుస్తుంది? నా మనస్సు నీ కేమీ తెలియ్యదని నీ మాటలవల్ల నాకు రుజువవుతూంది" అంది కొంచెం చురుకుగా.

"అలాగు కఠినంగా మాట్లాడకు పార్వతీ!" అని ప్రార్థిస్తూన్నట్లుగా చూశాడు.

"అబ్బాయీ! నీ తాహతు ఎరగకుండా మాట్లాడుతున్నావు! నువ్వు చేసేపనిలో ఉండే మంచి చెడ్డలు నీకు తెలియడం లేదు. నీ రహస్యభావాలు మీవాళ్లకి తెలిస్తే హర్షిస్తారా?" అంది.

"వాళ్ల గోల మన కెందుకు, అమ్మాయీ!" అని నిగనిగలాడుతూ బంగారపు బిళ్లలలగున్న ఆమె చెక్కిళ్లవైపు చూశాడు.

"మనకంటె వాళ్లు జ్ఞానసంపన్నులు. మానవప్రకృతిలో లోప మేదేనా ఉంటే ఉండవచ్చు! అంతమాత్రంచేత వాళ్ల జ్ఞానాన్ని, బుద్ధిని గురించి పొరపడకూడదు" అంది.

ఆమె సంభాషణ తృప్తిగా లేవందుకు పాపారావు విచారించాడు. "మన వివాహానికి ఏదో ఒకమార్గం చూపించు" అని అతను ఆదుర్దా తెలియబరిచాడు.

"తప్పు! తప్పు! అటువంటిమాట ఇకముందెప్పుడూ అనవద్దు" అని మృదువుగా మందలించింది.

ఆ మందలింపును మింగివేసి అతను "కాదు, పార్వతీ!" అంటూండగా, ఆమె "అటువంటి వ్యర్థపు టాలోచనలకి పోవద్దు" అని కొంచెం కరుకుగా అంది.

ఆమె అతనిచేతికి కాఫీకప్పు అందిస్తూండగా ఆమెచేతులు వణికాయి. కాఫీ తొణికి అతని పాదాలమీద పడింది. ఆమె కంగారుపడింది. కప్పు అందుకొంటూ పాపారావు, బంగారుతొడుగులు ధరించినట్లున్న ఆమె ముంజేతులవైపు చూసి మైమరిచాడు. కప్పు చేతితో పట్టుకొని "ఈ దీనుడికి దారి చూపించు. నీ మనస్సు నా దగ్గర మభ్యపరచకు. నా మనస్సు ఎంత ఆందోళన పడుతోందో, నీ మనస్సూ అంతే ఆందోళన పడుతూందన్న విషయం నీ తొట్రుపాటే తెలియజేస్తూంది. అది మానవస్వభావం!" అన్నాడు పాపారావు.

ఆమె, తెర మరుగునఉన్న తన మనస్సుయొక్క యథాస్థితిని అతను సరిగా వర్ణించినట్టుగా గ్రహించి విచిత్రపడి ఒక్క క్షణం ఊరుకొంది.

పాపారావు దీనంగా చూశాడు. అతని చూపులని ఆదరించాలో, తృణీకరించాలో, కోపించాలో ఆమెకి తోచలేదు. మనస్సు పరిపరివిధాల పోయింది.

పాపారావు వచ్చి చాలా సేపయింది. ఎవ రేనా రావచ్చు, చూడవచ్చు అని ఆమె భయపడి "ఇక నువ్వు ఇక్కడ ఉండవద్దు. మన సమావేశం మన ప్రాణం మీదికి రావచ్చు. నువ్వు బయలుదేరి వెళ్లు. అంది. కాని అతను లేవలేదు. ఇంక తాను చెయ్యి చేసుకొంటేనే గాని లాభం లేదని తలచి, అతని చెయ్యిపట్టుకొని కుర్చీమీంచి లేవ దీసింది. ఆమెచెయ్యి తగలగానే అతని ఒంటిలో మెరుపు మెరిసినట్లనిపించింది. అతను లేచి గుమ్మంమెట్లు దిగాడు. గోదావరిగట్టుమీద నడిచి, సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు.

ఎదుట గోదావరి నదీమతల్లి దివ్యంగా ఉంది. సాయంకాలపు వింతప్రభలు నీటిలో ప్రతిఫలించాయి. పొద్దుగుంకుతూందని కొబోలు మొగలుబిడారాలు ప్రయాణమాపుచేసి తమ సొగసు నీటిలో చూసుకొంటున్నాయి. పక్షులు కంగారుగా ఎగురుతూ పాటలు పాడుతున్నాయి. నదిలోను, గట్టుదగ్గర, ఉన్న పడవవాళ్లు పనులని ముగించుకోడంకోసం తొందర పడుతున్నారు. నీటిమీంచి వస్తూన్న చల్లగాలి పాపారావుకి ఎంతో సౌఖ్య మనిపించింది. అతను ఆలోచనలలో పడ్డాడు. "ఆమె మనస్సు నాకేమీ అంతుపట్టడం లేదు. ఒప్పుకొన్నట్టా? మానినట్టా? నా మనస్సు ఇంత కొట్లాడిపోతూండగా ఆమె మనస్సు ఇంత ప్రశాంతంగా ఉండడం ఎంతేనా చిత్రంగా ఉంది. ఆడదానికి తన మనస్సు ఎంత స్వాధీనంలో ఉంటుంది! బహుశః ఆమె ఆలోచన వితంతువివాహం కూడదని కాబోలు! లేకుంటే నా ప్రేమకి ప్రతిభావం కనబరచకుండా ఉంటుందా? అదే కారణమయితే ఆమెకి నచ్చజెప్పడ మొక పెద్ద పనిలోవి కాదు. ఒక క్షణం చాలు! నా మిత్రుణ్ణి నాతో కూడా తీసుకొనివచ్చి వాదించానంటే ఇట్టే లొంగుబాటులోకి వస్తుంది" అనుకొంటూ చిటికెలు వేశాడు. ఆరోజున టౌన్‌హాలులో ఒక సంఘసంస్కరణసభ జరుగుతూంది. ఆ సభకి అతను వెళదామని బయలుదేరాడు. కాని ఇక్కడే చీకటిపడిపోయిందంటూ, ఇంటికి వెళ్ళిపోయాడు.

జరిగిన విషయమంతా పార్వతమ్మ సింహావలోకనం చేసుకొంది. సంభాషణ ప్రారంభంలో తన కున్న చిత్త స్థైర్యం, సంభాషణ ముగిసేముందు లేకపోయినందుకు విచిత్రపడ్డది. దీనిని ప్రేమ అంటారో, కామమంటారో, మరేమంటారో? పైగా నేను చేస్తూన్నది తప్పుపనో, మంచిపనో? దీనినిగురించి ఎవరినేనా అడిగి చూస్తాను. ఎవరినడగను? ఎవరినడిగితే తప్పు పట్టుకొంటారో? కాని నామట్టుకునాకు బోధపడని సంగతులు ఇతరుల నడిగి తెలుసుకోక తప్పదు. నాకు తెలియక, ఇతరుల నడగక, ఏలాగు బతకడం? కాబట్టి తగినవాళ్లని నేర్పుగా అడిగిచూస్తాను. ఇంకా గ్రంథాలలో వెదికి చూస్తాను. అంతేకాని నేనై ఒట్టినే ఊరుకోను!" అని తర్కించుకొంది. దీనికిఆధారం ఏగ్రంథంలో నేనా ఉందేమో అని భాగవతాది పురాణాలు తిరగవేసి చూసింది. కాని ఏ పుస్తకం విప్పిచూసినా, ఇంద్రియాలని జయించాలి, రాగ ద్వేషాలని వర్జించాలి, నిష్కామంగా జీవించాలి, మనస్సుని భగవంతుడిమీదే నిలపాలి అనే ఉంది. అంతేకాని తన భావాలని ఎక్కడా మెచ్చుకోడం కనపడలేదు. ఆమె తన చిత్త చాంచల్యానికి విచారించి "తుచ్ఛ ప్రభావాలు" అనుకొంది. అయినా వీరభద్రపురం వెళ్లి స్త్రీల మఠంలో ఉన్న సాధువమ్మదర్శనం చేసి, అడిగిచూస్తాను. ఏమవుతుందో?" అనుకొంది.

పాపారావు పార్వతమ్మ ఇంటికి చాటుగా మాటుగా వెళ్ళి వస్తూండడం పేరయ్యకంటపడింది. అతను తహసిల్దారుగారి పేర ఆకాశరామన్న ఉత్తరాలు బనాయించాడు. తహసిల్దారుగారు వాటిని చదువుకొని, పైగా మరికొన్ని సంఘటనలని చూసుకొని, ఇది నిజమే అయుండవచ్చని తలచాడు. తల్లిదండ్రులు పాపారావుని తల వాచేటట్లు చీవాట్లు పెట్టారు. మాగడప తొక్కవద్దని పార్వతమ్మని చెప్పు దెబ్బలు కొట్టారు. ఇదా మీ సంప్రదాయమని సుందరమ్మని పడదిట్టారు. ఇదేం పోయే కాలమంటూ సుందరమ్మ పార్వతమ్మ మీద విరుచుకుపడింది. లోకులు ఆడి పోసుకొన్నారు.

పార్వతమ్మ తన చేతినున్న వెండి గాజులు తీసివేసింది. వాలుజడ విప్పి ముడి వేసుకొంది. సన్నని చీరెలు మానివేసి కాషాయ రంగు రవిక, అదే రంగుచీరె కట్టుకొన్నది. మూర్తీభవించిన వైరాగ్య మూర్తిలాగు తయారయింది.

వీధిలో పాపారావు వస్తూంటే పార్వతమ్మ తారసిల్లింది. ఆమె వేషం చూసి అతను నివ్వెరపోయాడు. అతని కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. చేతిరుమాల్లుతో కళ్లు తుడుచుకొన్నాడు. అతని స్థితి చూసి, సానుభూతిగా ఆమెతకళ్లు చెమ్మగిల్లాయి.

"ఇదేమిటి ఈ వేషం!" అన్నాడు. ఆమె జవాబు చెప్పలేదు. కాని అతను కొంత ఊహించుకొన్నాడు. "ఎక్కడికి వెళుతున్నావు?" అని ప్రశ్నించాడు.

"సాధువమ్మ ఆశ్రమానికి."

"ఎందుకు?"

"అక్కడా నాకు మనశ్శాంతి."

"నీకేమిటి! ఆశ్రమమేమిటి!" అన్నాడు ఆశ్చర్యంతో.

"అంత ఆశ్చర్య మెందుకు?" అని ఆమె ఆశ్చర్యపోయింది.

"మన ప్రేమకి, ఆశ్రమానికి సంబంధ మేమిటి?"

"నా ప్రేమ ఈశ్వరార్పితం."

"ఆమాట అందరికీ ఉంది."

"నాకాయనే భర్త."

పాపారావు మళ్ళీ నివ్వెరపోయాడు. "వితంతువు వివాహం చేసుకోకూడదని నీ దురభిప్రాయం! ఆసంగతి నాకిదివరకే తెలుసు. దానికి తగిన సమాధానం చెప్పే మనుష్యులని తీసుకువస్తాను. నేను చేతకాని వాణ్ణి అనుకొన్నావేమో!" అన్నాడు.

ఆమె చిరునవ్వు వెన్నెలకి అతని ముఖకైరవం వికసించింది. "పార్వతీ నన్ను మోసపుచ్చకు" అన్నాడు.

"నేను ఎవరినీ ఆశపెట్టలేదు మోసపుచ్చడానికి" అని సమాధానం చెప్పింది.

నడిరోడ్డుమీద అంతకంటే సంభాషణ కుదరక ఎవరిదారిని వాళ్లు వెళ్లిపోయారు.

పాపారావుకి ఆమెవేషం తలుచుకొన్న కొద్దీ దుఃఖం పొర్లివచ్చింది. "అంత అందచందాలు గల మనిషి ఈ వికృత వేషం వేసుకోడం! ఇది సంఘంచేసే దారుణాలకి నిదర్శనం. ఆమె వితంతువు అనేకదా సంఘం ఆమె ప్రేమ ప్రకటనని బహిష్కరించడం. ఇటువంటి సంఘాన్ని నేను తృణీకరించక మానను. నిష్కారణంగా ఆమెని మాతల్లిదండ్రులు ఆడిపోసుకొన్నారు. ఆమె కొంపలో వాళ్లకి కూడా బుద్ధి లేకపోయింది." అని ఎంతో విచారించాడు. తన మిత్రుడైన సీతామనోహరుడి ఇంటికి వెళ్లాడు.

సీతామనోహరుడు దానవాయిపేటలో ఉన్నాడు. అతను పట్టభద్రుడు; ఒక జోళ్లషాపు పెట్టుకొని చక్కగా వ్యాపారం చేసుకొంటున్నాడు. అతను సంఘసంస్కార ప్రియుడు. వీరేశలింగంగారి తోటలో చేరిన ఒక వితంతువుని పరిణయమాడాడు. పాపారావుకి, సీతామనోహరుడికి గొప్పస్నేహం ఏర్పడింది. సంఘసంస్కర్తలని మెచ్చుకోడం, అటువంటి సభలకి వెళ్లి వస్తూండడం, సీతామనోహరుడు బల్లగుద్ది ఉపన్యాసాలిస్తూండడం, ఇవే కాకుండా వాళ్ల ఇళ్లు కూడా దగ్గరగా ఉండడం, ఇటువంటి కారణాలవల్ల వాళ్ల ఇదరికీ మంచి స్నేహం కలిసింది. పాపారావు సీతామనోహరుడి ఇంటికి వెళ్లాడు. కాని అతను ఇంటివద్దలేడు. అందుచేత రేపు ప్రొద్దున్న కలుసుకొంటానని చెప్పి తిరిగి వచ్చివేశాడు.

తహసిల్దారుగారు తన కొడుకుయొక్క దురాలోచనలు చూసి ఈ మాటు కుదిరిన సంబంధం బలవంతంచేసయినా కొడుక్కి కట్టబెట్ట దలుచుకొన్నాడు.

పార్వతమ్మ మునపటికంటె తరుచుగా సాధువమ్మదర్శనం చేస్తూంది.

సాధువమ్మ పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా ఎవ్వరూ ఎరగరు. ఆమె ఆజన్మ బ్రహ్మచారిణి. ఆమె తన మానాన్ని తానుండగా, లోకులే ఆమెవల్ల ఉపదేశం పొందదలచి, మఠం ఒకటి కట్టించారు. అందులో ఆమెనే ప్రత్యక్షదేవతగా ప్రతిష్ఠించారు. పండిపోయి అడపలుగట్టిన శిరోజాలు ఆమెయొక్క ముదిమిని చెప్పకే చెపుతున్నాయి. కాషాయివస్త్రాలు ధరించిన ఆమె, ఎర్రని నీటితో గంభీరంగా ప్రవహిస్తూన్న వరద గోదావరిలాగు, అందులో ప్రతిఫలిస్తూ, నీటిని మరింత ఎరుపుగా చేస్తూన్న సాయంకాలపు వృద్ధసూర్యునిలాగు ఉంది. పార్వతమ్మ ఆమెని తరుచుగా దర్శించి తన సందేహాలు తీర్చుకొంటూంది. ఇంటివద్ద గ్రంథపఠనం చేసుకొంటూ, భక్తి ధ్యానాదులతో కాలక్షేపం చేస్తూంది. అప్పటి వరకు తనకున్న అజ్ఞానాన్ని తలచుకొని ఆమె పరితాపపడుతూంది. సాధువమ్మని దర్శించినప్పుడల్లా తనలో వెలుగు ప్రజ్వరిల్లుతూన్నట్టు, చీకటి పటాపంచ లవుతూన్నట్టు ఆమె భావిస్తూంది.

ఆదివారంనాటి పొద్దున్న పాపారాయ సీతామనోహరులు పార్వతమ్మ ఇంటికి దయచేశారు. ఓరగా వేసి ఉన్న తలుపుని తోసి లోపలికి తొంగి చూశాడు పాపారావు. పార్వతమ్మ భగవంతుణ్ణి ధ్యానంచేసుకొంటూ, తలుపు చప్పుడు కాగా కళ్లు తెరిచింది. స్నేహితు లిద్దరూ ఇంటిలోకి అడుగు పెట్టారు. ఆమె చిరునవ్వుతో ఆహ్వానించింది. ఇద్దరికీ చెరో కుర్చీవేసి కూర్చోమని కోరింది. ఆమెనికూడ ఒక కుర్చీమీద కూర్చోమని వాళ్లు అడిగారు. కాని ఆమె "అలాగే" అని వేసి ఊరుకొంది. కాఫీనీళ్లు పెట్టడానికి తొందరపడుతూంది. కాని పాపారావు అడ్డవచ్చాడు.

సీతామనోహరుడు "వద్దు, అమ్మాయీ! వద్దు" అన్నాడు.

వాళ్లు వ్యవహారంమీద వచ్చారు. చెయ్యి తీరకగా ఉండదుకదా అని ఆమెకూడా ఊరుకొంది.

"వీరేమా మిత్రులు, గొప్ప సంఘసంస్కర్తలు, సీతామనోహరుడుగారు." అన్నాడు పాపారావు.

"ఆయన్ని గురించి ఇదివరకే కొంత విన్నాను. చాలా సంతోషం! వీరినేనా నువ్వు తీసుకువస్తానని చెప్పతూ వచ్చావు?" అని అడగ్గా పాపారావు 'ఔను!' అన్నాడు.

సీతామనోహరుడు "అమ్మాయీ! మేము ఇక్కడ అట్టేసేపు కూర్చోము. అవతల అర్జంటు పని ఉంది" అన్నాడు.

"వారికి క్షణం తీరిక ఉండదు" అని పాపారావు బలపరిచాడు.

"తీరుబాటు లేకుండానే జీవితం గడపాలి. కాని చేసేపని సత్కర్మ అయుండాలి" అంది పార్వతమ్మ.

"సత్కర్మో! దుష్కర్మో! కర్మ ఎల్లకాలం ఒక్కలాగుంటుందా?" అన్నాడు సంఘసంస్కర్త.

"ఏ వేనా కొన్ని కొన్ని దురాచారాలు సంఘంలో కాని, మతంలో కాని ప్రబలగా, వాటిని నిర్మూలించడానికే మహానుభావులు ఉదయిస్తారు" అంది ఆమె.

"ఔను!" అన్నాడు పాపారావు.

"సంఘసంస్కరణ అత్యవసరం" అన్నాడు మిత్రుడు.

"అటువంటి మహానుభావులే శంకరులవారు. మొత్తంమీద ఆచార్యత్రయం" అంది ఆమె.

"సంఘసంస్కరణ ప్రాచీనంలోకంటె నవీనంలో అభివృద్ధి పొందింది. రామమోహనరాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, మనదేశంలో వీరేశలింగంగారు గాంధిమహాత్ముడు" అన్నాడు సీతామనోహరుడు.

"వారివారికి భగవంతు డిచ్చిన బుద్ధిని సద్వినియోగం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యడమే అందులోని ప్రధాన లక్షణం. కాని అందరికీ సమానమైన ఉదాత్తబుద్ధి ఎక్కడ ఉంటుంది! గొప్పవారిలో మళ్ళీ ఎన్ని తరగతులు లేవు!" అంది.

పాపారావు వింటున్నాడు. జయంకోసం ఎదురుచూస్తున్నాడు.

తనని ఒక ఊపు ఊపి చూస్తున్నట్టుగా కనపడింది సీతామనోహరుడికి. "అయితే వీరేశలింగంగారినిగురించి మీ అభిప్రాయ మేమిటి?" అని ప్రశ్నించాడు.

"ఈశ్వరచంద్రుని అడుగుజాడలలో నడిచిన ఒక సామాన్య సంఘసంస్కర్త. పండితుడనే విషయం తెలుస్తూనే ఉంది. అధికంగా త్యాగి."

"ఇంతేనా ఆయననిగురించి మీ అభిప్రాయం" అని ఆశ్చర్యపోయాడు సంఘసంస్కర్త.

ఆమెభావం తమకి వ్యతిరేకంగా ఉందని

(22-వ పేజీ చూడండి)



ఎప్పుడి కానీ లేకపోయినా అల్లుడికైనా నికి మాత్రం లోటురాకూడదు ఛీ! జన్మ ఎత్తిగానే సరి! చిన్నప్పట్నుంచీ పెంచి పెద్దచేసి, కట్నంతో సహా, కన్న కూతుర్ని చేతిలో పెట్టబట్టేగా? ఇంత లోకువ?

ఉత్తరం సాంతంగా చదువుకుని, ముక్కలు, ముక్కలుగా చింపి నేలమీద పారేసి కాళ్ళతో రాసేశాడు పద్మనాభం గారు. ప్రక్కగదిలో, గుమ్మందగ్గరగా నిలబడి తండ్రిచేష్టలు కనిపెడుతూ వుంది పద్మ ఆ ఉత్తరం, తన భర్త రాసిందేననీ, ఆ ఉత్తరం సాంతంగా చదివి, తండ్రి పై మాటలు గట్టిగా అని, చించివేయడంవల్ల, భర్తధోరణి ఇంకా మారలేదనీ, గ్రహించింది పద్మ ఏమని వ్రాశారో? ఏమనీ వ్రాయకపోతే నాన్నకెందుకంత చిరాకు వస్తుంది? అల్లుడైతే మాత్రం? అంత నిర్లక్ష్యమా? అంత చదువూ, చదివి ఆ మాత్రం ప్రపంచజ్ఞానం, సంస్కారం లేకపోతే ఎలా? ఇప్పటికే తన పెళ్ళిమూలంగా, నాన్న సగం కృంగిపోయారు! ఇంకా హిరణ్యాక్షవరాలేనా? తండ్రిగదిలోకి వెళ్ళడానికే భయపడింది పద్మ ఏం రాశారు, నాన్నా? అని అడుగుదామని అనుకుని సాహసించలేకపోయింది. ఏదో విధంగా ఆయనమనస్సు నొప్పించేలాగే, రాసివుంటారు? అటువంటప్పుడు ఏమని అడగటానికీ మొఖం చెల్లలేదు - పద్మకి ఒక్కసారి హృదయంలో క్షోభ చెలరేగింది అప్రయత్నంగా ఆమెకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఇంతలోనే ప్రక్కగదిలోంచి, "అమ్మాయ్? పద్మా?" అని తండ్రి వేసిన కేక, ఆమెకు వినపడింది వస్తున్నా! నాన్నా! అంటూ ఒక్క గంతేసింది గదిలోకి తండ్రి రెండుచేతులతోనూ, తల పట్టుకొని వాలుకుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాడు తండ్రిముఖంలోని నిర్వేదం, ఆవేదనా, పద్మ గ్రహించకపోలేదు—

"ఏం నాన్నా పిల్చారు?" అంటూ, జంకుతూ, జంకుతూ నిలబడింది పద్మ.

"దొరగారు, పండుక్కి రారట మ్మా. పెళ్ళిలో చేసిన వాగ్దానం ప్రకారం శేషమో కాని సైగాని పండుక్కి రావని ఖచ్చితంగా రాశాడు. రాకపోతే పోనియ్యి వచ్చేం ఉద్ధరించాలి! ఇలాంటి అప్రయోజకుడికీ, దురహంకారికీ, విశాలదృష్టిలేని అల్లుడికీ, నా కూతుర్నిచ్చి పెళ్ళిచెయ్యడం నాదే తప్పు. లేకపోతే మన కేం నలుగుర్లోనూ చిన్నతనం లేదులే. వెళ్ళి కాఫీనీళ్లు పెట్టు

దూరపు కొండలు



పొలంలోకి పోవాలి" అన్నారు పద్మనాభంగారు—పద్మ క్షణం ఆలోచించింది. ఆమె ముఖం, అప్పటివరకూ, చిరునవ్వు వెన్నెలలు క్రుమ్మరించే ఆముఖం, కళావిహీనమై చిన్నబోయింది "సరే! పోనీ నాన్నా రాకపోతే ఏం చేస్తాం," అంటూ నిష్క్రమించింది పద్మ అక్కణ్ణుంచి. అంతకంటే ఆమె ఏం చేయగల్గుతుంది! కుమార్తె ముఖంలో వచ్చిన మార్పూ, ఆమె ఎంతో చిన్నబుచ్చుకోవడం తండ్రి గమనించక పోలేదు—గమనించి ఏం చేయగలడు! ఆయన రెండుచేతులతోనూ తలపట్టుకుని మధనపడ సాగేడు. అవును. ఆయన అలా బాధ పడ్డానికి కారణం లేకపోలేదు.

పద్మనాభంగార్కి ముగ్గురు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ, మొత్తం సంతానం అయిదుగురు. ఆయనకి తన స్వగ్రామంలో, ఓ పదెకరాల పల్లమూ, ఓ స్వంత పెంకుటిల్లూ, అదే ఆయన ఆస్తి. ఆయన కొంతకాలం చిన్నతనంలో గవర్నమెంటు కంపౌండరుగా పనిచేయడంవల్ల వైద్యం కొంత తెలుసు. తన అనుభవంవల్ల వైద్యములో బాగా ఆరితేరినవాడవడంవల్ల ఆ పల్లెటూళ్లో ఆ వృత్తివల్లకూడా, పదీ పరకా, దొరుకుతూ ఉంటాయి. పద్మనాభంగారి భార్య మంచి వయస్సులోనే, పిల్లల భారం అంతా తండ్రికి అప్పగించి, పసుపు కుంకుమలతోనే పరలోకానికి వెళ్ళింది. ఆవిడ ఎంత మంచి ఇల్లాలూ, సద్గుణవతీ, మరెవరూ లేరని, ఆ గ్రామంలో ఆమె బ్రతికుండగానే, మంచి యశస్సు ఆర్జించుకొంది. ఆమె బ్రతికున్న రోజుల్లో పద్మనాభంగారి పని చాలావరకు బాగుండేది. ఎప్పుడూ కలకల్లాడుతూ, లక్ష్మీదేవిలా, ఇంటికి ఎంతో వెలుగు నిస్తూ, భర్త ఆదర్శాలకు అనుగుణ్యంగా నడుచుకుంటూ, పిల్లల దగ్గర తన మాతృత్వాన్ని సార్థకం చేసుకుంటూ 'గృహలక్ష్మి' అన్న పేరు ఈమెకే తగును, అన్నట్లుగా ఆమె బ్రతికిందని వినికిడి. ఆవిడ బ్రతికున్న రోజుల్లో పద్మనాభంగారికి అన్నివిధాలా కలిసివచ్చేది అనీ, ఆమె పోయినాకనే ఆయనకి చెడురోజులు పట్టుకున్నాయనీ ఊరివాళ్లు అనుకుంటూ ఉండటం కద్దు—భార్యపోయిన అనంతరమే తన ప్రాక్టీసూ, ఉద్యోగమూ, మానుకొని బస్తీనుండి తన స్వగ్రామం చేరుకున్నాడు పద్మనాభంగారు.

పిల్లలతో స్వగ్రామం చేరుకున్న అనంతరం ఉన్న పదెకరాలభూమీ వ్యవసాయం చేసుకుంటూ జీవితశేషం ప్రశాంతంగా, పరమార్థచింతతో గడుపుదామనుకొన్న పద్మనాభంగారు పిల్లల సమస్యతో ఊపిరి సలపకుండా, తీరని మనోవ్యసనానికి గురికావలసివచ్చింది—పద్మనాభంగారి పెద్ద కూతురు పద్మకి తల్లిపోయేసరికి పన్నెండేళ్లు. తల్లిపోయిన పన్నెండేండ్లవరకూ పద్మకి కల్యాణయోగం పట్టనేలేదు. ఈడొచ్చిన పిల్లని ఇంకా ఎంతకాలం ఇంట్లో పెట్టుకుని కూర్చుంటా రమ్మా అంటూ, ఆశేమ్మా, బోశేమ్మా, నోళ్లు నొక్కుకుంటూవుంటే పద్మనాభంగారి హృదయం చివుక్కుమనేది. ఎలాగైనా మంచి సంబంధం చూసి కూతురుపెళ్ళి చేసెయ్యాలని ఎంతో శ్రమపడ్డాడు. కూతురికి సంబంధం వెదకడంలో పన్నెండేళ్ళ పిల్లకి పాతికేళ్లు వచ్చాయి. ఎన్ని సంబంధాలు వచ్చినా, ఆస్తి వుంటే చదువు ఉండకా, చదువూ ఆస్తీవుంటే, అందం వుండకా, ఈ మూడూ వుంటే, వయస్సు ముదిరిన ఏ రెండోపెళ్ళివాడో, అవుతూవచ్చేది. అందులోనూ పొట్టచింపితే అక్షరంముక్క లేకపోయినా, నెత్తిమీద పుంజెడు వెంట్రుకలు లేకపోయినా సరే, అధమం పెళ్ళిఅవవలసిన మొగాడుగా లోకంచేత పరిగణింపబడితే చాలు. అధమ్ప యివెన్నూటపదహార్లయినా కనీసం ఇంచుకుంటేనేగాని, అల్లుడనేవాడు దొరకడం లేదు. అయిదు సంవత్సరాలకాలం కాళ్లు అరిగిపోయేటట్లుగా తిరిగాడు పద్మనాభంగారు అల్లుడుకోసం. కూతురికి, ఎంత ఆలస్యం అయినాసరే అన్నివిధాలా, మంచి సంబంధం చెయ్యాలని ఆయన సంకల్పం.

చచ్చిపోతూ, చచ్చిపోతూ, తన చేతిలో చెయ్యి వేయించుకుని మరీ చచ్చిపోయింది తనభార్య. పెళ్లివిషయంలో మాత్రం బాగా ఆలోచించి, మంచి సంబంధం చూసి కూతుళ్లకు పెళ్లి చెయ్యమనీ, తన కూతుళ్లు అనుకూలురైన భర్తలతో, అన్నవస్త్రాలకు లోటులేకుండా ఆదర్శ గృహజీవనం చెయ్యడమే తన కోరిక అనీ, అప్పుడే స్వర్గంలోని తన ఆత్మ శాంతిస్తుందనీ, మరణశయ్యమీద భార్య చెప్పి మరీ చచ్చిపోయింది. అకారణంగా ఎలాగైనా సరే "మంచిసంబంధం, ఎంతకష్టపడి వెతికి అయినా సరే పద్మకు చెయ్యాలని" ప్రయత్నించాడు పద్మనాభంగారు.

పద్మనాభంగారికి, అప్పుకాడుకు అయిన

సుబ్బారావు ఇంట్లోనే ఉన్నాడు. రూపవంతుడూ, గుణవంతుడూ కూడా. అయితేనేం, మరి పెద్దచెప్పుకోవలసిన ఆస్తి ఏమీ లేదు తన ఉద్యోగంతప్ప. సుబ్బారావుకి ఎకౌంట్సుడిపార్టుమెంటులో, నూరురూపాయల జీతం. తండ్రి సంపాదన ఏమీ లేనందువల్ల, తనవెనకాల ఇంకా అరడజనుమంది పిల్లలతో, బాధపడే, తండ్రికి ప్రతినెలా, ముప్పై, నలభై, సాయంచేస్తూ వచ్చిన జీతంతోనే క్లుప్తంగా గడుపుకుంటూ దురభ్యాసాలు ఏమీ లేక, యువకులకు ఆదర్శంగా బ్రతికే, తనచేతిలోని మేనల్లుడు అప్పట్లో తనకంటికి అనలేదు... కారణం అతను పెద్ద ఆస్తిపరుడు కాడు.

దగ్గర ఊళ్ళోనే దగ్గరవాడే అయిన కరణం శాస్త్రికూడా అప్పట్లో ఆయన కంటికి ఆనలేదు. కరణంశాస్త్రికి పాతికేళ్ళుంటాయి. మంచి రూపవంతుడు. స్ఫురద్రూపి. యాభై యకరాల స్వంతమాగాణీభూమి, స్వంత ఇల్లూ ఉన్నాయి. చాలామంచివాడు. కావలసినంత పాడి,పంట—దేనికీ లోటు లేదు. పద్మని చేసికోటానికి మొదట అతని తల్లి దండ్రులు ఒప్పుకున్నారు. కాని అప్పట్లో అతనూ పద్మనాభంగారి దృష్టిలో ఆనలేదు. కారణం? అయిదవఫారంతోనే అతను చదువుకి స్వస్తిచెప్పి, స్వంతవ్యవసాయంలోకి దిగాడు. అతనికి ఏ యూనివర్సిటీ డిగ్రీలూ లేవు.

సమీపపట్నంలోనే పెద్ద ఉద్యోగం చేసే జ్ఞాతి మరొకడున్నాడు. ఆ సంబంధం కూడా వచ్చింది. శర్మ ఆ సంవత్సరమే బికామ్‌హానర్స్ ప్యాసై, సరాసరి ACTO ఉద్యోగానికి ఎన్నుకోబడ్డాడు. వయస్సు 25. దృఢకాయుడు. పైగా, స్వగ్రామంలో, స్వంతఇలూ, యాభై ఎకరాల సుక్షేత్రం లాంటి పొలమూ ఉంది. శర్మతల్లి దండ్రులు కూడా పద్మని చేసికోటానికి అప్పట్లో యిష్టపడ్డారు. కాని పద్మనాభంగార్కి ఆ సంబంధమూ నచ్చలేదు. కారణం! శర్మ చాలా నలుపు. పైగా చిన్నప్పుడు మశూచి రావడంవల్ల అతని ముఖం నిండా, స్మాల్ ఫాక్స్ మచ్చలు! ఇంతకీ అతడు రూపవంతుడు కాడు. అంచాత ఆ సంబంధం కూడా పద్మనాభంగార్కి నచ్చలేదు.

ఇంకోమంచి సంబంధం కూడా వచ్చింది అప్పుడు. దగ్గరవాడే, ఓవర్ సీర్ ఉన్నాడు. ఓవసీర్ మూర్తి చాలా అందగాడు. అప్రెంటీసు అయిపోయి అప్పుడే అసిస్టెంటుఇంజనీరు అయాడు. మంచి ఉద్యోగం. మంచి రాబడి. పైగా పెద్ద స్థిరాస్తి. విద్యా, రూపమూ, ధనమూమూడూ కూడా ఉన్నాయి. అతడుకూడా పద్మను చేసుకుంటా నన్నాడు. కాని అదీ పొసగలేదు. ఆ సంబంధం కూడా పద్మనాభంగారికి నచ్చలేదు. కారణం? అతనికి మొదటి భార్య పోయి సంవత్సరం అయింది అయిదేళ్ళ ఆడపిల్ల ఉంది— అతను రెండో పెళ్లివాడు. తన కూతుర్ని రెండో పెళ్లివాడి కివ్వడమా? అదీ నచ్చిందికాదు పద్మనాభంగార్కి.

ఎలాగైతేనేం మంచి సంబంధంకోసం అయిదేళ్లు తిరిగాడు పద్మనాభంగారు. పద్మనాభంగారి తమ్ముడు మిలిటరీ ఎకౌంట్సు డిపార్టుమెంటులో సూపర్‌వైజర్‌గా పని చేస్తూఉండేవాడు. ఆయన ఆఫీసులో సబ్‌డివిజనల్ ఆఫీసర్ రావుగారనే ఆయన ఒకడుండేవాడు. ఆయనకీ, పద్మనాభంగారి తమ్ముడు మూర్తిగారికీ, చాలా స్నేహం. మాటలసందర్భంలో, మూర్తిగారు, పెళ్లివవలసిన తన అన్నగారి అమ్మాయి ఉందనీ, ఆ అమ్మాయి పెళ్లికోసం, తన అన్నగారు, చాలా శ్రమపడుతున్నారనీ, చెప్పాడు. రావుగారు క్షణం ఆలోచించి, పెళ్లికావలసిన తన తమ్ముడు ఉన్నాడనీ బి. యే. చదువుతూ మానేసి, మిలిటరీ సర్వీసులో చేరాడనీ ఇంకొక సంవత్సరంలో, సర్వీసు నుంచి రిలీజు అయివచ్చేస్తాడనీ, నాలుగైదు రోజులలో శలవుమీద వస్తాడనీ చెప్పారు. ఇద్దరిశాఖా వకటే గనుక ఫరవా లేదు.

పద్మనాభంగారికి యీ వివరాలతో మూర్తి వ్రాసిన ఉత్తరం చేరగానే నిలబడ్డపళంగా వచ్చి, వరుణ్ణి చూసుకున్నారు. వరుడు మురళీకృష్ణ. చాలా అందంగా ఉంటాడు. చదువుకున్నాడని చెప్పారు. వాళ్ల స్వగ్రామంలో కొంత భూమి, స్వంత ఇల్లూకూడా ఉందన్నారు. ప్రస్తుతం మిలిటరీసర్వీసు అయిపోగానే గవర్నమెంటే పిలిచి మంచి ఉద్యోగం ఇస్తుందన్నారు—

పద్మనాభంగార్కి ఆ సంబంధమే అన్ని విధాలా నచ్చింది— సరే! పిల్లని చూసుకుని నచ్చిందంటే, కట్నంవగైరా విషయాలనుగురించి తరువాత మాట్లాడుకోవచ్చు నన్నారు. పెళ్లికొడుకు వచ్చి పిల్లని చూసుకుని నచ్చిందన్నాడు. కట్నం అధమం పదిహేను వందలయినా యిచ్చి లాంఛనాలూ, అవీ, ఇంకో అయిదువందలేనా ముట్టచెప్పాలన్నారు. అయితే అయింది. ఏ అప్పో, సప్పో, చేసి, వాళ్లు అడిగిన కట్నం ఇచ్చిఅయినా ఆ సంబంధం చెయ్యాలనే పద్మనాభంగారు తీర్మానించారు.

ముహూర్తంకూడా పెట్టేశారు వెన్వెంటనే. ఉన్న పదెకరాల కొంద్ర మీదా మూడువేలు తనఖాపత్రం వ్రాశి అప్పు తెచ్చాడు పద్మనాంభగారు. అన్ని పనులూ సిద్ధంచేసుకున్నారు. ముహూర్తం సమీపించింది. యావన్మంది బంధువులూ కట్టగట్టుకుని వచ్చారు– కాని ఆ ముహూర్తానికి పెళ్లి అవలేదు. పెళ్లికొడుక్కి శలవు యివ్వలేదనీ, యింకా ఆరునెల్లకిగాని రాలేడనీ, టెలిగ్రాం వచ్చింది. వచ్చిన బంధువులంతా, రెండురోజుల పాటు మస్తుగా తిని, తమ దారిని పోయారు. చేసుకున్న ఖర్చంతా వృధా. అనవసరంగా ఆ సుముహూర్తం తప్పిపోవటంవల్ల, వెయ్యిరూపాయలు మట్టిలో పోసినట్లు అయిపోయాయి. అనంతరం ఆరునెల్లు గడిచాయి... రెండో ముహూర్తానికి ఎన్నో రాద్ధాంత సిద్ధాంతాల మీద, పద్మకి మూడుముళ్లూ పడ్డాయి- మొత్తంమీద కూతురికిమూడుముళ్లూపడ్డాయి అనిపించుకునేసరికి మూడు వేలు అప్పు అయింది. అయితేఅయింది. మంచి సంబంధం దొరికింది. సుఖపడుతుంది కూతురు. అనుకున్నాడే గాని కథంతా యిలా అడ్డం తిరుగుతుందనీ, తను పూర్తిగా మోసపోయాననీ అనుకోలేదు పద్మనాభంగారు. పెళ్లయి మూడు సంవత్సరాలయింది. ఇంతవరకూ అల్లుడికి ఉద్యోగమే దొరకలేదు. అధమం మూడునెల్ల కోసారి వచ్చి, పదిహేనేసి రోజులు అత్తారింటిదగ్గరే మకాం చేయసాగాడు-వాచీ కొనుక్కుంటాననీ, ఏదో సెక్రటరీకోర్సు చదవాలనీ, రెండొందలూ, మూడొందలూ, మారాంచేసి, మామగారి దగ్గర లాగడం సాగించాడు. ఒకమూల వడ్డీ పెరిగిపోయి అప్పు ముంచుకొచ్చేలా వుంది. ఒకదానివెంబడి మరొకటిగా ఎన్నో హిరణ్యాతువరాలు అల్లుడికి. ఇంతవరకూ ఏ ఉద్యోగమూ లేదు—అదిగో రైల్వేలో ఉద్యోగం వస్తుందనీ, ఇదిగో! సెక్రటరీ కోర్సు చదువు అయిపోగానే ఎకౌంటెంట్ జనరల్ ఆఫీసులో సెక్రటరీఉద్యోగం వస్తుందనీ చెప్పుకుంటూ వస్తున్నాడు— పెళ్లయి అయిదేళ్లయినా పెళ్లాన్ని కాపరానికి తీసికెళ్లలేదు - ఉద్యోగం ఏదయినా సంపాదించుకుని, నీ పెళ్లాం, నువ్వూ మీ బ్రతుకు మీరు బ్రతకండి. ఇంక మా యింట్లో నీకు అన్నంకూడా పెట్టం అని తల్లీ తండ్రీ ఖచ్చితంగా చెప్పి చిల్లిగవ్వయినా యివ్వకుండా కొడుకుని యింట్లోంచి గెంటేశారనీ, అన్నగారు పూనా బదిలీ అయిపోయి 'తమ్ముడిమాటే పట్టించుకోలేదనీ తెలిసింది కొన్నాళ్లకి. "అల్లుడు

ప్రస్తుతం యేం పని చేస్తున్నదీ తెలియదు. బి. ఏ. వరకూ చదివి మిలిటరీ సర్వీసు చేసి వచ్చినమనిషికి ఉద్యోగం దొరక్కపోతుందా" అనే అనుకున్నాడు గాని, తను బి. ఏ. చదివాడనుకొన్న అల్లుడు కనీసం స్కూలుఫైనలయినా ప్యాసు కాలేదనీ, స్కూలుఫైనలే మూడుసార్లు దండయాత్ర కొట్టించాడనీ, కొంతమంది విశ్వసనీయ వర్గాలద్వారా విన్నాడు పద్మనాభంగారు యీమధ్యనే.

అతణ్ణిగురించిన మంచి చెడ్డలూ, వివరాలూ, అతని అన్నగారూ తనతమ్ముడూ చెప్పగానే విన్నాడుగాని, స్వయంగా పద్మనాభంగారి కేమీ తెలియదు. అలా తెలిసికోడానికి దగ్గరచుట్టరికం లేదు. ఏదో రెండుజిల్లాల అవతలవాళ్లు. వాళ్లమంచిచెడ్డలు ఎవరైనా చెప్తే వినడమేగాని స్వయంగా తనేమీ చూడలేడుకదా? ఇంతకీ తను మోసపోయిన మాట యథార్థం. ఇంక వియ్యంకుడూ, వియ్యపురాలూ, వారాని కోసారి ప్రతిఉత్తరంలో ఫర్నిచర్ సామాను కావాలనీ, కొడుకు రేపు వేరేకాపురం ఉంటే, అన్నం వండుకోడానికి తవ్వగిన్నదగ్గర్నుంచి అట్లకాడదాకా కొనిపెట్టాలనీ ఉత్తరాలు! ఏదో! ఎలాగైతేనేం? తనెంతో తెలివిగల వాణ్ణి అనుకుని, తను కళ్లతో చూచిన, ఎరిగున్న సంబధాలన్నీ వదిలేసి, తిరిగితిరిగి, ఏదో కొమ్ములున్నాయనుకొని తీసుకొచ్చిన అల్లుడికి కనీసం చెవులైనా లేకుండాపోవడం పద్మనాభంగారి హృదయానికి తీరని ఆవేదన ప్రాప్తించింది.

పెళ్లయి అయిదు సంవత్సరాలు కావస్తోంది. [illegible]ఫుగా అల్లుడిలో ఏమార్పూ లేకపోయినా ఇంకా కనీసం భార్యని కాపరానికి తీసికెళ్లడానికి అవకాశం లేకపోగా, అడుగడుక్కీ హిరణ్యాక్షవరాలు పద్మకు రహస్యంగా వ్రాసిన రెండు మూడు ఉత్తరాలు పద్మనాభంగారి కళ్లబడకపోలేదు. మామగారికి గౌరవం తెలియదనీ, తన తాహతు ఆయన కనిపెట్టి తన్ని గౌరవించడంలేదనీ, డబ్బంటే పడిచస్తాడనీ, తను సెక్రటరీకోర్సు చదువుతున్నాననీ, డబ్బుకావాలనీ, ఏలాగైనా సరే తండ్రికి నచ్చచెప్పి రెండువందలు పుచ్చుకొని పంపించమనీ......


అసలే అమ్మాయి పెళ్లిచేసి మూడువేలు ఉన్నభూములమీద అప్పుచేశావు మళ్లీ పెళ్లికి సిద్ధంగా ఉన్న రెండోకూతురికి పెళ్లిచేయాలి? ఆ సంవత్సరం పొలం ఊడ్పన్నా అవలేదు-ఇంటరు చదువుతూన్న కొడుక్కి అధమం నెలకు నలభైరూపాయలన్నా పంపాలి. తరువాత ఇంటి ఖర్చు.

ఈ పరిస్థితుల్లో పండుగ వచ్చింది. ఏది ఎలాగున్నా అల్లుడయ్యాకా, మామగారయ్యాకా తప్పుతుందా? పండుక్కి వచ్చి మంచిచెడ్డలు మాట్లాడి పదిరోజులు ఉండి వెళ్ళమనీ, తన కష్టసుఖాలు, శాంతంగా చెప్పుకున్నట్లయితే పరిష్కారమార్గం ఆలోచిస్తాననీ రాశాడు పద్మనాభంగారు అల్లుడికి ఉత్తరం—వచ్చిన సమాధానం చూసుకుని ఆయనకు ఏడవాలో,నవ్వాలో తెలియలేదు - మీ గౌరవానికి చాలా సంతోషిస్తున్నాను. నేను పండుక్కి రావటానికి తీరుబడిలేదు. నాకు మీరు పెళ్ళిలో రేడియో కొనిస్తానన్నారు. ఇవ్వలేదు. ఈసంవత్సరమైనా కొనియిస్తారా లేదా? ఇస్తేనే మన ఇద్దరిమధ్యా యథాప్రకారం రాకపోకలు జరుగుతాయి లేకపోతే లేదు. మీ దారి మీది. నా దారి నాది. కాబట్టి వెంటనే యీ నా ఉత్తరానికి జవాబు వ్రాయండి.

నే నిక్కడ సెక్రటరీకోర్సు చదువుతున్నాను. డబ్బులేదు. మా నాన్నగారు నా విషయం పూర్తిగా వదులుకున్నారు. నాకిప్పుడు పరీక్షలు దగ్గరకొచ్చాయి—నాకు డబ్బు లేదు—అధమం మూడు వందలైనా కావాలి. ఆ సొమ్ము మీరు ఎలాగైనాసరే నాకు పంపినట్లయితే, మాట దక్కుతుంది. లేదా! ఇంక మీకూ నాకూ, ఇంతటితో సరి. మీరు నా ఉత్తరానికి వెంటనే సరి అయిన సమాధానం యిస్తారని ఆశిస్తున్నాను.


'మురళీకృష్ణ"-అల్లుడు వ్రాసిన ఉత్తరం సాంతంగా చదువుకొన్న పద్మనాభంగార్కి తనచుట్టూ అంధకారం తప్ప మరేం కనబడలేదు. ఆయన హృదయంలో ఆరని చిచ్చు రగులుకొంది. ఇప్పట్లో తన కర్తవ్యం ఏమిటో బోధపడలేదు. చూసిచూసి, తనెంతో దూరదృష్టిగల తెలివిఅయినవాణ్ణీ, తను ఎరిగున్న, కళ్ళతో చూసిన కావలసిన సంబంధాలన్నీ వదులుకుని ఎక్కడో ముక్కూ మొఖం ఎరుగని దూరపుసంబంధం చేసికున్నందుకు ఫలితం ?

తను ఉత్తరం చదువుకోడం చించి పారెయ్యడం ప్రక్క గదిలోంచి పద్మ చూసే వుంటుంది. పద్మ ముఖం తను ధైర్యంగా చూడలేడు. స్నేహితురాళ్లంతా ఏం మీ ఆయన రాలేదని అడుగుతారు. ఇప్పటికే అంతా ఏమే మీ ఆయనకి ఏం ఉద్యోగమే? ఇంకా నిన్ను తీసికెళ్లడా? అని అడుగుతూంటే ఏమని చెప్పడానికీ నోరురాక సిగ్గుపడుతోంది. ఇలాంటి పరిస్థితిలో, చదువుకొన్నవాడూ, సంస్కారీ అనుకొన్న అల్లుడు ఇలా రాస్తాడనీ, అత నింత సంకుచితదృష్టిగల అల్పమనస్తత్వంగలవాడనీ, ఇలా ప్రవర్తిస్తాడనీ, ఆయన ఊహించలేదు. ఆయనకి మార్గాంతరం ఏమీ కన్పించలేదు. ఆయన లాగే బుర్ర రెండుచేతుల్తోనూ పట్టుకొని ఆలోచిస్తున్నాడు. ఇదిగో నాన్నా కాఫీ! అంటూ, పద్మ పిలిచిన పిలుపుకి ఆయన తలెత్తిచూశాడు.ఆయన కళ్ల వెంబడి చెక్కులమీదుగా దిగజారి గడ్డకట్టిన కన్నీటి రేఖలు చూసి పద్మ నిర్ఘాంతపోయింది. 'కాఫీ యీ అమ్మా! ఇలా ఇయ్యి' అంటూ ఆయన మందంగా కూతురుచేతిలోని గ్లాసు అందుకున్నాడు. ★



"మీ తలపాగా అడ్డం వస్తోంది దయవుంచి దాన్ని తీసేస్తారా?"

[తలపాగా తీసిన తర్వాత]



ఎవరెస్టు శిఖరమంత ఎత్తు ఉన్న ఫైల్సు కట్టల్ని చూసి "ఇవన్నీ పూర్తి చేయటానికి ఈ జీవితం సరిపోతుందా?" అని ప్రశ్నించుకోవటంలో ఏమీ ఆశ్చర్యం లేదనుకుంటాను, ఇంకా యువకదశలోనే ఉన్న నేను.

నా జీవితంలో ఒక్క బాల్యదశే గడిచిపోయింది. ఇంకా జరుగుతున్న యవ్వనం, జరగవలసిన కౌమారం, వార్థక్యదశలు గడవటానికి ఎన్ని సంవత్సరాలు పడతాయో? ఇప్పటికే ఆఫీసుపనిలో ఒక్కరోజు గడిచేసరికి ఒక్క సంవత్సరం గడిచినట్లుగా ఉంటోంది నాకు అలాంటివి ఇంకెన్ని రోజులు? ఎన్ని నెలలు? ఎన్ని సంవత్సరాలు? . తలుచుకుంటేనే గుండె నీరవుతోంది

ఈ తాలూకాఫీసులో గుమాస్తాగిరి కంటె వేరే ఆధారమేమీ లేకపోయె. పోనీ ఈ వెధవగుమాస్తాఉద్యోగానికి ఒక్క 'కిక్' ఇచ్చి బజార్లో స్వేచ్ఛగా అడుక్కుతిందామంటే ఒక భార్య, ఆవిడకో కొడుకు, వాడికి కొన్ని పాలడబ్బాలు. తనకు దూర కంతి లేదు గాని .

విమానవేగంతో పోటీచేస్తున్న నా ఆలోచనలొక్కసారి కూలిపోయాయి వాటికంతరాయం కలగటానికి కారణం, వీపుమీదెవరిదో చెయ్యి బరువుగా పడ్డది

"ఏమయ్యోయ్, నీకేం డబ్బక్కర్లేదా?"

వంటిమీద చెయ్యి పడటమేమిటి, నోటిలోనుంచి మాట రావటమేమిటి రెండూ ఒక్కసారి జరిగాయి. డబ్బనేపదం చెవిన పడేసరికి కొంపకి బియ్యం,

రచన

"ప్రమ"

పంచదార వగైరా సరకులు సరఫరా చెయ్యాలని మెదడుకి వార్తలందాయి. ఆ డబ్బిచ్చే మహానుభావుడెవరో ఒక్కసారి తనివితీరా పరికిద్దామని నా మొహం పైకెత్తింది.

"నువ్వేం పనిచేసేటట్టు లేవే" నావంక ఆఫీసరుగారి పెద్దపులితలకాయ ఉరిమి చూసింది.

శ్రీవారు పెట్టినవి నాలుగూ తిని ఇంటికి దారితీశాను.

మా ఇంటికి నాలుగిళ్లవతల ఉన్న ఆఫీసరుగారి భార్య ఎనిమిది గజాల సిల్కుచీర కట్టుకొని శ్రీవారిరాకకోసం నిరీక్షిస్తూ ఉంది. ఆవిడనడుం కాస్త పెద్దదవటంవల్ల గాబోలు కట్టుకున్న చీర మోకాలుదాకా ఎగదీసుకపోయింది

ఏమాత్రం పద్యాలు అల్లటం వచ్చినా ఆవిడగారి నడుంవలయాన్ని మా ఇంటి పక్కనే ఉన్న మునిసిపాలిటీవారి చెత్తడబ్బాతో పోల్చి వర్ణించి ఉందును.

కొంపలోకి అడుగుపెట్టగానే పక్కనే ఉన్న ఒక్కటే ఒక్క గదిలో మా ఇల్లాలు పడుకేసి ఉంది- ఇక్కడే మా శ్రీమతి గురించి కాస్త చెప్పక తప్పదు. మా ఆవిడకీ తలనొప్పికీ అవినాభావసంబంధం ఉంది. అదేం పాపకర్మమో గాని తలనొప్పిని వదలి ఆవిడగారు ఒక్కక్షణం కూడా ఉండలేదు. కాని పాపం దాంతోనే పనంతా తనొక్కతే చేసుకొంటుంది. లేకపోతే ఆవిడకి మాత్రం తెలియదూ ఈ గుమాస్తాగాడు ఇప్పటికే చాలక ఇంకొక మనిషిని కూడా ఎక్కడ పోషిస్తాడని.

మా శ్రీమతిలో ఉన్న గొప్ప సుగుణమేమంటే పగల్లా చచ్చేటట్లు పనిచేసి ఇంటి



కొచ్చిన మొగుడుమున్డావాడికి పిచ్చెక్కకుండా ఉండేందుకు సణుగుకోటాలూ, గొణుగుకోటాలూ లేక ఉన్న రెండు చీరలనే చిరిగిపోయినా కుట్టుకుని కట్టుకుంటూ ఎండ తగలక తెల్లబడ్డ గడ్డిని తల్లో పెట్టుకుని మొహం కళకళలాడుతూ కనబడుతుంది.

ఇల్లాలి ఈ గుణానికి మెచ్చుకొని, ఆవిడ తలనొప్పికి డాక్టర్ని పిలిచి మందు లిప్పించలేకపోయినా మనస్సులోనే శతసహస్ర అ.వందనా లర్పిస్తూ ఉంటాను—

నా రాక గమనించిన మా శ్రీమతి పక్కనే ఉన్న ఒక్కగదిలో పడకనుంచి లేచి వడ్డించే ప్రయత్నాలు మొదలుపెట్టింది. పెందరాళే తినకపోతే లాంతరు కావద్దూ? లాంతరున్నా దాన్లోకి కిరసనాయిలు కావొద్దా? అందుకనే కాస్తంత వెలుతురుండగానే తిని పడుందామన్న ఉద్దేశం మాది.

కాళ్లు కడుక్కొని వస్తుండగా భార్యారత్నం గారు అత్యాశ్చర్యంతో చెప్పింది. పొద్దునే డాల్డాతో కలిపి వేసుకో వచ్చని తెచ్చిన సవాశేరు వెన్నమీద భగవాన్ జగద్గురు శ్రీ శ్రీ బాబా వారి పాదాలు పడ్డాయని.

నా గుండె ఒక్కసారి ఆగిపోయినట్టయింది. కాళ్లు గజగజ వణికాయి. కళ్లు గిరగిర తిరిగాయి. 'ఈ సవాశేరు వెన్నపూసనీ పదిలంగా అట్టే పెట్టాలిగాబోలురా భగవంతుడా' అనుకొన్నాను. "పోదూ ఈ పాదాల్ని లెక్కపెట్టే దేమిటి. కరగబెట్టవాండా మనుకొన్నానుగానీ మళ్ళీ ఏం కేసు మూడుతుందో"నన్న భయం వేసి చచ్చినట్టు పక్కకొంపలో ఉన్న బాబా భక్తురాలైన డాక్టరమ్మదగ్గరికి పరుగెత్తుకువెళ్లాను ఈవిషయం చెప్పటానికి.

అవతలమనిషి ప్రాణం పోతున్నా పైసా చేతిలో పడితేనేగాని అడుగు ముందుకు పడని ఈవిడగారు భక్తురాలట!

ఊళ్లోకల్లా డాక్టరమ్మ ఒక్కతే అవటం వల్ల ఈవిడపేరు ఊరు ఊరంతా మారుమోగిపోవటంలో వింత ఏమీ లేదు. ఆవిడగారు రెండుచేతులా డబ్బు సంపాయించటంలో ఆశ్చర్యమూ లేదు పైగా ఈవిడచేత వైద్యం చేయించుకొంటున్నవారందరి దగ్గరా "బాబామందిరం"కోసమని చందాలు వేయించుకుంటుంది.

అటువంటి ఈ డాక్టరమ్మ సందర్శనానికి వెళ్లిన నాకు ఆవిడ అప్పుడే రిక్షాలోనుంచి వస్తూ ప్రత్యక్షమైంది.

ఫలానిసంగతని చెప్పటమాలస్యం ఉన్నపాటున ఆవిడ మా ఇంటికి పరుగెత్తుకు వచ్చింది రిక్షాలో.

ఆశ్చర్యం! మేం ఇంట్లో అడుగు పెట్టామో లేదో మా ఆవిడ తందనాలాడుతూంది. అది చూసిన డాక్టరమ్మగారి ఆనందం అపారం. నోరెళ్లపెట్టుకొని చూస్తున్న నావైపు చూసి ఆవిడే అంది. "మీ భార్యగారిలో బాబా ప్రవేశించారు"

బిత్తరపోయి చూస్తున్న నేను ఆవిడ మళ్లీ ఏవో మాటలంటూంటే తేరుకొన్నాను. అప్పటికే కొన్ని మాటలనేసింది. నాకు వినపడిన పలుకు లివి. "పాదాలు పడ్డాయన్నారు చూపిస్తారా?" ఆవిడ నన్ను అనుసరించగా నేను వంటింటిలోకి దారితీశాను. ఆ దృశ్యం చూసిన ఆమె ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ పరవశురాలైపోయింది.

మళ్లీ ఇవతలి గదిలోకి ప్రవేశించేటప్పటికి మా ఆవిడ "ఈ తలనొప్పితో నా తలకాయ బ్రద్దలయిపోతోంది" అంటూ ఏడ్చేస్తోంది.

"అరరే, బాబాగారికి తలనొప్పి వచ్చిం"దంటూ వెంటనేఉన్న బాగ్‌లోనుంచి ఏవో మంగులు తీసి ఇచ్చింది డాక్టరమ్మ.

ఆ రోజు మొదలుకొని డాక్టరమ్మ మా ఆవిడకి మందులు ఊరికేనే ఇవ్వటం మొదలుపెట్టింది. ఓసారి నేను ఏదో కొంత డబ్బు ఇవ్వబోతే "అటువంటివారిదగ్గర డబ్బు పుచ్చుకుంటామటండీ" అంటూ తిప్పికొట్టింది చిఱునవ్వుతో. భగవంతుని పుణ్యమా అంటూ మా ఆవిడతలనొప్పి తగ్గిపోయింది డబ్బూ గిబ్బూ లేకుండా.

ఈ విషయం మా ఆవిడతోనే చెప్పుదన్నా అంటే అది అదోలాగ నవ్వుతుందెందుకో. "అదేమిటే అలా నవ్వుతా"వంటే "దీని కంతకీ ఉందిలెండి చిదంబర రహస్యం" అంటుంది కాని ఆ రహస్య మేమిటో చెప్పదు.

నయాన, భయాన చెప్పగా ఓ సుముహూర్తాన బయటపెట్టిం దారహస్యం. ఈవిడగారికి బాబా పూనా లేదుట ఏమీ లేదుట. అంతా వట్టి నటనేనట. "మరి వెన్నమీద పాదాలు పడ్డాయి కాదుటే?" అంటే మా శ్రీమతి నవ్వుతూ నా వళ్లో వాలిపోతూ తనే గీశానంది.

ఎలాగైనా మా శ్రీమతి తలనొప్పిబాధ తొలగింది. అదే నాకు సంతోషం. ★



"ఉత్తరం అంత మెల్లిగా రాస్తున్నావేం ?"
"మా ఆవిడ గబ గబ చదవ లేదు."

గతుకుల దా

(15-వ పేజీ తరువాయి)

తోచగా పాపారావుకి, ఆమె అందమైన నేత్రాలు చీపికళ్లలాగు కనపడ్డాయి.

పార్వతమ్మ "ఆయన ఆశించిన వితంతు వివాహసంస్కరణకూడ దేశంలో వ్యాప్తి పొందలేదు. ఏదో ఆచార వ్యవహారాల సంస్కరణతో ఊరుకొంటే బాగుంను. కాని ఆయన సంఘసంస్కరణకీ మత సంస్కరణకీ భేదం కనిపెట్టలేకపోయాడు. ఆ కారణంవల్ల సంఘసంస్కరణ అని తలపోసి మతవిషయాలలో జోక్యం కలిగించుకొన్నాడు. దేవతలని, పండగలని, వ్రతాలనికూడ విమర్శించడం మొదలుపెట్టాడు. మొత్తం మీద హిందూ మతంయొక్క ఔన్నత్యం గ్రహించలేకపోయాడనే చెప్పాలి. ఈ మతంయొక్క ఘనత అంత సులభంగా బోధపడేది కాదు. నేటి వైజ్ఞానికశాస్త్రిలలోని నూతనపరిశోధనలన్నీ పామరజనులకి సుళువుగా ఎల్లాగు బోధపడవో అదేమాదిరిగా హిందూమతంయొక్క పరిపూర్ణసూత్రాలుకూడ పైపై దృష్టికి సుళువుగా తెలియవు. ఇటువంటి కారణాలనుబట్టి ఆయన మతవిషయంలో వెనుకంజవేసి పక్కదారులు పట్టించాడు. చివరికి బ్రహ్మసమాజమతమంటూ స్వీకరించాడు. అది తెలుగుదేశంలో ఎంతమందికి కావాలి? మొత్తంమీద ఆయనకి మనమతం లోపభూయిష్ఠంగా కనపడింది. హిందూమతంయొక్క ఘనత పూర్తిగా ఎరిగినవాడు గాంధిమహాత్ముడు. వీరేశలింగంగారు ఆచార వ్యవహారాదులలో విమర్శదృష్టి కలిగించిన మాట వాస్తవమే కాని దానివల్ల లాభం కంటే నష్టమే అధికంగా ఉంది. ఆయన చదువుకొన్నవారికి తప్పు ఒరవడి ఏర్పరిచాడు" అంది.

అంతవరకు అతనికి వీరేశలింగంగారిని గురించి ఉన్న అభిప్రాయాన్ని నిర్దాక్షిణ్యంగా ఖండించివేస్తున్నట్లు కనపడగా, తాను ఆలోచించి ఆమె అభిప్రాయంతో ఏకీభవించడానికి తగినంత అవకాశం లేకపోగా, పైగా తటాలున పూర్వాభిప్రాయాన్ని విడనాడలేక, ఆమెకి వీరేశలింగంగారినిగురించి ఉన్న అజ్ఞానానికి చాల విచారించాడు. సీతామనోహరుడు ఈలాగు భిన్నాభిప్రాయాల మధ్య కవ్వం తిరిగినట్లు తిరుగుతున్నాడు. వాదించడానికేమీ తోచలేదు. మొత్తంమీద ఏదో కొంత జ్ఞానోదయమైనట్లు కనపడగా "అయితే మన మతం నిజంగా ఘనమైనదే అంటారా?" అన్నాడు అమాయకంగా.

అభిప్రాయభేదాలు కలిగేయని తెలుసుకోగా పాపారావుకి, అర్ధచంద్రునిలాంటి ఆమె లలాటం బూడిదగుమ్మడికాయ చెక్కలాగు కనబడింది.

పార్వతమ్మ: "ఒక చిన్న సంగతి చెప్తాను వినండి. ఈ కాలంలో మనవాళ్లకి ప్రతి విషయానికీ పాశ్చాత్యుల కొలబద్ద కావాలి. మన పూర్వవైభవాన్నిగురించీ, మన సంస్కృతియొక్క ప్రశస్తినిగురించీ, పాశ్చాత్యుల ప్రశంసాపత్రాలు చూసి మనలని మనం మెచ్చుకోగలుగుతున్నాం! మన మెంతట్టి అధోగతికి వచ్చాం! మన ఆత్మజ్ఞానం ఎంతగా నశించిందో కనిపెట్టండి? అశాంతితోను, ఆంతరంగిక కల్లోలాలతోను అలమటించిపోయే నేటి ప్రపంచానికి ఎప్పటికైనా శాంతి సౌఖ్యాలు ఆధ్యాత్మికౌన్నత్యం పొందిన భారతదేశం నుంచే వస్తాయని పాశ్చాత్యదేశాలు ప్రతీక్షిస్తున్నాయి. దానినిబట్టైనా మీరు మన మతాధిక్యతను గ్రహించండి" అంది ఆమె గంభీరంగా.

సీతామనోహరుడు విన్నాడు. కాని ఏమీ పాలుపోలేదు. గది నాలుగుదిక్కులా చూశాడు. చివరికి "వీరేశలింగం అంటే మీకు చాలా కోపమన్నమాట!" అన్నాడు స్థూలపరిశీలనగా.

పార్వతమ్మ: స్నానం చేసి తలవెంట్రుకలు చివర ముడివేసుకొనగా ఆమె తలవెంట్రుకలు పాపారావుకళ్లకి తలకిందుగా ఉన్న వట్టి సవరంలాగు కనపడ్డాయి.

పార్వతమ్మ "ఛీ! ఛీ! మీరు ఎప్పుడూ ఆలాగు భావించవద్దు. అది వట్టి అజ్ఞానం. ఆ పెద్దమనిషి పాపం శ్రమ పడ్డాడు, త్యాగంచేశాడు. ఆయననమ్మినదిబోధించి, ఆచరించాడు. ఆయన నిష్కల్మషంగానే పాటుపడ్డాడు. అందుచేత ఆయన్ని అనడానికేమీ లేదు. కాని ఆయనచెప్పినవాటిని గుడ్డిగా నమ్మి, మంచి యేది, చెడ్డ యేది అని ఆలోచించకుండా అనుసరించిన మనుష్యులయొక్క అజ్ఞానాన్ని నేను విమర్శించడం. మన వివేకం ఎక్కడికి పోయింది? మన సత్సంప్రదాయం ఏ ఏటిలో కలిసింది? మన సంస్కృతి ఏదరికి చేరింది? అని నేనడగడం. ఇదీ నేను తప్పుపట్టడం. లోకంలో అనేకమంది తాము త్రికరణశుద్ధిగా నమ్మినవాటిని ప్రకటిస్తారు, ప్రచారంచేస్తారు. అది మనుష్యుని జన్మహక్కు. కాని వాటియొక్క నిజానిజాలు, మంచిచెడ్డలు, న్యాయాన్యాయాలు తెలుసుకోకుండా గ్రహిస్తే ప్రజలు పాడైపోతారు. ప్రజారాజ్యమంటే ప్రజలలో ఎంత బాధ్యత ఉందో చూడండి. ఒక్క మతవిషయకమే గాదు. వైజ్ఞానికంగా అయినా కూడా అదే అనుకోండి" అంది చిరునవ్వు నవ్వుతూ.

ఆమెచిరునవ్వు అదో వికారంగా కనబడింది పాపారావుకి.

[ఇంకావుంది.]

అమెరికన్ హాస్యరచయిత మార్క్ ట్వేన్ ఒకసారి తన పొరుగున ఉండే ఒక ఆసామీ ఇంటికి వెళ్లి ఫలానా పుస్తకమేదో కావాలని, చదివి యిచ్చేస్తాననీ, కోరాడు.

"ఇవ్వటాని కభ్యంతర మేమీలేదు. కాని మీరు ఇక్కడే కూర్చుని చదువుకోవాలి. నా పుస్తకాల్ని నా లైబ్రరీగది దాటి వెళ్ళనివ్వ కూడదని నాకో నియమం ఉంది." అన్నాడా ఆసామి.

కొన్నాళ్ళ తర్వాత ఆ ఆసామీ మార్క్‌ట్వేన్ యింటికి వచ్చి గడ్డపార ఒకసారి ఇమ్మని కోరాడు.

"అలాగే యిస్తాను. కాని ఆ గడ్డపారని మీరు నాదొడ్లోనే ఉపయోగించాలి. అలాగని నియమం పెట్టుకున్నాను." అన్నాడు మార్క్‌ట్వేన్.

ఇండొనీషియా విప్లవచిత్రకారుడు అఫాండీ

ఇండొనీషియా చిత్రకారుడు అఫాండీ గారి చిత్రములు దక్షిణ భారత చిత్రకారుల సంఘ యాజమాన్యమున మద్రాసు మ్యూజియములో ప్రదర్శితము లైనవి. అఫాండీ తన చిత్రములతో పాటు, సమకాలిక ఇండొనీషియా చిత్రకారుల చిత్రములను కొన్నిటిని ప్రదర్శించినారు.

తరతరములుగా పరదేశ పరిపాలనా పీడనలకు గురియైన ఇండొనీషియా ప్రజల బ్రతుకులు నిస్సారములై, పేద పోయినవి. ఇటీవల ప్రజలలో ఏర్పడిన చైతన్యమువలన పరరాజ్యపాలన తొలగిపోయి, దేశము స్వతంత్రమైనది. దేశరాజకీయ గమనములో నేర్పడిన మార్పులు దేశీయ కళలలో కూడా కన్పించక మానవు. ఈ సత్యమును అఫాండీ గారి చిత్రములు మరియొకసారి రూఢిపరచునవిగా నున్నవి.

1910లో నిరుపేద మహమ్మదీయ కుటుంబములో జన్మించిన అఫాండీ ప్రకృతి తన గురువుగా, దేశవ్యాప్తముగా అగుపించుచున్న జీర్ణదేహులే తన చిత్రములకు మాతృకలుగ పరిగ్రహించి, ఈయన తన కుంచెకు పదను పెట్టుకొన్నాడు.

శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

మానవుడుగా, ఈయనలో దయానుకంపను మెండు. కరుణరసాపాదకములైన చిత్రములను రచించుటలోనే ఆతనికి అభిమానము హెచ్చు.

కళల ప్రయోజనము జీవితమును ప్రతిబింబించుటయేనని, చిత్రముల ద్వారా సామాన్యునిలో చైతన్యము కల్పించుట వలననే తాను నేర్చిన కళ సార్థకమగునని ఆతని విశ్వాసము. ఈ విశ్వాసము కలవాడు కనుకనే తన దేశీయులు సామ్రాజ్యవాదులపై జరిపిన రెండవ యుద్ధకాలములో నాతడు తన కుంచెను ఒక ఆయుధముగా చేసి, తాను రచించిన ప్రచార చిత్రములద్వారా ప్రజలను ప్రబోధించెను. దురదృష్టవశమున నవి జాగ్‌జకర్తా మ్యూజియంలో దగ్ధమయినవి.

చిత్రరచనాపద్ధతిలో నితడు పాటించునది. 'వాస్తవికత'. అతడు తన ఏదుటనున్న వస్తుసముదాయములో నేవేవి ఎంతెంతవరకు తన కంటికి కగుపించుచున్నవో వాటినే, అంతవరకే చిత్రించును కాని, వాటి వునికి,

(39-వ పేజీ చూడండి)



"నా తనయు"

ఈ రూప చిత్రాన్ని చిత్రించే సమయంలో తనకంటికి అగుపిస్తున్నంత వరకు తన శరీరాన్నికూడా ఈ చిత్రములో అఫాండీ ప్రవేశపెట్టాడు. చిత్రానికి ఎడమ భాగంలో ఆకుల అంచులదరిని అగుపిస్తున్నవి—ఆతని నాసిక, మీసపు మొన, అవి మసగ మసగగాను మిగిలినభాగం ప్రస్ఫుటంగాను, కనుపించగలవు.



'నా సంసారం'

ఈ చిత్రము అతడు ప్రతిఫలకసహాయముతో చిత్రించినాడు. (చిత్రకారుడు కుంచెలను ఎడమచేతిలో పట్టుకొనియుండుట గమనించ దగినది.) ఈ తన లక్ష్యమును, ఈ లక్ష్యసాధనలో తాను పొందియున్న నిర్వేదమును, తన కూరటకల్పించు దారాసుతలను ఆతడు చిత్రించియున్నాడు. కుంచెలు పట్టినచేతిని పైకెత్తి కళాపరమైన తన ఆశయములను తానెన్నడూ సడల నీయబోనని చాటియున్నాడు.



'ఒక సంసారం'

దీనిని అఫాండీ సమకాలికుడు, సహచరుడు అయిన హెంద్రా రచించెను.

చిత్రములో దూరముగా మోడైన మ్రానుకు వ్రేలాడగట్టిన పంజరములోని రామచిలుక, నిర్జనమైవున్న వసతిగృహము, పొగలెగయుచు బ్రద్దలు కానున్న అగ్నిపర్వతము, ముందు భాగములోనున్న శిల్పప్రాయమైన మాతా శిశువుల రూపములు నాటి జాతీయ జీవితములోని నైరాశ్యమునకు సాంకేతికములు. శిశువు చేతనున్న పుష్పము ఆశా సూచకము. ఈ చిత్రములో హెచ్చుగా వాడిన ముదురు రక్తపు వర్ణము ప్రజలలో మణిగివున్న క్రోధానికి చిహ్నము కావచ్చును.



'నేను ఇతర

ఆ దేశములో చిత్రకారు
అందుచేత వా రొకరి కొకరు
మానవ శరీరములోని అవయవ
మున కిది ప్రతిఫలితము.



త్రకారులకు 'మాడల్' సు"

మాడల్స్‌ను నియమించుకొనుటకు డబ్బుచాలదు.
ల్‌గా నిలబడి సహాయము చేసుకొనుట పరిపాటి.
అమెరికను గూర్చి యీతని కేర్పడియున్న పరిజ్ఞాన



"నా తల్లి"

బ్రతుకు బరువును మోసి బడలిపోయిన వృద్ధమాత మనసునావరించిన శూన్యమే ఆమె దృక్కులలో సైతము ద్యోతకమౌతున్నది.

"ముగురు బిచ్చగాళ్లు"

మొదటి బిచ్చగాడు చేయి చాచినరీతిలో అసహజత్వము తోచకమానదు. అది ఆతడు ఏండ్లతరబడి చాచినచేతిని చాచినట్లే వుంచుట చేత నేర్పడిన అంగ వైకల్య ఫలితము. దినదినము తన ఇంటి వాకిటకు వచ్చిచేరి, నిలచి అర్థించి, మరలిపోయిన బిచ్చగాని రూపచిత్రమే ఇది. ఆ మూడు దశలను ఒకే చిత్రములో చిత్రించి, అఫ్ఘాన్‌డీ దీనికి ఆ పేరుపెట్టెను.





బొమ్మరిల్లు

చిగురుటాకులు : 1

బొమ్మల పెళ్లి

శ్రీ అడివి బాపిరాజు

బొమ్మరిళ్లను మేము కట్టుకుంటాము,
బొమ్మలా పెళ్లిళ్లు చేసుకుంటాము.

బొమ్మలకు సొమ్ములు పెట్టుకుంటాము,
పొందూరు బట్టలను తెచ్చుకుంటాము.

మా వదిన వియ్యమ్మ, నేను వియ్యమ్మ,
మా వదినకూతురుకు నాకొడుకు పెండ్లి.

పెండ్లి చుట్టాలంత బండ్లెక్కినారు,
పెండ్లికొడుకూ ఎక్కె వెండిపల్లకినీ.

మా వదిన వూరదిగో, మావూరు ఇదిగో,
మా పెళ్లివారంత తర్లి వెళ్లేమూ.

ఎదురుసన్నాహానికి వదినె వచ్చిందీ,
"ఏమి తెచ్చారమ్మ చుట్టాలు మీరూ".

వెండిబిందెలు, గ్లాసు, విస్త్యాలవాగా,
పెళ్లికొడుకుకు తెచ్చి పెట్టి ఉంచారు.

"ఊరేగుతూ పెళ్లి తర్లివచ్చామూ,
ఊరంత పందిరీ వేశార మీరూ?".

పెళ్లికొడుకూ కట్టె మంగళసూత్రాలు,
కళ్లు మెరిశాయి మా కందరికి నేడూ.

ఏరు పొంగినట్లు మేము పొంగాము,
ఆరువాయిద్యాలు భోరుమన్నాయి.

అందాల గొంతుకల పాట పాడేము,
విందులూ గుడిచేము వియ్యమ్మ పొంద.



గాంధీజీ దీక్ష

నౌఖాళీ దురంతాలు జరిగే కాలంలో గాంధీజీ ప్రతి పల్లెటూరికీ వెళ్తూ అక్కడవుండే హిందూముస్లిం వాళ్లని సఖ్యంగా వుండమని చెప్పేవారు. ఆ సమయంలో హిందువుల్ని, మహమ్మదీయులు ఎంతమందినో చంపేస్తున్నారు. అందుకని, అది తప్పించటానికి గాంధీజీ బయల్దేరారు. ఆయన వెంట ఆయన కార్యదర్శి, మరికొంతమందిమాత్రం బయల్దేరేరు. గాంధీజీ మనమరాలు - మనుబెన్ అంటారూ - ఆవిడ కూడా వొస్తానంది. గాంధీజీ వొప్పలేదు. "వొద్దు-నువ్వు రావద్దు - నాతో నువ్వు వేగలేవు-అనేక చిక్కులుంటాయి-నువ్వు పడలేవు రాకు" అని ఎన్నివిధాలో మనుబెన్‌కి చెప్పేరు. కాని మనూ దొకటేపట్టు! సరే, గాంధీజీ ఆవిణ్ణికూడా తనతో తీసుకెళ్లక తప్పిందికాదు.

ప్రతీ పల్లెటూర్లోనూ, ఆయన మకాంచేస్తూ, అక్కడి పరిస్థితుల్ని స్వయంగా పరిశీలిస్తూ వుండేవారు. ఒకనాడు వొకవూర్నించి మరొకవూరొచ్చి అక్కడ వుండే బీదసాలెవాళ్ల యింట్లో దిగారు. దిగగానే గాంధీజీ కొన్నివుత్తరాలుచూసి, వాటికి జవాబులురాయమని తన కార్యదర్శి కిస్తారు. తర్వాత కాస్సేపటికి స్నానంచేస్తారు. ఈ స్నానం మొదలయిన పనులన్నీ మనూ స్వయంగాచేసేది.

ఐతే, అవాళ గొప్ప పొరపాటు జరిగింది. గాంధీజీ స్నానం చేసేటప్పుడు వొళ్లు రుద్దుకుందుకు సబ్బు ఏమీ వాడరు. ఒక గరుగ్గావున్న రాయిని మాత్రం వాడతారు. మామూలుగా మనూ గాంధి, నీళ్ళు తువ్వాలూ వుంచింది. రాయిమాత్రం లేదు! గబగబావెళ్ళి గాంధీజీని కనుక్కుంది. "లేదూ! నీకే తెలియాలి - ఎక్కడపెట్టావో - జాగ్రత్తగాచూడు" అన్నారాయన. "అంతా చూశాను. కాని కనపడితేనా-పోనీ మరోరాయి పెట్టనా?" అంది జంకుతూ. "వీల్లేదు. ఆ రాయే నాకు కావాలి. బహుశా క్రిందటిరోజు మనం బసచేసిన వూళ్లో వొదిలిపెట్టివుంటావు. వెళ్లు-వెళ్లి తీసుకురా!" అన్నారు గాంధీజీ. మనూగాంధీ భయపడ్డది. నిన్నటి వూరు ఐదారు మైళ్లు వుంది. దారంతా భయంకరంగావుంటుంది. అంతా గూండాల మయం. ఏ క్షణాన ఏం జేస్తారో! ఐనా ఈ రాతిముక్కకోసం ఆయనకి ఇంత పట్టింపు ఎందుకో!

"ఇక్కడ కొందరు వాలంటీర్లున్నారు-ఎవర్నన్నా సాయం తీసుకెళ్లనా?" అని అడిగింది. "ఎందుకూ? సాయంగీయం లేదు వెంటనే వెళ్లు-స్నానంకి వేళవుతున్నది" గాంధీజీ మొహం పెద్దది చేసి, కళ్లజోళ్లోంచి తీవ్రంగా చూసి అనేటప్పటికి, మనూ గబగబా వెళ్లిపోయింది. దారంతా ముళ్లడొంకలు! మనుష్యులే ఎక్కడా లేరు. ఏ పొదలపక్కన గూండాలు వున్నారో-అని భయ

(39 వ పేజీ చూడుడు)

శ్రీ రాపి కొండలరావు



టామ్ సాయర్... మార్క్ ట్వేన్

మర్నాడు మధ్యాహ్నం టామ్, హాక్ 'చచ్చినచెట్టు' దగ్గిరికి వెళ్లి కిందటి రోజున అక్కడ దాచిన పార, పలుగు తీసుకున్నారు. దెయ్యాల యింటికి దబ్బున వెళ్లాలని టామ్‌కి ఒకటే తొందర. హాక్‌కికూడా తొందరగానే వుంది; కాని హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చి ఇల్లాగన్నాడు.

'ఇటు చూడు టామ్! ఇవ్వాళ ఏం వారం?"

టామ్ వారాలన్నీ జ్ఞాపకం చేసుకుని, ఉలిక్కిపడ్డాడు; కళ్లు పెద్దవి చేసి,

"అరె బాప్! నాకీ ఆలోచన తట్టనే లేదురా!" అన్నాడు.

"నాకూ ఇప్పటిదాకా జ్ఞాపకం రాలేదు. శుక్రవారమని ఇప్పుడే గుర్తుకొచ్చింది," అన్నాడు. హాక్. "ఎంతజాగ్రత్తగా వుందామన్నా ఏదోటి పొరపాటు జరుగుతూనే వుంది. ఇవ్వాళ గనుక ఆ పని తలపెడితే కష్టాలు తప్పవు."

"అవును, శుక్రవారం మంచిరోజు కాదు."

"ఆ సంగతి ఏ చంటిపిల్లాడికైనా తెలుసు, నువ్వే కనిపెట్టినట్టు డాబులు కొట్టకు."

"నే నేం డాబులు కొట్టడంలేదు. టామ్! మర్చిపోయాను. రాత్రి నాకు పీడకలకూడా వచ్చింది. అందులో ఎలికలు కనిపించాయి."

"అయితే తప్పకుండా ప్రమాదం జరుగుతుంది. ఎలికలు దెబ్బలాడుకున్నాయా?"

"లేదు."

"అయితే ఫరవాలేదు హాక్! ఎలికలు దెబ్బలాడుకోకపోతే మన చుట్టుపక్కల ఏదో ప్రమాదం జరుగుతుందని అర్థం; అంతే గాని మనకేమీ ఉండదు. ఏమైనా ఈ వ్యవహారం ఇవ్వాల్టికి మానేద్దాం. హాక్! నీకు రాబిన్ హుడ్ కథ తెలుసా?"

"తెలవదు. ఎవరు రాబిన్ హుడ్?"

"ఇంగ్లండు దేశంలోకల్లా గొప్పవాడు; గజదొంగ."

"బలే, నేనుకూడా గజదొంగ అయితే ఎంత బావుంటుంది? ఎవర్ని దోచేవాడు?

"మంత్రుల్ని, మతగురువుల్ని, రాజుల్ని, ధనవంతుల్ని మాత్రం దోచుకునేవాడు. బీదవాళ్లని చాలా ప్రేమించేవాడు. దోచుకున్న డబ్బంతా వాళ్లకి పంచిపెట్టేవాడు."

"చాలా గొప్పవాడై వుండాలి రాబిన్‌హుడ్."

"నిజంగా ప్రపంచంలోకల్లా గొప్పవాడు. ఇప్పుడల్లాంటివాళ్లు ఒక్కళ్లైనా లేరు. ఇంగ్లండులో ఎంత గొప్పవీరుడినైనాసరే రెండు నిమిషాల్లో మట్టి తినిపించేవాడు. ఒక చెయ్యి వెనక్కి విరిచికట్టుకుని ఒక్క చేత్తో ఎంతసేపైనా యుద్ధం చేసేవాడు."

ఆరోజు చీకటిపడేదాకా ఇద్దరూ రాబిన్‌హుడ్ ఆట ఆడారు. మధ్యలో అప్పుడప్పుడు దెయ్యాల ఇంటికేసి ఆశగా చూసేవారు. ఆ మర్నాడైనా తమ ప్రయత్నాలు ఫలిస్తాయో లేదోనని బెంగపడ్డారు. చివరికి ఇళ్లదారి పట్టారు.

శనివారం మధ్యాహ్నం మళ్ళీ ఆచోటుకే వచ్చారు. నీడలో కూర్చుని చుట్టలు కాల్చారు. ఆఖరుసారి తవ్విన గొయ్యిని మళ్లీ కొంచెం తవ్వారు. డబ్బు దొరుకుతుందని ఆశతో కాదు. టామ్ ఏమని చెప్పాడంటే, "కొందరు ఇలాగే భూమిలో తవ్వీతవ్వీ విసుగెత్తి వెళ్లిపోతారు. ఇంకొక ఆరంగుళాలు తవ్వితే డబ్బు బయటపడుతుంది. కాని వాళ్లు ఇక దొరకదని నిరాశ చేసుకుని వెళ్లిపోతారు. అప్పుడు ఇంకెవళ్లో వచ్చి రెండు మూడుసార్లు గడ్డపలుగు దిగేసేటప్పటికల్లా డబ్బు బిందెలు బయటపడిపోతాయి. పాపం, మొదట్లో అంత కష్టపడి తవ్వినవాళ్ల కవి దొరకవు" అని చెప్పాడు.

అందుకని వాని చూద్దామని కొంచెం తవ్వి చూశారు. కాని అదృష్టం కలిసిరాలేదు వాళ్లకి. తమ కర్తవ్యం తాము చేశామనే సంతృప్తితో వాళ్లు నిట్టూరుస్తూ బయల్దేరారు.

దెయ్యాల ఇంటికి వచ్చేటప్పటికి అక్కడ అంతా ప్రశాంతంగా వుంది. పిట్టలుకూడా రావటానికి భయపడే ఆ ఒంటరి ప్రదేశంలో ఆ నిశ్శబ్దాన్ని గమనించే సరికి వాళ్ళకి ఎందుకో అర్థంకాని భయం ఆవేశించింది. కిటికీగుండా తొంగి చూశారు. ఇంట్లో నేలనిండా గడ్డి ఒత్తుగా మొలిచింది. దట్టమైన బూజు గోడల నిండా అలముకుంది. విరిగిపోయిన ఒక పాతపొయ్యిలో 'ఇక్ష్వాకుల కాలం' నాటి బొగ్గులు, బూడిద ఇంకా అల్లాగే వున్నాయి. నెమ్మదిగా, ఊపిరికూడా బిగపట్టి లోపలికి ప్రవేశించారు. జాగ్రత్తగా అడుగు తీసి అడుగు వేస్తూ, చీమ చిటుకుమంటే, వెనక్కి తిరిగి పలాయనం చిత్తగించడానికి సిద్ధంగా, ఇంట్లోకి వెళ్లారు.

చుట్టూ పరిశీలించారు. కొద్దిసేపట్లో అక్కడి వస్తువులన్నీ వాళ్లకి పరిచయమయ్యాయి. ఇప్పుడు కొద్దిగా భయం తీరింది. తమ ధైర్యాన్ని చూసి తామే ఆశ్చర్యపడ్డారు; గర్వపడ్డారు. కూడా ఇకపై అంతస్తుకి కూడా వెళ్లి పరీక్షచేద్దామనుకున్నారు. మేడమీదకి వెడితే, ఎవరన్నా వస్తే పారిపోవటానికి వీలుండదు. అయినా తము చెయ్యబోయే మహాకార్యానికి పైకి వెళ్లటంకూడా అవసరం.

అందుచేత తమ సాధనాలు ఒక మూల పడేసి, విరిగిపోయిన మెట్లమీద, కాళ్లు ఎత్తెత్తి తేలిగ్గా వేస్తూ ఎక్కారు. అక్కడ వస్తువులన్నీ చిందరవందరగా వున్నాయి. ఒక మూల అలమార కనిపించింది. అందులో ఏమైనా దొరకచ్చుననే ఆశతో గభాలున తెరిచి చూశారు. అందులో బొద్దింకలు తప్ప మరేమీ కనపడలేదు.

వాళ్లకి ఈ సాటికి భయం పూర్తిగా తగ్గిపోయింది. ఇక కిందకి పోయి పని ప్రారంభిద్దాం అనుకున్నారు. హఠాత్తుగా 'ష్' అన్నాడు టామ్.

"ఏమిటీ?" అన్నాడు హాక్ మెల్లిగా.

"ష్! అదుగో—వినబడిందా?"

"ఆ! ఓయి బాబో! పారిపోదామా?"

"కదలకు. ష్! కింద తలుపు నెవరో తెరుస్తున్నారు."

ఇద్దరూ వెంటనే చప్పుడు చెయ్యకుండా నేలమీద బోర్లా పడుకుని కంతలలోంచి కింద హాలులోకి చూశారు. వాళ్ళ గుండెలు రైలు ఇంజన్‌లా 'గుప్ గుప్' మంటున్నాయి.

ఇద్దరు వ్యక్తులు లోపలికొచ్చారు. వాళ్లలో ఒకణ్ణి టామ్' హాక్ వెంటనే పోల్చారు. అతడు ఈమధ్యే కొత్తగా ఊళ్లోకి వచ్చిన స్పెయిన్ దేశస్థుడు. వాడు చెవిటి, మూగ కూడాను. ఆ రెండోవాడెవడో తెలియలేదు.

ఆ 'రెండోవాడు' చిరిగి, మాసిపోయిన గుడ్డలు కట్టుకున్నాడు. వాడి వేషం భయంకరంగా వుంది. స్పెయినువాడు ఒక దుప్పటి కప్పుకున్నాడు; తెల్లటి ఒత్తైన మీసాలున్నాయి. పచ్చటి కళ్లజోడు పెట్టు

కున్నాడు. ఆ 'రెండోవాడు' ఏదో నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. ఇద్దరూ లోపలికొచ్చి గోడ కానుకుని తలుపుకేసి చూస్తూ కూర్చున్నారు.

"వద్దు. నా కది ఇష్టంలేదు. అది అపాయకరమని నా ఉద్దేశ్యం" అన్నాడు 'రెండోవాడు.'

"అపాయకరమా? నీ మొహం నువ్వూరుకో," అన్నాడు స్పెయినువాడు.

ఆ మాటలు విని మేడమీద టామ్, హాక్ ఉలికిపడ్డారు; వాళ్లిద్దరికీ మూర్ఛవచ్చినంతపని అయింది. స్పెయినువాడు మూగవాడు, చెవిటివాడు అనుకున్నారు; వాడిప్పుడు శుభ్రంగా మాట్లాడుతున్నాడు.

అంతే కాదు, ఆ గొంతిక ఇంజన్‌జో గొంతిక.

"అక్కడ మనం చేసిన పనికంటే ఇది అపాయకరం అంటావా? కాదు. ఏం ఫర్వాలేదు," అన్నాడు మళ్లీ ఇంజన్‌జో.

"అది వేరు. ఆచోటు నదికి బాగా ఎగువన వుంది. చుట్టుపట్ల ఒక్క ఇల్లుకూడా లేదక్కడ," అన్నాడు రెండోవాడు.

"అది నరే. ఇప్పుడు పట్టపగలు ఇక్కడికి రావటం అపాయకరం కాదా? మనను ఎవరైనా చూస్తే అనుమానించరూ?"

"నిజమే అనుకో. అయినా ఆ పని చేసివచ్చేటప్పుడు ఇంతకంటే మంచి చోటు దొరకలేదు కనక ఇక్కడి కొచ్చాము. అసలిది కూడా అపాయకరమే. ఇక్కడికి రాగూడదని నిన్ననే అనుకున్నా. ఆ ఎదురుగా మెట్టమీద పిల్లలు ఆడుకుంటున్నారు నిన్న. వాళ్లు చూస్తే మన్ని వెంటనే గుర్తుపట్టేవారు."

"మెట్టమీద పిల్లలు" అనే మాట వినేసరికి టామ్, హాక్‌ల గుండెలు మళ్లీ ఝల్లుమన్నాయి. నిన్న అక్కడ వీళ్లకి కనిపించింది తామే నని, నిన్న శుక్రవారమని, ఇక్కడికి తము రాకపోవటం చాలా మంచిదైనదని అనుకున్నారు. అసలు ఇవ్వాళైనా ఎందుకు రావాలిక్కడికి. కనీసం ఏడాదైనా ఆగి వుండాల్సింది.

ఇంజన్‌జో, ఆ రెండోవాడూ చేతిమూట విప్పి తెచ్చుకున్న తిండి తిన్నారు. తిండి పూర్తయ్యాక జో అన్నాడు.

"ఒరే అబ్బాయ్! నువ్వు పోయి నది ఎగువన పూర్వపు చోటులోనే వుండు; నేనొకసారి ఊళ్లోకి వెళ్లి పరిస్థితులన్నీ చూసి వస్తాను. తరవాత నువ్వు అపాయకరమని భయపడుతున్నావే, ఆపని కాస్తా చేసేద్దాం. తరవాత టెక్సాస్ రాష్ట్రానికి ఉడాయిద్దాం. ఇక మన్ని దేవుడుకూడా పట్టుకోలేడు."

దీనికి రెండోవాడు అంగీకరించాడు. తరవాత ఇద్దరూ కాళ్లు సాచుకుని బద్ధకంగా ఆవలించారు.

"నాకు చచ్చే నిద్ర వస్తోంది. నువ్వు మేలుకుని కాపలా కాయి," అన్నాడు ఇంజన్‌జో.

రెండు నిమిషాల్లో ఇంజన్‌జో పంది మూలిగినట్టు గుర్రుకొట్టడం మొదలెట్టాడు. రెండోవాడు కాస్సేపు అటూ, యిటూ చూశాడు. ఇంజన్‌జోని లేపుదామని తట్టాడు కాని, వాడు లేవలేదు. రెండోవాడుకూడా ఆవులించాడు; మరో నిమిషంలో వాడు కూడా గుర్రుకొట్టడం ప్రారంభించాడు.

పైన పిల్లలు "అమ్మయ్య" అని నిట్టూర్పు విడిచారు.

"ఇదే సమయం, పారిపోదాం పద," అన్నాడు టామ్.

"నేను రాలేను. వాళ్లు లేచారంటే మన పని అయిందన్న మాటే," అన్నాడు హాక్.

టామ్ ఎంత బతిమాలినా హాక్ ఒప్పుకోలేదు. టామ్ ధైర్యంగా ఒక్కడే లేచి బయల్దేరాడు. అది బల్లచెక్కలతో కూర్చిన నేల అవటం మూలాన ఒక్క అడుగు వేశాడో లేదో 'కిర్రు' మంది. అంచేత వెంటనే మళ్లీ టామ్ బోర్లాపడుకున్నాడు కిక్కురు మనకుండా.

టామ్, హాక్ సెకండ్లు లెక్కపెడుతున్నారు. కాలం ఆగిపోయినట్టు అనిపించింది. చివరి కెలాగైతేనేం సూర్యుడు అస్తమిస్తూవుండటం చూసి "అమ్మయ్య" అని మళ్లీ నిట్టూర్చారు.

ఇంతలో ఒక గుర్రు ఆగిపోయింది. ఇంజన్‌జో లేచి కూర్చున్నాడు. చుట్టూ తేరిపారచూసి కళ్లు నులుముకున్నాడు. పక్కన గుర్రు తీసే స్నేహితుణ్ణి చూసి, వెకిలిగా నవ్వి, కాలితో తన్ని లేపాడు.

"ఏమ్, లే లే. ఇదేనా, నువ్వు కాపలా కాయటం? ఏమీ జరగలేదనుకో."

"అరే. నేను నిద్రపోయానా?"

"కొద్దిగానే లే. సరేగాని, మనకి మిగిలిన ఆ కాస్త డబ్బూ ఏం చేద్దాం?"

"ఇక్కడే వుంచేద్దాం. ఒక్కాన్ పోయేరోజుదాకా దాన్ని కదిలించవద్దు. ఆరువందల యాభై డాలర్లు మోసుకువెళ్లటమంటే సామాన్యం కాదు," అన్నాడు రెండోవాడు.

"సరే నువ్వు చెప్పినట్టే చేద్దాం. ఇంకొక్కసారి ఇక్కడికి వచ్చినంతలో మనకి నష్టమేమీ లేదు."

"కాని, మనం రాత్రిపూట రావటమే మంచిది."

"అల్లాగే. కాని ఇటు చూడు. మన డబ్బును కాస్త జాగ్రత్త చేసుకుందాం. బాగా లోతుగా పాతిపెడదాం. మన జాగ్రత్తమీద మనం ఉండాలిగా," అన్నాడు ఇంజన్ జో.

దీనికి రెండోవాడు అంగీకరించాడు. సరాసరి పొయ్యిదగ్గిరికి వెళ్లి ఒక రాయి తొలగించి ఒక సంచీ తీశాడు. ఆ సంచీ తీస్తుండగానే గలగల మోగింది. సంచీ విప్పి ఇరవయ్యో, ముప్ఫయ్యో డాలర్లు తనకీ, మరొక ఇరవై ముప్ఫయ్ డాలర్లు ఇంజన్ జోకి తీసుకున్నాడు.

జో తన పొడుగాటి కత్తితో ఒకచోట తవ్వుతున్నాడు డబ్బు పాతిపెట్టేందుకు.

ఇదంతా మేడమీదనుండి టామ్, హక్ లు చూస్తూనే వున్నారు. డబ్బుసంచీని చూడగానే వాళ్ల కళ్లు మిలమిల మెరిశాయి. భయం, గియం ఎగిరి చక్కాపోయింది. ఆరువందల డాలర్లు అంటే కాస్త కూస్త డబ్బా? దాంతో అరడజనుమంది పిల్లలు ధనవంతులు కావచ్చు. పైగా డబ్బుకోసం ఎక్కడ తవ్వాలీ అన్న ప్రశ్నే లేదు. వాళ్ల కళ్లఎదురుగుండా ఇంజన్ జో పాతిపెడ్తున్నాడు.

ఇంతలో ఇంజన్ జో కత్తి నేలలో దేనికో తగిలింది.

"హల్లో," అని అరిచాడు జో.

"ఏమిటది?" అన్నాడు వాడి స్నేహితుడు.

"ఇదేదో వుందిక్కడ. పెట్టెలాగా వుంది. ఇట్రా చూద్దాం," అన్నాడు జో.

కత్తితో పెట్టెలో కన్నం చేసి, చెయ్యి పెట్టి లాగాడు. చేతిలోకి బంగారు నాణెములు వచ్చాయి.

"అరె బాప్! డబ్బేరా ఇదంతా," అన్నాడు జో.

కింద వీళ్లు, పైన వాళ్లుకూడా ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ, ఊపిరిపీల్చటంకూడా మర్చిపోయి చూస్తున్నారు డబ్బుకేసి.

జో స్నేహితు డన్నాడు :—

"మనం తొందరగా దీన్ని తవ్వి బయటకు తియ్యాలి. లోపల పొయ్యిదగ్గిర పార, పలుగు చూశాను ఇందాక. అవి పట్టుకొస్తానాగు," అని గబగబ వెళ్లి టామ్, హక్ లు ఇందాక అక్కడ పెట్టిన పార, పలుగు తెచ్చాడు.

ఇంజన్ జో పారకేసి దీక్షగా చూశాడు. అటు తిప్పాడు, ఇటు తిప్పాడు; ఏదో గొణుక్కున్నాడు. రెండు నిమిషాల్లో పారసహాయంతో పెట్టెని తీశాడు బయటికి. అదేమంత పెద్ద పెట్టె కాదు. దానికి చుట్టూ ఇనపబద్దలు కట్టివున్నాయి. ఒకప్పుడు చాల బలమైనదే ఆ పెట్టె. కాని, ఎన్నేళ్లనుంచి భూమిలో వుందో, ఇప్పుడు చెదలు పట్టి ఒక్క గుద్దుకు విరిగిపోయింది.

దాన్నిండా కొన్ని వేల డాలర్లున్నాయి.

"ముర్రెల్ గాడి ముఠా ఇదివరలో ఎప్పుడూ ఈ వేపునే తిరుగుతూ వుండేదట," అన్నాడు రెండోవాడు.

"వాళ్లే పాతిపెట్టివుంటారు యీ డబ్బు," అన్నాడు జో.

"ఇక ఇప్పుడు నువ్వు 'ఆపని' చెయ్యనవసరం లేదనుకుంటా."

"ఇదుగో నీకు నాసంగతి తెలియదు. 'ఆ పని' గూర్చి నీ కసలే తెలియదు. కేవలం డబ్బు దొంగిలించడానికి కాదు 'ఆపని' తల

(37-వ పేజీ చూడండి)

పూలసజ్జ



శ్రీ అయ్యగారి కనకం

పూర్వము హాలండులో జాకోబ్ అనే పిల్లవాడుండేవాడు. వానిని తల్లిదండ్రులు తోటమాలిగా ఒక రాజు తోటకు పంపిరి. అతని ప్రవర్తనకు మెచ్చి రాజాతనికి పెద్దవాడయిన తరువాత ఒక తోట, యిల్లు ఇచ్చెను. జాకోబ్ ఒక చక్కని యువతిని వివాహము చేసికొనెను. పాపము కొద్దిరోజులకే ఆమె ఒక చక్కని పిల్లను కని చనిపోయెను. ఆమె పూర్తిగా తల్లిని పోలియుండెను. ఆమెకు తండ్రి మేరీ యని పేరుపెట్టి మిక్కిలి గారాబముతో పెంచుచుండెను.

ఆమెకు పదిహేనేండ్లు వచ్చిన తరువాత వారిద్దరునుకూడా తోటలోని పూలమొక్కలను నమిత ప్రేమతో పెంచుచుండిరి. జాకోబ్ చుట్టుప్రక్కల పట్టణములలో తాను పెంచిన కూరగాయలు, పువ్వులు అమ్మి జీవితము గడుపుకొనెడువాడు. తీరికసమయములలో జాకోబ్ పేముతో చక్కని బుట్టలల్లుచుండెడివాడు. ఒకరోజున మేరీ పేమును తెచ్చుచు అందమైన పువ్వులుకూడా కోసికొని ఇంటికి వచ్చుచుండెను. దారిలో రాణి, ఆమె కూతురు అమీలియా షికారుకుపోవుచు మేరీచేతిలోని పువ్వులు చూచి తమకిమ్మని అడిగిరి. అవితీసుకుని అమీలియా, "రోజూ నాకిటువంటి పూలు తెచ్చిపెట్ట"మని అడిగెను. మేరీఅట్లే ప్రతిరోజు పువ్వుల నిచ్చుచుండెను. కొద్దిరోజులలోనే వారిద్దరు గాఢస్నేహితులైరి. మేరీ తన తండ్రితో ఒక చక్కని పూలసజ్జను అమీలియా పుట్టినరోజున బహుకృతిగా యియ్యదలచితినని చెప్పెను. తండ్రి సంతోషముతో ఆ సజ్జపై 'అమీలియా'అను అక్షరములు వచ్చునట్లెంతో అందముగ పేముతో అల్లెను. మేరీ అందు చక్కని పువ్వులు గుత్తులు గుత్తులుగా అమర్చి అమీలియా పుట్టినరోజున తీసికొని వెళ్ళి ఆమెకిచ్చెను. ఆమె, "ఇంత చక్కని వస్తువును నేనెప్పుడును చూడలేదు. మా అమ్మకి చూపుదము ర"మ్మని లోపలకు తీసికొని వెళ్లెను. రాణికూడా అది చూచి చాల సంతోషముతో అమీలియాను పక్కగదిలోనికి తీసికొని వెళ్లి ఆమెకేదైన చక్కని బహుమాన మిమ్మనెను. అమీలియా "ఆకుపచ్చరంగుపై చిన్నచిన్న పువ్వులు గల కొత్తగౌను తీసికొని ర"మ్మని జూలియట్ అను దాసితో చెప్పెను.

ఆ దాసి, "అబ్బ, ఎంత విలువగలదీ గౌను? ఈమెకు మేరీతో స్నేహ మెక్కువయిన నామాట వినదేమో," యనుకొని ఈ స్నేహమెట్లైన చెడుటకు మార్గము వెదుకదలచెను. అది "ఇప్పుడే గౌను మార్చెదరా?" అని అమీలియా

నడిగెను. "కాదు మేరీ కిచ్చెద" ననెను, "అమ్మగారితో చెప్పితిరా" యని మరలమరల అడుగుచుండ, అమీలియా విసుగుకొని ముందా గౌనిటు తెమ్మనెను. జూలియట్ తన కోవ మణచుకొని దొంగనవ్వు నవ్వుచు గౌను తెచ్చియిచ్చెను. అమీలియా మేరీకాగౌను నిచ్చి గుమ్మమువరకు సాగనంపెను.

మేరీ సంతోషముతో యింటికి వెళ్లి ఆ గౌను తండ్రికి చూపించెను. జాకోబ్ అది చూచి తల యూపుచు, "నీ వా పూలసజ్జ వాళ్ల కిచ్చుట పొరపాటు. ఈ గౌను నిజముగ అందమైనది, విలువ గలది; అయినను పరులకు దీనిని చూచిన మనసై యీర్ష్య జనించును. చూడు మేరీ! ఈ దుస్తులుకంటె విలువైనది సత్ప్రవర్తన," అని చెప్పుచుండగనే, అమీలియా పరిగెత్తుకొనుచు వచ్చి, "మేరీ! మా అమ్మ వజ్రపుటుంగరము పోయినది. ఉంగరమున్న గదిలో నీవు తప్ప ఇతరు లెవ్వరూ లేరు. నీవు దానిని తొందరగ యిచ్చినచో యింటికి పోవుదు" ననెను. మేరీ తెల్లబోయి నే నేమియు ఎరుగ ననెను. జాకోబ్ నిట్టూర్చుచు, "అమ్మాయీ! ఈ దేశములో ఉంగరమువంటి విలువైన వస్తువులు తీసినవారికి ఉరిశిక్ష విధింతురు. కావున నీవు తీసినచో యిచ్చివేయుము," అనెను. మేరీ ఏడ్చుచు "నే నా ఉంగర మెచ్చట నున్నదికూడ ఎరుగను. ఇతరుల తోటలో పువ్వుకూడ అడుగకుండ కోయని నేను ఆ ఉంగరము తీసితి నని నమ్ముచుంటివా?" యన్నది. అమీలియా, "నీవు తీయనిచో ఎవరు తీయుదురు? అది మా అమ్మకు మానాన్న నేను పుట్టి నప్పుడు బహుమతిగా నిచ్చెను. అది ఆమె పండగలు వచ్చినప్పుడు పెట్టుకొనును. ఇప్పుడు మా నాన్న అడిగిన ఏమి చెప్పను? నీవు తీయ లేదని నేను చెప్పినను ఎవరు నమ్ముదురు? ఛీ! నా పుట్టినరోజుపండగ ఎంత అసహ్యముగ తయారయి నది?" అని యేడ్చుచు ఇంటికి వెళ్లిపోయెను.



మేరీ తండ్రిపాదములదగ్గర కూర్చుని, "నాన్నా! నే నా ఉంగరము నిజముగ తియ్యలే" దనెను. జాకోబ్ "అమ్మా! అబద్ధ మెన్నటికి దాగదు. విచారింపకు" మనుచుండ రాజభటులువచ్చి, మేరీ నీవలకు లాగి, సంకెళ్లు వేసి, ఆమెను, తండ్రిని జైలుకు తీసుకొనిపోయిరి. ఈ వార్త తొందరగ ఊరంతయు ప్రాకిపోయెను. ప్రజలందరు "పాపం

వారెంత మంచివారు? అమాయకుల కెట్టి కష్టము కలిగిన" దని విచారించిరి. మేరీ, ఆమె తండ్రి ఆరాత్రి జైలులోనే గడిపిరి.

మర్నాడు ఆమెను విచారణకై కోర్టుకు తీసికొనివెళ్ళిరి. న్యాయాధికారి ఆమె ననేక ప్రశ్నలు వేసెను. అన్నిటికి మేరీ నిజమే నని సమాధానము చెప్పెను. కాని ఉంగరము మాత్రము తాను తీయలే దనెను. "ని చేతులలో ఉంగర మున్నపుడు చూచితి మనుచున్నారు. ఇప్పుడైన వప్పుకొందువా?'' అని అడుగుచు లోపలినుండిజూలియట్‌ను తీసుకొని వచ్చిరి. ఆమె ఎట్టి సందియము లేకుండ అబద్ధమాడుటకే నిశ్చయించి, మేరీవైపు తిరిగి "నీ చేతులో ఉంగరమును నేను చూచితి" నని సాక్ష్యము చెప్పెను.

మేరీ ఆమాటలు విని, "ఇదంతా వట్టి అబద్ధము. ఎందులకు నాపై అన్యాయముగా అబద్ధము చెప్పదువు? నీకు నే నేదైన అపకారము చేసితినా?" అని అడిగెను. జ్యూలియట్ మరింత గట్టిగ వినువారికి నమ్మకము కలుగునట్లు ఉంగరము మేరీయే తీసినదని చెప్పెను. జ్యూలియట్ సాక్ష్యముపై మేరీని దొంగగా నిర్ణయించిరి. న్యాయాధిపతి మేరీతో "నీవు దోషివని నిర్ణయించబడినది. ఇపుడైన నీవు ఉంగరము నేమి చేసితివో చెప్పు" మనెను. ఎన్ని విధముల అడిగినను ఆమె తనేమీ ఎరుగనని చెప్పుటచే ఆరోజులలో పద్ధతి ననుసరించి మేరీని రక్తమునచ్చునట్లు చితుగగొట్టిరి. అప్పుడుకూడా "నేను తియ్యలేదు" అని మాత్రమే చెప్పుచుండుటచే మేరీని మరల జైలులో వేసిరి.

మరుసాడు న్యాయాధిపతి ఆమెను చూచి, ఇప్పుడైన ఉంగరము తీసితినని వప్పుకొనినచో నిన్నేమియు చేయను. నీవు నీప్రాణములను లక్ష్యముచేయకపోయినను నీ ముసలితండ్రిప్రాణమునైన గమనించుము. ఊ! జాగ్రత్తగా ఆలోచించు. 'అవును అని అన్నచో చాలనెను. మేరీ న్యాయాధిపతితో, "నేను ఉంగరము తీసితి నని చెప్పిన మా ప్రాణములు రక్షించబడును. అయినప్పటికీ నేనబద్ధమునకెన్నడూ లొంగను. నన్ను చంపివేసినను సరే నా ముసలితండ్రిప్రాణములు మాత్రము రక్షించుడు" అనెను. ఆ మాటలు కోర్టులో వారినే కాక న్యాయాధిపతి హృదయమునుకూడ కలచివేసెను. కాని అత డేమియు మాట్లాడలేక మరల ఆమెను జైలులోనికి తీసుకొనిపొమ్మని సంజ్ఞ చేసెను. న్యాయాధిపతి జ్యూలియట్‌ను పిలిచి మరల విచారించెను. ఆమె పూర్వమువలెనే చెప్పుటచే మేరీని రక్షించుట కెట్టి ఉపాయమూ తోచక జాకోబ్‌ను పిలిచి "నీ కూతురికి నేను ఉరిశిక్ష విధించలేకపోవుచున్నాను. ఎట్లయినను ఆమెకు నచ్చజెప్పి ఉంగరమును తీసుకొనిర" మ్మని ఒక అధికారిని కూడ నిచ్చి జాకోబ్‌ను మేరీవద్దకు పంపెను. మేరీ తండ్రి అడిగిన ప్రశ్నలు విని భోరున ఏడ్చుచు "ఇప్పటికైన నన్ను నమ్మవా? నాన్నా! నా కా ఉంగర మెచ్చట నున్నదోకూడ తెలియదని" చెప్పెను. జాకోబ్ న్యాయాధిపతి వద్దకు వచ్చి, చేతులు జోడించి, "నా కూతురు నిర్దోషి" యని చెప్పెను. న్యాయాధిపతి నిట్టూర్చుచు, "నేనామె నిర్దోషి యని నమ్మినను సాక్ష్యము ననుసరించియే తీర్పు చెప్పవలె" ననెను.

తీర్పు చెప్పురోజున ప్రజలందరు గుంపులు గుంపులుగ కోర్టు చుట్టు మూగిరి. న్యాయాధిపతి తన పీఠము పైనుండి లేచి ''మేరీ చిన్నపిల్లయగుటచే యీమెకు ఉరిశిక్ష విధించుట లేదు. కాని ఈమె, ఈమె తండ్రి ఈ దేశములో నుండుటకు వీలు లేదు'' అని తీర్పుచెప్పెను. మరునాడు మేరీ జాకోబ్‌లు జైలు నుండి విడుదలచేయబడి వచ్చుచుండ జ్యూలియట్ వారిని పిలిచి, "మేరీ ఇదిగో నీవిచ్చిన పూలసజ్జ మా యజమానురాలు నీవంటివారి వస్తువుల నుంచుకొనుట కిష్టపడదు.'' అని చెప్పి పూలసజ్జ నామెమీదకు విసిరి వేసి లోపలకు పోయెను. మేరీ ఏడ్చుచు ఆసజ్జ తీసుకొని తండ్రితోకూడ నెమ్మదిగా నడచి దేశము సరిహద్దులలోనికి వచ్చెను. ఇక నడువలేక ఒక చెట్టు నీడను, తమప్రాణములను కాపాడమని దేవుని ప్రార్థించుచు కూర్చుండిరి. ఆంటోని అను వేటకాడు వీరిని చూచి ''జాకోబ్! మిమ్ములను భగవంతుడు రక్షించుగాక! మిమ్ము దేశమునుండి వెడలగొట్టిరనువార్త నిజమేనా?" యని యడిగెను. వారు నిజమే యనగా ఆ వేటకాడు జాలిపడి కొంత ధనమును వారికి యిచ్చెను. జాకోబ్ ఆతని దయకు కృతజ్ఞత తెలుపుచూ

డబ్బువద్దనెను. ఆంటోనిబలవంతము చేసి డబ్బు వారి కిచ్చి తనదారిని తానుపోయెను. జాకోబ్ మేరీతో అమ్మా! చూచితివా? భగవానుడు మన కీ పాతస్నేహితుని చూపి ఎట్లు సహాయపడినాడో ?" అనెను. దైవమే తోడుగా వారలా అరణ్యము వెంబడి వెళ్లిరి. ఆంటోనీ యిచ్చిన డబ్బు అయిపోవుటచే పాపము వారు ముష్టియెత్తుకొనుచుండిరి. ఎచ్చటకు వెళ్లినను తిట్టువారేకాని పెట్టువారులేరు. ఇట్లుండ జాకోబ్ కుజబ్బుచేసి మాటలేకుండా పడిపోయెను. మేరీఏడ్చుచు ఎవరైనా సహాయముచేయుదురేమో యని అట్లే ఏడ్చుచు ఒక రైతు ఇంటికి వెళ్ళి తమ దీనావస్థ చెప్పుకొనెను. రైతు, ఆతని భార్య ఆమెను చూచి జాలిపడి పాలు, నీళ్లు తీసుకొని జాకోబ్ ఉన్నచోటుకు వెళ్లిరి. వేడిపాలు యిచ్చుటచే కొంచెము సేపటికి జాకోబ్ లేచి కూర్చుండెను. మేరీ యెంతయో ఆనందపడెను.

ఆరైతు వారిని తమ యింటికి తీసికొనివెళ్ళి వారి కొకగది నిచ్చెను. జాకోబ్ క్రమక్రమముగ ఆరోగ్యవంతుడయ్యెను. పూర్వమువలెనే మేరీ పేము తెచ్చి తండ్రి కిచ్చెను. జాకోబ్ ఒక చక్కని సజ్జ నల్లి కృతజ్ఞతాచిహ్నముగ రైతుభార్య కిచ్చెను. జాకోబ్ ఇక ఎక్కడికైనా వెళ్లిపోయెద మన్న ఆరైతు, ఆతని, భార్యకూడా అంగీకరించలేదు. కాని పాపము కొద్దిరోజులకే జాకోబ్ నకు మరల జబ్బుచేసెను. వైద్యుని పిలిపించిరి, కాని లాభము లేకపోయెను. జాకోబ్ మేరీని దగ్గరకు పిలిచి, "అమ్మా! నేను ఇక బ్రతకను. అయినను నేను చనిపోవుదునని నీవు విచారించకు. భగవంతుడు నీకు తప్పక సహాయపడును. ఆతనికి తెలియని రహస్యము లుండవనిమాత్రము మరచిపోకు" మని చెప్పి కన్నులు మూసెను. పాపము మేరీ ఎన్నడూ చనిపోవు వారిని చూడకపోవుటచే ఇంటిలోని వారినందరను పిలుచుకొని వచ్చెను. వారు జాకోబ్ చనిపోయినాడని చెప్పగా విని ఆతనికొరకై ఎంతగనో దుఃఖించెను. తరువాత ఆమె తన తండ్రి సమాధివద్ద నున్న చెట్టు కొమ్మకు తమ కష్టములకు కారణమైన పూలసజ్జను కట్టెను.

రైతు ముసలివాడగుటచే ఆతని కుమారునకు పెళ్లి చేసి ఆస్తి అంతయు ఆతనికి వప్పగించెను. ఆ పిల్ల వట్టి గయ్యాళియై ముసలి వారలను అష్టకష్టములు పెట్టుచుండెను. మేరీకికూడ అక్కడ నుండుట చాల కష్టమయ్యెను. ఒక రోజున రైతుకోడలు విలువైన చీర నొకదానిని ఎండలో ఆరవేసెను. సాయంత్రమున కా చీర కన్పించకపోవుటచే మేరీయే తీసినదని తిట్టసాగెను. తాను తియ్యలేదని మేరీ చెప్పెను. "నీవు ఉంగర మెత్తుకు వచ్చిన దొంగవని నాకు తెలియదనుకుంటివా? తక్షణము నాయింటి నుంచి వెళ్లిపొమ్మనెను. మేరీ ఆ మాటలు భరించలేక ఆ రాత్రికి రాత్రే ముసలిరైతు, ఆతని భార్య వద్దకు వెళ్లి! "వెళ్లిపోవుచున్నాను, సెలవి" మ్మని అడిగెను. వా రామెకు కొద్దిగ డబ్బు యిచ్చి "భగవంతుడు నిన్ను రక్షించును." అని దీవించి పంపిరి. మేరీ ఎక్కువ దూరము వెళ్లకుండగనే "మేరీ, మేరీ," యను కేకలు వినబడెను. ఆ కేకల కామె భయపడి అట్లే నిలబడిపోయెను. "నీవు నన్ను మరచిపోయితివా ? భయపడకుము. నేను నీకు సహాయము చేయుటకై వచ్చితి" నను మాటలు వినబడెను. ఆనాడు వెన్నెల బాగాయుండుటచే మేరీ అమీలియాను గుర్తుపట్టి ఆశ్చర్యముతో," అమీలియా నీవిచ్చటి కెట్లు రాగలిగితివి? అని యడిగెను. "మేరీ! మేము మీ కెంతో అపకారము చేసినాము. ఇప్పటికి నీవు నిర్దోషివని తెలిసినది. మే మొనర్చిన అన్యాయమునకు మమ్ము క్షమింతువా ?" అనెను.

"అమీలియా! నీ వట్లెన్నడూ అనుకొనకుము. కాని పూర్వము మాపై అన్యాయముగ నేరారోపణ చేయబడుటచే నేను చాల బాధపడి ఎప్పటికైనా పరమేశ్వరుడు నిజమును తెలియజేయకుండునా, అనుకొనెడిదానను. అది నేడు నెరవేర్చినా" డనెను.

అమీలియా మేరీని కౌగలించుకొని ఒక రాతిపై కూర్చుండబెట్టి "నీవు నిర్దోషివని తెలిసినప్పటినుంచి నా తలిదండ్రులు నీకై ఎంతగనో వెదికించిరి. కాని మీ జాడ తెలియ

లేదు. రెండురోజులనుండి నేను మిమ్మలను వెతుకుచుండ ఈ చెట్టు కొమ్మకు గట్టిన పూలసజ్జ కన్పించినది. ఇది చూచి మీ తండ్రి చనిపోయెనని ఊహించుకొంటిని. మీ కీ దశ కల్గుటకు కారణము జ్యూలియటే. నిన్ను నానుండి విడగొట్టనిచో తన మాట విననని అట్లు చేసినది. అప్పటికి ఆ అబద్ధముతో ఆమె విజయము గాంచినది. ఆమె ఆనాడు నిన్ను వెక్కిరించుచు పారవేసిన పూలసజ్జయే నేడు మనము మరల కలసికొనుట కాధార మయినది. మేరీ! నీ వీ యర్ధరాత్రి ఇక్కెందుకు వచ్చుచున్నా" వని అమీలియా అడిగెను. రైతుకోడలి క్రూరత్వమంతయు మేరీ చెప్పెను.

"ఇదికూడ మనము మరల కలసికొనుటకై భగవంతుడు చేసిన ఏర్పాటు. నిన్ను యింటినుండి వెడలగొట్టి ఆమె నీ కెంతయో ఉపకారము నొనర్చిన" దని చెప్పుచు, అమీలియా ఆ పూలసజ్జను తీసికొని మేరీతో కోటవైపు బయలుదేరెను. దారిలో అమీలియా మేరీతో ఇట్లు చెప్పెను. "మీరు వెళ్ళిన కొద్దిరోజులకు పెద్ద తుపాను వచ్చి మా దొడ్లో నున్న చెట్టు పడిపోయినది. దానిపై నున్న పక్షిగూడు తెచ్చుకొనుటకై మాతమ్ము లచ్చటికి వెళ్లి తళతళ మెరయుచున్న ఉంగరమును తెచ్చి మా అమ్మ కిచ్చిరి. అది కని జ్యూలియట్ కొయ్యబారిపోయెను. ఆ సంగతి గ్రహించి మా తండ్రి జ్యూలియట్‌ను పిలిచి నీవు ఉంగరము మేరీ చేతులో నున్నపుడు చూచితినని చెప్పి అన్యాయముగ దేశమునుండి వెళ్లగొట్టించితివా? పాపిష్టి!'' యని ఆమెను వెంటనే జైలులో పెట్టించెను.''

ఇంతలో తెలతెలవారుచుండెను. అమీలియా ఒక చేతిలో పూలసజ్జను మరొకచేతిలో మేరీ చేయి పట్టుకొని కోటలోపలికి ప్రవేశించెను. రాజు, రాణి ఆమెను చూచి ఎంతో ఆనందమొందిరి. రాణి తన ఉంగరమును మేరీ వేలికి పెట్టెను.

మేరీ నింతవరకు కాపాడిన రైతు దంపతుల యింటికి వెళ్లి మేరీతో కూడ ఆమె తండ్రి తోటలో నుండమనిరి. రైతుకోడలు నిన్న తనచే తిట్లు తినిన మేరీ అదృష్టమున కసూయపడెను. మేరీ రైతుదంపతులతో కలిసి తన తండ్రితోటలో నివసించుచుండెను. ఒకరోజున ఒక ముసలి మతాధిపతి మేరీవద్దకు వచ్చి "నిన్ను చావుకు సిద్ధముగా నున్న ఒక అమ్మాయి చూడవలెననుచున్న'' దనెను. మేరీ వెంటనే మతాధిపతితో వెళ్లి జ్యూలియట్‌ను చూచెను. జ్యూలియట్ పశ్చాత్తాపపడుచు, "మేరీ! నేను మహాపాపిని. నేనుచేసిన దాని ఫలిత మిప్పుడనుభవించుచున్నాను. నన్ను క్షమించు,'' అని ఏడువసాగెను. మేరీ ఆమెతో, "జ్యూలియట్! నీవేడువకు, నిన్నెప్పుడో క్షమించితి'' ననెను. రాణివద్దకు వచ్చి జ్యూలియట్‌కు సహాయముచేయమని కోరెను. రాణి అట్లే యని మందులు ఆహారము పంపించెను. కాని జ్యూలియట్ తాను చేసిన తప్పుకు బాధపడుచు మరణించెను.

తరువాత ఒకరోజున మేరీ, అమీలియా తోటలో తిరుగుచుండ న్యాయాధిపతి అచ్చటకు వచ్చి అమీలియాకు నమస్కరించి మేరీతో మాట్లాడుట కనుజ్ఞ నిమ్మని అడిగెను. న్యాయాధిపతి మేరీతో "జ్యూలియట్ సాక్ష్యము నమ్మి నీకు శిక్ష విధించినందులకు నే నెంత విచారించుచున్నానో దేవునికే తెలియును. నేను నీ కేదైన సహాయము చేయనిచో ప్రశాంతముగ మరణించలేను. నా కొడుకు ఫ్రెడరిక్కు చాల యోగ్యుడు; అందమైనవాడు; విద్యావంతుడు; నిన్నాతని కిచ్చి వివాహము చేయవలెనని అనుకొనుచున్నాను. నీ వాలోచించి నా కోరిక నెరవేర్చు" మనెను.

మేరీ తనకు తల్లిదండ్రులుగా భావించుచున్న ముసలి రైతుదంపతుల వద్దకు వెళ్ళి జరిగినసంగతి చెప్పెను. అమీలియా వలన యీ వార్తను రాజు, రాణి తెలిసికొని తమ కూతురుకు వివాహము చేసినప్పటికంటె ఎక్కుడానందముతో మేరీని న్యాయాధిపతికొడుకగు ఫ్రెడరిక్కు కిచ్చి మహావైభవముతో వివాహ మొనర్చిరి. మేరీ తన భర్తతో ఇట్లు చిరకాలము సుఖముగ జీవించెను. ★

[ఆంగ్ల కథ ననుసరించి]

టామ్ సాయర్

(31-వ పేజీ తరువాయి)

పెట్టింది; పగ తీర్చుకోటానికి. నువ్వు నాకు సహాయం చెయ్యాలి. తర్వాత టెక్సాస్‌కు పారిపోదాం. ఈలోగా నువ్వు మీయింటికి పో. నేను కబురుచేసినప్పుడు వద్దువుగాని," అన్నాడు జో.

"సరే, నీ యిష్టం. ఈడబ్బు నేం చేద్దాం? పాతిపెడదామా మళ్లీ?"

"ఊఁ...(మేడమీద పరమ సంతోషం) అహ - వద్దు... (మేడమీద నిరాశ) మర్చేపోయా ఈ సంగతి. ఆ పారకి తడిమట్టి వుంది; యిందాక చూశాను. (టామ్, హక్‌ల గుండెల్లో బండరాళ్లు) ఆ పార, పలుగు ఎవరివి? ఇక్కడెందుకున్నాయి? ఆ తడిమట్టి ఎందుకుంది? అవి తెచ్చిన వాళ్ళెక్కడికి పోయారు? ఈ డబ్బు ఇక్కడ పాతిపెట్టి పోతే, ఆ మనుషులెవరో వచ్చి చూస్తారు. ఇక్కడ నేల కొత్తగా తవ్వినట్టు కనిపిసుంది. కనక, అది మంచిది కాదు. దీన్ని నాతో తీసుకుపోతాను" అన్నాడు ఇంజన్ జో.

"అవును సుమా! నే నీ సంగతి నాలోచించనే లేదు. అయితే ఎక్కడ దాస్తావు. నంబర్ ఒకటిలోనా, నంబర్ రెండులోనా?"

"నంబరు ఒకటి అందరికీ తెలిసిందే. నంబరు రెండులో 'శిలువ' కింద దాస్తాను."

"ఆల్ రైట్ చీకటి పడింది; పోదాం పద."

ఇంజన్ జో లేచి కిటికిటికీలో నుంచీ జాగ్రత్తగా బైటికి తొంగి చూశాడు.

"ఎవరు తెచ్చివుంటారు వాటిని? ఒకవేళ వాళ్లు మేడమీద వున్నారేమో?"

టామ్, హక్‌ల గుండెలు ఒక క్షణం ఆగిపోయాయి. భయంతో ముచ్చెమటలు పోశాయి.

ఇంజన్ జో కత్తితీసి పట్టుకున్నాడు. ఒక నిమిషం సేపు సందేహిస్తూ నుంచున్నాడు. చివరికి మెట్లెక్కడానికి బయిల్దేరాడు. పిల్లలు ఎక్కడన్నా దాక్కుందామనుకున్నారు. కాని, లేవడానికి బలం చాలక పడుకున్నవాళ్లు పడుకున్నట్టే వుండిపోయారు. మెట్లమీద ఇంజన్ జో అడుగులు భయంకరంగా ధ్వనిస్తున్నాయి. ఆ అడుగులు తమ గుండెలమీదే పడుతున్నట్టు అనిపించింది. ఇక భరించలేక పక్క గదిలోకి పారిపోదామనుకుంటున్నారు. ఇంతలోకే "ఫెళ ఫెళా" మని ఉరుములు ఉరిమినంత చప్పుడైంది. అసలే ఊగులాడుతూ చికిచివికి వున్న ఆపాతకొయ్యమెట్లు ఇంజన్ జో బరువుకి ఆగలేక ఫెళఫెళమని విరిగిపోయాయి. గుమ్మడికాయ పడ్డట్టు జో నేలమీద పడ్డాడు. బూతులు తిట్టుకుంటూ లేచి వళ్లు దులుపుకున్నాడు. వాడి స్నేహితుడిలా గన్నాడు—

"ఎందుకూ యీ శ్రమంతా? మేడమీద ఎవరన్నా ఉంటే ఉండనీ, మనతో పోట్లాటకి తయారవుతారా రానీ, ఇంకో పదిహేను నిముషాల్లో బాగాచీకటిపడుతుంది అప్పుడు వాళ్లు మన్ని వెంబడిస్తే వెంబడించనీ. నా ఉద్దేశ్య మేమిటంటే, ఈ చుట్టు పక్కల ఎవరన్నా మన్ని చూసివుంటే దయ్యాలనుకుని ఈపాటికే పారిపోయి వుంటారు."

జో కాస్సేపు గొణిగాడు ఏదో. తరువాత ఇద్దరూ తమ వస్తువులు తీసుకుని మెల్లిగా ఇంటిఇవతల కొచ్చి నదికేసి నడిచిపోయారు.

టామ్, హక్‌లు లేచారు. నీరసంగా వున్నారు. కాని, భయం మాత్రం పోయింది. సంజచీకట్లో నడిచిపోతున్న దొంగ లిద్దరి కేసీ నిరాశతో చూశారు. వెంబడించాలన్న ఆలోచన మానుకున్నారు. ఎల్లాగైతేనేం కష్టపడి మేడమీంచి కాళ్లుచేతులు విరక్కుండా దిగారు. ఆ పార, పలుగు అక్కడ పెట్టినందుకు తమ తెలివితక్కువని తామే నిందించుకున్నారు. అవిగనక అక్కడ పెట్టివుండకపోతే ఇంజన్ జో అనుమానించకుండా యావత్తు డబ్బును ఇంట్లోనే పాతిపట్టేవాడు. మళ్లీవచ్చి చూసుకునేసరికి ఏమీ కనుపించక గుండెలు బాదుకునేవాడు. ఛ! ఛా! ఆ పార, పలుగు ఎందుకు తెచ్చారు అక్కడికి?

పగ తీర్చుకోవటానికి మళ్ళీ ఒకసారి ఊళ్లోకి వస్తానన్నాడుగా ఇంజన్ జో. అందుచేత వాడిమీద ఒక కన్ను వేసివుండటానికి, 'నంబర్ రెండు' ఏమిటో కనిపెట్టడానికి నిశ్చయించారు వాళ్లు. ఇంతలో ఒక భయంకరమైన ఆలోచన తట్టింది టామ్‌కి.

"పగ! పగ అంటే మనమీదనే నేమో?" అన్నాడు.

"అయ్యబాబోయ్! అయితే చచ్చామన్నమాటే," అన్నాడు హక్. అతడికి మూర్ఛపర్యంతం అయింది.

ఇంజన్‌జో పగబట్టింది తమమీద కాదనుకోటానికి ప్రయత్నించారు వాళ్లు. కనీసం టామ్ ఒక్కడిమీదే పగ తీర్చుకోదలచాడేమో ననుకున్నారు. ఎందుకంటే హంతకుడిమీద సాక్ష్యమిచ్చింది టామ్ ఒక్కడేగా.

అంటే టామ్ ఒక్కడే ఇంజన్‌జో అపాయంలో పడ్డాడన్నమాట. ఇది టామ్‌కి బొత్తిగా ఇష్టంలేదు. అపాయంలోనైనా మరొకడు తోడుగా వుంటే కాస్త ధైర్యంగా వుంటుంది.

ఇద్దరూ ఇళ్లకు చేరుకున్నారు. ఆరోజున తాము చేసిన సాహసకృత్యాల గడబిడతో వాళ్లకి నిద్ర సరిగా పట్టలేదు. టామ్‌కు అన్నీ పీడకలలే వచ్చాయి. కనీసం నాలుగుసార్లయినా 'గుప్తధనం' టామ్‌కు దొరికింది. కాని నాలుగుసార్లూ కళ్లు తెరిచీ తెరవడంతో ఆ ధనంకాస్తా హరించుకుపోయి, వట్టి చేతులు మాత్రం మిగిలాయి.

తెల్లవారి లేచాక నిన్న జరిగిన విశేషాలన్నీ మరోలోకంలో జరిగినట్టు దూరమైపోయాయి. అందుచేత అదంతా కల అయివుండాలని టామ్ అనుకున్నాడు. అది కల అని చెప్పడానికి ఒక బలమైన కారణం వుంది. ఎందుకంటే టామ్ దృష్టిలో అన్నివేల డాలర్లు ఒక్కసారిగా మానవమాత్రుడికి కళ్లబడటం అసంభవం. అసలు అతడు యాభై డాలర్లుకూడా ఎప్పుడూ ఒకచోట చూడలేదు. అల్లాంటిది కొన్నివేల డాలర్లు కనిపించాయంటే ఎవరు నమ్ముతారు?

టామ్‌కి, అతనితోటి పిల్లలందరికిమల్లేనే డబ్బునుగూర్చి కొన్ని వింత ఊహ లున్నాయి. పెద్దవాళ్లు 'వెయ్యి డాలర్లు', 'లక్ష డాలర్లు' అనుకొంటుంటే విన్నప్పుడల్లా వాళ్లు ఊరికే సరదాకి అనుకొంటున్నారని అతని ఊహ. అన్ని డాలర్లు భూలోకంలో ఉండటానికి వీలే లేదని అతని వాదన. కనుక, నిన్న జరిగినదంతా కలే అయి వుండాలని తీర్మానించుకున్నాడు.

కాని, అది నిజంగా కలే అయితే మళ్ళీ మళ్ళీ జ్ఞాపకానికి వచ్చి ఎందుకు బాధపెడుతుంది? నిన్న జరిగిన విశేషాలు ఒకదానితరవాత ఒకటిగా టామ్‌కళ్లఎదుట నాట్యం చెయ్యసాగాయి. ఇక ఈ సందేహావస్థని భరించలేక అటో ఇటో తేల్చుకోవా లనుకున్నాడు, హక్ కోసం వెదికాడు.

హక్ నదిఒడ్డున పడవలో కూర్చుని కాళ్లు నీళ్లలోపెట్టి గిలగిల కొట్టుకుంటున్నాడు. వాడి మొహంలో విచారం గూడుకట్టుకుని వుంది. టామ్ తను ముందుగా అడగకూడదనీ, హక్ ముందుగా తనంత తానే ఆ విషయం ఎత్తితే సరే సరి లేకపోతే కలకిందే జమకట్టాలనీ అనుకున్నాడు.

"హల్లో, హక్!"

"హల్లో, టామ్!"

కాస్సేపు ఇద్దరూ మౌనం.

"టామ్! ఆ వెధవ పార, పలుగు 'చచ్చిన చెట్టు' దగ్గిరే వదిలేసి వెడితే ఎంత బాగుండిపోను? ఆ డబ్బు చేతికి చిక్కీకూడా జారిపోయింది గదా!" అన్నాడు హక్.

టామ్:—"అయితే అది కల కాదన్నమాట. కల అయితేనే బావుండు ననిపిస్తోంది హక్!"

హక్:—"కలేమిటి?"

టామ్:—"అదే నిన్న జరిగిందంతా కలేమో ననుకున్నా."

హక్:—"కలా? ఏం తెలివైనవాడివిరా టామ్! ఆ మెట్లు సమయానికి విరగకుండా వుంటే తెలిసేది అది కలో నిజమో. రాత్రంతా ఆ చచ్చినాడే వచ్చాడు కలల్లోకి."

టామ్:—"ఇంజన్‌జో చస్తే మనకేం లాభం? వాణ్ణి వెదికి కనుక్కోవాలి. ఆ డబ్బు నేలాగైనా కొట్టెయ్యాలి."

హక్:—"మనం వాణ్ణి ఈ జన్మలో కనుక్కోలేం. డబ్బు అసలే దొరకదు. నిన్న మన చేతిదాకా వచ్చి జారిపోయింది. ఇక మళ్ళీ రాదు."

టామ్:—"ఏమైనా వాడెక్కడుంటాడో కనుక్కోవాలి. ఆ 'నంబర్ రెండు' ఎక్కడో తెలుసుకోవాలి."

హక్:—"నంబర్ రెండు! ఆ అవును అదే. కాని ఎల్లా తెలుస్తుంది అదెక్కడో?"

టామ్:—"అది ఇంటి నంబరేమో?"

హక్:—"ఈ ఊళ్లో ఇళ్లకి నంబర్లు లేవుగా."

టామ్:-"నంబర్లంటే మన పని తేలికయ్యేది; వెధవపూరు. ఆగు, కాస్త ఆలోచించనీ—...ఆ, అది ఏదో గదినెంబరు; మన వూళ్లో హోటలులో గది కావచ్చు."

హక్:- "కావచ్చు. ప్రయత్నించి చూద్దాం."

టామ్:-"నువ్వొక్కడే ఉండు హక్! నేను వెళ్లి చూసొస్తాను." టామ్ ఒక్కడే వెళ్లాడు. వీధుల్లో హక్‌తో కలిసి అందరూ చూస్తుండగా తిరగటం టామ్ కిష్టంలేదు. అరగంటసేపైన తర్వాత తిరిగి వచ్చాడు. తను కనుక్కున్న విషయాలు హక్‌కి చెప్పాడు.

ఊళ్లో రెండు హోటళ్లున్నాయి. ఒకటి పెద్దది. అందులో రెండో నంబరు గదిలో చాలరోజుల్నించీ ఒక ప్లీడరు ఉంటున్నాడట. చిన్న హోటలుకి వెళ్లి కనుక్కోగా రెండో నంబరు గదిలో ఎవరో వుంటున్నారని తెలిసింది. కాని, ఆ మనిషిఎవరో హోటలు యజమానికికూడా తెలియదట. ఎప్పుడూ గదికి తాళంవేసి వుంటుందట. రాత్రిళ్లుమాత్రం ఎవరో వస్తారట. లైటు కనిపిస్తుందిగాని, మనిషి కనిపించడట. అందుచేత ఆ గదిలో దెయ్యాలు తిరుగుతున్నాయని అనుకుంటున్నారట.

హక్ ఈ కథంతా నోరు తెరుచుకుని ఆశ్చర్యపోతూ విన్నాడు. ఆ గదిలోనే ఇంజన్‌జో ఉంటున్నాడని ఇద్దరూ ఒక నిశ్చయానికి వచ్చారు. ఇక తరువాత కార్యక్రమ మేమిటీ అని ఇద్దరికీ సమస్య పట్టుకుంది. ★

గాంధీజీ దీక్ష

(27 వ పేజీ తరువాయి)

పడ్డది ఎంతగానో. చివరికి భగవంతుడిమీద భారం పారేసి, "రామ రామ" అంటూ తొందరగా ఆ వూరు చేరుకుంది. ఐతే, ఆ ఇంటివాళ్లు అదేదో రాయనుకుని వీధిలో పారేశారు. అది వెతికి తీసుకొని, మళ్ళీ "రామరామ" అంటూ బయల్దేరింది! 'ఈ రోజు గాంధీజీకి సేవ చెయ్యటానికి వీల్లేకపోయింది గదా, అని ఎంతగానో బాధపడ్డది. భగవంతుడి దయవల్ల ఏ ఆపదా లేకుండా గాంధీజీవున్నవూరు వొచ్చి గాంధీజీ ముందర, రాయినిపెట్టి, వొక్కసారిగా ఏడ్చింది. గాంధీజీ కొంచెంగా నవ్వేరు. "నేను మొదటే చెప్పలేదు మనూ! నాతో వేగలేవని! చాలాకష్టం! 'ఐతే, నీమీద నాకు ప్రేమ లేక వొంటిగా పంపలేదు., అలా చేస్తేమళ్లీ ఈ జన్మలోకి ఏ వస్తువునూ మరిచిపోలేవు" అన్నారు.

మనూ అంది "బాపూజీ! ఈ రోజు మాత్రమే మీ దయవల్ల రామనామస్మరణ మనస్ఫూర్తిగా చెయ్యగలిగేను."

"మనిషికి దీక్ష వుండాలి. ఈ రాయి నాకు అనేక సంవత్సరాలుగా పని చేస్తోంది. జైల్లోవున్నా, భవనంలో వున్నాకూడా ఇది నాతో నేవుండేది. అందుకే నాకు దానిమీద ప్రేమ" అన్నారు బాపూజీ.

మనూగాంధీ చాలా సంతోషపడింది. మళ్ళీ ఆయన అన్నారు—

"ఎవరన్నా వొకసారి తప్పు చేస్తే, దానికి ప్రాయశ్చిత్తం అనుభవించాలి. అనుభవించిన తర్వాత, మళ్లీ ఆ తప్పు చెయ్యరు-"

[మనూగాంధీ రాసిన, 'బాపూజీస్ ధరోనెస్' అనేవ్యాసాన్ననుసరించి]

ఇండొనీషియా విప్లవ చిత్రకారుడు అఫాండీ

(23-వ పేజీ తరువాయి)

రూపములనుగూర్చి తన మనస్సుకు తెలియగల వివరము లన్నియు అందు ప్రవేశపెట్టడు.

వర్ణముల విషయములో సైత మాతడు ఇంద్రధనస్సులోని ఏడు వర్ణములకు మించి తన చిత్రములలో ప్రయోగించడు. అందును ఈతనికి పసుపు, ఆకుపచ్చ అభిమాన వర్ణములు. ఈ రెండు ముఖ్య సూత్రముల నాధారముగా జేసుకొని రచించినవి కనుకనే ఆతని చిత్రములలో మిట్టమధ్యాహ్నపు సూర్యబింబము నీలివర్ణపు వలయముగాను, గాలి తాకిడికి కంకులువంచి వూగుచున్న వరిపైరు సువర్ణ తరంగమాలికగాను, నడి వేసంగిలో భూమి పొగలెగయుచున్న పెనముగాను చిత్రితములైనవి.

నేటిపరిభాషలో 'ఇంప్రెషనిజమ్' అనబడు రచనాశైలిని అభిమానించి ఈతడు కొనసాగించునది ఇండొనీషియా చిత్రకళా సాంప్రదాయములో ఒక విప్లవం.

పాశ్చాత్య చిత్రకారులలో విప్లవకారుడుగా ఎన్నబడుచున్న 'వాన్‌గాగ్'తో నీతని చిత్రములను విమర్శకులు పలువురు పోల్చియున్నారు. పోలికలుజూపి చిత్రకారుల ప్రావీణ్యతను కొలుచుటపొరపాటు. 'వాన్‌గాగ్' రచనాశైలి ఇతనికి నచ్చినదన్నంత మాత్రముచేత, నీతడు 'వాన్‌గాగ్' శైలియే తన పరమావధిగా నిర్ణయించుకొనెననుట తగదు. చిత్రకళలో ఇతడు సాధింపజూచిన విప్లవము చిత్రితములైన ఇతివృత్తముల వరకేకాని, చిత్రించు శైలిలో మాత్ర మితడు విదేశీసంప్రదాయమునే ఇప్పటివరకు పాటించి యున్నాడు. ప్రాచీన సాంప్రదాయమును వదలి ఇతడు 'ఇంప్రెషనిజమ్'ను చేపట్టినట్లే, కాలక్రమములో తన సాధనవలన ఒకానొక విశిష్ట సాంప్రదాయమును నిర్మించవచ్చునేమో!

సినిమా:

జానపద చిత్రాలు

"శ్రీ సదాశివ"

"అనగా, అనగా ఒక రాజు. ఆ రాజు వేటకి వెళ్లాడు. దాహం వేసింది. ఏట్లోపడ్డాడు. బారెడు తలవెంట్రుక నీళ్లలో కొట్టుకొచ్చింది. ఆ తలవెంట్రుక గల పిల్లని పెళ్లాడాలని బయలుదేరాడు" ఇత్యాది కథల్ని చిత్రాలుగా నిర్మిస్తే, జానపద చిత్రాలంటున్నారు—

ఈ చిత్రాల్లోని కథలకు, ఆధారం బృహత్కథ, కథాసరిత్సాగరం, కాశీ మజిలీలు, అరేబియన్నైట్సు మొదలైనవి ఈ కథలు. అసహజమైన సంఘటనలతోను, అస్వాభావికమైన సన్నివేశాలతోనూ, అభూత కల్పనలతోనూ నిండి, జన బాహుళ్యానికి, ముఖ్యంగా పిల్లలు, స్త్రీలు, చదువు సంస్కారాలు లేని జానపదులకు చాలా వినోదం కలిగిస్తాయి.

ఇంట్లో పిల్లలు అల్లరి చేస్తుంటే, తీరికగా కూర్చున్న ఏ ముసలమ్మో ఆ పిల్లల్ని "కథ చెబుతాను రండర్రా" అని పిలిచి-యీ అభూతకల్పనల కథ ప్రారంభిస్తే, ఆ పిల్లలందరు మంత్రముగ్ధుల్లాగ వింటూ కూర్చుంటారు. ఇరుగు పొరుగు స్త్రీలందరు ఒకచోట చేరి, వారూవారూ విన్న కథలు చెప్పుకుంటూ కాలం వెళ్లబుచ్చుకుంటారు. గ్రామాల్లో రచ్చ రాళ్లమీద కూర్చుని తీరికగలిగినప్పుడు శ్రమజీవులు, రైతులు అన్యోన్యం కథలు చెప్పుకుని ఆనందిస్తారు.

పైన చెప్పబడిన దృశ్యాలు అందరికీ తెలిసినవే! యీ విచిత్రకథలు పిల్లల్ని, స్త్రీలని, గ్రామీణుల్ని హెచ్చుగా రంజింపచేస్తాయి.

ఈ కథల్లో కొన్ని నీతులు, నియమాలు ఉండకపోవు. మాతృభక్తో, పితృభక్తో, సతీత్వమో, సాహసమో యేవో కొన్ని ఉత్తమ గుణాలు నిరూపించబడతాయి. అయితే, విద్యావంతులు, పత్రికలు యీ కథల్ని "పుక్కిటికథ" లని తిడుతూనే చూస్తున్నారు. ఏమంటే, "స్వభావలో ఆ చిత్రాలే యెక్కువగా వస్తాంటే చూడక యేం చేస్తామం"టారు. విజ్ఞాన ప్రబోధకమైన సాంఘిక చిత్రాలు తియ్యకూడదా అని నిర్మాతల్ని తిడతారు. విజ్ఞానం కోరేవారంతా విజ్ఞానవంతులే. జానపదులు తమ సొమ్ము వెచ్చించి వినోదం కొనుక్కుంటారు గాని, విజ్ఞానాన్ని చిత్రాల ద్వారా కొనుక్కోడానికి అంగీకరించరు.

ఈ రోజుల్లో "యీ జానపద చిత్రాల వెర్రి యెప్పుడు తగ్గుతుంది?" అనే ప్రశ్న అటూ యిటూ కూడా అందరూ అడుగుతున్నారు. అంటే, చదువు, సంస్కారము ఉన్న ప్రేక్షకులు, పత్రికలు, జానపద చిత్రాలు తీసేవెర్రి నిర్మాతలకి యెప్పుడు తగ్గుతుందని ప్రశ్నిస్తున్నారు.

జానపదచిత్రాలు చూసేవెర్రి ప్రేక్షకులకి యెప్పుడు తగ్గుతుందని నిర్మాతలు ప్రశ్నిస్తున్నారు. మొత్తంమీద యీ వెర్రి అటూ యిటూ కూడా అందరికీ తగ్గుతుంది ఎప్పుడు? ఈ విచిత్ర, వినోద కథలు— వీనిలో కనిపించే విచిత్ర దృశ్యాలు చెల్లిపోయినప్పుడు. అంటే-తామిదివరలో చూసిన సన్నివేశాలు, విచిత్రదృశ్యాలు (*Trick Scenes*) మళ్ళీమళ్ళీ చిత్రాల్లో కనిపిస్తే ప్రేక్షకులు వినోదమనుభవించలేరు. ఇదివరలో పురాణకథలు చూసి చూసి నేటికి వాటియందు ప్రేక్షకులు విరక్తులయ్యారు. అలాగే యీ విచిత్ర, వినోద కథలు యెంత త్వరగా ఎక్కువగా చిత్రాలుగా నిర్మింపబడితే, అంత త్వరగానే ప్రేక్షకులు యీ చిత్రాలయందు విరక్తులౌతారు. అరవ సోదరులు తెనుగువారికన్న ముందుగానే యీ జానపదచిత్రాలు నిర్మించడం ప్రారంభించారు. ప్రస్తుతం అరవదేశంలో జానపద చిత్రాలంటె విరక్తి కలిగిపోయింది.

అలాగే ఆంధ్రదేశంలో కూడా విరక్తి గలుగక తప్పదు. వచ్చేసంవత్సరానికి- నెలకి రెండు జానపదచిత్రాల చొప్పున రావచ్చు. అంతతో ఆ చిత్రాలు చూసేవెర్రి ప్రేక్షకులకు పోవచ్చు. కనుక చదువుకున్న ప్రేక్షకులు, పత్రికలు యిష్టం లేకపోయినా "సెబాస్" అని ప్రోత్సహిస్తాంటే జానపద చిత్రాలు త్వరలోనే చెల్లిపోతాయి.

అంతేకాకుండా, చెయ్యవద్దన్న పని చెయ్యడం, చెయ్యమన్న పని చెయ్యకపోవడం మానవజాతికి సహజం. కనుక, మనకు కావలసింది వద్దంటే యిస్తారు; మనం వద్దనుకున్నది కావాలంటే మానేస్తారు. అందుచేత, యీ జానపదచిత్రాలయుగం త్వరగా దొర్లించి వెయ్యాలంటే, మనకి యిష్టం లేకపోయినా "భేష్ బాగుంది" అని ప్రోత్సహించడమే ఉత్తమం!

ఒకడు తన రిస్టువాచీగొప్పతనాన్ని గూర్చి అర గంటకు పైగా వర్ణించాడు. ఇంకా వర్ణిస్తూనే వున్నాడు. విసుగెత్తిపోయిన మరొకడు ఇలా గన్నాడు.

"నేను ఏడాదికిందట నా రిస్టువాచీని గోదావరిలో పారేశాను. అయినా అది ఇప్పటికీ శుభ్రంగానే వుంది."

అవతలవాడు ఆశ్చర్యపోయి, "ఏది? ఆ గడియారమే?" అనిఅడిగాడు.

"కాదు. గోదావరి," అనిజవాబు.



బిహ్గా కి రాత్ చిత్రంలో

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(8-వ పేజీ తరువాయి)

మనస్సు లగ్నం చెయ్యి. కలల్లో విహరించడం మాను. అటువంటి కలలనించి మేలుకోగానే, వాస్తవ స్థితి దుర్భరమైపోగలదు. నా స్నేహాన్ని మాత్రం స్వీకరించు. నేను నీ కింతకంటే ఇవ్వగలిగేది లేదు."

"అవును మర్సిడా! నువ్వు చెప్పినది నిజం. నేను నావికుడనౌతాను. నీ కంటికి అసహ్యంగా కనపడే మనపూర్వుల దుస్తులు త్యజించి, చారలషర్టు, నీలికోటు, టోపీ ధరిస్తాను. నిన్ను మెప్పించడానికి అలాగే ఉండాలి కదూ?"

ఈమారు మర్సిడా ముఖభంగిమ మారింది. అనుతాపం పోయి ఆగ్రహం ఆవహించింది. "అంటే?"

"అంటే, ఆరీతిగా ఉండే ఒకనికోసం వేచిఉన్నావు. కాబట్టి, నాపట్ల ఇంత నిర్దయతో ప్రవర్తిస్తున్నావని. అయినా ఏమో! ఎవరు చెప్పగలరు? నువ్వు ఎవరికోసం నిరీక్షిస్తున్నావో అతడు చపలుడు కావచ్చును. కాకపోయినా అతనికి సముద్రమే చివరిగతి రాసి పెట్టి ఉండవచ్చును."

"ఫెర్నాండో," అంది మర్సిడా బిగ్గరగా. "నువ్వింకా సత్పురుషుడవనుకున్నాను. కాని, మోసపోయాను నీ ఈర్ష్యకు తోడు శాపాలు పెట్టడానికి నీ హృదయమెంత విషపూరితం! ఇదిగో విను. నేనేమీ దాచడంలేదు. నువ్వు ఎవర్ని గురించి మాట్లాడుతున్నావో అతన్ని నేను ప్రేమిస్తున్నాను. అతనికోసమే నిరీక్షిస్తున్నాను. తిరిగిరాని పక్షంలో అతన్నిచపలుడని నీమాదిరిగా నిందించను. నాపై ప్రేమతోనే మరణించాడని భావిస్తాను"

కాటలన్ యువకుడు ఉద్రేకపూరితుడైనాడు.

"నిన్నర్థంచేసుకున్నాను ఫెర్నాండో. నేనతన్ని ప్రేమిస్తున్నందువల్లనే అతన్ని నువ్వు దూషిస్తున్నావు. అతనితో కత్తి దుయ్యడానికి సిద్ధపడుతున్నావు. కాని, దానివల్ల నీకేం ప్రయోజనం? నన్నెలాగూ వివాహం చేసుకోలేవు. నేనిచ్చిన స్నేహంతో, సోదరప్రేమతో తృప్తిపడు. అదికాక నువ్వన్నట్లు, నిజంగానే సముద్రం నమ్మడానికి వీలుకానిది. అతను వెళ్ళి అప్పుడే మూడుమాసాలయింది. ఈ మూడుమాసాలలోనూ ఏ తుపాను లొస్తాయో నని ఎంతగా క్షోభించాను?" అంటున్నంతలో మర్సిడాకళ్ళు నీళ్ళతో నిండాయి.

ఫెర్నాండో అటూఇటూ పచారుచెయ్య నారంభించాడు. తరవాత ఆమె సమీపంలోకి వచ్చి నిలిచి, పిడికిళ్లు బిగబట్టి, కళ్ళలో నిరాశ ప్రతిఫలిస్తుండగా ప్రశ్నించాడు "చెప్పు మర్సిడా! ఆఖరుపర్యాయం చెప్పు. ఇదే నీ దృఢనిశ్చయమా?"

నిష్కర్షగా చెప్పింది మర్సిడా:—"నేను ఎడ్మండ్ డాంటేని ప్రేమిస్తున్నాను. అతన్నితప్ప ఇంకెవరినీ వివాహమాడను."

ఆశలు కూలిపోయినట్లు ఫెర్నాండో తల ఒరిగిపోయింది. మూలుగుతున్నట్లు దీర్ఘనిశ్వాసం విడిచాడు. కాని, వెంటనే శిరసెత్తి దృఢస్వరంతో ప్రశ్నించాడు.

"అతడు మరణించినట్లయితే?"

"అతడు మరణిస్తే, అతన్ని నేనూ అనుసరిస్తాను."

"అతడు నిన్ను విస్మరిస్తే?"

ఇంతలోనే గృహప్రాంగణంనుంచి ఉల్లాసపూరితమైన ఒక పిలుపు వినవచ్చింది. "మర్సిడా! మర్సిడా!"

"అడుగో" అంది యువతి. ఆమెముఖం కాంతివంత మైంది. "చూడు, అతడు నన్ను మరిచిపోలేదు. ఇదుగో వచ్చాడు." ద్వారంవైపు పరుగెత్తి తలుపు తీసింది. "ఎడ్మండ్! ఎన్నాళ్ళకి వచ్చావ్!"

ఫెర్నాండోముఖం పాలిపోయింది. వొణికిపోతూ కుర్చీలో కూలబడిపోయాడు. మర్సిడా ఎడ్మండ్ చేతుల్లోకి వాలిపోయింది. ఇద్దరూ ఆనందాతిరేకంలో లోకాన్ని మరిచిపోయారు. బాధాజనితమో ఆనందఫలితమో తెలియని అస్పష్టమైన వాక్కులతో పరస్పరభావాలను ప్రకటించుకున్నారు. అకస్మాత్తుగా ఫెర్నాండో ముఖంలోని కాళచ్ఛాయలు ఎడ్మండ్ దృష్టిగోచరమైనాయి. ఫెర్నాండో చెయ్యి కత్తిపిడిమీదికి దూకింది.

"ఓహో, నన్ను క్షమించాలి" అన్నాడు డాంటే. క్రోధ భావంతో "ఇక్కడ ముగ్గురం ఉన్నామన్న సంగతి నేను గమనించలేదు." మర్సిడావంక తిరిగి ప్రశ్నించాడు.

"ఈయనెవరు?"

"నీకు ప్రాణస్నేహితుడు కావలసినవాడు. నాకు మిత్రుడు, బావ, సోదర సమానుడు. అతనిపేరు ఫెర్నాండో. ఎడ్మండ్, నీతరవాత అతన్ని ప్రేమించినంతగా ఈ ప్రపంచంలో నేనింకెవరినీ ప్రేమించను. అతన్ని గుర్తుపట్టలేదా?"

"ఆ! అవును." అన్నాడు డాంటే. మర్సిడాను వదలకుండానే, ఒక చెయ్యి చాచి కాటలన్ యువకుని సాదరంగా పిలిచాడు. కాని, ఫెర్నాండో చెయ్యి అందుకోలేదు. శిలాప్రతిమవలె స్తబ్ధుడై కూర్చుండిపోయాడు. ఆందోళనతో కంపిస్తూమర్సిడావంక డాంటే తేరిపార చూశాడు. తరవాత క్రోధోద్వేగంతో ఫెర్నాండోవంక చూశాడు. క్షణంలో అంతా గ్రహించాడు. కోపంతో అతని ముఖం ఎర్రబడింది.

"నీదగ్గరకు రెక్కలమీద వచ్చి వాలాను. కాని, ఇక్కడ శత్రువొకడు తటస్థపడతా డనుకోలేదు మర్సిడా."

"శత్రువా?" మర్సిడా బిగ్గరగా అరిచింది. ఆవేగంతో ఫెర్నాండోవంక చూసి, "నాయింటిలోనా శత్రువు? అదే నిజమయితే, వెంటనే ఈఇల్లు విడిచిపెట్టి మార్సెల్స్ నగరానికి నిన్ననుసరించి వచ్చేస్తాను. నీకే హాని సంభవించినా మార్గియన్ అగ్రంపైనుంచి దూకి ప్రాణత్యాగం చేస్తాను." నిశ్చలంగా ఆమె పలికిన వాక్కులనుబట్టి, తన మనోగతోద్దేశాన్ని ఆమె గ్రహించినట్లు ఫెర్నాండో తెలుసుకున్నాడు. అతనిముఖం పాలిపోయింది.

మర్సిడా మళ్ళీ చెప్పింది. "కాని నువ్వు పొరపడ్డావు ఎడ్మండ్. ఇక్కడ నీకు శత్రువెవరూ లేరు. నాకు సోదరసమానుడైన ఫెర్నాండో ఒక్కడే ఉన్నాడు. హృదయపూర్వకమైన స్నేహప్రకటనకు సిద్ధంగా ఉన్నాడు." ఆజ్ఞాపూర్వకమైన యువతి నేత్రభంగిమ చూసిమంత్రముగ్ధుడైనట్లు ఫెర్నాండో మెల్లిగా ఎడ్మండ్‌ను సమీపించి చెయ్యి అందించాడు. కాని చేతికి చెయ్యి తాకినంతనే తనలోని సహనం అంచులు మీరినట్లు, దుర్భర వేదనతో ఇల్లు విడిచి అతివేగంతో నిర్గమించాడు. పిచ్చివానివలె జుట్టుపీక్కుంటూ "అయ్యయ్యో! ఎలాగ? నన్నెవరు కాపాడగలరు? అయ్యో పాడుజన్మ! పాపిష్ఠికర్మ!" అంటున్నాడు.

ఇంతలో అతని కొక పిలుపు వినవచ్చింది. "ఎవరు? ఫెర్నాండో! ఎక్కడికి వెడుతున్నావ్?"

కాటలన్ యువకుడు చటుక్కున ఆగిపోయాడు. చుట్టూ చూశాడు. వృక్షచ్ఛాయలో కూర్చున్న కాడెరూస్, డాంగ్లర్ కనిపించారు. విభ్రాంతుడై వారిని చూస్తూ ఉండిపోయాడు. నోట మాట రాలేదు.

అలా పిచ్చెత్తినట్టున్నాడు?" అన్నాడు. "ఏమో! ఏం చెప్పగలం? మనం మోసపడిఉండవచ్చు. డాంటేకి కోరినదంతా లభించిఉండవచ్చు."

"అలాగే కనిపిస్తోంది. అదేమిటో కనుక్కుందాం" అన్నాడు కాడరూస్. ఫెర్నాండోవంక తిరిగి, "రావోయ్ రా. కూచో కొంచెం స్థిమితపడు."

నుదుటినుంచి ధారలుకట్టిన చెమట తుడుచుకుంటూ, ఫెర్నాండో మెల్లిగా పొదరింటి నీడకి చేరాడు. నీడలో చల్లదనం అతన్ని కొంత శాంతపరిచింది. "నన్ను పిలిచారా?" అంటూ ఒక కుర్చీలో కూలబడ్డాడు.

"పిచ్చివాడిలా పరుగెత్తుతున్నావని పిలిచాను. వెళ్లి సముద్రంలో దూకుతావేమో నని భయపడ్డాను." అన్నాడు కాడరూస్ నవ్వుతూ. "స్నేహితుడన్న తరవాత ఒక గ్లాసు మద్యం ఇవ్వడమే కాదు; సముద్రంలో మునిగిపోతున్నప్పుడు కాపాడాలి కూడా."

ఫెర్నాండో పెద్ద మూలుగు మూలిగాడు. అది మూలుగులా లేదు రోదనలా ఉంది. రెండుచేతులమధ్యా ముఖం దాచుకొని ముందుకు వంగి కూర్చున్నాడు

"ఇదిగో చూడు ఫెర్నాండో. నిన్ను చూస్తే ఎలా వున్నావో చెప్పనా?" అన్నాడు కాడరూస్ "భగ్నప్రేమికుడిలా వున్నావు చాలు చాలు! అదేమిటో మాకు చెప్పు పూర్తిగా. నీ హితవు కోరి స్నేహితు లడుగుతుంటే ఊరుకోడం భావ్యం కాదు"

ఫెర్నాండో తలెత్తకుండానే పిడికిళ్లు బిగించి అన్నాడు.

"నేను బాగానే ఉన్నాను"

"అదిగో! చూడు డాంగ్లర్" అన్నాడు కాడరూస్ మిత్రునివంక కన్నుగీటుతూ "ఇలా గుంది చూడు ఇతని సంగతి ఏ పాపం ఎరగడు. ఉత్తముడు. పల్లెవాళ్లలో పెద్ద చెయ్యి మర్సిదా అనే చక్కని అమ్మాయిని ప్రేమించాడు కాని దురదృష్టవశాత్తు ఈ చక్కనిపిల్ల ఫరావో నౌక మేట్‌ని ప్రేమించింది ఫరావో ఇవాళే వచ్చింది వచ్చిందో లేదో, పాపం, ఫెర్నాండోని తనదారి తన్ని చూసుకోమంది"

"అయితే?" అన్నాడు ఫెర్నాండో, తలెత్తి కాడరూస్ వంక చూస్తూ, తన కోపాన్నంతటీ కక్కడానికెవరైనా దొరుకుతారా అని వెతుకుతున్నట్టు. "కోరినవాణ్ణి ఎంచుకోడానికి మర్సిదాకి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉన్నాయి లేవంటారా?"

"సరిపోయింది. అల్లా అనుకుంటే ఇబ్బందే లేదు" అన్నాడు కాడరూస్. "కాని నువ్వేమో కాటలన్‌జాతిపేరు నిలిపే వీరుడి వనుకొన్నాను ప్రత్యర్థి ఆక్రమించుకుంటూ ఉంటే, కాటలన్‌జాతికి చెందినవాళ్లెవరూ ఊరుకోరని నే విన్నాను. జంగులోనూ ఫెర్నాండో అంటే ప్రత్యర్థులకు భయంకరుడని విన్నాను."

ఫెర్నాండో సానుభూతిపూర్వకంగా నవ్వాడు. "ప్రేమికుడు భయంకరంగా ఉండడు" అన్నాడు.

"ఓహో! కాబోలు," అన్నాడు కాడరూస్ మద్య ప్రభావం అప్పుడే అతని తల కెక్కుతోంది "దాని మాటెల్లా వున్నప్పటికీ, డాంటే తిరిగిరావడంవల్ల ఫెర్నాండో ఒక్కడికే ఇబ్బంది కలగలేదు ఏమంటావ్ డాంగ్లర్?"

"నువ్వు చెప్పిందీ నిజమే. అతనికి కొంత ఇబ్బంది కలిగే ఉండవచ్చు."

"అదేముందిలే" అన్నాడు కాడరూస్, ఫెర్నాండో గ్లాసులో మద్యంపోస్తూ పదోసారి తన గ్లాసుకూడా నింపుకున్నాడు డాంగ్లర్ మొదటిగ్లాసింకా ఖాళీ కాలేదు. "ఎవరెల్లా పోతేం! అతను మర్సిదాని పెళ్లిచేసుకోక మానడు"

డాంగ్లర్ కాటలన్‌యువకుని అతి శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు. కాడరూస్ పలుకులు అతని హృదయంలో చిచ్చుపెడుతున్నాయి.

"మరి, పెళ్లి ఎప్పుడు?"

"అదా? ఇంకా నిర్ణయం కాలేదు" అని గొణిగాడు ఫెర్నాండో.

"లేదు కాని నిర్ణయంకావడానికెంతలే! త్వరలోనే అవుతుంది" అన్నాడు కాడరూస్ "ప్రళయం ఎంత నిశ్చయమో, ఫరావో నౌకకి డాంటే కెప్టెన్ అవడం కూడా అంతే నిశ్చయం. ఏమంటావ్ డాంగ్లర్?"

సంభాషణ హఠాత్తుగా తనమీదికి తిరిగేసరికి డాంగ్లర్ కంగారుపడ్డాడు. కాడరూస్ తనను ఎత్తిపొడవడానికి యత్నిస్తున్నాడేమోనని అతనివంక తీక్ష్ణంగా చూశాడు కాని, మత్తువల్ల అర్థచైతన్యం మాత్రం మిగిలిన ఆ ముఖంలో అసూయతప్ప, వేరేమీ కనిపించలేదు

తనగ్లాసు నింపుకుంటూ అన్నాడు • "సరే కానీ మర్సిదా భర్తఅయిన కెప్టెన్ ఎడ్మండ్ డాంటే [illegible] కొంతులు పలకండి"

కాడరూస్ గ్లాసెత్తి పెదవులకు స్పృశించాడు. ఒక్క గుక్కలో గ్లాసు ఖాళీచేశాడు

ఫెర్నాండో తన గ్లాసునెత్తి నేలకు విసిరికొట్టాడు

"ఆగండి అటు చూడండి అక్కడెవరు?" అన్నాడు కాడరూస్. "కాటలన్స్ గ్రామంపక్కన ఆ మిట్టపైన కనిపిస్తున్న వాళ్లెవరు? నువ్వు చూడు ఫెర్నాండో నాకంటె నీ చూపు బాగుంది; నా చూపు తగ్గిపోయింది మద్యం చేసే ద్రోహం నీకు తెలుసుగా! చూస్తే ఇద్దరు ప్రేమికుల్లా కనిపిస్తున్నారు చెయ్యీ చెయ్యీ కలిపి నడుస్తున్నా రనుకుంటా [illegible] చూడు! — పాపం ఇంకొకళ్లు చూస్తున్నారని వాళ్ళకి తెలియదు చూడు. ఆలింగనం చేసుకుంటున్నారు"

ఆ దృశ్యాన్ని చూసి ఫెర్నాండో ముఖం వికృతంగా మారిపోయినట్టు డాంగ్లర్ కనిపెట్టాడు.

"వాళ్లెవరు ఫెర్నాండో?" అని అడిగాడు

బొంగురుపోయిన గొంతుతో చెప్పాడు ఫెర్నాండో "వాళ్లు ఎడ్మండ్, మర్సిదా"

"ఓహో" అన్నాడు కాడరూస్ "నేను గుర్తుపట్టలేక పోయాను సుమా!" అని వాళ్లని గట్టిగా పిలిచాడు. "డాంటే! మారోయ్! ఓ అమ్మాయ్! ఇటు రండి కొంచెం ఇటురండి. ఎప్పుడేమిటి పెళ్లి? ఇక్కడ ఫెర్నాండో మర్సిదా చెప్పకుండా భీష్మించుకుని కూచున్నాడు"

"ఊరుకుంటావా లేదా" అంటూ డాంగ్లర్ కాడరూస్‌ని వెనక్కి లాగుతున్నట్టు నటించాడు మత్తులో నిలబడలేకపోయినా లేచి సాగుతున్నాడు కాడరూస్ "కూచోవోయ్ నువ్వు మాట్లాడకుండా. ప్రేమికుల్ని వాళ్ల మానాన వాళ్లని విడిచిపెట్టరాదూ? చూడు, ఫెర్నాండో కేసి; అతనెంత శాంతంగా, సబబుగా ఊరుకొన్నాడో చూసి నేర్చుకో" అన్నాడు డాంగ్లర్.

ఒళ్లు తెలియని ఆవేశంలో, డాంగ్లర్ రెచ్చగొట్టినా ఫెర్నాండో మాటవరకు కదలకుండా కూచున్నాడే కాని, ఇంతలో మర్సిదా తలెత్తి చిరునవ్వుతో చూస్తూ కలయచూసింది ఇద్దరూ సమీపిస్తున్నారు ఫెర్నాండో మర్సిదా బెదిరింపు [illegible]

వచ్చింది—ఎడ్మండ్‌కి ఎటువంటి హానికలిగినా ఆత్మహత్య చేసుకుంటానని. దాంతో ఫెర్నాండో నిర్జీవంగా కుర్చీలోకి వాలిపోయాడు.

డాంగ్లర్ తనప్రక్కనున్న ఇద్దరిముఖాలూ చూశాడు ఒకరి ముఖంలో మత్తువల్ల చైతన్యం ఊడిగిపోయింది మరొకని ముఖంలో భగ్నప్రేమవలని ఉన్మత్తత కనిపించింది.

"ఈ వెర్రిమొహాలవల్ల నాకు రవ్వంతకూడా ప్రయోజనం లేదు" అనుకున్నాడు డాంగ్లర్ తనలో "ఇక్కడ ఒక తాగుబోతుకీ, ఒక పిరికిపందకీ మధ్య నేను కూచోవలసిన పని లేదు. ఎడ్మండ్ దశ ఉచ్చగతిలో ఉంది. అతనా సుందరిని పెళ్ళిచేసుకుంటాడు; కెప్టెన్ అవుతాడు; మమ్మల్ని అందర్నీ హేళన చెయ్యగలడు; నేను జోక్యం చేసుకోకపోతే, అవహేళన చెయ్యక మానడు" ఒక వక్రమందహాసం పెదవుల చివర ద్యోతకమయింది

మేజాబల్ల నానుకుని నిలిచీ నిలవనట్లు నిలిచి కొడెరూస్ బిగ్గరగా అంటున్నాడు.

"ఏమోయ్ ఎడ్మండ్! ఇక్కడ మిత్రులం కనిపించటం లేదా? లేక మాట్లాడ్డానికి మేము తగమా?"

"లేదు కొడెరూస్" అన్నాడు డాంటే వేరువకివ్వగా. "మాట్లాడ్డానికి తగకపోవడమేమీ లేదు నాకెంతో ఆనందంగా ఉంది. గర్వంకంటె ఆనందం మరింత గుడ్డిదికదా!"

"బలేగా చెప్పావోయ్! ఏమమ్మా మదాండాంటే! క్షేమమేనా?"

మర్సిదా శంకతో శిరస్సువంచుకుంది. "నన్నిప్పుడే అల్లా పిలవకూడదు. వివాహంకాని యువతుల్ని వరుల పేరు చెప్పి పిలిస్తే మాలో అశుభం. నన్ను మర్సిదా అనే పిలవండి"

"త్వరలోనే పెళ్ళి జరుగుతుందనుకుంటాను డాంటే?" అన్నాడు డాంగ్లర్.

"వీలైనంత త్వరలోనే జరుగుతుంది డాంగ్లర్. ఇవాళ నా తండ్రితో మాట్లాడి అంతా ఏర్పాటుచేస్తాం రేపో ఎల్లుండో ఇక్కడే, ఈ రిజర్వ్ హోటల్లోనే విందు ఏర్పాటవుతుంది. మిత్రులంతా మానకుండా రాగలరనుకుంటాను మిమ్మల్ని నేను ఇప్పుడే ఆహ్వానించినట్టు ఎంచుకోండి డాంగ్లర్. మీరుకూడా కొడెరూస్."

"మరి ఫెర్నాండో మాట? అతనుకూడా రావాలా?" అన్నాడు కొడరూస్ చిన్న వెకిలి నవ్వుతో.

"నా భార్య సోదరుడు నాకూ సోదరుడే" అన్నాడు ఎడ్మండ్. "ఇటువంటి శుభానికి అతను రాకపోతే ఇద్దరంకూడా చాలా చింతిస్తాం."

"ఇవాళ ఏర్పాట్లు, రేపో ఎల్లుండో ప్రధానం, విందు. చాలా తొందర మీదున్నారే కెప్టెన్!"

డాంటే చిరునవ్వుతో అన్నాడు "డాంగ్లర్! కొడెరూస్‌కి మర్సిదా చెప్పినమాటే మీకూ చెప్పాలి ఇప్పటికింకా లభించని బిరుదుతో పిలవకండి. దానివల్ల దురదృష్టం ప్రాప్తించవచ్చు."

"క్షమించాలి. ఆలస్యం సహించలేకుండా ఉన్నారని ఊరికే అన్నాను. అంతే. మీ కింకా కావలసినంత వ్యవధి ఉంది. ఫరావో మూడుమాసాలవరకూ బయలుదేరదు అనుకున్నాను"

"సౌఖ్యాన్ని అందుకోడానికి ఎవరైనా తొందరపడతారు డాంగ్లర్. మరీ ఆలస్యమైతే, ఆ సౌఖ్యం దక్కకపోవచ్చును. నా సౌఖ్యం మాటెలా ఉన్నప్పటికీ, నేను పారిస్ వెళ్ళవలసిన పని కూడా ఉంది."

"ఓ! పారిస్ వెళ్ళాలా? అక్కడ పనేదైనా ఉందా?"

"నాపని కాదు. పాపం మన కెప్టెన్ లక్లేర్ తుది ఆజ్ఞ పాటించాలి అది పవిత్రమైన కర్తవ్యంకదా డాంగ్లర్!"

"అవు నవును." అన్నాడు డాంగ్లర్. అని తనలో ఇట్లా అనుకున్నాడు "అవును పారిస్ వెళ్ళాలి గ్రాండ్‌మార్షల్ ఇచ్చిన ఉత్తరాన్ని అక్కడ ఒప్పగించాలి ఆ! మంచి ఆలోచన తట్టింది. చాలా బాగుంది డాంటే! బాగా దొరికావ్! నువ్విప్పుడే ఫరావ్ కెప్టెన్ కావటం లేదులే!" తరవాత డాంటేతో అన్నాడు. "క్షేమంగా వెళ్ళిరండి."

ఎడ్మండ్ ధన్యవాదాలు చెప్పి బయలుదేరాడు. అమర సౌఖ్యాన్ని అందుకుంటున్న తృప్తితో ఇద్దరూ వెళ్ళారు.

4

అంతకంతకి దూరమౌతున్న ఇద్దరిపైనా దృష్టి నిగిడ్చి చూస్తున్నాడు డాంగ్లర్. సెంట్‌నికలాస్ కోటవద్ద మలుపుతిరిగి ఇద్దరూ అదృశ్యులవగానే ఫెర్నాండోవంక చూశాడు. ఫెర్నాండో నిరాశతో కుర్చీలో కూలబడి ఉన్నాడు. కొడెరూస్ మత్తు తలకెక్కి పాట గొణుగుతున్నాడు.

డాంగ్లర్ ఫెర్నాండోవంక తిరిగి అన్నాడు. "అయితే అదన్నమాట సంగతి. ఇది అందరికీ ఆనందం చేకూర్చే వివాహం కాదన్నమాట!"

"నాకు పిచ్చెక్కిస్తోంది" అన్నాడు ఫెర్నాండో.

"అయితే మీరు మర్సిదాను ప్రేమిస్తున్నారన్నమాటేనా?"

"పరిచయం కలిగిన రోజునుంచీ ఆమె నారాధించాను"

"అయినా మార్గాంతరం చూడకుండా ఇక్కడే కీకుక్కుంటూ కూచున్నారు. మనుషు లిట్లా ప్రవర్తిస్తారని నేనెన్నడూ అనుకోలేదు"

"వాణ్ణి నిలువునా చీరెయ్యాలనుంద. కాని వాడికే ముప్పొచ్చినా తన ప్రాణాలు తీసుకుంటానని ఆమె అంటుంది"

"హుం. దద్దమ్మ" అనుకున్నాడు డాంగ్లర్ తనలో. "ఆమె ప్రాణాలు తీసుకుంటే ఎవరికి, తీసుకోకపోతే ఎవరికి? డాంటే కెప్టెన్ కాకపోవడమే కావలసింది!"

"మర్సిదా మరణించేకంటె నేనే చావటం మేలు" అన్నాడు ఫెర్నాండో స్థిరమైన స్వరంతో.

డాంగ్లర్ అన్నాడు. "చూడండి మీరు సత్పురుషునివలె కనిపిస్తున్నారు. మిమ్మల్ని ఈ చిక్కులోనించి తప్పించాలని నాకు కోరిక కలుగుతోంది. కాని"

"అవును అదేల్లాగో ఆలోచిద్దాం" అన్నాడు కొడరూస్

"నువ్వుండవోయ్ ఇప్పటికే ముప్పాతిక పాలు తెలివితక్కువ టట్లు తాగావు ఆ పాతికా పూర్తిచేసేసె నీమూనాన నువ్వుండు నీ తాగుడేదో నువ్వు చూసుకో. మా వ్యవహారంలో వేలు పెట్టకు దీనికి కొంచెం బుర్ర ఉపయోగించాలి"

"నేను తెగ తాగానా? ఎవరన్నారు? ఏదీ చూడు ఛస్తా. ఇప్పుడే ఇంకో నాలుగు సీసాలు తాగెయ్యగలను. ఇవ్వేం సీసాలు, ఔన్సు మందుల్లాగ? పాంఫిల్! ఇంకా మద్యం తీసుకురా" మాటలకి జోరు చాలదన్నట్టు కొడెరూస్ గ్లాసు తీసి బల్లనేసి కొట్టాడు.

ఫెర్నాండో అందుకున్నాడు "ఏమిటి ఇప్పుడంటున్నారు?"

"ఏమంటున్నానంటే— ఏమిటో మర్చిపోయాను ఈ తాగుబోతువల్ల ఆలోచన తెగిపోయింది"

గ్రామాలు తిరగడం పూర్తిఅయింది. వీరయ్యమీద రిపోర్టులేగాని ఒకరుకూడా అతని మంచితనంగురించి ముచ్చటించిన పాపాన లేదు. ఎవరయితే తన కండగా ఉంటూ ఉన్నాడో వాళ్లు కూడా తనమీద వ్యతిరేకంగా రిపోర్టు లిచ్చారు. సాయంత్రం 7 గంటలకు సంచారం పూర్తయింది. తిరిగి బస్తీ చేరుకున్నారు. బంగాళాలో మంత్రిగారు పగలంతా ఎండలో పడిన శ్రమపోవడానికి విశ్రాంతితీసుకుంటున్నారు. వీరయ్యగూడా చాలా అలసిపోయాడు. మనసంతా చింతాక్రాంతమై ఉంది. మంత్రిగారికి తన తుదిప్రార్థన వినిపిద్దామని మంత్రిగారు శయనించిన గదివాకిలి దగ్గర నిలబడి, "అయ్యా నా ప్రార్థన వినండి!" అన్నాడు. మంత్రిగారు మంచంలో చివాలున లేచి కూర్చుని "నీవు రేపుదయం కనిపించు. పో యింటికి. నే నీ రాత్రి నీవిషయం ఇంకా దర్యాప్తుచేసి నీకు రేపు చెబుతాను. నీవిషయ మేమీ సంతృప్తికరంగా లేని మాట నిజం!" అన్నారు.

వీరయ్యకు కళ్లనీళ్లపర్యంతమైంది. "పెద్దలు మీరు కనికరించాలి. వారంరోజులలో నా కుమార్తె వివాహం! ఈ సమయంలో సంభవించిన యీ ఆపదనుంచి నన్ను మీరు కాపాడితే, మీమేలు నే నీ జన్మలోమరిచిపోను!" అన్నాడు వీరయ్య.

"నాకు చాలా బడలికగా వుంది. రేపు కనిపించు!" అన్నాడు మంత్రిగారు. వీరయ్య కునికే గుడ్డిదీపస్తంభంవలె మినుకుమినుకుమను ఆశలో మునిగి జీపుకా రెక్కి ఇంటికి వెళ్లాడు. అప్పటి కప్పుడే ఇనస్పెక్టరు సామాను తెచ్చిపడేశారు. పందిళ్లకు స్తంభాలు, తాటాకులు వచ్చాయి. ఇల్లంతా పెళ్లికబుర్లతో మారుమ్రోగిపోతోంది. అలిసి, సొలిసి, నిట్టూర్పులు విడుస్తూ, మొఖాన విన్నదనం వికసిస్తూ లోనికి వచ్చిన వీరయ్యను చూచి భార్య 'ఏం అలా ఉన్నా రేం?' అన్నది.

వీరయ్య జవా బివ్వక సరాసరి పడకగదిలోకి పోయి, కోటు, తలపాగా తీసి పందిరిమంచంలో పరుండి సన్నగా దుఃఖించనారంభించాడు. భార్య పాపం! కారణం తెలియక చాలా ఆందోళనపడింది.

మధ్య పెద్ద హాలులో సోఫాలలో కూర్చుని కుమారులు మద్రాసురేడియో కేంద్రంనుంచి వసంతకోకిలపాట వింటూ ముచ్చటలాడుకుంటున్నారు. ధనార్జన చేయటంలోని కష్టం తెలియని సుకుమారులు. వాళ్లకు తండ్రిగా రేదో బాధతో దుఃఖిస్తున్న సంగతి తెలియలేదు. తల్లి వచ్చి 'మీ నాన్నగారికి వొంట్లో సరిగా లేదు! కాస్త రేడియో ఆపండ్రా!' అని గదిలోకి వెళ్లి "ఏమండీ! ఎలా వుంది వొంట్లో-? వడదెబ్బ తగిలిందా! సరిగ్గా మండువేసంగిలోనే కుదిరింది గావాలు ఆ మంత్రికి సంచారం? వాళ్ల దేం పోయింది: క్రింది ఉద్యోగు లేమైతే వాళ్ల కేం? గుండెల్లో నొప్పిగా వుందా? కాస్త నెయ్యి రాచి తోముంతా నుండడి. ఏదీ ఆ చొక్కా కాస్త వూడదీయండి!" అని బ్రతిమాలింది. తాసిల్దారు జవా బీయక విద్యుద్దీపకాంతిలో పందిరిమంచంలో బోర్లపడుకుని సన్నని మూలుగుతో బాధపడుతున్నాడు. భార్యకేమీ తోచలేదు. పెద్దకుమారుణ్ని పిలిచి 'నీవు త్వరగా వెళ్లి డాక్టర్ను పిలుచుకరా! నాన్నగారి పరిస్థితేమీ సరిగా లేదు!' అన్నది. తాసిల్దారు కామాటలు వినిపించలేదు.

4

డాక్టరు కారుమీద వచ్చి వీరయ్య గదిలో ప్రవేశించి 'తాసిల్దారుగారూ! ఒంట్లో ఎలా వుంది?' అన్నాడు. వీరయ్య మంచంలో కూర్చొని "చాలా బడలిక చేసింది: మనసంతా పిరికిగా ఉంది. మంత్రిగారితో సంచారం చాలా ప్రయాసైంది!" అన్నాడు. వైద్యుడితో తన మానసికబాధ చెప్పలేదు. కాని వైద్యుడు వీరయ్యను పరీక్ష చేసి "మీ వొంట్లో బాగానే వుంది. మీ రేదో విషయంగూర్చి అధైర్యపడుతున్నారు. మీ కుత్సాహం కలిగించే మందు పంపిస్తాను. ఈరాత్రి మూడుసార్లు త్రాగండి." అని చెప్పి వెళ్లిపోయాడు.

వైద్యుడు వెళ్లిన తరవాత వీరయ్య భార్య అనంతలక్ష్మితో రహస్యం చెప్పినాడు: ఆమె విని నిర్విణ్ణురాలయింది. నోట మాట రాలేదు. ఆమెకు కళ్లనీళ్ల పర్యంతమైంది.

"అమ్మాయి పెళ్లి ఈ లగ్నానికి జరుగుతుందని నాకు నమ్మకం లేదు. మీరు బాగా ఆలోచించి ఏం చేస్తే ఈ ఆపద తప్పుతుందో నిర్ణయించుకోండి!" అన్నది.

ఆ రాత్రి తెల్లవార్లు వీరయ్య భార్యతో అనేకమార్గాలు ఆలోచించాడు. కాని త్రోవ ఒకటికూడా లభించలేదు.

"ఇన్నాళ్లూ నాకు స్నేహితులుగా వున్నవాళ్లే కొందరు నన్ను ఉద్యోగంలోంచి తీసివేయించడానికి కుట్ర పన్నారు. మంత్రిగారు నన్ను ఎంతో ఆదరంతో చూచేవారు ఇదివరకు! నా దురదృష్టంవలన ఆయనకు నామీద దయ తప్పిపోయింది! ఆయన చాలా కోపంగా వున్నాడు. ఇన్నాళ్లూ మంత్రివర్గంపక్షంవాళ్లు తమ బానిసగా నన్ను వాడుకున్నారు. ఇప్పుడు నన్నాదుకునేవాడొకడూ కన్పించడం లేదు!" అన్నాడు వీరయ్య గద్గదకంఠంతో. అనంతలక్ష్మికి కళ్లనీళ్ళు వచ్చినాయి. చావటానికి సిద్ధంగా ఉన్న రోగివద్ద భూతకాలాన్ని, ఆ వైభవాన్ని తలుచుకుని ఏడిచే విధంగా ఆమె ఏవేవో జ్ఞప్తి కలయించి కొసరి వసంతకాలమున కోయిల క్రొచ్చిన భంగి ఏడ్చింది.

భళ్లున తెల్లవారింది. వీరయ్య లంకణాలు చేసిన మనిషల్లే నీరసంగా ఉన్నాడు. ముఖాన కళ లేదు: ఉత్సాహం లేదు. ఉదయం ఎనిమిదిగంటలకు మంత్రిగారిని కలుసుకోడానికి జీపుకారులో బంగాళాకు వెళ్లాడు. మంత్రిగారికి కానుకగా మంచి మామిడిపళ్లు ఒక డజను, బత్తాయిలు ఒక డజను, ద్రాక్ష తీసుక వెళ్లాడు. మంత్రిగారా ఫలములు చూచి చిరునవ్వు నవ్వి "నన్నుకూడా నీ స్థాయికి మారుస్తున్నావు. నీవు కూతురి పెళ్లిపనులసందడిలో జమాబందిపని సరిగా చూట్టంలేదు. రెవిన్యూ ఇనస్పెక్టర్లనీ, కరణాల్నీ, గుమస్తాల్నీ

(34-వ పేజీ చూడుడు)

కథానిక:

ప్రపితామహులు

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకి సింహాచలం బస్సు స్టాండుకువచ్చి బస్సు ఆగింది.

కూలీల ఆక్రందనలూ, రోడ్డుధూళీ రేగి, ఆగినతర్వాత బస్సులోంచి దిగారు—తెలుగు లెక్చరర్ శాస్త్రి...మరి ఎనమండుగురు విద్యార్థులు.

రెండు థెర్మాఫ్లాస్కులు, రెండు సిగరెట్ టిన్నులు ఒకచేతిసంచీమాత్ర సహాయులైన వారి అవతరణం చూడగా, ఏదో ఉత్సవ యాత్రకు బయల్దేరి ఉంటారని తెలుస్తూనేవుంది.

పూర్వదేవాలయాలు, శిలాశాసనాలు, క్షేత్రాలూ అంటే శాస్త్రిజీకి అమితప్రీతి.

కాలేజీకి లెక్చరర్ గా వచ్చి కొద్దిరోజులుమాత్రం అయింది. పడుచువారు. ఇంకా కాలేజీ అనారోగ్యవర్తనంలో దిగనందువల్ల పాత ఉపాధ్యాయుడి మొహం పడలేదు. చదువుకునే పిల్లలతో సజీవంగా నవ్వుతారు. పిల్లలకు ఆయనవద్ద దొంగభయంగాని, దుర్వినయంగాని లేవు. చాలా చనువైన అన్నగారి దగ్గరలా ఉంటారు.

వారానికొకటిగా చుట్టుపట్లుండే ప్రాచీనదేవాలయాలు, శిలాశిల్పాలను, సుందరపర్వతప్రదేశాలను, పిల్లలతో వినోదయాత్రగా వెళ్లిచూడ్డం, పురాణ భారత వైభవాన్ని వ్యాఖ్యానించడం శాస్త్రిగారికి పరిపాటయింది.

ఈవారం సింహాచలం ఎక్స్కర్షన్ వేసుకున్నారు.

'ముందుగతి కానవే చిలుకా' అని తల కుచుట్టుకున్న వులెన్ కంఫర్టు తీసి 'మధు' పాడుతూ ఆవలించాడు.

"ముందుగతికే ముందిలే ? అదిగో ఎదురుగా కాఫీ ఫలహారశాల - పదండి!" అన్నాడు భద్రం. "ఓ న్నో కాలణా, రెండిడీ...కప్పు కాఫీ" అని బిగ్గరగా వినబడుతున్నాయి.

"అరవం అరవం అంటూ ఎంతగా అరుస్తారోయ్ ఈ........ లు"అంటూశాస్త్రి గారు శిష్యులితో కాఫీ క్లబ్బులో ప్రవేశించారు.

*　　*　　*

అరగంటలో కాఫీలు పూర్తయ్యాయ్.

శాస్త్రిజీ హోటల్ ప్రక్క కిళ్ళీకొట్టులో అప్పుడే తాజాగా కట్టబడిన కిళ్లీ ఒకటి నములుతూ, "ఏమోయ్! పెట్రోల్ పట్టించావా ?" అన్నారు, కారు యజమాని పోజులో. "చిత్తం రెడీసార్ !" ప్రకాశం అన్నాడు డ్రైవరు లాగ, అప్పుడే కంఠదఘ్నంగా 'టీ'తో నింపిన ఫ్లాస్కుమూత పెడుతూ. కాఫీ క్లబ్బుకు పెట్రోలు బంక్ అనడం శాస్త్రిజీకి సరదాట.

"అట్టే పెళ్లి నడకలు నడవకండి. రాను పోను అయిదు మైళ్లు నడిచి మళ్లా మధ్యాహ్నం బస్సుకందుకోవాలి!" అంటూ నాలు గడుగులు ముందుకు వేసి, శుభ్రమైన సిజర్ సిగరెట్టొకటి వెలిగించి, అగ్రభాగాన్ని ధూమ్రవలయాలతో నింపారు శాస్త్రిజీ.

"అదిగో మన వినోదయాత్రా స్పెషల్ తాలూకు బస్సు ఇంజన్ ఆవిరి గ్రక్కుతూ బయలుదేరింది - గెట్ రెడీ!" అంటూ కిళ్లీకొట్టులో చిల్లర లెక్క తేమలక మల్లయుద్ధం చేస్తున్న మధు ఎట్టకేలకు బయలుదేరాడు.

"ఆల్ రైట్! అయితే ఇంజన్లోంచి మాత్రమే ఆవిరి రావాలి. మిగతా పెట్టెల్లోంచి రాకూడదు." అంటూ శాస్త్రిజీ సిగరెట్ టిన్నులు రెండూ హేండుబ్యాగ్ లో పెట్టి దాచారు.

"కాని ఒక్క బస్సు ఎత్తు ప్రదేశంలో ఆగలేదు. కనుక వెనకాల రెండో బస్సు కట్టుట చాలా ఉత్తమం." అని మధు పూర్వార్జిత శ్వేతకాష్టం తీసి వెలిగించాడు.

వినోదయాత్రా స్పెషల్ పొగలు గ్రక్కుతూ బయలుదేరింది.

శివరాత్రికి సింహాచలంలో గొప్ప తీర్థం జరుగుతుంది. జిల్లాల నాలుగు మూలల్నుంచీ యాత్రికులు వస్తుంటారు.

సింహాచలదేవుడికి దగ్గరచుట్టాలైన, బైరాగులు, జంఘాలు, పురోహితులు-అపిచ వితంతువులు వచ్చి తీర్థానికి మాంచి నిండు కలిగిస్తారు.

శివరాత్రి వెళ్లిపోయి అట్టే రోజులు కాలేదు. బైరాగులు కంఠంలోకు పాతుకుని డబ్బులకోసం మహాత్తు చూపే గోతులూ, అడవి అంతటా ।. తీట్టు క్రిందా కనపడే యాత్రికుల వంట పొయ్యిలూ, మంచం మిఠాయి దుకాణంకోసం నరికి పారవేయగా మిగిలిన చెట్టు మొదళ్లూ, ఇంకా పూర్తిగా చెదిరిపోలేదు.

అమాయకపు అడవిపూలతో, పేరు తెలియని ఏవో సాగను మొక్కలతో, సెలయేళ్ళతో, స్వచ్ఛమైన కల్లరాళ్లతో ఉండే అడవి అందాన్ని దుర్మార్గులు నాశనం చేస్తారు సంవత్సరానికోసారి చేరి! మహానుభావుడు నరుడు పాదం పెడితేచాలు పచ్చగడ్డి భగ్గుమంటుంది.

విద్యార్థులు, శాస్త్రిజీ, ఒక శుభ్రమైన పణుకుమీద నడుస్తున్నారు. ఒక ఫర్లాంగు మేర ఒకటే నల్ల శానాపురాయి. తీర్చిదిద్దిన తారురోడ్డులా పరుచుకుని ఉంది. కుడివైపునచూస్తే, కళ్లు తిరిగేటంత అగాధంతో- నిర్మలమైన నీటితో, కొండరాళ్ళ మీద గలగలమంటూ ఒక సెలయేరు పారుతోంది. ఉదయ సూర్యుని కిరణాలు పడి కరిగి పారే బంగారునీరులా మెరుస్తూంది. నీటికి దగ్గరగాఉన్న అడవి మొక్కలు గాలికి పూల తలలను కొద్దిగా కదుపుతున్నాయి. ఏ మూలనుంచో ప్రాతఃకాలపు చలిగాలితో అడవి మల్లెపూలవాసన గుప్-మంటోంది.

శాస్త్రిజీ చటుక్కున ఆగి అన్నారు - "ఇలాంటి శాంత వాతావరణంలో - శీతల వృక్షచ్ఛాయల్లో మన మునీశ్వరులు వేదం పలికారు. ఉపనిషత్తులు గానంచేశారు. శాస్త్రాలు నిర్మించారు. శిష్యులకు ఉపదేశించారు. జాతి పువ్వులంగా బ్రతికున్న రోజు లవి. ఇప్పుడా? — టైమ్ టేబిల్లూ నౌమట మొహం కొయ్య బెంచీలూ, గుడి గుడి కుంచం పరీక్షలూ! 'పులి పొట్ట చలి

చీమల పొట్టయయ్యో'. బాగా అన్నాడు మహాకవి."

విద్యార్థులు పకపక నవ్వి ముందుకు సాగారు. ప్రదేశం సమతలంగా ఉంది. కొండవాగు దగ్గరయింది. అంతా ప్రకృతి మాత ఒడిలో పసిపిల్లల్లా మారిపోయారు.

అందులో ఎవ్వరికీ తాము బి. ఏ. చదువుతున్నామనిగాని, పట్టణంలో – కాలేజీలో పొందే నాజూకుతనం మాటగాని, జ్ఞాపకం లేదు.

భద్రం షర్టువిప్పి భుజంపై వేసుకుని నీటి దగ్గరకు దిగిపోతున్నాడు. 'మధు' కోటు ఏదో చెట్టుకొమ్మకు తగిల్చి, రెండు పువ్వులుకోసి బూరా ఊదుతున్నాడు.

ప్రకాశం, మహేశ్వర్, నారీణ ఇత్యాదులు పంచెలు ఎగగట్టి, తువాళ్లు తలకుచుట్టి, అడవి కుంకుడుచెట్లమీద ఆటలకు ఎగబడ్డారు. కామేశ్వర్ ఆ యేడాది యూనివర్సిటీ ఎగ్జామినేషన్‌లో ఫస్టుక్లాసు కొట్టెయ్యాలని నీటివారలంట 'సరస్వతీ ఆకు' కోసం వెతుకుతున్నాడు.

సమీపంలో చిన్న పురాతన శివాలయముంది. శాస్త్రీజీ దానిలో విశేషాలు చూడ్డానికెళ్లారు. ఎన్నాళ్ళనుంచో దానికి పూజా పునస్కారాలున్నట్టులేదు. ముఖమండపంమీది రాతి పలకలు కూలుతున్నాయి.

మండపస్తంభం మీద నాగరి లిపిలో శాసనం ఒకటి కనపడ్డది. శాస్త్రీజీ దాన్ని ఎలాగైనా చదువుదామని ప్రయత్నించారు కాని కొరుకుపడలేదు.

శివరాత్రికి వచ్చిన శ్రీభక్తులు అరటి పళ్లు పిసికి, నందిముఖానికి రాయగా మిగిలిన చేతులను, ఈశాసనంమీద భక్తితో తుడుచుకోడం మామూలు. అరటిపండ్ల ముద్ద అక్షరాల మధ్యదూరి గడ్డకట్టి వాటిపోలికేమీ తెలియనివ్వడం లేదు.

"గర్భదరిద్రులు... నానాకశ్మలం కాని నిక్షేపంలాంటి శాసనం తగలెట్టారు" అని శాస్త్రీజీ గొణుక్కుని, దేవాలయం మెట్లమీద చదికిలబడి ఎదుటపారే వాగునూ, రంగురంగుల రెక్కల్తో శ్రావ్యంగా రొదలు చేస్తూ ఎగిరే పక్షులనూ చూస్తున్నారు.

ఇంతట్లో స్టూడెంట్సు 'అడవి' అంతా గాలించి, చూడవలసిన చెట్లుచూచి, త్రెంపవలసిన పువ్వులు త్రెంపి, జారవలసిన బండలమీదజారి, కొరకవలసిన కాయలు కొరికి, దేవాలయం దగ్గరికి చేరారు. మండపం సమీపిస్తూ ప్రకాశం ఆవేశంతో,

"ఏజోదు చిందెనో ఈరక్తగంధమ్ము,
విర్గలాలయశిలావేదులందు" అన్నాడు.

మధువెంటనే అందుకున్నాడు—

"ఏముండ పరచెనో ఇటసైనుపంచెలు
తతశిలాతలిని ముద్రలు రహించు."

సహాధ్యాయులు గొల్లుమన్నారు. శాస్త్రీజీ లేచి "భేష్! బాగుందోయ్! మంచి పేరడీ! కవితాశ్రేణిలో మంచి బ్రతుకుదెరువు కనిపెట్టావు" అని కొండవాగు వైపు అడుగులు వేశారు.

అంతా హాయిగా జల్లులాడుతూ స్నానాలు చేసి ఒడ్డున ఒక మర్రిచెట్టు క్రింద విశ్రమించి, టీ త్రాగి – పొగాయుధాలు వెలిగించారు. మధ్యాహ్నం 12 దాటింది. లేచి తిరుగు ప్రయాణ సన్నాహం చేసి నెమ్మదిగా ఆటపాటల్తో ఒంటిగంటకు బస్సుస్టాండుకు చేరారు.

కాని......

వెళ్లవలసిన బస్సు వెళ్లిపోయింది.

* * *

ఎటుపోడానికీ తోచలేదు. సింహాచలం పెద్దపట్టణం గాదు, పల్లెటూరూ గాదు. అప్పుడే ఒకవైపు త్రోసుకొచ్చే బస్తీ లక్షణాలు, ఒక చెంప పూర్తిగా విడిచిపోని పల్లెటూరు చిహ్నాలు కలిసి పెనుగులాడుతున్నాయి — పట్నవాసపు పురోహిత పుత్రుని పిలకా, క్రాపులాగ ... కాఫీ హోటళ్లో ఇంకా భోజనాల యేర్పాటు కాలేదు. శాస్త్రీజీకి ఏమీఊసుపోలేదు.

స్టూడెంట్సు స్టాండు ప్రక్క పడున్న ప్రాతబస్సు కొయ్యసీట్లమీద చదికిలబడ్డారు. ఫాస్టు ట్వంటీయెత్ సెంచరీ ప్రాణాలు!

అయిదు నిమేషాలు అటూ ఇటూ చూసి భద్రం అన్నాడు – "ఇక్కడికి మైలున్నర

(35-వ పేజీ చూడుడు)





శ్రీ నోరి నరసింహశాస్త్రి

౪౮

మహాశివరాత్రినాటి రాత్రి సోమనాథదర్శనము చేయించి మహాదేవరాజును ప్రక్క నున్న గదిదారిన బంపిరికదా! ఆ ప్రక్క గదిలో పలువురు పరిచారకులు కలరు. మహాదేవరాజు గదిలోనికి రాగానే వారందరును భయభక్తులతో లేచి నమస్కరించి విశేష గౌరవముతో దారి చూపుచు నొక చిన్న ద్వారమునొద్దకు తీసికొని పోయి యది తెరచిరి.

ఆ ద్వారము నావల కటికచీకటిగా నున్నది. ఆ ద్వారమున బయటికి బోవుటకు ఇంచుక సంశయించుచు మహాదేవరాజొక త్రుటికాలము లోపల నిలిచెను. వెంట నున్నవారు మిక్కిలి గౌరవముతో "ఏమి, మహాప్రభూ, చీకటిగా నున్నదా? వెలుగు తెత్తుమా?" అని యడిగిరి.

మహాదేవరాజుకు భయపడుచున్నట్లు తనను వారు భావించిరని తోచెను. అందు కాతనికి అభిమాన మనిపించెను. "వెలుగెందుకు? అవసరము లేదు!" అనుచు నాతడు ఆ ద్వారము దాటి చీకటిలో రెండడుగులు వేసెను.

రెండడుగులు కాదు, ఒక్క అడుగే! ఆ ఒక్క అడుగుకే అతడు ముందుకు పడిపోయెను. ఎంత లోతుకు పడిపోయెనో అతడెరుగడు. పడిపోవుచున్నను అతడొక కేకకూడ వేయలేదు. మహాదేవరాజు ప్రమాదావస్థలో నైనను ఆర్తుడై కేక వేయునా!

అతడు పడిన ప్రదేశములో నదృష్టవశమున జల మున్నది. కాని లోతుగా లేదు. పడిన మొదటిపాటుకు అతడు దిమ్మరపోయెను. ఒక్క క్షణములో స్మృతి వచ్చినది. రోషోగ్రుడై యాతడా నీటిలో పైకి లేచుటకు ప్రయత్నించెను. అది యొక విశాల మగు బలపు రాతి గది. గోడలు నున్నగా నుండి పైకి ఎక్కుటకు ఎక్కడను ఎట్టి పట్టును ఇచ్చుటలేదు. ప్రాకుట కన్నిమారులు ప్రయత్నించి సాధ్యము కాక జారి నీటిలో పడిపోవుచుండెను.

అంతలో మరల తాను పడిపోయిన ద్వారము తెరచిన చప్పుడైనది. మరల బయట ఏవో మాటలు వినబడినవి. మరుక్షణమున మరియొకరి దేహము నీటిలో పడిపోవుట మహాదేవరాజుకు వినబడెను.

మహాదేవరాజా నెట్టి యపాయస్థితిలో నున్నందు కట్టి భయమును పొందుట లేదు. ప్రాణత్యాగమునకు వెనుదీయని వీర వంశములో జనించినవా డాతడు! మహారాజుల యల్లు డగు తాను ఈ నీచస్థితిలో నీటిలో దొగుచు నుండు ననాథస్థితికి అభిమానముగా నున్నది. ఇట్టి స్థితిలో తా నుండుట మరియొకరు చూతురే యని సిగ్గుతో అతనికి ప్రాణమే పోవుచున్నట్లున్నది. అందుచేత నాతడు ఎట్టి సవ్వడియు జేయక ఆ పడిపోవు మనుష్యునకు దూరముగా నుండెను.

అట్లు పడిన రెండవ వ్యక్తి ప్రసాదాదిత్యనాయడు! అతని యనుభవమును మహాదేవరాజువలెనే ఉండెను. దిమ్మెరపోయిన వాడు లేచి గోడలు పట్టుకొని పైకి ప్రాకుటకు ప్రయత్నించెను. అట్లు ప్రయత్నించి పడుచుండుటలో నాతనికి తనతోపాటు మరియొక వ్యక్తి యందులో నున్నట్లు తోచెను.

"ఎవరు?"

మహాదేవరాజు మాటాడలేదు. సిగ్గుతో నాతని సర్వావయవములు కుంచుకొనిపోవుచున్నవి. అతడు మాట్లాడకుండుటతో ఎవరో శత్రువను సందేహము ప్రసాదాదిత్యనాయకునకు తోచెను. వెంటనే యాతడు తన యొరలో నున్న ఖడ్గము పెరికి పొడిచి వేయుటకు సిద్ధముగా నుండి క్రోధావేశముతో , పలికెను. తనను మోసముచేసినవారిపై గల కోప మంతయు నిట్లు రూపొందెను.

"ఎవరు? వెంటనే చెప్పనిచో పొడిచివేసెదను!"

ఈ మాటు మహాదేవరాజుకు ఆ కంఠము గుర్తు వచ్చెను. ఈ స్థితిలో తన కాప్త డగు ప్రసాదాదిత్యనాయనితో కలహించుటా? లజ్జతో గద్గద మగు కంఠముతో మహాదేవరాజు పలికెను.

"నాయకా! నేను!"

ప్రసాదాదిత్యనాయుడు ఆ గొంతు విని ఒక్కక్షణ మాగెను. గుర్తు వచ్చినది. అతని కోపపు మైకము దిగిపోయెను. కత్తి యొరలోనికి పోయినది.

"క్షమించుము, మహాదేవరాజా! మీకుగూడ ఈ యవస్థ వచ్చినదా?"

వారు మాటాడుకొను నవకాశము లేదు. మరల పైని ద్వారము తెరచిన చప్పుడు! మరల మాటలు! మరల నొక వ్యక్తి పడిపోయెను. మరల ద్వారము మూసికొనెను.

ఈ మారు పడిపోయిన వ్యక్తి లేచి గోడలు ప్రాకయత్నింప నవసరము లేకపోయెను. అతడు పడిన వెంటనే ప్రసా

దాదిత్యనాయకుడును మహాదేవరాజును దగ్గరకు పోయి లేవదీసి యాతని సాదరముతో ప్రశ్నించిరి. ఈ మారట్లు పడిపోయినది రుద్రమనాయకుడు.

తలుపు మరల మరల తెరచికొనసాగెను. ప్రోలశాతు పడిపోయెను. నాగదేవనాయకుడును పడిపోయెను. వల్లభనాయకుడు పడిపోయెను. మరల పైన తలుపు తెరచుకొనెను. ఈ మారు ఆ బయట నున్న వ్యక్తి ప్రక్క నున్నవారిపై కేకలు వేసెను. అంతలో నక్కడ చిన్న పోరాటము జరిగిన టున్నది. పలువురు కలసి యా వ్యక్తిని బలవంతముగా లోపలికి త్రోసివేసిరి. ఈమారు పడినది మేచయనాయకుడు !

మేచయనాయకుడు పడినవెంటనే అందులో నెవ రున్నదియు తెలిసికొనెను. అంతట నాతడా చీకటిలో వీలయినంత వరకు నా గదిస్వభావము తెలిసికొనుటకు ప్రయత్నించెను.

ఆ గది మూడుబండ్ల లోతున నున్నది. అందులో నీ రున్నను అది బావి కాదు. ఈమధ్య గాలివానచే కురిసిన విశేషవర్షముచేత నడుములబంటిగా నీ రూరినది. ఆ నీరు లేకున్న నా మెవ్వరును జీవించియుండుట సాధ్యము కాదు. ఇందులో పడినవారు జీవనములతో నుందు రని పైవా రనుకొనరు. "అందుచే మనమందరమును జీవించియున్నట్లు సందేహము పైవారికి కలిగింపరాదు !"

కొంతవడి నొకరితర్వాత నొకరు పైనుండి వ్యక్తులు పడుచునేయుండిరి. ఏకశిలానగరములో తలగలవారందరును నీ రూరిన యా చీకటి నేల కొట్టులోననే పడిపోయి యుండిరి. పై తలుపు మూసికొన్నది. ఎంతసేపైనను మరల నది తెరచుకొనలేదు. అది యిక మరల తెరచుకొనదని తేలిపోయినది.

అప్పుడు మేచయనాయకుడు అందున్న పెద్దలందరకును నమస్కరించి తన నిర్ధారణ తెలియజేసెను.

"మన మిప్పు డిందుండి ప్రాణములతో బయటపడుదుమని యాశింపరాదు. నగరములో పెద్ద ప్రమాదము లేవో యిప్పుడు జరుగుచుండవలెను. ఏకశిలానగరమున కిప్పుడు తగు రక్ష లేదు. మాకు వార్తలు తెచ్చువారే పలువురు మోసగాండ్రని స్పష్టమైయినది. జైనకరణములు రాజ్యాంగములో అల్లుకొని పెనవేసికొని యుండుటచే ఏ వార్త నమ్ముటకును ఏ వార్త నమ్మకుండుటకును సాధ్యము కాకున్నది. భగవంతుడు గణపతిదేవులను ప్రతాపరుద్ర కుమారులను ఈ రాత్రి కాపాడును గాక!"

తాము పడియున్న ప్రదేశము నూపుతో వాకిలికి మూడు బెండ్ల లోతున నున్నదని మేచయ తన నూహించెను. కాని యది చీకటిలో చూపు! అందుచే నది నిర్ధారింపదలచి గోడల నాని యొకరి భుజములపై నొకరిని నిలుచుండ జేసి, వారి క్షమాభిక్ష కోరుచు, మేచయ స్వయముగా నా పైవాని భుజములపై తానెక్కి చూచెను. అతని కిప్పుడు ద్వార మందినది. దాని నాతడు ముందు నెట్టి చూచెను. ఏమియు సందీయలేదు. వెనుకకే తెరచుకొనుచున్నట్లున్నది. చీకటిలో చేతితో తడవి చూచి, దాని యంచు లుపలక్షించి కొంచెము నెమ్మదిగా నది లాగి చూచెను. అది యించుక వెనుకకు వచ్చి యంతట నాగిపోయినది. బయట గొళ్ళెము వేసి యున్నదని యాతడు నిశ్చయించెను. ఈ దారి ప్రస్తుతము లాభము లేదు! నెమ్మదిగా నాతడు మరల నీటిలోనికి దిగిపోయెను.

ఆ ద్వారముగాక మరియొక ద్వార మేమైన నున్నదేమో యని యాతడు గోడలన్నియు పరీక్షించెను. ఏమియు నగపడలేదు.

కాని యా గోడలు కట్టిన పనివారు పరంజ కట్టుకొనుటకు గోడలలో నుంచిన కంతలు మాత్రము పూడ్చియుండలేదు. ఆ కంతలలో క్రింది వానినుండియే సన్నగా నీ రాగదిలోనికి కారుచున్నది. మేచయకు సందేహమైనది. ఆ గది నీటితో నిండిపోయిన?

"ఇక్కడ నందరికి ఈత బాగుగా వచ్చునా?"

"వచ్చును — వచ్చును — వచ్చును." అను గుసగుసలు వినవచ్చెను. రాదను శబ్దము రాలేదు. దానితో మేచయకు ధైర్యము కలిగెను. ఆ కంతలు పొడిచి దారికై తాము ప్రయత్నించునెడ నేదైన జలప్రవాహములోనికి వచ్చునెడల నేమగును? ఇప్పుడా భయము లేదు.

ఇక్కడ తామెంతసే పుండగలరు? తల యెత్తి పరీక్షించెను. కప్పుపైనుండి అక్కడక్కడ నక్షత్రములు కానవచ్చుచున్నవి. ఊపి రాడుట కొంత కష్టముగా నున్నది. కాని గాలికి దారి లేక పోలేదు. లోపల నున్నవారికి అవసరమగుచో ఆహార మందిచ్చుటకై కంత లుద్దేశింపబడినవి. తాము జీవించియున్నది లేనిది యుపలక్షించుటకుగూడ నవి యుపయోగింపగలవు.

ఎక్కడ నేదైన శబ్దము వచ్చునేమో యని యాతడాలకింప సాగెను. శబ్దము లేదు. అతడు చేయుచున్న ప్రతికార్యమునందును అతని యల్లుడగు నాగదేవనాయు డాతనికి సహాయమగుచుండెను. మహాదేవరాజు మధ్యమధ్య కోపముతో పండ్లు పటపట కొరుకుచుండెను.

చిక్కటి ప్రొద్దుపోయినది. వారి దేహములన్నియు నలసట చెందియున్నవి. నిద్రాభారము దుర్భరమగుచున్నది. అక్కడ నున్న వారిలో పలువురు గోడలకు చేరగిలబడి కూర్కసాగిరి. ఆ కునుకుటలో ఒక్కొక్కసారి నీటిలోనికి జారిపోయి దేహము లంతయు తడిసిపోయి దీనావస్థలో మరల లేచుచున్నారు. కాని యిట్లెవరును నిద్రించుట లేదు.

రాత్రి మూడుజాము లైనట్లున్నది. అప్పుడు వారి కేదో నేల యదరుచున్న శబ్దమువలె వారికి వినవచ్చెను. అది యంతకంత కెక్కువ యయ్యెను. పైన నేదో మహాయుద్ధము జరుగుచుండవలె! శ్రీరుద్రదేవమహారాజుల సేనలకు జయ మర్థించుచు ఆ పాతాళ గృహములోని నాయకులు మహాదేవుని ప్రార్థించుచుండిరి. కాని శ్రీరుద్రదేవమహారాజుల పక్షమున పోరుటకు పెద్ద సేనలు నగరములో లేవు. రేచర్లవారి బలము లున్నవి. వారు రాజభక్తి కలవారైనచో నీ పాతాళగృహములో నుండవలసినది. లేరు గనుక వారిపై నాధార పడుట సాధ్యముకాదు. పూర్వము గణపతిదేవులు దేవగిరి చెరసాలలో నుండగా కాకతీయసామ్రాజ్యమును రక్షించి 'కాకతి రాజ్యభారధౌరేయు'డని ప్రసిద్ధివహించిన రేచర్ల రుద్రసేనాని వంశమున నెట్టి రాజద్రోహు లిప్పు డుదయించినారు!

అంతకంతకు యుద్ధము భయంకరమైనట్లున్నది. ఆ ప్రదేశమునకు దడదడలాడు నొక శబ్దము తప్ప మరియేమియు రాలేదు.

అంతలో తాము ఇందులో పడకముందు ఉన్న గదిలో పలువుర యడుగుల చప్పుడు వినవైనది. ఎవరో సత్వరమున ద్వారము తీసినారు. లోపలికి రాబోయి యా వ్యక్తి తనతోపాటు పడిపోయినది. అట్లు పడిపోవుచు నా వ్యక్తి యార్తస్వర మొనర్చెను. "అయ్యో, అన్నా—!" అది యొక స్త్రీ కంఠముగా మేచయకు భాసించెను. పూర్వపరిచితమగు కంఠమువలె కూడ నాతనికి తోచి

(33-వ పేజీ చూడుడు)

పశుపక్ష్యాదుల్లో జ్ఞాపకశక్తి

(క్రావెన్ హిల్)

★

ఏనుగులకు జ్ఞాపకశక్తి అధికమని చెప్తారు. అయితే ఇతరజంతువులకు, పక్షులకు కూడా జ్ఞాపకశక్తివుంది. ఇంగ్లండులోని ఒక జంతుప్రదర్శనశాలలో ఒక ఏనుగును గురించి చిత్రమైన కథ చెప్తారు. సాయంకాలంవేళ ఏనుగుల్ని అక్కడ నడిపిస్తూ ఉండడం మామూలు. అలా ఒకరోజున నడిపిస్తూఉండగా ఒకనల్లకోతి కనిపించింది. కోతినినడిపిస్తున్న వానివద్ద ఎండిన రొట్టెముక్కలున్నాయి. ఒకటితీసి ఏనుగుకి ఇవ్వ చూపాడు. ఏనుగు తొండంచాపి అందుకో బోతున్న సమయంలో, కోతి తన ఉదారబుద్ధి ప్రకటిస్తూ, ఒక గులకరాయితీసి సరిగ్గా ఏనుగు తొండం కొసకుతగిలేలా విసిరి కొట్టింది. ఏనుగుసరిగ్గా చూసుకోలేదు. రొట్టెముక్కనీ, గులకరాయినీకూడా అందుకుని కొరికింది. పంటికి రాయి తగలగానే ఏనుక్కి ఎక్కడలేని కోపం వచ్చింది. కోపంతో ఆ బెడ్డనే తీసి గురిచూసి కోతిని కొట్టింది. అది మొదలు ఆ నల్లకోతి కనిపిస్తేచాలు వెంటనే బెడ్డచేతికి తీసికొంటుంది.



అది వినగానే ఆ చిలక హిందూస్తానీలో గబగబా వాగడం మొదలెట్టింది.

తనకు ఆనాడు జరిగిన అవ[illegible] ఈనాటివరకూ మరిచిపోలేదు.

కొన్నియేళ్ల క్రిందట చిరుతపులి జ్ఞాపకశక్తిని పరీక్షించడానికి వీలైన అదును దొరికింది. లండన్ జూలోకి వచ్చేటప్పటికి ఆ చిరుతపులి అనారోగ్యంతో బాధపడుతుండేది. ప్రతిదినం ప్రత్యేక ఆహారం ఏర్పాటుచేసి ప్రత్యేకంగా వ్యాయామం చేయించవలసి వచ్చేది. ప్రతిదినం మెత్తని రొట్టెలు పెట్టడానికి ఒకడు వచ్చేవాడు. అయితే ఒక తమాషా చేసేవాడు. చేతిలో రొట్టెముక్క చూపించి చిన్న గదిలోకి పరిగెత్తమనేవాడు. పరిగెత్తి అది అక్కడే ఉండాలి. మళ్ళీ అతను పిలిచినప్పుడు ఇనప ఊచల గదిలోకివచ్చి రొట్టె తీసుకోవాలి. ఈ విధంగా ప్రతిరోజూ జరిగేది చిరుతపులికి ఆరోగ్యం కుదిరిన తరవాతకూడా ఇలాగే కొన్నాళ్ళు జరిగింది. తరవాత కొన్నాళ్ళకి అతను దూరదేశం వెళ్లిపోయాడు. నాలుగేళ్ళవరకూ రాలేదు తిరిగి వచ్చిన తరువాత జూకివచ్చి రొట్టెముక్క చూపించాడు. రెండో చేత్తో పక్క చిన్న గది చూపించాడు మొదట సంకోచించింది చిరుతపులి రెండుమూడు సార్లు చేతితో సంజ్ఞ చేసిన తరువాత, అప్పుడు జ్ఞాపకం వచ్చింది చిరుతపులికి. గబగబా పక్కగదిలోకి వెళ్లింది. అతను పిలిచిన తరువాత ఊచల గదిలోకి వచ్చి రొట్టెముక్క అందుకుంది.

పక్షుల్లోకూడా అప్పుడప్పుడు ఆశ్చర్యకరమైన జ్ఞాపకశక్తి కనిపిస్తుంది అన్నిటికీ చిలక్కి జ్ఞాపకశక్తి అధికం. తనను పెంచిన మనుషుల్ని కొంతకాలం చూడకుండా తరువాత చూసినట్లయితే ముఖాలు చూసి గుర్తుపట్టగలదు చిలక. మనుషుల్నే కాదు. కొన్ని కొన్ని సంఘటనల్నికూడా గుర్తు పెట్టుకోగలవు.

యుద్ధకాలంలో ఒకరోజురాత్రి లండన్ మీద శత్రు విమానాలు దాడిచేశాయి. రంయిని సైరెన్లు మోగాయి. [illegible] జూకి దెబ్బ తగిలింది. ఒక చిలక పంజరం విరిగి



ండంతో ఆ బెడ్డతీసి ఏనుగు గురిచూసి కోతిని కొట్టింది.

పోయింది. పంజరంలోవున్న రెండుచిలకలు ఎగిరిపోయాయి. కాని మళ్ళీ ఆ రెండు చిలకల్ని పట్టుకోడానికి అట్టే కష్టం లేకపోయింది. అది మొదలు సైరన్ కూతవినిపించిందంటే, పంజరం విరుగుతోందనుకుంటాయి కాబోలు, ఆ చిలకలు పంజరంలో ఇటూ అటూ ఎగుర్తూ రభస చేస్తాయి.

కొన్నేళ్లకిందట ఒక ఆఫ్రికన్ చిలక లండన్ జూకి వచ్చింది. ఆఫ్రికాలో ఆ చిలక భారతదేశీయుల పెంపకంలో వుండేది. కొద్దిగా హిందూస్తానీ మాటలు నేర్చింది. లండన్‌లో హిందుస్తానీ చాలా కాలంవరకూ వినపడలేదు. చిలకకూడా హిందూస్తానీ మాట్లాడ్డం మానేసింది. పన్నెండేళ్ల తరవాత ఒకరోజున కొందరు భారతీయులు లండన్ జూకివచ్చి చూస్తున్నారు. ఇద్దరు స్త్రీలు ఈ చిలక పంజరంవద్ద నిలబడి హిందూస్తానీలో మాట్లాడుకుంటున్నారు. అది విని చిలక గబగబా హిందూస్తానీలో వాగడం మొదలెట్టింది. భారత స్త్రీలు ఆశ్చర్యపడ్డారు. చిలక హిందూస్తానీ భాషాజ్ఞానం తిరిగి జ్ఞప్తికొచ్చింది.

[ఎడింబర్గ్ ఛేంబర్స్ జర్నల్.]


సెప్టెంబరు 15
ప్రారంభము
మెస్. బి. ప్రొడక్షను వారి
అద్భుత పౌరాణిక చిత్రము
మాయారంభ
అంజలిదేవి • జి. వరలక్ష్మి
శ్రీరంజని (జూనియర్) లక్ష్మీరాజ్యం
రఘురామయ్య • శివరావు
N.T. రామారావు • సి. యెస్. ఆర్
నటించినది
డైరెక్టర్: టి.పి. సుందరం
శ్రీ మారుతి — విజయవాడ
మినర్వా — కాకినాడ
మినర్వా — రాజమండ్రి
పాండురంగా — ఏలూరు
సత్యనారాయణ — తెనాలి
రాధాకృష్ణ — గుంటూరు
చాంద్ — కర్నూలు
రౌనఖ్ — కడప
రఘువీర్ — అనంతపురం
వినాయక్ — నెల్లూరు
20-9-50 మొదలు
మినర్వా — విజయనగరం
22-9-50 మొదలు
బృందావన్ — మచిలీపట్నం
తరువాత చిత్రం
మినర్వా — విశాఖపట్నం
రాయల్ — బళ్లారి

భూమాత, గోమాత, గంగామాత

[శ్రీ గోపరాజు రాజన్న]

ల్లికంటె వేరే దైవం లేదని శాస్త్రాలు ఘోషిస్తున్నవి. బిడ్డలను రక్షించడానికి మాతృదేవత సర్వస్వం ధారపోస్తుంది; అవసరంవస్తే ప్రాణంకూడా ఒడ్డుతుంది.

భారతదేశప్రజలు భూమిని, గోవును, గంగానదిని మాతగా పరిగణిస్తున్నారు. అందువల్లనే 1905 వ సంవత్సరంలో బెంగాల్ రాష్ట్రంలో ప్రారంభమయిన స్వదేశోద్యమంలో నాయకులు "భూమాత, గోమాత, గంగామాత"లను పురస్కరించుకొని ప్రజలకు ఉద్రేకం కలిగించి, దేశాభిమానం, స్వరాజ్య తృష్ణ పుట్టించారు. అందుకనుగుణ్యంగా "వందేమాతరం" జాతీయ గీతం రచింపబడింది.

యుగయుగాలనుంచీ హిందువులు గంగానదిని పూజిస్తున్నారు. గంగనీరు కంటె పవిత్రమైనది మనదేశంలోనే కాదు ప్రపంచంలోనే లేదని వారి నమ్మకం. కవులు, గాయకులు, గంగను వేయివిధాలస్తుతించారు. ఋషులు గంగ ను నెత్తి మీద పెట్టుకున్నారు.

క్రతువులకు, యజ్ఞములకు, సర్వకర్మలకు గంగనీరు ఆవశ్యకం. నేటికీ గంగాస్నానానికి ఎంతో ఫలితం వుందని పండితులు చెబుతున్నారు. గంగాస్నానం నిమిత్తం ఆసేతు హిమాచలంనుంచీ ప్రజలు యాత్రచేస్తారు. గంగను దర్శనం చేస్తే చాలు. ముక్తికలుగుతుందని వారి నమ్మకం.

ఇంతేకాదు. గంగ సర్వరోగనివారిణి; సంజీవి. ఈ విధంగా ప్రజలు నమ్ముతున్నారంటే నవనాగరికులు కొందరు ఇది పిచ్చి నమ్మకం అనీ, మూఢవిశ్వాసమనీ కొట్టివేస్తున్నారు.

మహమ్మదీయచరిత్రకారులు, పాశ్చాత్య శాస్త్రజ్ఞులు పరిశోధనలుచేసి వారివారి అనుభవాలు పొందుపరచి ఉన్నారు.

"ఐనీ అక్బారీ" అనే మహమ్మదీయ గ్రంథంలో గంగను గురించి మూడువిషయాలు చెప్పబడినవి:

1. గంగలో స్నానంచేసినా, గంగనీరు త్రాగినా సంపూర్ణారోగ్యం కలుగుతుంది.

2. చెంబులో పోసి ఎంత కాలం వుంచినా, గంగనీరు చెడిపోదు.

3. ఇట్టి ప్రాశస్త్యం ఉండడంచేతనే, ఎక్కడెక్కడివారూ గంగను ఇళ్లకు తీసుకపోయి, భద్రంగాఉంచుకొని, అమూల్య వస్తువుగా వాడుకొంటున్నారు.

ఔరంగజేబు చక్రవర్తికి అనేకమంది వైద్యులుండేవారు. అందులో ముఖ్యుడు "మనౌషీ". ఇతడు యూరపుదేశస్థుడు. వెనిస్ నగర వాస్తవ్యుడు.

మొగలాయీ సామ్రాజ్యపు విశేషాలను గురించి వ్రాస్తూ ఈ విధంగా చెప్పాడు:

"హిందువులు గంగను పూజిస్తారు. గంగా జలములు సర్వ పాపములూ నశింపజేస్తాయి.

"తన సామ్రాజ్యంలో సాటిలేని మణివంటిది గంగానదియని అక్బరు చక్రవర్తి అనేవాడు. అట్టి శ్రేష్ఠతమమైన నదియొక్క వ్యుత్పత్తి కనుక్కోవలసిందని ఆరితేరిన ఇంజనీర్లను నియమించాడు."

మహమ్మదీయ చక్రవర్తులు గంగనీరు తప్ప ఇంకో నీరు త్రాగేవారు కాదని "టెవెర్నియర్" అనే మరియొక పాశ్చాత్య పరిశోధకుని వ్రాతలవల్ల తెలుస్తుంది. ప్రతిదినం కొన్ని ఒంటెలు రాజమందిరానికి గంగనీరు తీసుకొని వెళ్ళేవి. వీటి పని రోజూ గంగనీరు మోయడమే.

గంగానదిలో శవాలు రోజూ కొట్టుకు పోతూవున్నా, నీరు, క్రిములు లేకుండా, పరిశుభ్రంగా ఉండడంవల్లనే, గంగను అన్ని కులాలవారూ, మతములవారూ పూజిస్తున్నారని అతడు వ్రాసియున్నాడు.

పదకొండవ శతాబ్దంలో సోమనాథ దేవాలయమును సుల్తాన్ మహమ్మద్ గజినీ ధ్వంసం చేసిన సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఆ పురాతన దేవాలయమును "ఆల్బెరునీ" వర్ణిస్తూ, అక్కడ జరిగే పూజా పునస్కారముల విశిష్టతను కొనియాడి, అట్టి దేవస్థానానికి కలిగిన విపత్తుకు వాపోయాడు. వెయ్యిమంది బ్రాహ్మణులు ప్రతినిత్యమూ పూజ చేసేవారు. ప్రతి రాత్రీ గుడిలో దేవుని అప్పటికప్పుడు తెచ్చిన గంగనీరుతో స్నానం చేయించేవారు. గంగానది సోమనాథ్‌కు 600 మైళ్లకు పైగా ఉన్నా, దేవస్థానానికి ఆ నది నీరు వాడడంచేత, గంగలో ఎంత మహత్తువున్నదీ ఊహించవచ్చునని "ఆల్బెరునీ" అన్నాడు.

1695-వ సంవత్సరంలో "ఖులాసత్ వారిక్" అనే పెర్షియన్ గ్రంథం ప్రచురింపబడింది. గ్రంథకర్త గంగనుగురించి పూసగ్రుచ్చినట్లు ఈ క్రింది విధంగా వ్రాశాడు.

"గంగనీరు కుండలోపోసి సంవత్సరం వుంచినా, వాసనరాదు, రంగుమారదు.

"సాధు సత్తముల హృదయాల మాదిరిగా గంగ నిష్కల్మషమైనది. ఋషి పుంగవుల పవిత్రాత్మల మాదిరిగా తేజోవంతమైనది.

"గంగలో ఇంత పరిశుద్ధత ఉండడంచేత ఆ నీరు అన్ని తత్వాలకూ పడుతుంది.

"గంగ ఆరోగ్యం ఇస్తుంది. బలహీనులకు బలం యిస్తుంది. దీర్ఘవ్యాధుల్ని కుదురుస్తుంది.

"ఆరోగ్యవంతులకు కండపుష్టి, ఉత్సాహం కలిగిస్తుంది.

"ఆకలి పుట్టిస్తుంది. కామోద్రేకం కలిగిస్తుంది.

"పాలిపోయిన వారికి రక్త వృద్ధి కలిగిస్తుంది.

"అనారోగ్యులకు ముఖవికాసం పెంపొందిస్తుంది.

"ఇందుచేతనే భారతదేశపు రాజులు ఎల్లప్పుడూ గంగ నీరు త్రాగుతారు."


బ్రిటిష్ రాయల్ సొసైటీ సభ్యుడు డాక్టరు నెల్సన్ గంగను గురించి స్వానుభవం ప్రపంచానికి వెల్లడి చేశాడు.

కలకత్తానుంచి ఇంగ్లాండుకు పోయే ఓడలు గంగ నీరు తీసుకుపోతాయి. గమ్యస్థానం చేరేవరకూ ఓడలోనివారికి త్రాగడానికి ఈ నీరే. గంగా జలం చెడిపోదు.

లండన్‌నుంచి బయల్దేరే ఓడలు అక్కడ థేమ్సునది నీరు తీసుకువస్తాయి. కాని ఆనీరు మధ్యదోవలోనే కంపు కొడుతుంది. కనుక మార్గంలో తగిలే "సయ్యద్" రేవులోనైనా, "ఏడెన్" రేవులోనైనా ఆ నీళ్లు పారబోసి కొత్త మంచినీళ్లు తీసుకుంటారు.

ఈ సంగతి డాక్టరు నెల్సన్ చూశాడు. అతడూ మరికొందరు శాస్త్రజ్ఞులూ, వివిధ ఖండాల నదుల నీళ్ళను గంగతో పోల్చి చూశారు. అన్ని నదుల నీళ్లూ కొన్ని రోజులకు చెడిపోయాయి. గంగా జలం మాత్రం ఎంతకాలమయినా చెడిపోకుండా పరిశుభ్రంగానే ఉంది.

(40-వ పేజీ చూడుడు)




ఏనుగులశాల:—రాణుల అంతఃపురమున కావల నున్న ఈ శాలలో ఆంధ్రచక్రవర్తుల గజబలముల నుంచేవారు. ఏనుగుల సహాయముతోనే బ్రహ్మాండమైన శిలలను తెచ్చి ఆంధ్ర శిల్పులు తొలిచి, మలిచి అద్భుతసృష్టి చేసినారు.

★

హంపీ వెలుగు విన్నాణము

ఛాయాచిత్రకారులు శ్రీ డి. అన్నాజీరావుగారు. ఇక్కడ చేర్చబడిన పద్యభాగములు స్వర్గీయ శ్రీ కొడాలి సుబ్బారావుగారి 'హంపీ క్షేత్ర' కావ్యములోనివి.

హంపీ వెలుగ




★

పంపతీశ్వరాలయం

హంపిలో కెల్ల చెక్కు చెదర కుండా ఈనాటికీ నిల్చిన దేవాలయ మిదొక్కటే. ఇప్పటికీ ఇక్కడ పూజా పురస్కారములు నిర్వర్తింప బడుతున్నవి. ఈ దేవాలయ గోపురాన్ని శ్రీకృష్ణ దేవ రాయ లే నిర్మించినారని ప్రతీతి.

★

"ఆంధ్రసామ్రాజ్య
తెర జారిపోయిన చిన్నెలరసి
ములు బాసియు వేయి" అ
సుబ్బారావుగారు. హంపీ
మార్లుచూచినా తనివిదీరదు.
నపు తలపులు" ప్రతి ఒక్క
పుటముపెట్టి రగుల్చు" చ
మంట. "నిలిచినన్నాళ్లు
గినన్నాళ్లు మిరిమిట్లు గొ
పోయిన ఆంధ్ర వసుం
మనోవీధిలో సాక్షాత్కరింప
చిత్రములు కొంతవరకైన ఆ



పిట
అసం
ద్వా

★


"సరిగమ పధనిస స్వరవల్లకీ తుల్య
రవ విలోలా స్తంభరాగ ఘణి"

వీనిని సంగీతపు స్తంభాల
ప్రతి పెద్ద స్తంభంలోనూ
చొప్పున పిల్లస్తంభాలు ఏ
నవి. విట్ఠలాలయములోని ఈ
లను ఎక్కడ ఏ కొద్దిగా
మీటినా, ఆరోహణావరో
క్రమంగా సప్తస్వరాలు పలుక


ం విన్నాణము

టకాభ్యంతరమున చివర
" "బ్రతికియు వేయి, ప్రాణ
న్నరు స్వర్గీయ శ్రీ కొడాలి
క్షేత్రదృశ్యాలను ఎన్ని
"మన సామ్రాజ్య నాశ
ఆంధ్రుని "ఎ డ ద లో
న్నవి. ఈ మంట ఆరని
తీరు వెలిగినదియు, వెలి
ము" "చరిత్రలో మునిగి
పోజ్వల" వైభవ శ్రీని
చేసుకొనుటకు ఈ ఛాయా
ధారపడగలవు.

ఏనుగుల శాలలోని న డ వ. నడుచుచున్న బాలుని బట్టి శాల ఎంత ఎత్తున కట్టబడినదీ తెలుస్తుంది. నవీన యంత్రోపకృతులు లేకనే పెనుగొండ బండల నెట్లు అంత యెత్తుకెత్తి వీనిని నిర్మించినారో కాని పనివాండ్ర కౌశలవిధానము నేటికీ మనకు విదేశస్థులకు కూడ అచ్చెరుపు గొలుపుతున్నది.




లయానికి పోవుదారిలో
నిర్మింపబడిన బృహ



సినీ వార్త:

1949-50 లో ఉత్తమ తెలుగునటుడు నాగయ్య:



చెన్నపురి చలనచిత్ర వ్యామోహితుల సంఘంవారి బాలట్‌లో తెలుగు చలనచిత్రరంగంలో కల్ల ఉత్తమనటుడుగా శ్రీ చిత్తూరు నాగయ్య ఎన్నికైనాడు. రాజాజీహాల్లో 5వ తేదీ మంగళవారంనాడు మంత్రి గోపాలరెడ్డిగారి అధ్యక్షత క్రింద జరిగిన బహిరంగసభలో ఈ ఉత్తమనటునికి ఒక రజతప్రతిమ బహూకరింపబడింది.

టూరింగ్ సినిమాలకు దెబ్బ

'కాను'

మదరాసు ప్రభుత్వం ఫిలింపరిశ్రమలో వ్యవహారించేప్పుడు ఆచరించే విధానం చాల వింతగా కనిపిస్తుంది. ఒకవైపు బాధ్యతగల ప్రభుత్వాధికారులు ఫిలింపరిశ్రమను భారత దేశానికి ఒక భారీపరిశ్రమగా ఒప్పుకుంటున్నా విజ్ఞాన, విద్యాప్రబోధానికి అనుకూలపడుతూ ప్రజలనిత్య జీవితంలో అవసరంగా కనిపించే పరిశ్రమగా భావించుతువ్నా, మద్రాసు ప్రభుత్వం పరిశ్రమను దెబ్బకొట్టేచట్టాలను అమల్లోకి తీసుకురావడం అతి విడ్డూరమనిపిస్తుంది. ఈ విడ్డూరం ముఖ్యంగా యీమధ్య టూరింగ్ సినిమాలపై మద్రాసు ప్రభుత్వం పెట్టిన నిషేధాలు ఒకసారిచూస్తే గ్రాహ్యమవుతుంది.

కేవలం జనాభాను ఆధారంచేసుకుని సినిమాలు నడిపే సూత్రాన్ని యీ చట్టానికి మూలంగా చేసుకుందిప్రభుత్వం. 20, 30 వేలకు మధ్యజనాభాకల పట్నంలో ఒక పర్మినెంటుసినిమా, ఒక టూరింగ్ సినిమా, 30, 40 వేలకు మధ్యజనాభావున్న పట్నంలో రెండుపర్మినెంటు సినిమాలు ఒక టూరింగు సినిమా, 40, 50 వేలకు మధ్య జనాభాకల పట్నంలో రెండు పర్మనెంటు సినిమాలు, రెండు టూరింగ్ సినిమాలు వుండవచ్చుట. 50 వేల జనాభాకు పైబడ్డ పట్నంలో టూరింగ్ సినిమా పెట్టవలసివస్తే అది ఏ పర్మనెంటు సినిమాహాల్‌కు మూడు మైళ్ల దూరంలోపున వుండడానికి వీలులేదట. జనాభాను అంచనాకు తీసుకునేప్పుడు ఆపట్నం జనాభాగాకుండా దానికి మూడు మైళ్ల కైవారంలో వున్న పల్లెల జనాభానుకూడ లెక్కలోకి తీసుకోవాలి. ఆపట్నంగాని పారిశ్రామికవ్యాపారమతప్రాముఖ్యత గల దయితే, వచ్చిపోయే జనాన్నికూడ ఆపట్నం జనాభాక్రింద లెక్క తీసుకోవాలి.

టూరింగ్ సినిమా ఆరు మాసాలకంటె ఎక్కువకాలం నడుపుకోడానికి వీలులేదు. ఈ ఆరు మాసాల అనంతరం మళ్లా ఆ సినిమా నడుపుకోవాలంటె మూడు మాసాల వ్యవధి విధిగా వుండాలి. ఈ కాలంలో మరెవరూ లైసెన్సుకు దరఖాస్తు పెట్టుకోకపోతే మూడు మాసాలఅనంతరం ఆటూరింగ్ సినిమా నడుపుకోడానికి లైసెన్సిస్తారు. పర్మనెంటు సినిమాలున్న పట్నాల్లో టూరింగ్ సినిమాలకు లైసెన్సు లిచ్చేప్పుడు. పర్మనెంటు సినిమా యజమానుల అభ్యంతరాలు ఆలోచించవలసి వుంటుందట.

సినిమాలపై సెన్సరింగ్ పెట్టే యీనిర్బంధం మద్రాసు ఫిలిం పరిశ్రమకు ఓపెద్ద దెబ్బ అనాలి. సినిమాలపై సెన్సరింగ్ అంటే ప్రజలకు కావలసినవినోద విజ్ఞానాలపై సెన్సరింగన్నమాట. అందుకే యిది హర్షించదగ్గవిషయం కాక పోగా విచారించవలసినదికూడా అయింది.

ప్రభుత్వం అమల్లోపెట్టిన యీ నిర్బం

1949-50 లో ఉత్తమ తెలుగు, తమిళ నటీమణి భానుమతి



చెన్నపురి చలనచిత్ర వ్యామోహాతుల సంఘం వారి బాలట్‌లో తెలుగు తమిళ చిత్రరంగాలలో ఉత్తమ నటీమణిగా శ్రీమతి భానుమతి ఎన్నికయింది రాజాజీ హాల్లో 5 వ తేదీ, మంగళవారం నాడు మంత్రి గోపాలరెడ్డిగారి అధ్యక్షతక్రింద జరిగిన బహిరంగసభలో ఈ ఉత్తమ నటీమణికి రెండు రజతప్రతిమలు బహూకరింపబడినవి

థాలపై టూరింగ్ సినిమా ఎసోసియేషన్ అధ్యక్షుడు తన అసమ్మతిని తెల్పుతూ ఇటువంటి చర్యవల్ల అనతికాలంలోనే టూరింగ్ సినిమాలను మూసి వెయ్యవలసి వస్తుందనే భయాన్ని వెల్లడించాడు ఈయన భయపడినట్లు టూరింగ్ సినిమాల మూసివేతే జరిగితే టూరింగ్ సినిమాల ప్రచారంపై ఒక నిర్దిష్ట స్వరూపాన్ని ఏర్పరచుకున్న ఫిలిం పరిశ్రమకూడ దెబ్బతిన్నా మన మాశ్చర్యపడ నవసర లేదు

పర్మనెంటు సినిమాల కట్టడపై నిషేధమున్న యీరోజుల్లో ఫిలిం వ్యాపారాన్ని బాగా విస్తరింప చేయడానికి కేవలం టూరింగ్ సినిమాలే శరణ్యమని అందరూ గుర్తించిన విషయమే మద్యపాన నిషేధం అమల్లో పెట్టిన తరువాత సినిమాల అవసరాన్ని గుర్తించి టూరింగ్ సినిమాల స్థాపనకు ఎక్కువ అవకాశాలు కల్పించిన ప్రభుత్వ మిప్పుడు ఆటూరింగ్ సినిమాలపై యీ నిర్బంధాలు పెట్టడంలో అర్థం కనిపించదు ఈ నిర్బంధాలవల్ల పర్మనెంటు సినిమాలకు సర్వాధిపత్య మివ్వడమే అవుతుంది ఈథియేటరు యజమానులకు సర్వాధిపత్యం వున్నంతకాలం చిత్రాల పంపకంలో న్యాయం జరగదు తయారయిన అనేక చిత్రాలు ప్రదర్శనకు థియేటర్లు లేక టిన్నుల్లోనే మగ్గిపోవ నవస్తున్నది

ఈ చట్ట మేమన్నా అమలుచేస్తే ఒక్క పర్మనెంటు సినిమా యజమానికే లాభిస్తుంది అందువల్ల దీన్ని ఆతడు [illegible] కాని మిగతావారు చివరకు ప్రొడ్యూసరు కూడ చాల కలవరపడతాడు ఎందుకంటే తన చిత్రాన్ని విడుదల చెయ్యాల్సివస్తే సర్వాధిపత్యం వహించిన పర్మనెంటు థియేటరు యజమాని పెట్టిన షరతులకు తలవొగ్గాలి ఈ షరతులు ఎంత దారుణాలయినా అతని కిత్యంతర ఉండదు

అందుకే ప్రభుత్వం ఫిలిం పరిశ్రమ అభ్యుదయాన్ని కోరినట్లయితే ఆ విధించే నిర్బంధాలు థియేటరు యజమానులపైనా చిత్రాలపై వసూలుచేసే ఖర్చుం శేజ్ అద్దె చిత్రాలు నడిపే కాలంమీదా పెడితే తయారయిన చిత్రాల కన్నిటికీ విడుదలయ్యే అవకాశం కల్పించడమేగాకుండా వసూలయిన మొత్తం పంపకంలో కూడ న్యాయం జరుగుతుంది కాని ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా చర్య తీసుకుంది టూరింగ్ సినిమాలస్థాపన గిట్టని పర్మనెంటు

★



యూనిటీ పిక్చర్సువారి 'సాయిబాబా'లో
మన్నవ రామచంద్రరావు.

★

థియేటరు యజమానుల అభ్యంతరాలను ప్రభుత్వం మన్నించదలచింది. వారి అభ్యంతరాలకు అనేక అవకాశాలిచ్చి, తప్పుడు విధానానికి, పరిశ్రమకు హానికరంగా లాభాల సంపాదనకు మార్గాలు సమకూర్చింది.

పరిశ్రమలో బాధ్యతగల అనేక వ్యక్తులు అనేకసార్లు పరిశ్రమ అభ్యుదయం థియేటర్ల పెరుగుదలమీదనే ఆధారపడివుందని వక్కాణిస్తున్నా, ప్రభుత్వం ఇటువంటి చర్య తీసుకోడం చాలా ఆశ్చర్యంగావుంది. ఈచర్య పరిశ్రమాభ్యున్నతిని అరికట్టడమే గాకుండా, ఫిల్ము పరిశ్రమను విజ్ఞాన ప్రచారానికి సాధనంగా గుర్తించిన కాంగ్రెసు సిద్ధాంతాలకు వ్యతిరేకంగావుంది.

బొంబాయి మంత్రి మొరార్జీ దేశాయి కేంద్రప్రభుత్వమంత్రి దివాకర్ నిత్యావసరాలకు సినిమాకూడ ఒకటని, విద్యా ప్రబోధానికిది మంచి సాధనమని ఒప్పుకున్నారు. అటువంటప్పుడు ఇటువంటి సాధనాన్ని ఎక్కువ ప్రజాసామాన్యానికి అందజేయలేకపోతే ఆశించిన ఫలితం ఎట్లాసమకూడుతుంది? నిజంగా ప్రభుత్వం చిత్రాల విశిష్టతను గుర్తించినప్పుడు, ఆచిత్రాల ప్రచారానికి తోడ్పడ్డం, దేశంలోని మారుమూల ప్రజలు చూడ్డానికి అవకాశం కల్పించడం వారి బాధ్యత. ఇదే ప్రభుత్వం ఆశయమయితే టూరింగ్ సినిమాల అభివృద్ధికి అవకాశాలివ్వాలి. వాటిపై పెట్టిన నిషేధాలు తొలగాలి. నిర్బంధాలు సడలాలి.

ఫిలింపరిశ్రమ స్వేచ్ఛా వ్యాపారం. అటువంటప్పుడు పర్మనెంటు థియేటర్లకు కావలసిన పరికరాలు దొరకని ఈరోజుల్లో టూరింగ్ సినిమాలపై యీ నిర్బంధాలు దేనికి? ప్రజాప్రభుత్వం చట్టాలవల్ల యిటువంటి నిర్బంధాలేనా ఆశించేది? స్వాతంత్ర్యము, అభ్యుదయము అరికట్టే యీ చట్టాలు కేవలం కొందరివ్యక్తుల స్వార్థాలు తీర్చగలిగితే అది నిరంకుశ మనిపించుకుంటుంది. పరిశ్రమ అభివృద్ధికి, తద్వారా దేశాభ్యుదయానికి దెబ్బకొట్టే యిటువంటి చర్యల్ని ఫిలిం ఎంక్వయిరీ కమిటీ ఖండించాలి. ఫిలింపరిశ్రమల వ్యవహారాలెంతవరకు రాష్ట్రప్రభుత్వాలు లేకుండా కేంద్రప్రభుత్వమే వ్యవహరించడానికి అనువుగా చట్టాలను సవరణచేయాలి.



బాలానందం

వినాయకుని శాపం!

పూర్వం పాండవులు అరణ్యవాసంలో ఉండగా శ్రీకృష్ణుని అన్నగారయిన బలరాముని కుమార్తె శశిరేఖ వివాహం ఏర్పాటయింది. కౌరవులలో పెద్దవాడైన దుర్యోధనుని కుమారుడు లక్ష్మణునికిచ్చి ఆమెను పెండ్లిచేయాలని నిశ్చయించాడు బలరాముడు. కాని అర్జునుని కుమారుడు అభిమన్యుడు చిన్నప్పటినుండి శశిరేఖను ప్రేమించి ఉన్నాడు. బలరాముడు శశిరేఖను దుర్యోధనుని కుమారునకిచ్చి పెండ్లి చేయాలని నిశ్చయించినట్లు అభిమన్యునికి తెలియగానే, ఏవిధంగానయినా ఆ వివాహం జరగకుండా ఆపాలనుకొని బయలు దేరాడు.

మార్గంలో పాండవులలోని రెండవవాడైన భీమునికుమారుడు ఘటోత్కచుడు ఎదురైనాడు. వారిద్దరికీ కూడా తామన్నదమ్ముల బిడ్డలమని తెలియదు. ఇద్దరూ యుద్ధం చేస్తుండగా ఘటోత్కచుని తల్లి హిడింబి వచ్చి వారిని విడదీసి వారి బాంధవ్యం తెలిపింది. ఇరువురు నవ్వుకున్నారు. తెలియక తగువులాడినందుకు ఒకరినొకరు క్షమించమని కోరుకున్నారు. తరువాత అభిమన్యుడు తన పని గురించి ఘటోత్కచునికి విన్నవించాడు. ఘటోత్కచుడు అభిమన్యునికి అభయమిచ్చి, శశిరేఖను ఒప్పగించగలనని ప్రతిజ్ఞ చేసి బయలుదేరాడు. అభిమన్యుని వెంట బెట్టుకొని ద్వారకా నగరంచేరాడు.

బలరాముడు తనకుమార్తె వివాహానికి అన్ని సిద్ధంచేసి, లోకంలో కల రాజులను, చక్రవర్తులను, దేవతలను అందరినీ ఆహ్వానించాడు. కాని వినాయకుని మాత్రం మర్చిపోయాడు బలరాముడు. వినాయకునికి కోపం వచ్చింది. ఈ పెండ్లికి విఘ్నమేర్పడాలని శపించాడు. ఘటోత్కచునికి ఇది తోడయింది. కాని శాపం గురించి బలరామునికి తెలియదు. శ్రీకృ తెలిసింది. శ్రీకృష్ణుడు కిమ్మనకుండా ఊరుకున్నాడు. చాటుగా ఘటోత్కచునికి, అభిమన్యునికి సహాయపడి మెల్లిగా పెండ్లి పందిరినుంచి శశిరేఖను ఎత్తుకొని పోయే ఏర్పాటు చేశాడు. అభిమన్యుని, శశిరేఖను ఘటోత్కచుడు ఇరుభుజాల పైన కూర్చోబెట్టుకొని పోయి ఒక దేవాలయం చేరాడు. అక్కడికి శ్రీకృష్ణుడు చెల్లెలు సుభద్రతో కలసి చేరాడు. దేవాలయంలో ఏ ఆర్భాటమూ లేకుండా, శశిరేఖను అభిమన్యునికిచ్చి వివాహం చేశాడు.



శశిరేఖ మాయమైన సంగతి తెలిసి ద్వారకలో పెళ్లిమండపంలో అందరూ ఆశ్చర్య పడ్డారు. దీనికి కారణం శ్రీకృష్ణుడేనని బలరాముడు దుర్యోధనుడు మొదలైనవారు భావించారు. తరువాత బలరాముడు శ్రీకృష్ణుని దండించి అడిగాడు. శ్రీకృష్ణుడు నవ్వుతూ, తనకేమీ తెలియదన్నాడు. దీనికి కారణం వినాయకుని శాపమని చెప్పాడు. బలరాముడు పశ్చాత్తాపం చెందాడు. తాను అందరినీ పెండ్లికి పిలిచి వినాయకుని పిలువకపోవడం తన దోషమేనని గ్రహించాడు. కాని ఏమి చెయ్యగలడు! శశిరేఖ వివాహం జరిగిపోయింది.

అప్పటి నుండీ ఏపనీ వినాయకుని ఆహ్వానించి పూజించనిదే ఏ శుభకార్యమూ జరుగదు.

శ్రీ ఏ. యల్- దేశపాండే

శ్రీమంతుడు - కష్టజీవి

రచన : థామస్ డే ★ అనువాదం : శ్రీ నేమాని వీరభద్రరావు

ఒకానొక దేశంలో ఒక శ్రీమంతుడుండేవాడు. అతడికెన్నడూ లోటనేదిలేదు. పెద్దభవనంలో నివసించేవాడు. దినమంతా తినడం, త్రాగడం, నిద్రపోవడం, వినోదాలతో గడిపేవాడు. అతడికి ఎంతో మంది నౌకర్లుండేవారు. యజమాని ఏపని చెప్పినా వారుఎంతో వినయం కనపరుస్తూ, వెంటనే చేసేవారు. కాని వాళ్లు పరోక్షాన్ని ఎంత తిడుతున్నారో, పనులు చెయ్యడానికి ఎంత విసుక్కుంటున్నారో అతడికి తెలియదు. నిజ పరిస్థితులు తెలియని శ్రీమంతునికి గర్వం రెచ్చిపోయింది. ప్రపంచంలో వున్న వాళ్లందరినీ ఆజ్ఞాపించడానికి హక్కుందనీ, బీదవాళ్లు కేవలం తనకి పన్లు చెయ్యడానికే సృష్టించబడ్డారనీ భావిస్తూ వుండేవాడు.

శ్రీమంతుని భవనానికి సమీపంలోనే ఒక కష్టజీవి, చిన్న గుడిసెలో వుండేవాడు. అతని గుడిసె దగ్గరే తుంగ లుండేవి. తుంగతో చాపలు అల్లి, వాటిని అమ్ముకొని అతడు బ్రతికేవాడు. ఉదయం మొదలు సాయంకాలం వరకూ కష్టపడి అతని పొట్టకు సరిపోయేటంత మాత్రమే సంపాదించుకునేవాడు. శ్రీమంతుడు తినే పదార్థాలు తినడం మాటట్లుంచి, వాటి పేర్లుకూడా తెలియవు కష్టజీవికి. పడుకోడానికి ఒక పక్కంటూ లేనేలేదు. మిగిలిపోయిన తుంగ మీదనే అతని పడక. అయినప్పటికీ కష్టజీవి వున్నది చాలదని గాని, లేనిది కావాలని గాని బాధపడి యెరుగడు. ఎప్పుడూ ఆనందంగా వుండేవాడు. కష్టపడి నందువల్ల ఆకలి ఎక్కువగా వేస్తుంది. సమయానికి ఏదిజతపడితే అదే అమృతోపమానంగా వుంటుందతనికి. ప్రక్కమీద పడుకోవడమే తడవు నిద్రపడుతుం దతనికి. అతడు స్వతస్సిద్ధంగా మంచివాడు. మర్యాదస్తుడు. ఎప్పుడూ నిజమే చెపుతూ వుంటాడు. అందు చేతనే ఇరుగు పొరుగుల వారందరూ అతణ్ణి గౌరవిస్తూ వుంటారు.

శ్రీమంతుడు కష్టజీవి కంతా వ్యతిరేకం. మెత్తని పరుపు మీదే పడుకుంటాడు. కాని సరిగా నిద్ర పట్టదు. ఎందుచేత? దినంలో ఒక్క గంటైనా కష్టపడితే కదా! శరీరం ఏమాత్రం అలవకుండా అతడికి నిద్ర ఎలా పడుతుంది? ఎంత రుచిగల పదార్థాలూ అతడికి హితవుకావు. స్వభావ సిద్ధంగా ఆకలి వెయ్యకుండానే కనపడినదల్లా తింటూంటే అతడికి సరియైన ఆకలి ఎలావుంటుంది? అశడి నౌకర్లే అతడి వెనుక "తిండిపోతు" అంటారు. ఇరుగు పొరుగులవారి సంగతి చెప్పనే అక్కర్లేదు. వారందరినీ అవమానపరుస్తూ, సమయం దొరికితే అణచివేద్దామని చూస్తూన్న అతన్ని ఎవరు గౌరవిస్తారు? ఎవ్వరూ పలకరించరు. అతడు కనపడితే హేయంగా చూస్తూన్నందున అతనిలో ఒక విధమైన ఈర్ష్య రేకెత్తింది. ఎవరైనా ఆనందంగా వున్నట్లు కనపడితే చాలు; వారిని చూస్తే కారణంలేని అసహ్యం, వారి అంతు చూదామన్న దుష్టకోరిక అతనిలో కలిగేవి. కష్టజీవి గుడిసె ప్రక్కనుంచే శ్రీమంతుడు వెళ్లడం తటస్థించేది. కష్టజీవి చాపలు అల్లుతూ పాడుకుంటూ వుండేవాడు. శ్రీమంతుడికిది సహించరానిదైంది. "ఏమిటి! కేవలం రెక్కాడితేగాని డొక్కాడని క్షుద్రుడు ఇంత సుఖంగాను, ఇంత ఆనందంగాను కాలం గడపడమా! నావంటి పెద్ద మనిషి, అటుచూస్తే ధనం ఇటుచూస్తే అధికారం అటుయిటూ చూస్తే అంతామనమే అయిన నేను, ఇలా విచారంతో, అసంతృప్తితో కాలాన్ని ఈడవటమా, ఎంత ఘోరం! అని తలపోస్తూ వుండేవాడు. ఇట్టి దురాలోచన కష్టజీవిమీద అతని విపరీత ద్వేషానికి కారణమైంది. అతని మనసు అతనివశంలో వుండదు. అటువంటప్పుడు ఎంత అన్యాయానికయినా వెనుదీయడు. కష్టజీవిని ఎలాగైనా శిక్షించాలనుకున్నాడు.

ఈ దురుద్దేశంతో శ్రీమంతుడు, కష్టజీవికి జీవనాధారంగా వుంటున్న తుంగమొక్కలకు నిప్పంటించమని నౌకర్లకు ఆజ్ఞ



ఇచ్చాడు. అతని నౌకర్లు అతని ఆజ్ఞలను శిరసా వహించ వలసిందే. గాని, ఎదురు చెప్తే, వారు ప్రాణాల మీద ఆశ వదులుకోవలసిందే శ్రీమంతుని దుర్బుద్ధికి ప్రకృతి కూడా సహాయ పడింది. అది వేసవికాలం. తుంగమొక్కలు ఎండి వున్నాయి. కన్ను మూసి తెరిచే లోపున అంతా అంటుకు పోయింది. దగ్గరలో వున్న కష్టజీవి గుడిసె కూడా పరశురామ ప్రీతిఅయింది. కష్టజీవి ప్రాణంతో బయట పడ్డాడు.

కష్టజీవి గ్రుడ్ల నీరు గ్రుక్కుకుంటూ నడచి దూరాన వున్న న్యాయాధికారివద్దకువెళ్లి తనవిషాద గాధను విన్నవించుకున్నాడు. న్యాయాధికారి మంచివాడు. వెంటనే శ్రీమంతుని తన చెంతకు తీసుకు రమ్మని నౌకర్లను పంపాడు. శ్రీమంతుడు తన నేరాన్ని ఒప్పుకోక తప్పదు అని అధికారి గ్రహించిన తరువాత, కష్టజీవితో "శ్రీమంతుడు, నలుగురూ తన్ను పొగడడంతోనే వుబ్బిపోయి తనలో ఏదోగొప్ప వుందని గర్వంపెంచుకొని బీదవాళ్ల యందుండే అసహ్యతను తెలుపుడు జేసుకోడానికి యీనింద్య కార్యం చేశాడు. అతడికి ఒక చక్కని పాఠం బోధించాలని వుందినాకు. అతడు యీ లోకంలో ఎవ్వరికీ వుపయోగ పడడని గ్రహింప జేయాలని నానిశ్చయం. మీయిద్దరినీ ఒక నూతన ప్రదేశానికి పంపుతాను. నీవు అతనితో వెళ్లడానికి అంగీకరించాలి" అన్నాడు.

"అయ్యా, నేను ఒకప్పుడు సంపదలతో తులతూగలేదు. నాకు వున్నది కూడా, శ్రీమంతుని దుష్కార్యం చేత నాశనమైపోయింది. నాకు మరోసారి ఆకలిగా వుంటే, తినడానికి అవకాశమే లేదు. కనుక యీ విశాల ప్రపంచంలో ఎక్కడికి పంపినప్పటికీ, వెళ్లడానికి నేను సిద్ధమే. శ్రీమంతుడు నాపట్ల వ్యవహరించినట్లు నేనెంతమాత్రం వ్యవహరించను. కాని అతనికి సత్ప్రవర్తన, మానవత్వం అంటే ఏమిటో తెలియజేద్దామని వుంది. ఇకముందైనా బీదవాళ్లని హింసించడని నాఆశ" అన్నాడు కష్టజీవి.

న్యాయాధికారి శ్రీమంతుని, కష్టజీవిని, ఒక ఓడ ఎక్కించి, దూరదేశం పంపించాడు. ఆ ప్రదేశంలోని ప్రజలు అనాగరికులు గుడిసెల్లో నివసిస్తారు. భాగ్యము, భోగము అంటేనే వారికి తెలియవు. చేపలు పట్టి జీవిస్తారు.

శ్రీమంతుని, కష్టజీవిని ఆ ప్రదేశంలో దింపి ఓడ తిరిగివెళ్లిపోయింది. అచ్చట ప్రజలు శ్రీమంతుని, కష్టజీవిని చుట్టు ముట్టేశారు. వారి భాష వీరిద్దరికీ తెలియదు. శ్రీమంతుడు ఎన్నడూ ఇంతమంది ఎదుట పడలేదు. ఆశ్చర్యంగా కళ్లప్పగించి చూస్తూన్న యీ అనాగరికుల మధ్య ఒక వింతవస్తువు క్రింద మారేనన్న చింతతో శ్రీమంతుడు క్రుంగి పోతున్నాడు కళ్లవెంట ఏకధారగా నీళ్లు కారిపోతున్నాయి. నూతన వాతావరణంలో ఎలా మెలగాలో యిదివరకు ఎరుగడు. కాని కష్టజీవి ఇలాంటి విషమ పరిస్థితులను చాలాసార్లు ఎదుర్కొని ఉన్నాడు. వారికి సంజ్ఞలుచేసి వారికి స్నేహితుడని, తెలియజేశాడు. వారికి ఏమి కావలసినా చెయ్యడానికి సిద్ధంగా వున్నానని తెలియజెప్పాడు. అచ్చటి ప్రజలు కూడా తామేమీ అపకారం చెయ్యమనీ, చేపలు పట్టడం, వంట చెరకు మొయ్యటం మొద


లగు పనులలో వారి సహాయం పొందుతామనీ తెలియజేశారు.

శ్రీమంతుని, కష్టజీవిని అచ్చటి ప్రజలు ఒక అడవికి తీసుకుపోయి, పెద్ద దూలాలను చూపించి మోసుకు రమ్మన్నారు. శ్రీమంతుడు, కష్టజీవి పనికి తలపడ్డారు. కష్టజీవి ఇదివరలో బరువు పనులకూ కష్టజీవితానికీ అలవాటుపడి ఉండటంచేత, తనపని త్వరగా ముగించేశాడు. శ్రీమంతుడు నాలుగోవంతు పనైనా చెయ్యలేక పోయాడు. అచ్చటి ప్రజలు, కష్టజీవి తమకు వుపయోగ పడతాడని గ్రహించి అతడికి ఎక్కువ ఆహారం, దుంపలు, చేపలు ముట్టజెప్పేవారు. ఇప్పుడు శ్రీమంతునికి "ఆకలి" అంటే ఏమిటో తెలుస్తూంది. ఏది పెట్టినా అమృతమని భావించి తింటున్నాడు.

ఈవిధంగా రోజులు గడిచిన కొద్దీ అచ్చటి ప్రజలకు కష్టజీవిపట్ల ప్రేమ అధికమవజొచ్చింది. శ్రీమంతుణ్ని చూచి అసహ్యపడుతున్నారు. ఉపయోగం లేని సోమరి క్రింద జమకట్టారు. శ్రీమంతునికి ఇప్పుడు కొంచెం జ్ఞానోదయం అవుతూంది. ఇదివరలో తననేవిధంగా హెచ్చుగా భావించుకొని ఇతరులను చిన్నబుచ్చేవాడో ఇప్పుడు గ్రహింపుకు రానారంభించింది. తరువాత జరిగిన ఒక సంఘటన అతనిలో పెద్ద మార్పు తెచ్చింది. ఆ ప్రదేశంలో వుండే అడవిమనిషి ఒకడు ఒకరోజున ముఖం అలంకరించుకున్నాడు. కష్టజీవి చూసి ఆ ప్రజల

(37-వ పేజీ చూడుడు

బొమ్మల మేళం:



ఏనుగు గున్నను పంపినందుకు కృతజ్ఞతా సూచకంగా జపాన్ బాల బాలికలు పండిట్ నెహ్రూకు తమ దేశంలో తయారయిన ఈ బొమ్మలమేళాన్ని బహుమతి చేశారు. మేళాన్ని చూస్తున్నవారు నెహ్రూగారి మనుమలు రాజీవుడు, సంజయుడు.

బాలానందం:

విచిత్ర శిఖరాలు

చీనాలో చెప్పుకొనే ఒక కట్టుకథ

జిల్లాఅధికారి వెంగ్ లావో సరస్సు ఒడ్డున ఒకరాతిపైన కూర్చుని ఆలోచిస్తున్నాడు. నలభైయేళ్లొచ్చినా అతనింకా ఉద్యోగంలో అభివృద్ధిలోనికి రాలేదు. కానిఉన్న దానితోనే తృప్తిపడతాడు వెంగ్. ఒకరిలాభం మరొకరికి నష్టం అనే సామెతలో అతనికి నమ్మకం ఉంది. చిన్నతనంనుంచీ కష్టాలనేవి అతన్ని విడువకుండా కాపురం చేస్తున్నప్పటికీ, అతను చింతించలేదు. పెళ్లైన మూడు మాసాల్లోనే అతని భార్య మరణించింది. అనేక సంవత్సరాలుగా అతని జిల్లాపైన బందిపోటు దొంగలు పడి దోచుకొని ప్రజల్ని హింసిస్తున్నారు. సైనికుల సహాయం అడిగినా చక్రవర్తిగారు పంపలేదు. అయినా అల్లాగే గడుపుకొస్తున్నాడు.

వెంగ్‌కి వేటంటే చాలాప్రీతి. ప్రక్కనే బాణం, అమ్ములు పెట్టుకుని కూర్చున్నాడు. అక్కడక్కడ తూనీగలు మాత్రం జుమ్మంటూ ఎగురుతున్నాయి.

ఇంతలో అకస్మాత్తుగా ఒక ఆర్తనాదం వినపడింది. బంగారు రెక్కలుగల ఒక పిట్టను ఒక డేగ తరుముతోంది. పిట్ట ఆర్తనాదం చేస్తూ అటూ ఇటూ ఎగిరి తప్పించుకోడానికి యత్నిస్తోంది. వెంగ్ బాణంతీసి ఒక అమ్ముతో జాగ్రత్తగా గురిచూసి డేగను కొట్టాడు. డేగ టపీమని కింద పడింది. పిట్ట అకస్మాత్తుగా మాయమైపోయింది డేగపడిన చోటికి వెళ్లాడు వెంగ్ ఇంతలో అక్కడ బంగారు రంగుదుస్తులు ధరించిన ఒక మహాత్తర వ్యక్తి ప్రత్యక్షమైనాడు ఆ వ్యక్తి వెంగ్ ధనుర్విద్యా కౌశలాన్ని మెచ్చుకుంటూ, తానొక మంత్రగాడినని తెలియచెప్పాడు. అతని పేరు చూ మెక్. అతని శత్రువై నమరొక మంత్రగాడు తరుముతుండగాఅతడు బంగారుపిట్ట రూపం ధరించాడు. అయితే శత్రువు అతని ఉనికి కనిపెట్టి డేగరూపంలో తరమడం మొదలెట్టాడు. సమయానికి వెంగ్ బాణంతో కొట్టి డేగరూపంలో ఉన్న శత్రువుని చంపివేశాడు. అందువల్ల చూ మెక్ తన కృతజ్ఞత ప్రకటిస్తూ, వెంగ్‌కు అపూర్వమైన ఒక వస్తువును బహుమతిగా ఇచ్చాడు. అది ఒక చిన్న దంతపు పెట్టె. అందులో మంత్ర ప్రభావం ఉందని చెప్పి, వెంగ్ సమాధానం చెప్పేలోపుగా అదృశ్యమైనాడు చూ మెక్.

వెంగ్ దంతపుపెట్టెని జాగ్రత్తగా పరిశీలించాడు. దానిని అరచేతిలో నిలబెట్టవచ్చును. రెండంగుళాలు పొడవుంటుంది. చక్కగా బొమ్మలు చెక్కి వుంది. పెట్టె మూత తెరిచే సరికి లోపల చిత్రమైన రాయి ఒకటి కనపడింది. రాయి మూడు శిఖరాలు కల ఒక మహాపర్వతం రూపంలో వుంది. శిఖరాలు మణులవలె తళతళ మెరుస్తున్నాయి. ప్రక్కల లోయలున్నాయి. లోయలు పచ్చని పచ్చికలు, పొదలూ, వృక్షాలతో నిండి ఉన్నాయి. లోయల్లో అతి సూక్ష్మరూపంలో నీలంగా, ఆకుపచ్చగా మెరుస్తూ సన్న నియేరులు, నదులు, జలపాతాలు కనబడుతున్నాయి. పర్వతపు స్లోపులలో గుహాలదారులుకూడా కనపడుతున్నాయి.

పెట్టెమూతపైన ఈరీతిగా వ్రాసి వుంది. "అమూల్య సంపదను పొందినవారు, దుష్టుల కళ్లబడి పోడుకాకుండా దానిని కాపాడాలి."

రాతినితీసి అరచేతిలో పెట్టుకున్నాడు వెంగ్. దగ్గరగా జాగ్రత్తగా పరిశీలించాడు. పర్వతశిఖరాలచుట్టూ పల్చని మేఘాలుఆవరించి కదులున్నట్లు కనిపించింది. మరింత దగ్గరగా చూశాడు వెంగ్. ఈమారు మబ్బుల తెరలు తొలగి పోయాయి. ఇంతలోనే అతనికి గాబరాపుట్టింది–తన చేతిలో ఎంతటి అమూల్య వస్తువున్నదో తెలియ వచ్చేసరికి. గబగబా రాతిని దంతపుపెట్టెలో పెట్టేసి, మూతవేసి గట్టిగా చేతపట్టుకుని ఊళ్ళోకి వెళ్లిపోయాడు. అదిమొదలు ప్రతి రోజూ ఆ రాతిని చూసేవాడు వెంగ్.

ఇలా వుండగా ఒకసారి కొందరు బందిపోట్లు ఉత్తరంనుంచి వచ్చి పట్టణాన్ని ముట్టడించారు. ఎవరూ పట్టణాన్ని విడిచి పోవడానికిగాని, బయటనుంచి పట్టణంలో రావడానికిగానీ, వీల్లేకుండా, బందిపోట్లు చక్రబంధం పన్నారు. పట్టణంలో ఆహార వస్తువులు క్రమక్రమంగా అయిపోవచ్చాయి చక్రవర్తిగారి సేనలు సహాయానికి రాలేదు. వీటివల్ల వెంగ్‌కి మతిపోయింది– ఏమి చెయ్యడానికీ తోచలేదు.

ఒకనాడు అతడు తన తోటలో విశ్రాంతి తీసుకుంటూ రాతిని తీసి చూశాడు. జాగ్రత్తగా ప్రక్కన చలువరాతిపైన పెట్టాడు. సూర్యకాంతిలో రాయి ధగ ధగ మెరిసిపోతోంది. పర్వతశిఖరాలపైన మబ్బు తెరలు



కదులుతున్నాయి. వెంగ్ ఒంగి మబ్బుల్ని మెల్లిగా వూదాడు, వెంటనే అతని సమక్షంలో మంత్రగాడు చూ మెక్ ప్రత్యక్షమైనాడు.

వెంగ్ లేచి నమస్కరించాడు. తాను ఆపదలో వున్నట్లు చెప్పి, ఎందుకు వచ్చినదీ చూ మెక్‌ను ప్రశ్నించాడు. రాతి పైన ఊదినట్లయితే అది తనకు పిలుపని మంత్రగాడు చెప్పాడు. అప్పుడే వెంగ్ మబ్బుల్ని ఊదినందువల్ల అతడు ప్రత్యక్షమైనాడు. వెంగ్ ముఖంలోని విషాదచ్ఛాయలు చూసి, చూ మెక్ అతడికి కలిగిన ఆపదయేమిటని అడిగాడు. తానేదైనా సహాయం చెయ్యడానికి సిద్ధమేననికూడా చెప్పాడు.

వెంగ్ తన పట్టణం ఎలా దొంగలవల్ల ముట్టడించబడినదీ, పట్టణంలో ఆహార వస్తువులు తరిగిపోతున్నదీ చెప్పాడు. పట్టణంలో సైనికులుకూడా క్రమక్రమంగా క్షీణించిపోతున్నారు. పట్టణం దొంగలవశం కావడానికింక ఆట్టే రోజులు పట్టదు. అప్పుడు వెంగ్‌కి చావు తప్పదు. మరి కొంత మంది సైనికులు, మరికొంత ఆహారవస్తు సామగ్రి ఉంటేకాని పట్టణాన్నింక రక్షించడం అసంభవమని చెప్పాడు.

"అవి మీసన్నిధిలోనే ఉన్నాయి" అని చెప్తూనే చూ మెక్ అంతర్ధానమైనాడు. చూ మెక్ మాటలింకా పూర్తికాకముందే రాతిలోని సూక్ష్మమైన గుహల్లోనుంచి బంగారు రజను పొర్లివచ్చింది. ఇవతలకి రాగానే బంగారు నలకలు పెరిగి పెద్దవై గుర్రాలెక్కిన సైనికులుగా మారాయి. ప్రతి సైనికునివద్దనూ గుర్రపుజీనుకు వేలాడుతూ రెండేసి బస్తాల ఆహారవస్తువులున్నాయి. చూస్తున్నంతలో తోటంతా సైనికులతో, గుర్రాలతో నిండిపోయింది. క్షణంలో సైన్యాధిపతి వచ్చి వెంగ్‌వద్ద వినయంతో ఆజ్ఞకై నిలబడ్డాడు.

వెంగ్ ఆనందానికి మితిలేదు. బస్తాలను కొట్లలో పడేయించాడు. తాను కూడా కవచం, ఆయుధాలు ధరించి ఒక గుర్రమెక్కాడు. సైన్యాన్ని వెంటబెట్టుకుని బైలుదేరాడు. నగరవాసులంతా ఆశ్చర్యచకితులై చూస్తుండగా వెంగ్ సైన్యాన్ని పట్టణం పొలిమేరలకు నడిపాడు. ఒక్కపట్టున సైన్యమంతా బందిపోటు గుంపుల పైన పడి చూస్తున్నంతలో హతం చేసేసింది. మాయసైన్యంలో ఒక్కనికి కూడా గాయమైనా తగల్లేదు. పని పూర్తికాగానే సైన్యమంతా తిరిగి తోటకు చేరుకుంది. సైన్యాధిపతి వెంగ్‌వద్ద సెలవు తీసుకున్నాడు. సైనికులందరూ కుంచించుకుపోయి మళ్లీ బంగారు నలుసులుగా మారిపోయారు. బంగారు రజను రాతి గుహల్లోకి చేరి మాయమయింది. ఆరాత్రి పట్టణవాసులందరికీ వెంగ్ పెద్దవిందు చేశాడు.

ఆరాత్రివిందు అనంతరం వెంగ్ దంతపుపెట్టె చేతపట్టుకుని తన పడకగది చేరాడు. మెల్లిగా దంతపు పెట్టె తెరచి రాతిశిఖరాలపై మబ్బుల్ని ఊది మంత్రగాడిని రప్పించాడు. తనకా పర్వతం ప్రవేశించి లోపలంతా చూడాలని వుందని కోరిక తెలియపరిచాడు. చూ మెన్ సరేనన్నాడు.

కెంపుతాపిన ఉంగరమొకటి వెంగ్ చేతికిచ్చాడు చూ మెక్. కెంపుకద్ద ఏవో సంజ్ఞాక్షరాలు చెక్కివున్నాయి. ఆ అక్షరాలు అరచేతి లోపలికుండేలాగు ఉంగరాన్ని వేలికి పెట్టుకోమని చెప్పాడు.

వెంగ్ ఉంగరాన్ని వేలుకు పెట్టుకోగానే అతనిశరీరం, దుస్తులు చిన్నవైపోసాగినాయి. చిన్నవై చిన్నవలుసంతగా మారాడు. అతనికప్పుడు రాయి మహాపర్వతంలా కనిపించింది. పర్వతం మొదట పెద్ద గుహాద్వారం కనపడింది.

* * *

ద్వారందాటి గుహ ప్రవేశించగానే వెంగ్‌కు కాగితపు దీపాలు చేతపట్టుకున్న చిత్రవిచిత్రమైన మనుషులూ, జంతురూప రాక్షసులూ కనపడ్డారు. అతనికి వినయంతో నమస్కరించి కాగితపు దీపాల సహాయంతో దారిచూపారు. గోడలు, దారులు బంగారువెలుగుతో తళ తళ లాడుతున్నాయి. కొంతదూరం పోయేసరికి మార్గం విశాలమయింది. అక్కడ నీలికాంతులు వ్యాపించి ఉన్నాయి. ప్రక్క గోడలు, పైకప్పు, నేలఅంతా నీలిరాళ్లు చెక్కి కట్టినట్లున్నాయి. కొంతదూరాన ఎత్తుగా పెద్దమేజా, దానిపై కూర్చున్న చిత్రమైన మనుషులు కనిపించారు. శరీరమంతా మనిషిశరీరమే. కాని తలమాత్రం రాక్షస జంతులవి. వారిలో ఒక్కరు తప్ప మిగతా అందరూ తళ తళలాడే పట్టుబట్టలు ధరించారు. వారి నాయకుడు మాత్రం బంగారు వన్నె పట్టు దుస్తులు ధరించాడు. అతడు చూ మెక్. వెంగ్‌ను గౌరవంతో ఆహ్వానించి తనప్రక్క కూర్చోబెట్టుకున్నాడు. పంచభక్ష్య పరమాన్నాలతో విందు చేశాడు. అతిలోక సుందరులైన నర్తకగణం నాట్యం చేశారు. తరువాత మానవుల సుగుణాలను కీర్తిస్తూ కొందరు కవనం చెప్పారు. "మానవుని కంటె ఉత్కృష్టమైన ప్రాణి లేదు; ఆత్మకంటె మహత్తరమైన వస్తువులేదు. లోకంలో కల సౌందర్యమంతా మానవులలోనూ మానవుల దృష్టిలోనే ఇమిడివుంది" అన్నారు.

కొంతసేపటికి వెంగ్‌కు నిద్ర ముంచుకు వచ్చింది. చూ మెక్ ఇది గ్రహించి, తరుచు తన నివాసానికి రావలసిందని విన్నవించి; తన అనుచరులను పిలిచాడు. ఇంతలోనే వెంగ్ కళ్లు మూతలు పడ్డాయి గుహలోని కాంతులు క్రమక్రమంగా క్షీణించాయి.

అంతా అంధకారంతో నిండిపోయింది. తిరిగి మెలకువ వచ్చేసరికి వెంగ్ తన పడక గదిలో తన పడకలో ఉన్నాడు. ప్రక్కనే పర్వతరూపంలోకల రాయి సూర్య కిరణాలతో మెరుస్తూ ఉంది.

ఆరోజు మొదలు వెంగ్ ప్రతిదినం మాయా పర్వతం ప్రవేశించి అందులోకల చిత్రాలను చూస్తుండేవాడు. ఒకచోట ముత్యాలతో నిర్మించిన ఒక మహానగరం చూశాడు. అక్కడ ఆకాశమంటే భవనాలు చూశాడు. చక్కని ఉద్యాన వనాలు చూశాడు. ఉద్యాన మంతటా పువ్వులు రంగురంగుల కాంతులు విరజిమ్ముతున్నాయి. రంగురంగుల జలధారలున్నాయి. రంగు రంగుల కాంతులతో సమస్తం వింత అందాలతో మెరుస్తున్నాయి. సమస్త గ్రహాలలో నివసించే జీవులూ ఇక్కడ కనిపించాయి. వారి ఆకారాలు వింతగొలుపుతున్నాయి. చూమెక్‌తో కలసి వెంగ్ పర్వత శిఖరాలనెక్కాడు. సెలయేళ్ల నీటిని రుచి చూశాడు. ఆనీటిని త్రాగిన వెంటనే అతనికి క్రొత్తబలం, నూతనోత్సాహం, నవయౌవ్వనం లభించాయి. మత్స్యశిఖరంపైనుంచి చూసినప్పుడు, ఒకవంక నాగరికలోకం, మరొకవంక అనాగరికలోకం కానవచ్చాయి.

ఈ సంచారాలలో ఒకనాడు చూమెక్ ధనరాసుల్ని చూపాడు. అపారధనము, ఆభరణాలు, రాళ్ల వస్తువులు చూడగానే వెంగ్ కన్నులు చెదిరాయి.

"మితిలేని సంపద జీవితాన్ని మాయాజాలంలోకి భ్రమింపజేసి పాడు చేస్తుంది నిజమే. కాని ఆ సంపదను పొందేతాహతు కలిగి ఉండడం కూడా ఎంతటి అదృష్టం!" అన్నాడు వెంగ్.

"అంటే మీ ఉద్దేశం నేను గ్రహించలేకుండా ఉన్నాను" అన్నాడు చూమెక్.

"అంటే నేను నాపొట్ట గడవడానికి నా ఉద్యోగంపైనా నా చాకిరీపైనా ఆధారపడ ఉండేగతి పట్టక పోయినట్లయితే, నిత్యం ఈ అపూర్వ భాగ్య సంపదల్ని చూస్తూ గడపగలిగేవాణ్ని. కాని నాకా అదృష్టం లేదు." అన్నాడు వెంగ్.

"ఇంతేనా? ఇదే అయితే ఈ సకల ధనరాసుల్ని మీకు నేను బహుమతి చేస్తాను. ఇది చాలా, లేక ఇంకా..."

"ఇదే ఎక్కువ. ఇంతకంటె" అని వెంగ్ చెప్పబోతున్నంతలోనే అతనికి స్మృతితప్పిపోయింది. మెలకువ వచ్చేసరికి తన పడక గదిలో పక్కలో ఉన్నాడు. వెంటనే లేచి చూశాడు. చుట్టూ పది జాడీలు ధన పురాసులతో నిండి ఉన్నాయి. ఆ రాత్రి అంతా ధనం లెక్కించుకుంటూ గడిపాడు వెంగ్.

ఒక మాసంలో తన ఉద్యోగానికి రాజీనామానిచ్చాడు వెంగ్. తనను తెలిసిన వారికి అనుమానం కలక్కుండా దూరంగా ఉన్న ఒక రాష్ట్రం చేరాడు. అక్కడొక పెద్దభవనం కొన్నాడు. భవనం చుట్టూ విశాలమైన, చక్కని ఉద్యానవనం ఉంది. క్రొత్తభవనంలోని తన పడకగదిలో నేల తవ్వి ఒక రహస్య మందిరం నిర్మించాడు. ధనాన్ని ఆ రహస్య మందిరంలో గుప్తపరిచాడు. దంతపుపెట్టెను కూడా ఆ మందిరంలోనే భద్రపరిచి, అక్కడే రహస్యంగా మంత్రగాడైన చూమెక్‌ను కలుసుకునేవాడు. ఒక్కొక్కప్పుడు పగలంతా రహస్యమందిరంలో గడిపేవాడు.

తరుచు భవనంలో కనిపించకుండా అంతర్థానమౌతూ, నిత్యం భోగభాగ్యాలతో తులతూగుతున్న వెంగ్‌ను చూసేసరికి భవనంలోని నౌకర్లు చాకర్లు వింత వదంతులు చెప్పుకునేవారు. వెంగ్ భాగ్యం గురించి చిత్రవిచిత్రమైన కథలు దేశమంతా వ్యాపించాయి. క్రమంగా వెంగ్‌ను గురించిన ఈ కథలు ఆ ప్రాంతంలోని చక్రవర్తి గారి ప్రతినిధి చెవులపడ్డాయి. చక్రవర్తి గారి ప్రతినిధి క్రూరుడు, లోభి, స్వార్థపరుడు. అతడిపేరు యాంగ్ హై.

వెంగ్ సంపదని స్వాధీనపరుచుకోవాలని యాంగ్ హైకి కోరికపుట్టింది.

ఒకనాడు అకస్మాత్తుగా వెంగ్ భవనానికొచ్చి యాంగ్ హై అతన్ని బందీచేశాడు. వెంగ్‌ను తన ఇంటికి తీసుకుపోయాడు యాంగ్ హై. అతని భాగ్యాన్ని గురించి, అతని జీవితవిశేషాల్ని గురించీ ప్రశ్నించాడు. కాని వెంగ్ తనరహస్యాన్ని వెల్లడించలేదు. వెంగ్‌ను ఒకఅంధకార కూపంలో బంధించి అతనిసొత్తును గురించి స్వయంగా విచారణ ప్రారంభించాడు యాంగ్ హై.

వెంగ్ చాలా చింతలో పడ్డాడు. కాని ఆమంత్రశిలను రహస్యంగా తనదుస్తుల్లో దాచిపెట్టుకున్నందువల్ల భయపడలేదు. అర్థరాత్రివేళ అందరూ నిద్రపోతున్న వేళ వెంగ్ మెల్లిగా మంత్రశిలను పైకితీశాడు. మెల్లిగా నేలపైపెట్టి మబ్బుల్ని ఊదాడు. చూమెక్ ప్రత్యక్షమైనాడు. వెంగ్ జరిగినదంతాదీనంగా చెప్పుకున్నాడు.

చూమెక్ కొంతసేపాలోచించి ఇలా అన్నాడు. "నిన్నిప్పుడు విడిపించడం సులువే. క్షణంలో నీవు పారిపోవచ్చును. కాని విషయాన్నంతనీ పూర్తిగా పరిశీలించినట్లయితే నీవిడుదలతో నీచిక్కులన్నీ తీరిపోవు. యాంగ్ హై ముందుముందు మళ్లీ నిన్ను చిక్కులు పెట్టకుండా జాగ్రత్త పడాలి. అందులోనూ ఏపనిచేసినా చడీ చప్పుడూ కాకుండా చెయ్యాలి. కాబట్టి నాకొక యోచనతట్టింది. నీ కిష్టమైతే అది చెప్తాను."

"తప్పకుండా మీరు చెప్పినమాటల్ని రవంతైనా అతిక్రమించను. చెప్పండి."

చూమెక్ రహస్యంగా వెంగ్ చెవిలో కర్తవ్యం బోధించాడు. వెంగ్ ముఖం వికసించింది. నవ్వుకూడా వచ్చింది.

వెంటనే ఉపాయాన్ని చేతల్లో పెట్టడానికి ఇద్దరూ ఉపక్రమించారు. చూమెక్ తన మంత్ర ప్రభావంతో కావలాదార్లందరికీ మైకం కలిగించాడు. యాంగ్ హైకి మాత్రం మెలకువ తెప్పించాడు.

తరువాత మంత్రాక్షతలు చిలికి చూమెక్ ధూపం వెలిగించాడు. ధూపం పొగ తెర అణిగేలోగా చూమెక్ వికృతమైన రాక్షసాకారం ధరించాడు. ఆరుగురు సైనికులు అతనికి సహాయంగా వచ్చారు. కారాగారం తలుపులు వాటంతటవి తెరుచుకున్నాయి. ఇద్దరు సైనికులు కాగితపు దీపాలతో దారి చూపగా వికృత రాక్షస రూపంతో చూమెక్ బయలుదేరాడు. యాంగ్ హై నిద్రించిన గది ప్రవేశించాడు. అతని పడకవద్దకు చేరాడు- సైనికులతో సహా- యాంగ్ హై ఉలికిపడి మేలుకొన్నాడు. కేకలెట్టబోగా, ఒక సైనికుడు కత్తి ఝుళిపించాడు. వెంటనే నోరు నొక్కుకున్నాడు యాంగ్ హై. వికృత రాక్షసరూపం అతని సమక్షంలోకి వచ్చింది.

(37-వ పేజీ చూడుడు)

భాషల పుట్టుపూర్వోత్తరాలు

3. వాక్సాహిత్యం

శ్రీ ఎస్. ఆర్. చంద్రాన్

బొబ్బిలి కథ వాడి జంగమవాడికి ఒక్క ముక్క రాయడం రాక పోవచ్చు; బట్టి నిశానీదారు కావచ్చు. కాని బొబ్బిలి పాట మాత్రం చక్కగా చెబుతాడు. రాగ యుక్తంగా. అలాగే తుమ్మెద పాటలు పాడే పడుచు లక్కూడా పాటలైతే వస్తాయి. కాని— రాయడం చదవడం రాదు. ఇదే మాదిరిని అచ్చుగాని ఆంధ్రదేశపు జానపద గేయాలెన్నో ఉన్నాయి. అచ్చవేది ఈ మధ్య వొచ్చింది. కాని వాక్సాహిత్యం చాలా పాతది; ఒక్క ఆంధ్ర దేశంలోనే అచ్చవవల్సిన సాహిత్యం ఎంతో ఉంది. ప్రపంచ మంతటం మీద ఎంత ఉంటుందో చెప్పాలా?

ఈ నాడు మనకి వార్తాపత్రికలూ, అచ్చు పుస్తకాలూ, బాగా అలవాటయాయి. అవి లేని ప్రపంచాన్ని ఊహించడం కాస్త కష్టంగా ఉంటుంది. మనది చరచరా మారి పోయే ప్రపంచం.

కాని— అదే కొండ గుహాలో, అదే మనుషులతో, చలినీ, ఆకలినీ ఎదుర్కొంటూ బతికిన ఆది మానవుడి జీవితం ఎంత దుర్భరంగా ఉండేదో —ఆలోచించండి! ఋతువుల మార్పులతో అతని ఆహార సేకరణా పద్ధతులు మారేవి. కాని జీవితం ఒకే తాటి మీద నడిచేది. మాంసం దొరక నప్పుడు పర్వత ప్రాంతాల పండిన పళ్లు తినేవాడు. ఏమైనా తిండి లేక చావ వల్సిన బాధనుంచి తనయుక్తివల్ల తప్పించుకున్నాడు.

ఆది మానవుడు కొండల్లో బతకడం వల్ల కొండమనిషి అవుతాడు. ఒక రోజున బయళ్ళలో బతికే ఒక కొత్త మనిషి వస్తాడు అతనిదగ్గిరికి. ఋతువుల్ని బట్టి కొండ మనిషి ఆహారం సమృద్ధిగా దాచుకునే వాడవడం చేత 'ఆకలి —ఆకలి' అంటూఅలుస్తూ సొలుస్తూ వచ్చిన కొత్తమనిషికి కడుపు నిండా తిండి పెడతాడు. ఒకడు కొండ మనిషి— మరొకడు కొత్త మనిషి.

మనం ఏదైనా పల్లెటూరు వెళ్తే మన కొత్త మొహం చూసి 'ఎవరింటి కొచ్చారు?' అని అడుగుతారు ప్రతివాళ్లూ. ఏదో అనుమానంగా. అలాగే అనుమానంగా చూసే వాడు కొండమనిషి కొత్తమనిషిని. కాలక్రమేణా— ఈ కొత్త మనిషి తిన్నయింటి వాసాలు లెక్క పెడతాడు—అనాటికి నిజానికి వాసాలూ లేవు లెక్కా రాదు.

కొండమనిషికీ కొత్త మనిషికీ, 'యిది నాదంటే-యిది నాది' అనే పేచీ లొస్తాయి. ఇద్దరూ కొట్టుకుంటారు. కొండ మనిషంటే కొండ మనిషొక్కడే కాదు— ఆ గుంపు అంతా అలాగే. కొత్త మనుషుల గుంపు అంతా ఒక పక్షం. కొండ మనుషుల గుంపు అంతా ఒక పక్షం. ఇద్దరి మధ్యా భీకర సమరం జరుగుతుంది. చావగా మిగిలిన వాళ్లు

(38-వ పేజీ చూడుడు)

బాలగేయం:

పిచ్చిప్రశ్నలు

[శ్రీ నండూరి రామమోహనరావు]

ఆకాశపు పందిట్లో
అంతులేని మల్లెపూలు
అందుకునే దెల్లాగో
అమ్మా! నాకు చెప్పవులే?
వెన్నెల కిరణాలతోటి
వెండి మెట్లు నిచ్చెనేసి
మబ్బులెక్కి కొయ్యనువే
మల్లెపూలు నీకోసం?

* * *

దూరంగా జలజలమని
పారే ఆ వాననీళ్ళు
కాలవలో వెళ్ళొద్దే
కాగితాల పడవ మీద?
ఎవరెరగని దేశానికి
ఎక్కడికో పోయిపోయి
పచ్చలు, రత్నాలు, మణులు
పడవనిండ తెస్తానే.

పిచ్చికలకు గూళ్ళుచేసి
పచ్చికతో పరుపులేసి
గుజ్జనగూళ్లొండా నవి
గూళ్ల లోకి వస్తాయే?
పిచ్చిక గూళ్ళల్లో దూరి
వెచ్చగ యీ రాతిరంత
కిక్కురు మనకుండా, నే
నక్కడ పడుకుంటాన్నే.

* * *

పోవే నావన్నీ నువు
పిచ్చి ప్రశ్న లంటావు
నాన్నగారు రాగానే
అన్నీ నే నడుగుతాను.
నాకు కోప మొస్తే, యిక
నీకు కథలు చెప్పనుగా
నాన్నగారి కొక్కరికే
అన్ని కథలు చెబుతాను.

రుద్రమదేవి

(15-వ పేజీ తరువాయి)

నది. ఎవరో యనుచు నుద్ధరించుటకు దగ్గరకు పోయెను. అత డొక బాలవీరుడు!

మేచయ దగ్గరకు రాగానే ఆ బాలవీరునికి అపరిమితమగు భయము వేసెను. అకస్మికముగా నట్లు తాను కూపములో పడిపోవుట అచ్చట తన్ను ఒక వ్యక్తి పట్టుకొనుట ఎవరికి భయము కలిగింపదు! అటు తనను పట్టుకొన్నది భూతమో పిశాచమో! భూతప్రేతపిశాచములు ఉన్నవని మేము నమ్మమని ప్రగల్భము పలుకువారే, ఒంటరి పాటున చిత్రధ్వనులు విన్న నదియేమో దయ్యమని భ్రమింతురు. మరి యిక వాని యునికి విశ్వసించువారి కెట్లుండును?

అంతలో నింకను కొందరు లోపలికి పడియుండెడివారు. ఎవరో ఒక వ్యక్తి వారల నా ద్వారమున బోవద్దని వారించుచుండెను. మరి కొంతసేపటికి పైన దివిటీలు కానవచ్చెను.

మేచయకు తా నుద్ధరింపబడితిమని ధైర్యము కలిగినది. ముందు ప్రయత్నించిన విధముగా నొకరిపై నొకరిని నిలువబెట్టి వారిద్దర భుజములపైనుండి మేచయనాయకుడు ఆ తెరచిన ద్వారబంధమునకు లంఘించి శీఘ్రగతి పైకి వచ్చెను.

అచ్చట నాతనికి ఎదురుగా అన్నమంత్రీశ్వరుడు ప్రత్యక్షమయ్యెను. కవచగాత్రుడైన యా మంత్రీశ్వరుడు శిరస్త్రాణము పైకెత్తి యా గదిలో నెవ రుండిరో తెలిసికొన దివిటీ వెలుగున ప్రయత్నించుచుండెను. వచ్చుచున్న మేచయ నాతడే చేయూత యిచ్చి యుద్ధరించెను.

మేచయ నిర్ఘాంతపోయెను. తనచే బంధితుడైన యన్నమంత్రి యిక్కడ నుండుటేమి? అత డేమి చేయుచున్నాడు? రాజద్రోహుల నాయకు డితడేనా? అది మరియొకడైనచో మేచయనాయకుడు వెంటనే పోరుకు తలపడియుండును. మహామంత్రీశ్వరుడగు అన్నమంత్రి తేజస్సు మేచయనుగూడ ముగ్ధునిజేసెను. అన్నమంత్రి శాంతముగా ప్రశ్నించెను.

“మరి ఎవ రున్నారు లోపల?”

మేచయసందేహము ఒక్క త్రుటిమాత్రమే! మరుపటి క్షణమున నాతడు చెప్పివేసెను. నీళ్లలో దోగియున్న మేచయకు వెంటనే యుపచారములు చేయ భటుల కాజ్ఞాపించి అన్నమంత్రి మిగిలినవారి నుద్ధరించుటకు ప్రయత్నములు చేసెను. భటుల యుత్తరీయములను ఉష్ణీషములను మెలివేసి వెంటనే త్రాడుగా చేసి బలశాలు రగు భటులు పట్టుకొని లోపలికి దింపిరి. దాని సహాయముతో నొక్కరొక్కరే పైకి వచ్చిరి.

ముందు పైకి వచ్చినది బాలవీరుడు! క్రిందివారును పైవారును ఎంత యర్థించినను లోపల నున్నవా రెల్ల రుద్ధరింపబడునంతవరకు మహాదేవరాజు పైకి రాలేదు. అందరు పైకి వచ్చిరని నిశ్చయింపబడినతర్వాత అతడును పైకి వచ్చెను.

మహాదేవరాజుకు సంతోషముకంటె సిగ్గు ఎక్కువగా నున్నది. అది దివిటీల వెలుగున నుపలక్షించిన యన్నమంత్రీశ్వరుడు తన రెండు బాహువులు కైదండ యిచ్చి యాదరముతో పైకి తీసెను.

సంతోషము పట్టలేక మహాదేవరాజు, “నీవటయ్యా, అన్నమంత్రీశ్వరా?” అనుచు నాతని గాఢముగా నాలింగనము చేసికొనెను. మహాదేవరాజు సురక్షితముగా నున్నందుకు అన్నమంత్రికి ఆనందబాష్పములే కార్చెను.

అంతట నందరనాయకులకును తానే ప్రభువైనట్లు అన్నమంత్రి సాదరముగా నాజ్ఞలు అందజేసెను.

“మీరందరికి తీరని పని యున్నది. కాని యింత యలసటతో ఇప్పు డేమియు జేయలేరు. మీరు వెంటనే భటుల సహాయముతో మీ గృహముల కేగి విశ్రమించి జాము ప్రొద్దెక్కనప్పటికి స్వయంభూదేవాలయమునకు నన్ను గలసికొనుడు! ఇప్పుడు నాకు తీరని పని యున్నది. మంచిది!”

మంత్రముగ్ధులవలె నందరు నిర్ణీతులైన భటుల రక్షణతో తమ తమ గృహముల కేగిరి.

* * *

మరి యిది యంతయు నెట్లు జరిగినది?

ఆ రాత్రి అన్నమంత్రీశ్వరుడు స్వయంభూదేవాలయమున తిక్కనసోమయాజుల సెలవు తీసికొని నూతనబ్రాహ్మణవీరుల తోడను శైవవీరులతోడను జైనవసతిపైకి కదలెనుగదా! వారి నక్కడ నొక సేన యెదిరించెను గదా! ఆ యెదిరించిన సేన కధిపతులు రేచర్ల కామయ, నామయ, మల్లయ, గణపిరెడ్డి, మల్రెడ్డి రేచర్లరుద్రసేనాని వంశజులగు వారిని చూచినంతనే ఒక్క క్షణకాలము అన్నమంత్రికి చేతులు కాళ్లాడలేదు. మహాసభాసమయమున శ్రీరుద్రదేవమహారాజుల యభిషేకము నిషేధించి హరిహరదేవుని నభిషేకింపు డని వాదించుటతో వీ రాగలేదు! వెంటనే తన సేనను అన్నమంత్రి వారితో పోరుట కాజ్ఞ యిచ్చెను.

ఇట్టి యుద్ధములకు పూర్వశిక్షిత మైనది కాదాతనివెంట నున్న సేన! కాని యన్నమంత్రి తమకు నాయకుడుగా నుండుటయే దానికి మహాసాహసము చేకూర్చెను. జైనవసదిని చుట్టియున్న సేనయు మిక్కిలి పెద్దది కాదు. ఇంత యాకస్మికముగా నిందరు వసదిపై నెత్తివత్తు రని రేచర్ల వా రూహించి యుండలేదు.

శైవవీరుల మొదటితాకే వసదిని చుట్టియున్న సేనలను చీకాకు పరచెను. అదియు నొక గాలివానతాకువలెనే యుండెను. చిట్టడవిని మహాప్రవాహమువలెనే ఆ సేన వసదిని ముంచివేసెను. గడియ కాకముందె రేచర్ల కామిరెడ్డియు నామిరెడ్డియు గణపిరెడ్డియు హతులైరి; మల్లయరెడ్డి మల్రెడ్డి గాయపడి పట్టుబడిరి. వసది అన్నమంత్రివశ మయ్యెను.

వీరావేశముతో శైవవీరులు వసదిని త్రవ్వివేయ ప్రారంభించిరి. కొన్ని ప్రక్కల దానికి వారు నిప్పు ముట్టించిరి. అన్నమంత్రీశ్వరుడు అతికష్టముమీద వారి యావేశమును మాన్పి యా యగ్ని చల్లార్పజేసెను.

“వసదిలో నగరనాయకు లున్నా రని యైన మీరు మరువరాదు!” అంత స్పష్టముగా ప్రకటించువరకు నా శైవవీరులు ఆగలేదు.

అన్నమంత్రి యంతట వసదినంతయు వెదకించెను. అందులో నొక్క జైనసాధువుకూడ గనపడలేదు. నూతనముగా ప్రతిష్ఠితమైన నేమినాథవిగ్రహమునకు వెనుక నున్న చిన్న గదిలో, వసదికి నామమాత్రము అధిపతి యగు సిద్ధనంద్యాచార్యులు ప్రాణమాత్రావశిష్టుడై పడియుండెను. అతని నోట గుడ్డలు క్రుక్కబడి యున్నవి.

కొన్ని దినములుగా నతడు భోజనము చేసినట్లే లేదు. ఆతని రక్షించుటకు తనతో వచ్చిన బాలవీరులలో చిన్నవాని నప్పగించి, రెండవవానితో నగరనాయకుల నన్వేషించుచు అన్నమంత్రి ఒయలు వెడలెను.

ఒక ప్రక్కను వారు వసదికరణశాలను జూచిరి. కొద్దిసేపటి వరకును అక్కడ కరణములు వ్రాయుచుండిన చిహ్నములు కనబడినవి. కాని కరణములు లేరు. వారు వెళ్లిపోవుచు కొన్ని పత్రములు ఒకమూల ప్రోవువేసి అగ్ని ముట్టించినట్లున్నది. ఆ యగ్ని ఇంకను రాజుకొనుచునే యున్నది. దానిని వెంటనే ఆర్పించి ఆ గదికి బ్రాహ్మణవీరులను కాపుపెట్టి అన్నమంత్రి త్వరితగతిని రెండవ బాలవీరునితో నాయకులకై వెదకుచు వసది గాలింపసాగెను.

నేమినాథ విగ్రహమునకు దక్షిణమున నున్నగది వారు ప్రవేశించిరి. అందుండి పాతాళగృహమునకు బోవు ద్వార ముపలక్షించి యా బాలవీరుడు గొళ్ళెము ఆసీ దూర మాలోచింపక మందుకు అడుగు వేసి క్రిందపడిపోయెను.

* * * *

బాలవీరుడు చేసిన యుపచారములతో సిద్ధనంద్యాచార్యుడు కొంచెము తేరికొనెను. వసది పాకశాలనుండి గోక్షీరములు తెప్పించి సిద్ధనంద్యాచార్యులకు అతడు త్రావించెను. కొంచెము ఓపికరాగానే సిద్ధనంద్యాచార్యులు "ఎక్కడ నుంటిని" అని యడిగెను. బాలవీరుడు శాంతముగా "వసదిలోనే ఉన్నారు. ఆ దుష్టులందరు పారిపోయినారు" అనెను.

సిద్ధనంద్యాచార్యులు నిట్టూర్చెను.

* *

జైనవసదిక్షేత్రము వశమైనతర్వాత శైవవీరులకు దానిని నేల మట్టము చేయకుండ పట్టుట సాధ్యము కాకుండెను. వారి సంప్రదాయమున జైనవసదుల విటతాట మొనరించుట యొక పుణ్యకార్యము. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్యచరిత్రలో శైవభక్తులు ఎన్ని జైనవసదులను వ్రచ్చి వ్రయ్యలు చేసినట్లు వర్ణింపలేదు? ప్రాచీన శివభక్తులను తాము అనుకరింపవలెనని వారును ఉద్రేకులగుటలో నాశ్చర్యమేమి? కాని అన్నమంత్రీశ్వరుని యాజ్ఞలను ఆనకట్టకు వారు విధిలేక కట్టుబడిపోవలసినవారైరి.

తాసిల్దారు

(11-వ పేజీ తరువాయి)

పెళ్లిపనులకు సహాయం చేయుమని నియమించావుట! ఇక నీదాహంగూర్చి నాకు పూర్తి వివరాలు లభించాయి. నీకు మంత్రుల సహాయముందని ప్రజలు చెప్పుకుంటున్నారు. ప్రజ లిలా చెప్పుకోవడం మా గౌరవప్రతిష్ఠలకు భంగం! అందువలన ప్రజలలో నేను విశ్వాసం కలిగించవలెనంటే, మంత్రివర్గం నీవిషయంలో దయాదాక్షిణ్యాలు చూపట మసంభవం! నీవైనా మితిమీరిపోయావు. స్వార్థానికైనా కొంత మితి వుండాలి. ఇది ప్రజాప్రభుత్వం! ప్రజల మాటపాటించకపోతే, యీమాటు ఎన్నికలలో క్షేమం కాదురా ఓటివ్వడు. తెలిసిందా?" అన్నాడు - పలుములు నిరాకరించాడు.

వీరయ్య గద్గదకంఠుడై, వలలో చిక్కిన పక్షియై, "అయ్యా! నేను పిల్లలుగలవాణ్ని! పెద్దకుటుంబీకుణ్ని. బ్రిటిషుప్రభుత్వకాలంలో నే నొక గుమాస్తాగా వుండి ఎన్నో బాధ లనుభవించాను. మన దేశానికి స్వతంత్రం లభించింది. నా కుద్యోగం ప్రమోషనయింది. నావల్ల తప్పు లుంటే వుండవచ్చు. కాని అవిచాలా చిన్నదోషాలు. వాటిని క్షమించి మీరు నన్ను కాపాడాలి." అన్నాడు.

"చిన్నవి కావు. చాలా పెద్దవి. అసలు నీ వుద్యోగమే వూడుతుంది: నేను నీకు సహాయం ఏవిధంగా చేద్దామా అని ఆలోచిస్తున్నాను. నిన్ను కొన్నాళ్లుసస్పెన్షన్‌లో పెట్టడమా - లేక నిన్ను తిరిగి రెవిన్యూ ఇనస్పెక్టరుపనిలోకి మార్చడమా. అని ఆలోచనలో ఉంది. నే నీ రాత్రి మెయిలుకు మద్రాసు వెళ్లిపోతున్నాను." అని చెప్పి మంత్రిగారు తొందరపనులమీద కారులో ఏదో వూరు వెళ్లిపోయారు.

వీరయ్య ఇంటికి వచ్చి అచ్చువేసిన శుభలేఖలు పోస్టులో వేయవద్దన్నాడు. పెళ్లి యీ లగ్నానికి జరగడ మసంభవ మన్నాడు. ఏమీ తోచక యింట్లో అందర్నీ తిట్టిపోశాడు. "ఈ పెళ్లిప్రయత్నం ఏముహూర్తాన ప్రారంభించామో, ఆరోజునుంచీ నాదశ మారింది." అని విసుక్కున్నాడు. ఆరోజుననే రెండుమాసాలు సెలవు కావాలని జిల్లాకలెక్టరుకు వ్రాసుకున్నాడు.

నాలుగురోజులలో వీరయ్యకు మద్రాసునుంచి ఆర్డరు వచ్చిందన్నారు. ఆవిషయాన్ని పత్రికలు ప్రచురించాయి: ప్రజలానందించారు.

"లంచగొండితనానికి అలవాటు పడి విధులను సరిగా నిర్వర్తించక యథేచ్ఛగా ప్రవర్తిస్తున్న తాసిల్దారు వీరయ్యను ఒక ఏడాదిపాటు సస్పెండ్ చేయడమైనది!"

ఆ వుత్తరవు చదువుకుని నేల కూలిపోయాడు వీరయ్య! ఇంటిల్లిపాదీ గొల్లుమన్నారు. అది పత్రికలలో ప్రచురింపబడే సరికి ఆ కుటుంబానికి తలవంపు లైంది.

వీరయ్య ఆరుమాసాలు మద్రాసుచుట్టూ తిరిగాడు సస్పెన్షన్ ఆర్డరు రద్దుచేసి రివిన్యూ ఇనస్పెక్టరుపనైనా యిప్పించమని! కాని లాభం లేకపోయిరది.

ఆశ్రితపక్షపాతం వహిస్తున్నదని మంత్రివర్గాన్ని దూషించిన ప్రజలు వీరయ్యవిషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యతో తృప్తిపడ్డారు!.

ప్రపితామహులు

(13-వ పేజీ తరువాయి)

దూరంలో మావూరు వేటపాలెంవుంది భోజనాలుచేసి కాస్త విశ్రాంతి తీసుకుని సాయంత్రం బస్సుకు వద్దాం."

శాస్త్రీజీది విచిత్రస్వభావం సేవా యజమానిత్వో ఆయనకు పరిచయం లేనిచోట, ఆయనకు మంచినీరైనా వెళ్లదు కాని విద్యార్థులు బహలి ఉన్నారు గత్యంతరం లేక వప్పుకున్నారు

• విద్యార్థులు పోరంబోకు బస్సులోంచి ఒక్కొకొంతు గెంతారు

భద్రం తండ్రి అవధాన్లుగారు పాలెంలో ఒక సంపన్న గృహస్థు పాతికకరాల పొలం డెబ్బై వేలు వడ్డీవ్యాపారం సాగుతోంది తూర్పు ఇళ్ల పంక్తిలో కట్టిన పెద్ద లోగిలి

మధ్యాహ్నం ఒంటిగంట సమీపం అవధాన్లగారి దేవతార్చన గంట చప్పుడు వినవస్తూంది.

ఛాత్రోలితో శాస్త్రీజీ అవధాన్లుగారి సావిట్లో కాళ్లు పెట్టారు

అప్పుడే ఎండ జాస్తీగావుంది అందరి లాల్చీలు తడిసి ముద్దయిపోయాయ్

భద్రం ఒక్క సారి లోపలికెళ్లొచ్చి, "మా నాన్నగారి దేవతార్చనయిపోయింది మనదే ఆలస్యం, మడి కట్టుకోవచ్చు" అని తలో పట్టుపంచా తెచ్చిచ్చాడు

శాస్త్రీజీ మళ్లీ స్నానం చేయాలన్నారు "గంగాళంలోనూ—అండాలోనూ—వేడి నీళ్లూ—[illegible] ఉన్నాయి" భద్రం అన్నాడు

పెరటి బావిగట్టులో చిక్కలుంగీతీసి కట్టుకొ ఒకతాంబాలు పైన వేసుకొని శాస్త్రీజీ పెరట్లో కాలుతా బే అవధాన్లు గారప్పుడే దైవప్రార్థన ముగించి వసారాలోకి వచ్చి, "స్నానం ముగించి వేగంరండి మేష్టారూ" అన్నారు ఆనేసి టమీద విసురుగా వెళ్లి కూర్చున్నారు

దేవతార్చనలో పెట్టెను చి వచ్చిన నీరానవు ధూమం అగరు వత్తి సువాసనా - అ ప్రా తమ తాన డి ది

అన్నపూర్ణమ్మగారు పసుపూ కుంకాలతో, తల్లో మారదారి పూవుతో, అచ్చు అన్నపూర్ణాదేవిలా వచ్చింది వడ్డించింది

అంతా భోజనాలు చేస్తున్నారు

అవధాన్లుగారు ఒకటిరెండు ఖచ్చితమైనటువంటి కరళ్లు నోట్లో వేసుకొని, కుశల ప్రశ్నవతుగా అన్నారు "బాబూ! మనింటి పేరు కందుకూరి వారని గదూ అన్నారు అయితే గోదావరిజిల్లా అంతటికీ పేరు మోసిన కందుకూరి వేంకటావధాన్లు గారు తమకు "

"పితామహులు"

"అట్లా చెప్పండి" కమండలం అంత రాగిచెంబు మండమీద పెట్టుకుని గడగడ మంచినీళ్లు పుచ్చుకుని, దించి, ఆ మహానుభావుడు క్రమాంతస్వాధ్యాయి శ్రౌతస్మార్తాల్లో నిధి, గొప్ప కుటుంబంలో పుట్టారు బాబూ!" ••

"కాని - ఆ బ్రాహ్మణ్యం! ఆ చదువులూ ఏవండీ ఇప్పుడూ ?"

"మాది. చిత్తగించారు గొప్ప శిష్ట కుటుంబమండి - మా ముత్తాత బ్రహ్మావధాన్లు గారంటే ఈ పట్టీకి అపర ఆపస్తంభులని వాడుక లెండి వేదశాస్త్రాలు జిహ్వాగ్రంలో తాండవించేవట నిరతాగ్నిహోత్రి అలాంటి వంశంలో జన్మించి.. మా నిర్భాగ్యడు వెధవ చూశారూ - మొహాన్ని బొట్టైనా లేకుండా గూడకట్లు సిగరెట్లు వేషాలు. ఏం చెప్పం - లోకం అంతా

"ప్రకాశం"

బ్రహ్మసమాజం వాళ్ళతో నిండిపోతోంది"

" . . . "

శాస్త్రీజీకి వెన్నులో పొడిచినట్టైంది భద్రం తన పితృ తన్నే దూషిస్తున్నాడని బుర్రోంచుకున్నాడు.

మధు కళ్లు చిరచిరలాడాయి. తగిన శిక్షా తియ్యాలని నిశ్చయం చేసుకున్నాడు

అన్నపూర్ణమ్మగారు మజ్జిగ పోస్తూ, "ఎండక్ల కొంబోలు మేష్టారికేమో సయించలేదు" అన్నారు

భోజనాలు పూర్తిచేసి లేచి, శాస్త్రీజీ, శిష్యశ్రేణి సావిట్లో పాలగచ్చుమీద విశ్రమించారు.

భద్రం ఏదోపనిమీదఎవరింటికో వెళ్లాడు.

కొంతసేపైనతర్వాత అవధాన్లుగారు తడి అంగవస్త్రం పై మీదేసుకొని, మడి ఉట్టి పదేశేషంతో సావిట్లో కొచ్చారు

స్టూడెంట్సులో ఏవో గుసగుసలు, రుసరుసలు - బయలుదేరాయి మధు అవధాన్లుగారిపై పగతీర్చుకుందుకు ఏదో ప్లాన్ వేశాడు

అవధాన్లుగారు వారికెదురుగా కూర్చుని అన్నారు "బాబూ! మీరంతా కాలేజీలో చదువుకుంటున్న [illegible]? మావాడూ మీరు ఒకటే క్లాసేనా? " ఇత్యాదిగా కొన్ని ప్రశ్నలు వేశాక, మళ్లీ అన్నారు "అయితే మీకు కాలేజీలో ఏమేమిటి చెప్తారు?—ఏవో క్రొత్త శాస్త్రాలు చెబుతున్నారంటాడు మావాడు..."

శాస్త్రీజీ భద్రం తెచ్చిన పరుపుచుట్ట మీద ఆనుకుని పరధ్యానంగా విశ్రమిస్తున్నారు మాగన్నుగా ఉంది.

ప్రకాశం అందుకున్నాడు—"చరిత్ర - భూగోళం - గణితశాస్త్రం మొదలైనవేవో చెప్తారు. దానికేం గానీండి మా మధు దగ్గర ఒక నూతన విద్యఉంది అది మీరు ముఖ్యంగా వినదగ్గది ఏమిటంటే అతడు దేహాంతరగతులైనవారు అతడితో మాట్లాడతాడు అంటే మన పితృదేవతలను ఆహ్వానించి. మాట్లాడతాడు. పితృదేవతల అభిరుచులు, అభిప్రాయాలు అన్నీ తెలుసుకోడం, బతికున్న వారితోటలాగే ఇష్టాగోష్ఠి జరపడం, ఈ ప్రజ్ఞతో మావాడు చాలా మందిని వినోదింపజేస్తుంటాడు దాంట్లో మావాడిది క్రొత్త తరహా"

అవధాన్లుగారు ఎప్పుడూ ఈ సంగతి విన్న లేదు అత్యాశ్చర్యం కలిగింది అదేదో ఎలాగైనా చూడాలనిపించింది "ఈ ఆంగ్లేయవిద్యవల్ల ఎన్ని వింత విషయాలు వింటున్నాం!—బాబూ అలా మాట్లాడానికి ఏదో ఒక వేళని ఉంటుందిగా మోసు! " అన్నారు.

ప్రకాశం—"అక్కర్లేదండి—మా వాడెప్పుడు కావలిస్తే అప్పుడే ఆహ్వానింప చేయగలడు మీ పెద్దలనెవరినైనా ఆహ్వానించి చూస్తారా? పేరుచెప్పండి" అన్నాడు

"అయితే - మా ప్రపితామహులు జగ్గావధాన్లుగారితోటే మాట్లాడాలని కుతూహలంగా ఉంది" అన్నారు అవధాన్లుగారు స్థిమితంగా కూర్చుని

"మధూ" ప్రకాశంపిలిచాడు అతను ముందుకొచ్చి పద్మాసనంమీద సీరియస్‌గా కూర్చున్నాడు. మేజిక్ చేస్తున్నట్లు,మధు ముఖం మీద మూడుసార్లు చెయ్యి త్రిప్పి, ప్రకాశం అన్నాడు — "బాబుగారూ ప్రపితామహుని ఆహ్వానిస్తున్నాడు వారు మనకంటే పెద్దలు గనక ఏమైనా అన్యాపార్థం చేసుకోగూడదు మధ్యలో కదిలితే

పిమ్మట్నీ మమ్మల్నీ కూడా శపించివేస్తారు. తరువాత మీ యిష్టం."

"అమ్మమ్మ్వే! ఎంతమాట! మంచో చెడుగో బిడ్డ చూడాలనే కుతూహలం కావలిండి!" అన్నారు అవధాన్లుగారు

మధుధ్యాననిమీలితాక్షుడై, మూడు ఊగు లూగి మాట్లాడబోతున్నాడు. స్టూడెంట్సు ముసిముసి నవ్వుల్తో పరికిస్తున్నారు. శాస్త్రీజీ ఈ గందరగోళానికి లేచిపోయి చూశారు. వ్యవహారం ఏమిటో గ్రహించి, వచ్చే నవ్వు అపుకుని దీక్షగా చూస్తున్నారు

మధు ఆవేశంలో అన్నాడు- "అబ్బా! మళ్ళీ ఎన్నాళ్ళకి నరలోకానికి రావల సొచ్చింది .. అంతా మారిపోయింది ఒక్కడూ నిజమైన శ్రోత్రియాచారవు బాపడు కనపడ్డంలేదు మా కుటుంబ పరిస్థితి ఎలాగుందో ఎవరయ్యా వన్నిక్కడి కావాహ్వానించింది ?"

అవధాన్లుగారి ఆశ్చర్యం ఇంతింతని చెప్ప లేము - "తాతగారూ . నేనండి శ్రీనాథ ధాన్లని ." అన్నారు - ఉత్సాహంతో.

"శ్రీనూ ఎన్నాళ్లకి చూచానురా మళ్లీ నిన్ను.. ఎంత ప్రయోజకుడి వయ్యావు! - ఎన్ని భూములు సంపాదించావు! - ఎంత డబ్బు నిలవ చేశావు! గొప్ప గృహస్థు వని పించుకున్నావు !"

అవధాన్లుగారి ముఖం వికసిస్తోంది

"కాని - మాపొట్టకు పుట్టి ఇంత నిర్భా గ్యుడివి అవుతావనుకోలేదు."

అవధాన్లుగారు త్రుళ్లిపడి చూశారు

"ఉపనయనం అయినవెంటనే, 'స్వాధ్యా యాన్న ప్రమదితవ్యమ్' అన్న వేదప్రమా ణం చెప్పుకున్నావురా ?" మధు తన నంగా సెకండ్ లాంగ్వేజ్ అయిన సంస్కృ తంలో అన్నాడు

ఈ ఉపనిషద్వాక్యం ఉచ్చరించేటప్పటికి, అవధాన్లుగారికి ముచ్చెమటలు పోశాయి.

"మానాడు ఎనభైనాలుగు సన్నాలూ రాని వాణ్ణి పంక్తి బాహ్యుడుగా చూసేవాళ్లం రా! యావజ్జీవం హోష్యామి అని ప్రమా ణంచేసి, ఒక్కనాడైనా అగ్నిహోత్రం చేసిన పాపాన పోయావు ? తద్దినం నాడు ప్రాయశ్చిత్తంతో తప్ప! ఇప్పుడు నువ్వీ ప్రాంతానికి ఒక సనాతన ధర్మ ప్రతినిధి వట గదూ! సనాతన ధర్మంఅంటేనీకే కాదు ఈచుట్టూ పదిమైళ్లలో ఎవరికైనా తెలుసు? అజ్ఞానులదగ్గర నీవు ఘనుడివి! తల గొరిగి పిలక పెట్టడంతోనే సనాతన ధర్మం పెడితే సనాతన మతస్థుడు కానివాడెవడ్రా! 'దేవ పితృ కార్యాభ్యాం న ప్రమదితవ్యం' అని శ్రుతి ఘోషిస్తూంటే - కోర్టు వ్యవహారాల మీద ఉండే శ్రద్ధ నీకు ఒకనాడేనా ప్రపితృ కార్యం మీద ఉండా నాయనా? బ్రాహ్మ ణుడికి వడ్డీ వ్యాపారమే మిత్రాబాబూ! కుశీద వృత్తి సర్వశాస్త్ర నిషిద్ధంకాదుట్రా! ఇంత శ్రోత్రియ కుటుంబంలో పుట్టి నీవు చెడనవే కాకుండా, కుర్రవెధవకు హూణవిద్య చెప్పి స్తున్నావూ? - అవునులే! నీకేలేని బ్రాహ్మ ణ్యం వాడికెలా తెలుస్తుంది? నీ కొడుకు వాడూ! ఇంతకూ నిన్న నవలసిన పనేముంది? అంతా కలియుగంరా బాబూ!"


మెల్లగా మదుకళ్లు విప్పి చూశాడు అవ ధాన్లుగారి మొహాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. ఆయన రుసరుసలాడుతూ దిగ్గునలేచి ఏ వైపూ చూడకుండా ఇంట్లోకి పోగానే, విద్యార్థులంతా మధు మీదపడి ఏకసక్కే!

"ఉండండిరా! పితృలోక బసలికింకా తీరలేదు" అని తమాషాగా జవాబుచెప్పి, "మేష్టారూ సామాను సర్దమన్నారా?" అన్నాడు సవినయంగా.

శాస్త్రీజీ ఉక్కిరి బిక్కిరిగా నవ్వుతూ "చాల్లేవోయ్! - ముసలాడిమీద ఎంత కసి తీర్చుకున్నావ్!" అన్నారు, హాండ్‌బాగ్ సవరించుకుంటూ

భద్రం వచ్చి ఈ హాస గందరగోళం చూచి నిలుచుండగా శాస్త్రీజీ అన్నారు. "లేవండి! బస్సు వైమవుతూంది"

* * *



ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, మాగ్డలెన్ కళాశాల గోపురం

శ్రీమంతుడు

(28-వ పేజీ తరువాయి)

మోటుతనం, ఆడంబరం గుర్తించి తుంగమొక్కలు నాలుగు పీకి, ఒక చక్కని అల్లికవస్తువు తయారు చేసి ఒకని కిచ్చాడు. అతడుదానిఅందం చూసి గంతులువేస్తూవెళ్లి తన స్నేహితులకీ, బంధువులకూ చూపించాడు. వారందరూ ఆ వస్తువును చూసి ఆశ్చర్యపడి, అందరూ కలసి కష్టజీవిదగ్గరకువచ్చి, తమకూ కావాలని బ్రతిమాలారు. కష్టజీవికి దూలాలు మొయ్యటం బాధవదలి సుఖంగా కూర్చుని, వారందరికీ తుంగతో అల్లిక లిస్తున్నాడు. తిరిగి వారందరూ అతనికి కావలసినంత ఆహారం ఇవ్వటమే కాకుండా, ఒక చక్కని గుడిసె నిర్మించి, ఎన్నో విధాల తమధయ్య, కృతజ్ఞత తెలియ జేశారు. కాని శ్రీమంతునికి అచ్చటి ప్రజలను మెప్పించే నేర్పరితనంగాని, తెలివి తేటలుగాని, ఓపిక గాని లేనందున, కష్టజీవికి నౌకరుగా నియమింపబడ్డాడు.

ఈవిధంగా కొన్ని మాసాలు గడిచిన తరువాత తిరిగి శ్రీమంతుని కష్టజీవిని స్వదేశం తీసుకువచ్చారు. అధికారి ముందు ఉంచబడ్డా రిద్దరూ శ్రీమంతుని వైపు కోపంగా చూసి అధికారి యీ విధంగా అన్నాడు, ''ఏమయ్యా, ఇప్పుడు బోధపడిందా, నువ్వెంత క్షుద్రుడవో, అశక్తుడవో? నీవు అవమానపరిచి. బాధపెట్టిన మనిషి నీకన్న ఎన్నివిధాల ఉన్నత స్థాయిలో వున్నాడో యిప్పుడైనా గ్రహించగలిగేవా? నీవు అతనికి చేసిన అపకారానికి నీచేత గుణహా యిప్పిస్తాను. కష్టజీవి సర్వస్వం నీవు నాశనం చేసినందుకు నిన్ను నేను నాశనం చెయ్యాలి. కాని ఇక ముందైనా నీలో మానవత్వం మొలక ఎత్తక పోదన్న ఆశతో, నీ ఆస్తిలో సగ భాగం మాత్రం కష్టజీవికి ఇప్పించి, నిన్ను వదిలేస్తున్నాను''

కష్టజీవి అధికారికి ధన్యవాదా లర్పించి ''అయ్యా నేను బీద తనంలో పెరిగి కష్టానికి అలవాటు పడ్డాను. ఇప్పుడు నాకు భాగ్యం పట్టినా ఎలావుపయోగించుకోవాలో కూడా తెలియక చిక్కుల్లో పడతాను. కనుక యీ శ్రీమంతుని, నన్ను యిదివరలో ఏస్థితిలో వున్నామో, ఆస్థితిలోనే ఉండనిస్తే చాలు. నావంటి వారియందు జాలికలిగి వుండవలసిన దని సూచిస్తే మరీ సంతోషం'' అన్నాడు. శ్రీమంతునికి ఈ అవ్యాజానురాగం చూస్తే, అతని ఆశ్చర్యానికి మేర లేకపోయింది.

పడిన కష్టాలవల్ల తెలివిని సంపాదించాడు శ్రీమంతుడు. జీవితాంతం కష్టజీవికి ఏలోటూ లేకుండా చూస్తూ, స్నేహితునిగా చూసుకున్నాడు కష్టజీవిని.

వింత శిఖరాలు

(31-వ పేజీ తరువాయి)

యాంగ్ హై భీతితో రెండు చేతులతోనూ కళ్లు మూసుకున్నాడు. చేతులు తీసి మళ్లీ చూసేసరికి అతడొక కోతిగా మారి పోయాడు. చూమెక్ మెల్లిగా కదిలి ద్వారం సమీపించి తలుపు తెరిచాడు. కోతిగా మారిన యాంగ్ హై నేలపై కరికి ద్వారం సమీపించాడు. తన పరిచారకులందరూ శిలా ప్రతిమలవలె చలనం లేక పడివుండటం గమనించాడు. భయంతో రాక్షసరూపివంక చూశాడు.

ఎగిరి గంతేసి తనపక్క చేరాడు. మళ్ళీ చేతుల్తో కళ్లు మూసుకున్నాడు. మళ్లీ చూసుకునే సరికి అతనికి మామూలా శరీరం వచ్చేసింది. అప్పుడు చూమెక్ ఇలా చెప్పాడు. "వెంగ్ నా రక్షణలో ఉన్నాడు. అతని సంపదల్ని చూసి అసూయపడి నీవు అతని కపకారం తలపెట్టావు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని అతన్ని గౌరవంగా చూస్తే మంచిది. లేదా నీ ప్రాణాలు నిలవవు. జాగ్రత్త. ఏమి చెప్తావు?"

"వేరే చెప్పేదేముంది? మీరు చెప్పే షరతులన్నిటినీ కూడా అంగీకరిస్తాను. నన్ను ప్రాణాలతో విడిచిపెడితే చాలు" అని ప్రాధేయపడ్డాడు యాంగ్ హై. చూమెక్ కారాగారానికెళ్లాడు. అతడు లోనికి ప్రవేశించగానే తలుపులు వాటంతటవే మూసుకు పోయాయి.

మరునాడు వెంగ్‌ను సభలోకి పిలువనంపి సకల గౌరవాదరాలు చూపి యాంగ్ హై విడుదల చేశాడు. క్షమార్పణ కోరాడు. తరువాత వెంగ్ చిరకాలం సుఖంగా జీవించాడు. అతడు మరణించగానే దంతపు పెట్టి, వజ్రశిల వాటంతటవే మాయమైనాయి.

భాషల పుట్టు పూర్వోత్తరాలు

(32-వ పేజీ తరువాయి)

కొండగుహలు ఆక్రమించుకుంటారు. వాళ్లు కొత్త కొండ మనుషులు. వీళ్ళ దగ్గరికి మరో కొత్త మనుషుల గుంపు వస్తుంది. పాపం—వాళ్లూ తిండి లేకనే వస్తారు. మళ్ళీ, కొత్తవాళ్లూ ఆపాతవాళ్లూ పోరాడుతారు. ఈ చక్రం అలా తిరుగుతూ వుండవల్సిందే!

ఎవరిది తప్పంటారు? కొత్త మనిషి పాత మనిషిని అన్యాయం చేశాడంటారా? మన న్యాయాన్యాయవిచక్షణ వాళ్లకి వర్తించదు. చంపడమో చావడమో—మరో సూత్రం వాళ్లకి తెలీదు.

ఈ కథంతా ఎందుకంటే: హిమప్రళయం దాటుకొచ్చి, ప్రాణి లోకానికి సామ్రాట్టై, పనిముట్లూ, నిప్పు కనిపెట్టి, మాట లభ్యసించి, ఆఖరికి స్వజాతి వైరంతో కాలక్షేపం చేసేవాడు మనిషి—అని చెప్పేందుకు. జంతువుల భయం పోయి మనిషికి మనుషుల భయం పట్టుకుంది. అందుచేత యుద్ధాలు, ఆయుద్ధాల్ని కీర్తిస్తూ పుట్టింది మనవాక్సాహిత్యం.

ఇక్కడ మనం గ్రహించవలసిన చిన్న విషయ మొకటుంది. మనుషులు జంతువుల కంటె హీనంగా పోట్లాడుతున్న మాట నిజమే. కాని మానవపరిణామంలో మెదడుది ప్రముఖపాత్ర అవడం వల్ల, పరిస్థితులకి అనుగుణంగా మారగలిగిన మనిషి కష్టాలు దాటుకు రాగలిగాడు. నేర్పరులం కాని వాళ్ళు కాలగర్భంలో కలిసి పోయారు. వ్యక్తుల కేంజరిగిందో అదే జరిగింది, గుంపులకి, దేశాలకి, నాగరికతలకు కూడా.

ఆర్యులు క్రీస్తుకి రెండువేల సంవత్సరాలకి పూర్వం మధ్య ఆసియాలో తలెత్తారు. వీరు గోధుమలు పండించేవారు. కంచు అనే లోహం తెలుసు వీరికి. ఆఫ్రికా ఖండంలో ఈజిప్టు అనే దేశమొకటుంది. ఈజిప్టు అప్పటికే పరపీడనవల్ల బాధపడుతూవుండేది. ఈజిప్షియనులకి మంచి విద్య ఉండేది. వారు తమ భాషకప్పుడే లిపిని కూడా ఏర్పరుచుకున్నారు. ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకో దలిచినప్పుడు మనం మొదట చెప్పుకోవల్సింది ఈజిప్ట్‌వారి లిపే మనకి తెలుసుగాని వారి భాషలోని శబ్దాలు మనకి తెలీవు.

చైనాలో నేమి ఈజిప్టులోనేమి లిపి బొమ్మల భాష రూపేణా పుట్టింది. మధ్యధరా ప్రాంత భాషలన్నీ ఫొనీషియనులు తమ లిపితో సంస్కరించారు. మన A B C D లు కనిపెట్టినవారు ఫొనీషియనులు. చైనా వారి భాష ఈ నాటికీ పూర్వపంథాలోనే ఉంటుంది.

బొమ్మల, భాషలలో వుండగా ఆర్యులు తమ వాక్సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేశారు. ఆ రోజుల్లో అన్ని జాతులకి పూజార్లు ఉండేవారు. ఆ పూజారి మందూ మాకూ యివ్వడమే కాకుండా గ్రహబలాలు చెప్పేవాడు. ఈ జాతులు కడుపులో చల్ల కదలకుండా కూచున్న రోజుల్లో ఆర్యులు తమ గుడారాలతో శీతభూములన్నీ తిరిగేవారు. ఆర్యుల నాయకుడు పూజారి కంటె తెలివిగలవాడు. కనక శత్రువుల్ని యుద్ధాల్లో యిట్టే వోడించేవాడు.

ఆర్యులకి యిల్లూ వాకిలీ ఉండేవి కావు. గుడారాలు వేసుకొని తమ వస్తు వాహనాదులతో అక్కడ కొన్నాళ్ళపాటు వుండి, మళ్లీ గుడారాలెత్తేసుకు పోయేవారు. అలా నిరంతరం ప్రయాణిస్తూ విజయాలు సాధించుకుంటూ పోయే ఆర్యులు తమ తెగలోని మహాపురుషుల శౌర్యాన్ని చాటే పాటలు పాడుకునేవారు. Bard, అనగా పాటగాడు ప్రతి గుంపుకీ ఒకడు ఉండేవాడు. ఒకొక్కప్పుడు అతను ఒక చరణం పాడితే, మిగతావాళ్లు పల్లవి అందుకునే వారు—మార్చింగ్ సాంగ్ లాటిది. ఇంకోప్పుడు శిబిరంలో సురాపానం అయిన తర్వాత నాయకుణ్ణీ, నాయకురాల్నీ అగ్రపీఠంమీద కూచోబెట్టి, తమ గుంపు మినహా నరవాసనలేని, ఆ విశాలమైన శీతభూమిలో, అన్ని వైపులా నక్షత్రాలు మిలమిలా మెరుస్తూ వుండగా ఆర్య వంశీయుల ఘనత తన శ్రావ్యకంఠంతో వినిపించేవాడు ఆ పాటగాడు. ఆర్యులు సాహసోపేతులు. ముందుకి దూకించే ఉడుకురక్తం వాళ్ల దేహాల్లో ఉండేది. ఘనకార్యాలకి పురిగొల్పే పాటలు వింటూ ఆర్యులు తన్మయులయేవారు. ఆ సంగీతం వారికి సంతోషదాయకంగా ఉండటమే కాకుండా, జీవితం పట్ల ఉత్సాహాన్ని యిచ్చేది. పగలంతా పడ్డ శ్రమని సాయంత్రపు సురాపానంలో ముంచేసి పాటగాడి పాటతో ఆనందోన్మత్తులైన ఆర్యుల వీరగాథలే మన ప్రాచీన వాక్సాహిత్యం.

హోమర్ కావ్యాలూ, వేదాలూ, భారత రామాయణాలు మొదలైనవి వాక్సాహిత్యంగానే మొదట జన్మించాయి. ఈ నాడు ప్రింటింగ్ చవక. కాని ఆనాడు కంఠస్తం చేసి నేర్చుకోడం తేలిక. ఎంచేతననగా రాత పరికరాలు సులువుగా లభ్యమయేవి కావు కనక. అదీ కాక వాక్సాహిత్యంలోని రసం లిపిలో చెడుతుంది. పాట ఎవరైనా చదువుతారా పాడతారుగాని! పాట పాడటం నేర్చుకుంటేనే గాని రాదు. అనగా ఒక గురువు కావాలి.

వాక్సాహిత్యానికి ఉచ్చారణ జీవం. ఆ ఉచ్చారణ అభ్యాసం వల్లగాని అలవడదు. సంస్కృత పాఠశాలలో విద్యార్థులు చేసే వేదాధ్యయనం ఒక సారి చూస్తే వాక్సాహిత్యం ఎలాటి క్రమశిక్షణలో పెరిగిందీ బోధపడుతుంది.

వేదాలు నాలుగు. ఋగ్వేదం; యజుర్వేద, సామవేద, అధర్వణ వేదాలు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మొదటిది శౌచానికీ, రెండోది నిత్యనైమిత్తిక కర్మలకీ, మూడోది గానానికీ, నాలుగోది విలువిద్యకీ సంబంధించినవి. భారతాన్ని పంచమ వేదమన్నారు. ఇదంతా ప్రారంభంలో వాక్సాహిత్యమే. తరవాత్తరవాత దేవనాగరి లిపిలో పదిల పరిచారు ఈ ప్రమాణగ్రంధాలను!

ఇప్పటికీ మనం ఫలానాయన కవిత్వం చెబుతాడంటాం. చెప్పడంగాని అది రాయడం కాదు. ఇప్పుడు రాయడమెంతసులువో వెనక చెప్పడమంత సులువు. యమకం, గమకం యిత్యాదులు ఆ నాటి సాహిత్యానికి కావల్సివచ్చేవి. సుమతీ శతకంలోని పద్యాలు తొందరగా కంఠతా రావడానికి మూల కారణం ఛందోనియమం. దాన్నే నోరు తిరగడం అంటాం.

లిపి పుట్టగానే వాక్సాహిత్యం పోయిందని గానీ, లిపివల్ల వాక్సాహిత్యానికి అపకారం జరిగిందని గానీ అనుకోకూడదు. లిపివల్ల మేలు జరిగింది. వాక్సాహిత్యంలో వున్న నవరత్నాలూ లిపి ముందుతరాలవారి కోసం భద్రపరిచింది.

ఆనోటా ఆనోటా పాడుకునే పాటలు మనదేశంలో లక్షోపలక్షలు. ఇండియాలో వున్నంత వాక్సాహిత్యం యింకెక్కడా లేదేమో కూడాను. లిపీ వాక్సాహిత్యమూ మోటారూ రైలుబండిలా పక్కపక్కనే బతుకుతూ వచ్చాయి. నిజానికి లిపి ప్రస్తుతం మనకి తెలిసిన వాక్సాహిత్యంకంటె పాతది.

లిపి గురించి తెలుసుకునేందుకు మళ్ళీ వెనక్కి ఈజిప్టుదగ్గిరికి పోవాలి. నైలునదీ నాగరికతలో ప్రథమ లిపి ఎలా పుట్టింది యింకో సారి తెలుసుకుందాం.

(ఆలిండియా రేడియో [illegible] సన్యంతో) [illegible] ంకా వుంది)



సంఘ విద్రోహులు

(7-వ పేజీ తరువాయి)

స్తాయనే తెలివితక్కువతనాన్ని యెంత త్వరితంగా విడిచిపెడితే అంత మంచిది. గ్రామాలలో పేదవారి సంఖ్య అత్యధికమని వారు గుర్తుంచుకోవాలి.

కష్టకాలంలో పేదవారి నాదరించడం, వారికి కక్షవంచన లేకుండా సహాయపడడం, వారితోపాటు తాముకూడా గ్రామరక్షణోద్యమంలో భాగస్వాములుగా వ్యవహరించడం, తద్వారా సామాన్యప్రజల సహానుభూతిని సంపాదించడం. ఎంతయినా అవసరమని గుర్తించాలి. ప్రభుత్వనిర్బంధాలకి దొరకకుండా తప్పించుకొని దాక్కొంటున్న వాళ్ళకు ఆశ్రయం దొరక్కుండా చూడాల్సిన బాధ్యత ప్రజలమీదనే వుంది. అట్టివాళ్ళని పట్టుకొనడానికిచేసే పోలీసుల ప్రయత్నాలకు ప్రజలు నిర్భయంగా సహాయపడాలి. ఇది మన ప్రభుత్వం, మన రక్షకభటులనే విషయాన్ని ప్రజలు విస్మరించకూడదు. ప్రజలకు మనం సేవకులం అనే విషయాన్ని పోలీసులూ మరవకూడదు. ఈ ఉభయుల్లో ఎవరు తమ కర్తవ్యాన్ని విడిచినా ప్రమాదమే.

పోలీసులవల్ల ఏమయినా పొరపాట్లు జరిగితే ప్రజలు నిరాశానిస్పృహలకు గురికాకూడదు. ఆపొరపాట్లనుఅధికారుల దృష్టికి తెచ్చిసవరింపచేయాలి. ప్రజలవల్ల తప్పులుంటే వాటిని వారికే నచ్చచెప్పి సరిఅయినదారిలో పెట్టడానికి అధికారులు యత్నించాలి. ఈ విధానం అవలంబించడంవల్ల పరస్పర సహకారం హెచ్చుతుంది. ప్రజాశత్రువులకు గ్రామాలలో తావు లేకుండా ఏకాకులవుతారు. ఈ దుష్టశక్తుల్ని నిర్బంధవిధానంద్వారా మాత్రమే అణచగలమని ఎవరనుకున్నా తప్పే. ప్రచారం, ప్రజాచైతన్యంమూలంగా, ప్రజల సంపూర్ణ సహకార ఫలితంగా వీరిని ఎదుర్కోగలం. ప్రభుత్వాలు చేస్తున్న ప్రజోపయోగకార్యాలను విరివిగా ప్రచారంచేయడానికి ప్రజాసేవకులు పూనుకొని పనిచేయాలి. రాత్రిపాఠశాలలు, వయోజనవిద్యాకేంద్రాలు, సినిమా ప్రదర్శనాలు ప్రచారానికి బాగా ఉపయోగపడతాయి.

ఏ ప్రభుత్వాన్నయినా మార్చడానికీ, తమకోరిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని సక్రమపరిపాలన సాగించుకొనడానికి ప్రజలకు సవ్యమయిన మార్గాలున్నాయి. ఎన్నికలద్వారా ప్రతినిధులను పంపి శాసనబద్ధప్రజాస్వామికాన్ని స్థాపించుకోవాలి. ఇది నాగరిక ప్రపంచపద్ధతి. ఈ పద్ధతి ఈ సంఘవిద్రోహులకు నచ్చదు. వారికి ప్రజలసానుభూతిని చూరగొనగలమనే ధైర్యం నశించిపోయింది. అందుకనే ప్రజల నదిలించి, బెదిరించి హత్యలుకూడా చేసి అధికారానికి వద్దామని ప్రయత్నిస్తున్నారు. ఈ దుష్టయత్నాలను ధైర్యంగా, ఐకమత్యంతో ఎదుర్కొంటేనే తప్ప, దేశంలో గూండాల రాజ్యం, వ్యక్తిత్వమునకు తావులేని నిరంకుశ రాజ్యం, కంచుకాగడాలు వేసి వెతికినా పౌరసత్వహక్కులు లేని ఉక్కురాజ్యం అమలులోనికి వస్తుంది. అందుకనే, ప్రజానీకం, ముఖ్యంగా విజ్ఞానులైన యువజనబృందమంతా మేల్కొనాలి. మేల్కొని కార్యరంగానికి దిగాలి.

(ఆలిండియారేడియో సౌజన్యంతో)

భూమాత, గోమాత, గంగామాత

(18-వ పేజీ తరువాయి)

చరిత్రకారులు, విదేశీయులు చెప్పిన విషయాలు శాస్త్రజ్ఞులు ప్రత్యక్షంగా పరిశోధనలమూలంగా తెలుసుకున్నారు. హిందువులు గంగను పూజించడం మూఢవిశ్వాసం కాదని ధృవపరిచారు.

50 సంవత్సరాల క్రితం కాశీలో కలరా వ్యాధి విపరీతంగావచ్చి యాత్రాసమయంలో ఉధృతమయింది. ఈ వ్యాధికి కారణం కాశీ ప్రజలు త్రాగే గంగ నీరే అని అప్పటి ఇండియా గవర్నమెంటు అనుకున్నారు.

ఇలాంటి వ్యాధుల విషయం పూర్తిగా తెలిసిన మేధావి ఆరోజుల్లో ఫ్రాన్సు దేశంలో 'పేశ్చర్ ఇన్స్టిట్యూట్' లో ఉన్నాడు.. ఆయన్ని ఇండియా గవర్నమెంటు పిలిపించారు.

అతడువచ్చి గంగనీటిని పరీక్షించాడు. సోలెడు నీటిలో ఐదారు వేల టైఫాయిడ్, కలరా మొదలయిన క్రిములు వేశాడు.

మూడు గంటల కాలంలో ఆ క్రిములు నశించిపోయి, నీరు మలినం కాకుండా యధారీతిగానే వున్నట్టు పరీక్షవల్ల తెలిసింది.

యూరపు ఖండంనుంచి ఆసియాఖండం వచ్చినందుకు గంగ మహత్తు తెలుసుకున్నానని చెప్పి, తన జన్మ తరించడానికి గంగానదిలో స్నానంచేసి, కడుపునిండా గంగనీరు త్రాగి, ఇంటికి కూడా గంగనీరు తీసుకుపోయాడు ఆ ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు.

'డీహెరెల్లీ' అనే మరొక ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు గంగను గురించి విచిత్ర విషయం కనుక్కొన్నాడు.

కలరా, రక్తగ్రహణి మూలంగా చనిపోయినవారి శవాలు గంగలో కొట్టుకొనిపోతూవుండగా ఆయన కళ్లారా చూశాడు. ఆ శవాలు తేలేచోట కోటానుకోట్లు వ్యాధిక్రిములు ఉండక తప్పదని అనుకొన్నాడు.

తేలుతున్న ఆ శవాలక్రింద ఒకటి రెండడుగుల మేర గంగనీటిని తీశాడు. ఆ నీటిని శాస్త్రీకంగా పరీక్షచేస్తే, అందులో మచ్చుకైనా ఒక్క పురుగూ కనిపించలేదు. ఆయన విస్మయపడ్డాడు.


కలరావ్యాధిగ్రస్తులవద్దనుండి వెలువడే క్రిములను కొన్ని సేకరించి, వాటిని పెంచి పిమ్మట గంగనీటిలో వేశాడు. కొంత సేపటికి అవి మాయమయిపోయాయి. గంగనీరు యధావిధిగా, నిర్మలంగా వుంది.

గంగలో క్రిములు నశించడానికి కారణమేమిటి, అనే ప్రశ్నకు సరియైన సమాధానం ఏ శాస్త్రజ్ఞుడూ చెప్పలేదని కెనడా దేశపు "మాక్డొనాల్డు కాలేజీ" ప్రిన్సిపాల్ డాక్టరు హారిసన్ అన్నాడు. ఆయన కూడా పరిశోధనలుచేసి గంగనీటిలో క్రిములు చనిపోవడం చూశాడు.

ఈ పరిశోధనలవల్ల గంగనీరు పావన కృత్యమని తేలింది.

గంగకు అంటుదోషం లేదు, అందుచేతనే ఛాందసులుకూడా గంగనీరు యెవరు ఇచ్చినా అభ్యంతరంలేకుండా స్వీకరిస్తారు. దూరదేశ యాత్రీకులు గంగను చెంబులలోనూ, బిందెలలోనూ నింపి వాటికి గట్టి మూతలువేసి, భద్రంగా యిళ్ళకు తీసికొనిపోయే ఆచారం నేటికీ వుంది.

అన్ని దోషాలనూ గంగామాత హరిస్తుంది.



పత్రికా సంపాదకుల స్థాయీసంఘం:

సెప్టెంబర్ 6-వ తేదీన బొంబాయిలో అఖిలభారత పత్రికాసంపాదకుల స్థాయీసంఘ సమావేశం జరిగింది.



రంగేళీ శిల్పం:

వి. ఆర్. అఠాలేగారు రంగుల రాతిపొడితో అనేక చిత్రాలను తయారుచేశారు. ఇది రంగుల ముగ్గు పెట్టినట్లు ఉంటుంది. ఈ కళా ప్రదర్శనాన్ని ఛీఫ్ జస్టిస్ రాజమన్నార్, ముఖ్యమంత్రి కుమారస్వామిరాజా ప్రభృతులు దర్శించారు.

Regd No M



కళాప్రపూర్ణ

శ్రీ॥ శే॥

కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం పాతచరిత్రల నన్నిటిని అవలోడన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమగ్రంథం

వెల రూ. 2-0-0 తపాలాఖర్చు **0-7-0**

ఆంధ్ర గ్రంథమాల

పోస్టుబాక్సు నెం. 212, మద్రాసు.

Edited, Printed & Published by S Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras